మధ్వాచార్య తత్వజ్ఞాన ప్రదీపిక

(డా. బి.ఎన్.కె. శర్మ గారి "The Philosophy of Madhvacharya" పుస్తకానికి తెలుగు స్వేచ్ఛానువాదం)



తెలుగు సేత

డా. ఐ.వి.ఎన్.ఎస్. రాజు

ఓం

శ్రీ గణేశాయ నమః

శ్రీ గురుభ్యోన్నమః

శచీపతి ఇంద్రాన్తర్గత, ఉమాపతి మహారుద్రాన్తర్గత, భారతీరమణ ముఖ్యప్రాణాన్తర్గత,

శ్రీ లక్ష్మీనారాయణాయ నమః

***

శ్రీ మధ్వాచార్య తత్వ జ్ఞాన ప్రదీపిక

(డా.బి.ఎన్.కే. శర్మ గారి రచన "The Philosophy of Sri Madhvaacharya"కు స్వేచ్ఛానువాదం

https://books.google.co.in/books?id=aktdBheKI-IC&pg=PR18&dq=jayatirtha&hl=en&sa=X&ei=EzmxVL8TiYm4BKbNgugH&ved=0CB8Q6AEwATgK#v=onepage&q=jayatirtha&f=false)



తెలుగు సేత : డా. ఇనపకుతికి వేంకట నాగ సత్యనారాయణ రాజు

ఈమెయిలు: ivnsraju65@gmail.com

చరవాణి: +91 88970 55678

ద్రవ్యం కర్మచ కాలశ్చ స్వభావో జీవ ఏవ చ
యదనుగ్రహతః సంతి న సంతి యదుపేక్షయా
- భగవద్గీత ii 10 12

తత్త్ + త్వం అనే రెండు పదాల కలయిక "తత్వం". సంస్కృత భాషలో "తత్త్"అనే శబ్దానికి ఉన్న అర్థం "అది". అది అంటే కనబడని ఒక శక్తి, ఈ విశ్వాన్ని నియమించే ఒక మహత్తరమైన చైతన్య స్వరూపం. ఆ శక్తిని భారతీయులు భగవంతుడు అని పిలుస్తారు."త్వం" అంటే నీవు. అంటే ఆ నీవు ఇది చదువుచున్నపుడు నేను. నాకు- భగవంతునికి లేదా కంటికి కనిపించని ఈ జగత్తును శాశించే ఒక మహత్తర శక్తి కి నాకు మధ్య ఉన్న సంబంధాన్ని తత్వ జ్ఞానం అంటారు. ఈ తత్వ జ్ఞానాన్ని తెలుసుకోవడానికి ఉపయోగ పడే శాస్త్రం తత్వశాస్త్రం. అనాదిగా మానవుడు ఈ తత్వ జ్ఞానాన్ని ఆశిస్తూ సాధన చేస్తూనే ఉన్నాడు. ఈ సాధన వయక్తిక మైనది కాబట్టి పుట్టిన ప్రతి మనిషి ఈ సాధన చేస్తూనే ఉంటాడు. ఇలా కాలం లో పుట్టి-గిట్టే మనుషుల్లో ఎంతమందికి ఈ తత్వ జ్ఞానం పూర్తిగా తెలిసింది అనేది గుహ్యమైన విషయం.

మనుష్యాణాం సహశ్రేషు
కశ్చిద్ యతతి సిద్ధయేత్
యతతాం అపి సిద్ధానాం
కశ్చిన్మాం వేత్తి తత్త్వతః - భగవద్గీత

భగవానుడు పై శ్లోకం లో చెప్పినట్లు అసంఖ్యాకమైన సాధకుల్లో కొందరు మాత్రమె పరబ్రహ్మాన్ని తెలుసుకోవడానికి కావలసిన నిశ్చయమైన జ్ఞానాన్ని పొందగలరు, అలా పొందినవారిలో ఏ ఒక్కరో ఆ భగవానుని నిజం గా తెలుసుకోగలరు. అంటే సాధనలో పరిపూర్ణత పొందడం చదివినంత, తెలుసుకున్నంత, విన్నంతం శులభం కాదు. కానీ సాధకులు వారి వారి సాధననుసరించి ఆ భగవానుని కృపను అవశ్యం పొందుతారు, ***"తారతమ్యం"*** ఆధారంగా.

మానవ చరిత్రలో కొందరు తమకు దక్కిన ఈ తత్వజ్ఞానాన్ని ప్రపంచానికి పంచి తద్వారా ఇతర సాధకులకు మార్గదర్శులు గా మారారు. అట్టి వారిలో భారతదేశం లో ప్రముఖం గా ముగ్గురు ఆచార్యులు ఉన్నారు వారు:

శంకరాచార్యులు - వారు ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతం,
రామానుజాచార్యులు - వారు ప్రతిపాదించిన విశిష్టాద్వైతం

మూడవ వారు ఆఖరి ఆచ్యారులు మధ్వాచార్యులు - వారు ప్రతిపాదించిన ద్వైత సిద్ధాంతం.

మధ్వాచార్య అనంతరం మరే ఆచార్యులు భారతావనిలో పుట్టలేదు, వారు చేసిన ద్వైత సిద్ధాంతాన్ని ఖండించి దానికంటే ఉన్నతమైన మరొక సిద్ధాంతాన్ని ఎవరూ ప్రతిపాదించలేదు.

తత్వ జ్ఞానాన్ని ప్రధానం గా ఆస్తిక – నాస్తిక దృక్కోణాలలో జిజ్ఞాసులు (ఆధ్యాత్మిక/భౌతిక) గ్రహిస్తారు. ఆధునిక విజ్ఞానానికి ఋజువులతో సహా అందని బ్రహ్మత్వతం ఒక విశ్వాశం మాత్రమె అనే ఆలోచనతో, తనంత తానుగా ఈ విశ్వాన్ని నియంత్రించే ఒక శక్తి కోసం కొందరు సాధకులు మానవ మేధస్సును సాధనంగా చేసికొని ఈ తత్వజ్ఞాన సముపార్జన చేస్తున్నారు. కనిపించని ఈ శక్తిని పరబ్రహ్మమని నమ్మి ఈ పరబ్రహ్మం సాక్షాత్తు వేదమే అని విశ్వశించి ఆ వేదవిజ్ఞానాన్ని విపులీకరించే ఉపనిషత్తులనూ, పురాణాలను, ఇతిహాసాలను, బ్రహ్మసూత్రాలను ఆధారంగా చేసికొని భగవంతుడున్నాడు అనే నిశ్చయమైన ఆస్తిక భావనతో సనాతన ధర్మం నిర్దేశించిన దిశలో సాధన చేస్తూ కొందరు ఈ విశ్వానికి "వెనుకనన్నియు తానై" నడిపించే ఆ భగవంతుని తెలుసుకోవాడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కోవకు చెందిన వాడను నేను అని సవినయంగా మనవి చేసుకొంటున్నాను.

మధ్వులు చెప్పింది సాధనను శులభతరం చేస్తుంది అని కితాబు/తీర్పు ఇచ్చేంత మొనగాడిగా ఈ అనువాదం చేయడం లేదు. ఒక సాధకునిగా నాకు ద్వైత సిద్ధాంతం లో దక్కిన సౌలభ్యాన్ని, సంతోషాన్ని, అచంచలమైన భక్తిని, శరణాగత బుద్ధిని స్థిరపరచుకోవడానికి చేసినదే ఈ అనువాదం. ఈ అనువాద రచన నాలాటి సాధకులకు ఉపయుక్తమైతే అది నాకు అమితమైన సంతోషం కలిగించే విషయమే!

ఇంతవరకూ నాకు దక్కిన అతి తక్కువ పురాణేతిహాసజ్ఞానం, నేను విన్న ఉపన్యాసాలు, వివరణలు, పొందిన సలహాలు, చదివిన పుస్తకాల ఆధారం గా బ్రహ్మతత్వం పై ఒక అవగాహన కోసం చేసే ప్రయత్నంలో అద్వైత సిద్ధాంతం లో చెప్పిన నాలుగు మహా వాక్యాలను ఎలా అన్వయం చేయాలో తెలియక తరచుగా నా సాధన చాల గందరగోళానికి గురిఅయ్యేది.

1. ప్రజ్ఞానం బ్రహ్మ
2. అహం బ్రహ్మాస్మి
3. అయమాత్మా బ్రహ్మ
4. తత్ త్వం అసి (తత్వమసి)

వీటికి తోడు వివిధ పౌరాణికులు చెప్పిన పురాణాలు, ఇతిహాసాలలో వారు ఉటంకించిన సిద్ధాంతాలు నన్ను మరింత గందరగోళానికి గురిచేశాయి. అవి:

- బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి : బ్రహ్మమును తెలుసుకుంటే ఆ బ్రహ్మమే అయిపోతాము! అంటే నేను బ్రహ్మం గురించి తెలుసుకోవడం వలెనే బ్రహ్మం అయిపోతే అలా వ్యక్తులు బ్రహ్మ గా మారిపోయిన దృష్టాంతాలు ఉన్నాయా? అంత తపస్సు చేసిన విశ్వామిత్రుడు సైతం బ్రహ్మర్షి అయ్యాడు మినహా బ్రహ్మగా మారలేదు. అంతకు ముందే ఉన్న వశిష్టాది బ్రహ్మర్షులు కూడా బ్రహ్మ గా మారలేదు.
- శివ-కేశవ భేదం అవైదికం – అంటే శివుడే కేశవుడు, కేశవుడే శివుడు. అంటే లక్ష్మే పార్వతి, పార్వతే లక్ష్మి అనా? పతి-పత్నిత్వం అనే సిద్ధాంతం దేవతలకు వర్తించదా?
- మహాభారతం లో శివుని పాత్రను (అర్జునిని బాణాలు శత్రువులను చంపక మునుపే శంకరుడు శూలధారియై శత్రు సంహారం చేసినట్లు ఉన్న విషయాన్ని) ఎలా సమన్వయము చేస్తాము?
- పునరావృత్తి రహిత శాశ్వత విష్ణు / శివ / లలిత / సాయుజ్యం అంటే జీవులు బ్రహ్మం లో లయమైపోతారా?
- పరస్పర విరుద్ధమైన పురాణేతిహాస విషయాలు ఎలా సమన్వయము చేయాలి?
- వేదవాగ్మయం లో మహా వాక్యాలు, మహా వాక్యాలు కానివి అంటూ ఉంటాయా?

ఏకమేవా అద్వితీయం బ్రహ్మ అనేశ్రుతి వాక్యానికి తగ్గట్టుగా పరబ్రహ్మం:

- ఈ రూపం లో ఉంటాడు
- ఈ ఆయుధాలు ధరించి ఉంటాడు
- ఈ పేర్లతో పిలవబడతాడు
- ఆయన ప్రభుత్వం లో ఉన్న వారి తారతమ్యాలు ఇవి అని ఎందుకు మన సనాతన ధర్మం వివరించలేదు?
- దేవీ భాగవతం, శివపురాణం మొదలగు వివిధ పురాణాలు వ్రాసి వివిధ దైవ స్వరూపాలను సర్వోత్తములు గా వ్యాసుడు ఎందుకు చెప్పాడు?
- షన్మత స్థాపన చేసిన శంకరులు ఒకే బ్రహ్మన్ని విష్ణువు గా, శివుని గా, గణపతి గా, సూర్యుని గా, లలితాపరా భట్టారికా గా ఉపాసన చేసి ముక్తి ని పొందవచ్చు అని చెప్పినపుడు జీవుని ఆఖరి ప్రస్థానం లో ప్రేత కాండ లో కేవలం నారాయణునే ఎందుకు తలవాలి?

ఇటువంటి పలు ప్రశ్నల ప్రభావం సాధకులలో అవశ్యం ఉంటుంది అని తెలుసుకోవడానికి నాకు చాల సమయం పట్టింది. ఆ ప్రభావం యొక్క తీవ్రతే సాధనను కొనసాగనిస్తుంది అని అనుభవం లో తెలిసింది.

ఆచార్యత్రయం చేసిన భాష్యాలు ఆయా ఆచార్యుల సాంప్రదాయం లో ఉన్నవారికే పరిమితమైతే సాధనకు కావలసిన అనసూయకత కు బదులు అసూయ ప్రబలి మా ఆచార్యులు చెప్పిందే వేదం అనే ఒక అనారోగ్యకరమైన నిశ్చయానికి సాధకుణ్ణి ప్రేరేపిస్తుంది.

ఈ గందరగోళ స్థితిలో మా గురువుల ద్వారా నాకు ఒక పూర్వజన్మ సుకృతం గా పరిచయమైంది ద్వైత సిద్ధాంతం.

స్వేచ్ఛానువాదం అంటే?

జ్ఞానుల వ్యక్తీకరణ ను అనువదించడం కొండను చేతితో పగుల గోట్టగలనని సాహసించడమే! సంస్కృతాంగ్ల భాషలలో దిట్ట అయిన విజ్ఞులు డా.బి.ఎన్.కే. శర్మ గారు ద్వైత సిద్ధాంతాన్ని విపులీకరిస్తూ ప్రదిపాదించిన విషయాలు, ప్రకటించిన ప్రపంచ సత్యాలు, ఉటంకించి, ఖండించిన పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలు అసలు పూర్తిగా అర్థం చేసికోవడమే కష్టం. వారు విశదీకరించిన పరమ గురువు ప్రతిపాదిత బ్రహ్మతత్త్వం పూర్తిగా అర్థం చేసుకొని మరొకరికి ఈ తెలుగు అనువాదం ద్వారా పూర్తిగా వివరించే సాహసం కాదు ఈ స్వేచ్ఛానువాదం. నావంటి సాధారణ మనిషికి ఒక ప్రాథమిక స్థాయిలో అవగతమయ్యేలా ఆంగ్లంలో - ఆంగ్లేయులే వారి పదకోశాలను శోధిస్తూ చదివే రీతిలో - మధ్వులు ప్రపంచానికి అందించిన తత్వ జ్ఞానాన్ని శర్మ గారి ద్వారా అర్థం చేసుకోవాలంటే చాల కష్టం. ముందు ఆయన వ్రాసింది చదివి, నా అంతరంగం చెప్పే అర్థాన్ని విని, దానిని నా మాతృ భాషలో వ్యక్తీకరించడం ద్వారా నాకు ఈ మహత్తరమైన విషయాలు ప్రాథమిక స్థాయిలో అర్థమౌతాయి అనే భావనతో చేసిన ప్రయత్నమే ఈ స్వేచ్ఛానువాదం. ఒక్కమాట లో చెప్పాలంటే ఈ స్వేచ్ఛానువాదం కేవలం నా ప్రాథమిక అవగాహనను ఖరారు చేసుకోవడానికే. కనుక నేను చేసిన ఈ అనువాద ప్రయోగం లో తప్పులు మెండుగానే ఉండవచ్చు. వాటిని సరిదిద్దు కోవాలంటే మరి కొందరు విజ్ఞులు దీనిని చదవాలి ఆ తప్పుల్ని సరిదిద్దాలి. అందుకే దీనిని తెలుగు భాష తెలిసిన సాధకులకు అందిస్తున్నాను.

చివరిగా ఒక గమనిక: డా. శర్మగారి జ్ఞాన ప్రవాహం లో విషయాలు ఒక క్రమం లో తెలియచేయబడ్డాయి అదే క్రమం లో ఈ అనువాదం సాగింది. కనుక పూర్తిగా చదివాకే ఈ పుస్తకం లో ప్రతిపాదించిన విషయాల పట్ల మరింత శోధన చేయడం సాధనకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

***

విషయ సూచిక

అస్తిత్వం

జ్ఞానాన్వేషణ (EPISTEMOLOGY)

ప్రాపంచిక అనుభవాలు

ఆత్మ సిద్ధాంతం

పరబ్రహ్మ సిద్ధాంతం

సాధనా విచార

ముక్తి సిద్ధాంతం

***

౧. తత్వ జ్ఞానం – పరమావధి

ఉధృతమైన గాలి-వాన అభం శుభం తెలియని ఓ పిట్ట పిల్లలను గూటితో సహా పెకలించి వరద నీటిలో ముంచి చనిపోయేలా ఎందుకు చేస్తుంది? ఎందుకు ఎవరో చేసిన తప్పులకు నీరు కలుషితమైతే ప్రాణ వాయువు దక్కక చేపల సంతతి మొత్తం చనిపోయి తమ దేహాలను ఆకాశానికి ఇస్తున్నట్లు చెరువులో తేలిపోతాయి? ప్రపంచం లో ఎందుకు అన్యాయం, అక్రమం, నేరం, అధర్మం చేసి కూడా కొందరు సరదాగా జీవితాన్ని అనుభవిస్తారు? అలాగే ఎందుకు సత్యం, న్యాయం, ధర్మం ఆలంబనగా తమ జీవితాలను గడిపేవాళ్ళు దుస్థితిని అనుభవిస్తారు? అసలు మనిషి పుట్టుకకు ఉన్న పరమార్థం ఏమిటి? ఏది సాధించడం కోసం మనిషి జీవించాలి? దానికి సాధన ఎలా చేయాలి? చుట్టూ ఉన్న ప్రపంచ జ్ఞానం, ఈ ప్రపంచంలో పొందిన అనుభవాలు, పరస్పర విరుద్ధం గా ఉన్న సత్యాలు ఎలా అర్థం చేసుకోవాలి? ఈ ప్రశ్నలకు సాధికారిక సమన్వయంతో కూడిన సమాధానం ఎవరిస్తారు? ఇవి మానవ మస్తిష్కం లో మెదిలే ప్రశ్నలలో మచ్చుకి కొన్ని. వీటికి సమాధానం వెతికే ప్రయత్నం లో మనిషి మేధస్సుకు దక్కిన జ్ఞానమే తత్వం. ఈ తత్వజ్ఞానం ఇటువంటి ప్రశ్నలకు సంపూర్ణ సమాధానం ఇవ్వగలిగినపుడే ఈ జ్ఞానం సముపార్జిన్చాలనే ఇచ్చ కలుగుతుంది. అటువంటి తత్వ శాస్త్రం లోనే లోపాలు ఉంటె ఇక జీవితం అగమ్య గోచరం మౌతుంది. మనిషి మనసులో పుట్టే ప్రతి ప్రశ్నకూ సంతృప్తికరమైన సమాధానం ఇచ్చేదిగా తత్వజ్ఞానం ఉంటేనే అది మనిషి జీవితానికి ఉపయుక్తంగా ఉంటుంది. అందుకే బాదరాయణుడు (వేద వ్యాసుడు) బ్రహ్మ సూత్రాలను ప్రపంచానికి ఇచ్చి వాటిని తత్వ చింతనకు మూల గ్రంధంగా మలచాడు. ఈ బ్రహ్మ సూత్రాలను సైతం యధామతి తమ భాష్యాలతో కొందరు భాష్యకారులు తాము సృష్టించిన తత్వశాస్త్ర చట్రం లో ఇమిడేలా చేసి తద్వారా వారికి తోచిన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి వాడుకున్నారు. ఇటువంటి దేశ కాల పరిస్తితుల్లో కారణజన్ముడైనారు మధ్వాచార్యులు.

గందరగోళపరచే పరస్పర విరుద్ధమైన సత్యాలను “ఒక స్వతంత్రమైన ఏకత్వం” తో సమన్వయపరచి సప్రమాణంగా మానవ మేధకు అందని, అందినా అవగతం కాని పెక్కు ప్రశ్నలకు బదులు ఇవ్వగల ఒక మహత్తర తత్వజ్ఞానాన్ని ఆవిష్కరించారు మధ్వులు . ఈ ప్రాపంచిక జీవనం లో ఎదురయ్యే అనుభవాలు ఆధ్యాత్మిక విశ్వాసానికి ఎలా అన్వయిన్చుకోవాలో, అందరికీ అతీతమైన ఆ భగవద్శక్తిని ఆకళింపు చేసుకొనే మార్గమేదో చూపేదే తత్వజ్ఞానం అని ప్రపంచానికి చాటారు. దైనందిన జీవితం లో ప్రతి వ్యక్తికీ ఒక తత్వం ఉంటుంది అది ఎంత వరకూ ఆ వ్యక్తి కి తన జీవన పరమార్థం తెలుసుకొని తదనుగుణంగా నడుచుకోవడానికి ఉపయోగపడుతుంది అనేది శంకించవలసిన అంశమే. కనుక ఆ వయక్తిక తత్వానికి ఏ తత్వ జ్ఞానాన్ని జోడిస్తే పరిపూర్ణ తత్వం తెలుస్తుందో అదే నిజమైన తత్వం జ్ఞానం. అంటే ఇది కేవలం

నిజమైన ఆస్తికులకు మాత్రమె అవగతమయ్యే జ్ఞానం మాత్రమె కాదు నాస్తికుల తర్కానికి సైతం అందే విషయంగా ఉండే జ్ఞానం.

తత్వజ్ఞానం కేవలం వివరణాత్మకంగా ఉండడమే కాదు ఒక నిర్దిష్ట మైన అనుభవాన్ని తెలిపేదిగా ఉండాలి. అసలైన తత్వజ్ఞానం మనిషి ఇతరులకు, ఈ ప్రపంచానికి, దైవశక్తి కి ఎలా అనుసంధానమౌతాడో, అనుక్షణం విసిగించే ఈ సాంసారిక సమస్యలను ఎలా అర్థం చేసికోవాలో, వాటిని ఏ దృష్టికోణం లో చూడాలో తెలపాలి. ఇందుకొరకు కేవలం మూడు విషయాలు / అంశాలు ప్రధాన పాత్ర వహిస్తాయి అవి:

1. ఆలోచించే మనసు,
2. బాహ్య ప్రపంచపు వాస్తవాలు,
3. ఈ సమస్త విశ్వాన్ని నడిపించే అనంతమైన, స్వతంత్రమైన శక్తిని సూచించే దృగ్విషయాలు

ఈ మూడు విషయాలలో ఏ ఒక్క విషయాన్నో ఆధారం గా చేసుకొని తత్వాన్ని ప్రతిపాదిస్తే అది వ్యర్థ ప్రయాసే ఔతుంది కాని పూర్ణత్వాన్ని పొందదు. ఉదా: బాహ్య ప్రపంచపు వాస్తవాల ఆధారంగా ప్రతిపాదించిన సిద్ధాంతం భౌతిక వాదాన్ని పాశ్చాత్య దేశాలలో, చార్వాక పద్ధతిని తూర్పు ప్రపంచానికి పరిచయం చేసింది. ఆలోచించే మనసే గొప్పది అని తీర్మానించిన సిద్ధాంతం ఆత్మ ఒక్కటే అని అదే ఈ ప్రపంచపు ఉనికికి మూల కారణమని ఏకజీవత్వాన్ని చాటింది. ఇక మూడవ అంశం ఆధారంగా వచ్చింది సకల దేవ ఆరాధన సమ్మతమని ఆస్తికత్వాన్ని చాటింది కాని సమన్వయాన్ని సాధించలేదు. ఇలా ఈ మూడు ధోరణులు పరిపూర్ణమైన తత్వ జ్ఞానాన్ని ఆవిష్కరించలేదు. వీటన్నిటినీ కాదని మారేది-మారనిది, అస్వతంత్రమైనది-స్వతంత్రమైనది అనే ఒక ప్రధాన వాస్తవిక ఆస్తిక భావనకు తెర తీసారు మధ్వాచార్యులు. పాంచభౌతికంకాని, కేవలం మనసుకు మాత్రమె అవగతమయ్యే ఈ ద్వివిధమైన భావన ఈ తత్వ ఆవిష్కరణ కు ఒక గొప్ప ఆలంబనం అయింది. దీనిని ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాలతో సాధించి వాస్తవిక ఆస్తిత్వాన్ని నిరూపించారు పూర్ణ ప్రజ్ఞులు.

ఆత్మ సత్యం భగవంతుడు సత్యం. కాని ఆత్మ పరతంత్రం, దైవం స్వతంత్రం. ఈ సూత్రం ఒక్కటీ భారతీయ తత్వ జ్ఞానాన్ని ఉత్కృష్ట స్థితికి తీసికొని వెళ్ళింది. కొందరు మిథ్యావాదులు ప్రతిపాదించినట్లు ప్రపంచం లో ఒకే ఒక స్వతంత్రమైన వాస్తవం ఉంది అదే ఆత్మ. కాని ఈ ఆత్మ స్వతంత్రమైనది కాదు అని ప్రత్యక్ష ప్రమాణం ద్వారా విదితమే! ఒకవేళ ఈ ఆత్మలు స్వతంత్రాలై ఉంటె అవి “కేవలం” ఆనందస్వరూపులై ఉండాలి. కాబట్టి ఈ ప్రపంచంలో దు:ఖం ఎలా వచ్చింది? దీనికి సమాధానం గా జీవులు అందరూ పరతంత్రులే వారి అజ్ఞానం వలన తమ స్వస్థితిని అంటే ఆనందస్వరూపాన్ని కోల్పోయారు అంటారు కొందరు తత్వవేత్తలు. అంటే వారి అజ్ఞానం పొతే వారు స్వతంత్రులైపోతారా? మరి అందరూ

స్వతంత్రులైతే వారిలో ఎవరూ ఎవరికీ మార్గదర్శకం చేయలేరు. కొందరు స్వతంత్రులు మరి కొందరు అస్వంత్రులు గా ఉంటె వారి ఇద్దరి మధ్య సంబంధం పొసగదు. ఎందుకంటే స్వతంత్రమైన ఆత్మలు ఆనందస్వరూపాన్ని పొంది తమలో తామే రమిస్తూ ఉండిపోతాయి కాని మరల బాహ్యోన్ముఖులై ఈ సంసారచట్రం లో ఇమడడానికి ఇష్టపడవు. కనుక మానవ జాతి అనుభవం తెలిపేది ఏమిటి అంటే జీవులూ మరియూ ఈ భౌతిక ప్రపంచం సమస్తం పరతంత్రమే అని. సృష్టిలో జీవన గతిని నియంత్రించే ఒకే ఒక్క స్వతంత్ర వాస్తవానికి మానవ జాతి ఇచ్చిన పేరే పరమాత్మ. ఈ సత్యాన్ని మానవ మేధస్సు విశ్వశించినపుడే అసలైన తత్వ జ్ఞాన సముపార్జన సాధ్యం ఔతుంది.

అనంతమైన జీవరాశి పరతంత్రం గా ఉండడమే అనంతమైన పరమాత్మ ఉనికికి ప్రత్యక్ష ప్రమాణం. అట్టి పరమాత్మ ఒక్కటే ఈ సృష్టి లో స్వతంత్రమైన వాస్తవము. పదార్ధము, స్వభావంతో కూడికొని ఉన్న ఆత్మలు, కాలము, కర్మల ఆధారం గా యోగ్యత- అయోగ్యత, తారతమ్యం మొదలగు కీలకమైన ఆస్తిక అంశాల నిర్ధారణ చేసి తద్వారా మధ్వులు పరమాత్మ చేసే నియంత్రణ ను తెలిపే ద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

కనుక భౌతిక ప్రపంచంలో అనుభవించే ప్రతి అంశమూ, అభౌతికమైన దైవ సంబంధం ఆధారం గా పొందేదే అని చెప్పి సాధకునికి సాంత్వన చేకూర్చడమే తత్వ జ్ఞానం యొక్క పరమార్ధం. దీనిని మనః సాక్షి ఆధారం గా స్థిరీకరీకరిస్తుంది ఈ తత్వజ్ఞానం. తత్వజ్ఞానంలో ఈ "మనః సాక్షి" మధ్వులు అందించిన ప్రధానమైన పనిముట్టు. ఈ సాక్షి ఆధారం గానే మనం జాగృతులమౌతాము. ఈ సాక్షి మాటలు విన్నపుడే మనకు మనకంటే ఉన్నతమైన శక్తి ఈ విశ్వం లో ఉన్నదని అవగతమౌతుంది. సాక్షి యొక్క ఆవాసస్థానం మనస్సు కాబట్టి దీనికి మనః సాక్షి అని కూడా పిలుస్తారు . కనుక సంసారసాగరం లో మునిగిపోయి మరచిపోయిన స్వతంత్రాన్ని తిరిగి సంపాదించడానికి తత్వజ్ఞానం దోహద పడుతుంది అనే జైనుల, రామానుజుల వాదన ఇక్కడ అప్రస్తుతం. సనాతన ధర్మం కేవలం స్వతంత్రమైన పరమాత్మను తెలుసుకోవడానికి మాత్రమె దోహద పడుతుంది స్వతంత్రతను సంపాదించడానికి కాదు. ఎందుకంటే అది తత్వతః జీవులకు అసాధ్యం. అందరు కాబినెట్ మంత్రులు స్వతంత్రులమే అనుకొంటే ఇక ప్రధానమంత్రి పదవి ఎందుకు ? మనం నిర్మించుకున్న పరిపాలనా వ్యవస్థ మనకు తెలియకుండానే ఈ పరతంత్ర – స్వతంత్ర సిద్ధాంతాన్ని అనుభవంలోకి తెచ్చింది ఎందుకంటే ఇది ఇలా ఉంటెనే పాలన / సాధన సాధ్యం కనుక. పరమాత్మ ప్రభుత్వంలో జీవుల సాధన కొనసాగడానికి అన్ని ఏర్పాట్లు ఉన్నాయి. సర్వ స్వతంత్రుడు ఒక్కడే ఈ విశ్వం లో "ఏకమేవా అద్వితీయం బ్రహ్మ" అనిశ్రుతి చెప్పింది ఇందువలనే.

***

౨. మధ్వాచార్య ఆలోచనా సరళి – గత, ప్రస్తుత ఆలోచనా విధానాలు

చాలమంది తార్కికులు తెలిసినంతగా మధ్వులు, వారి శిష్యగణం ప్రపంచానికి పూర్తిగా పరిచయం కాలేదు అనేది వాస్తవం. ఇందుకు కారణాలు అలౌకికాలు. తత్వం ఒక అమోఘమైన జ్ఞానం ఇది అనాదిగా మానవ జాతికి ముఖ్యంగా భారతీయులకు వారి పూర్వీకుల నుంచి సంక్రమిస్తూ వస్తూంది. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు చెప్పినట్లు ఇలా పూర్వీకులు అందించిన జ్ఞానానికి స్వకపోల జ్ఞానాన్ని కొందరు జోడించి ఆ జ్ఞానాన్ని సిద్ధాంతీకరించి ఆ సిద్ధాంతాన్ని స్థిరీకరించుకోవడానికి శృతులను, స్మృతులను వెతుకుకొని ఏదో విధంగా వాటిని సమన్వయ పరచి ప్రచారంలోకి తెచ్చుకొన్న తత్వాలు ఉన్నాయి. కాని వాస్తవం మారదు. అసలైన తత్వం వాస్తవాన్ని మానవ జీవితానికి అనువర్తింపచేయునపుడు ప్రాపంచిక జ్ఞానాన్ని / అనుభవాలను త్రోసిరాజనలేదు!

ప్రపంచానికి మధ్వులు అందించిన తత్వ జ్ఞానం వేదవాగ్మయం లో ఉన్న ప్రతి అంశాన్ని ప్రోదిచేసి సమన్వయ పరచి ప్రతిపాదించినది. మధ్వులు అందించిన ఈ తత్వజ్ఞానం ఆయన అనునయులు అయిన జయతీర్థులు చాల చక్కగా వివరించి మహా తార్కిక శక్తిగా వాసికెక్కారు. ఆయన తరువాత వ్యాసతీర్థులు మధ్వాచార్య తత్వజ్ఞానాన్ని ప్రపంచానికి పంచారు. వీరు అందించిన ఈ తత్వ జ్ఞానం కొందరికే అందింది. ఇతర ఆచార్యుల గ్రంధాలకు ఉన్న ప్రాచుర్యం వీటికి గతం లో లేదు ఇప్పుడూ అంతగా కానరాదు. కానీ అంతర్జాలం ప్రభావం తో వీరి గ్రంధాలు కొన్ని ఇప్పడు ప్రపంచానికి "కొన్ని క్లిక్కుల" దూరం లో లభ్యం ఔతాయి. భవిష్యత్ లో మధ్వాచార్య ప్రభావం సాధకులపై ఎలా ఉంటుదో ఊహించలేము. భగవద్గీత లో దాగిన తత్వజ్ఞానాన్ని తెలుసుకోవాలంటే ఎవరో ఒక ఆచార్యుల భాష్యం చదివితే సరిపోదు. మనకు ఉన్న ఆచార్య త్రయం (శంకర, రామానుజ , మధ్వాచార్యులు) చేసిన భాష్యాలు చదివితేనే మన మనోనేత్రానికి "సాక్షి" ఆధారం గా అసలైన సంపూర్ణమైన తత్వజ్ఞానం గోచరమౌతుంది. సాధన కేవలం ఒక్కరి భాష్యం చదవడం తోనే ఆగిపోతే అసూయ ప్రబలుతుంది మినహా స్థిరమైన జ్ఞానం సిద్ధించదు.

భారతీయ తత్వవేత్తలు, తార్కికులు కార్యా-కారణ సంబంధాలను (KAARYA IS TEMPORARY AND KAARANA IS PERMANENT) తర్కంతో విశ్లేషించి వాస్తవాన్ని కనుగొనడమే ముఖ్యమని భావించక, అలా తెలుసుకొన్న వాస్తవానికి ఆధ్యాత్మిక అనుమానాన్ని (శబ్ద ప్రమాణాన్ని) జోడించి విశదీకరించారు. ఇలా చేయడానికి ముందు మన పూర్వీకులు ఒక చట్రం నిర్మించి, తమ తర్కాన్ని దానిలో లో బిగించి, దానిని సమస్త వాగ్మయానికి అన్వయించుటలో తమ ప్రజ్ఞా పాటవాలు చూపారు. ఇది భారతీయ తత్వ శాస్త్ర కారులు అవలంబించిన విధానం.

ఈ విధానంలో ముఖ్యంగా తాత్విక శోధన మూడు విధాలు గా జరుగుతుంది.

- జ్ఞానం యొక్క సిద్ధాంతం   లేదా జ్ఞానం యొక్క స్వభావము దాని   విస్తృతి (epistemology) తెలుసుకోవడం.
- జీవుల / పదార్ధాల స్వభావాన్ని, అట్టి జీవుల / పదార్ధాల తో కూడి ఉన్న ఈ ప్రపంచాన్ని తాత్విక దృష్టి తో వివరించే విధానం. ఈ విధానం లో జ్ఞానం పట్ల జరిగే తార్కిక అధ్యయనం. అంటే, చిట్టచివరికి ఉండేది ఏది? అది ఎలా ఉంటుంది అనే శోధన (metaphysics).
- విశ్వంలో గోచరమయ్యే తారతమ్యాలు వాటి పరస్పర సంబంధాలతో కూడిన వ్యవస్థ ను అధ్యనం చేయడం (ontology).
- వీటితో పాటు ఇతర వేదాంతుల ప్రతిపాదనలను, సిద్ధాంతాలను ఆకళింపు చేసుకొని వాస్తవాన్ని వివరించడం నిజమైన తత్వ జ్ఞానం.

మన పూర్వీకులు చేసిన తత్వ ప్రతిపాదనలు ఎన్నో ఆలోచనల/ విశ్లేషణ ఫలితంగా చేసిన ఒక మహత్తరమైన మానసిక ప్రయత్నం. వీటిని అధ్యయనం చేయడం వలెనే మనసు వికసించి అసలైన తత్వం వైపు మళ్ళుతుంది. వీటిని త్రోసిరాజని చేసే సాధన "రెండు గుప్పెళ్ళు మూసి, నేను నాకు ఇష్టం వచ్చిన ఒక గుప్పిట తెరుస్తాను దానిలో నీ ఉంగరం లేక పోతే ఇక లేనట్లే అని అనడం". గతం లో జరిగిన తర్క మంతా/ తత్వ శోధన అంతా ఆ తర్కజ్ఞుల గతంతో సంబంధం ఉన్నదే!!

ఈ విధానంలో మధ్వులు తనకు పూర్వీకులైన ఇరువది ఒక్క మంది (21) భాష్య కారులు బ్రహ్మ సూత్రాల పై చేసిన వ్యాఖ్యానాలను అధ్యనం చేసి వాటి సమర్ధన / ఖండన చేస్తూ తనదైన భాష్యాన్ని బ్రహ్మ సూత్రాల పై వ్రాసారు. ఉదాహరణకు చార్వాక సిద్ధాంతం లో ఉన్న బాహ్య ప్రపంచ స్పృహ, అనుభవం అనే అంశాలను సమర్ధన చేసి అదే సిద్ధాంతం లో ఉన్న లౌకిక కోరికలను తీర్చుకోవడానికి ప్రతిపాదించిన నైతికతను, భౌతిక వాదాన్ని,నాస్తిక వాదాన్ని (దేహాత్మవాదం) ఖండించారు. ఎందుకంటే మనిషి మనుగడ కేవలం లౌకిక కోరికలు తీర్చుకోవడం కోసమే కాదు జీవన పరమార్ధమైన జనన-మరణ చక్రచ్ఛేదనం కనుక అందుకు కావలసిన ఆధ్యాత్మిక సంపదను సంపాదించడం. చార్వాకుడు కేవలం ప్రత్యక్ష ప్రమాణం వద్దనే ఆగి పోయాడు. అనుమాన, శబ్ద ప్రమాణాలను ఉపయోగించలేదు. ఈ విశ్వం లో కేవలం ప్రత్యక్ష ప్రమాణం ద్వారానే తెలుసుకొనే విషయాలు మాత్రమే లేవు ఇతర రెండు ప్రమాణాల ద్వారా మరెన్నో తెలుసు కోవలసినవి ఉన్నాయి. అలాగే గౌతమ బుద్ధుడు చెప్పినట్లు జీవితాన్ని ఆస్వాదించడం తప్పు అని, ఈ బాహ్య ప్రపంచాన్ని విడనాడి క్రమేణా ఆత్మహత్యా సదృశమైన నిర్వాణాన్ని

పొందమని మధ్వులు చెప్పలేదు. అలాగని కేవలం స్వర్గ సుఖాలు పొందడానికి చేసే వైదిక తంతులకు జీవితాన్ని దాసోహం చేసి సంతసించమని మీమాంసకారులు చెప్పినట్లు చెప్పలేదు. ఎందుకంటే ఇలా జీవితాన్ని పరిమార్చడం కర్మలు చేయడం వెనుక గల ధ్యేయాన్ని/వైదిక జ్ఞానాన్ని విడనాడడమే. ***"హరి పాద వినమ్ర విధియాసతతం"*** అని మధ్వులు మొత్తం సమస్త వేద వాఙ్మయసారాన్ని ఒక్క మాటలో చెప్పారు. తత్వ జ్ఞానం ఇట్టి వినమ్రతను మనిషి పొందేలా చేయాలి.

వైదిక కర్మలను ఆచరించడం వలన జీవి ఆ కర్మ ఫలాలను అవశ్యం పొందుతాడు కానీ అలా ఫలాలను పొందడం పరమార్థం కాదు. ఆ కర్మలు క్రమేణా జీవిలో ఒక నిబద్ధతను కలిగించి తద్వారా కర్మలనాచరించే విధానంలో పరిపక్వత కలిగి అది జీవి యొక్క ఆధ్యాత్మిక ఉన్నతికి సోపానంగా మారుతుంది. ఇలా చేయగా, చేయగా జీవికి పరమాత్మ పట్ల భక్తి పెరిగి ఆ భక్తి భావన తో కర్మ ఫలాలను భగవద్ ప్రసాదం గా అనుభవించడం అలవడుతుంది. తద్వారా కర్మలు చేయడం భగవంతుడి కోసమని భావించడం ***(తత్కర్మ హరితోషం యతు)*** , వాటి ఫలితాలపై ధ్యాస కిన్చత్తు కూడా లేకుండా ఉండడం జీవికి శులభసాధ్యమౌతుంది. ఇది తత్వ జ్ఞానం పొందిన జీవి చేరే ఉత్క్రుష్ట స్థితి. ఎందుకంటే వేదాల సారం కర్మలు చేయడం కాదు, పరబ్రహ్మాన్ని, పరబ్రహ్మతత్వాన్ని తెలుసుకోవడం.

కానీ ఆ పరబ్రహ్మాన్ని తెలుసుకోవడం నిష్కామ్య కర్మాచరణ ద్వారానే. జైనులు సిద్ధాన్తీకరించినట్లు అహం శుఖి అనే ఆత్మ భావన సరియైనదని మధ్వులు చెప్పారు. అంటే ఆత్మ తనను తాను:

- తెలుసుకొనేది,
- తెలుసుకోబడేది,
- తెలిసినది

అనే మూడు స్థితుల సమ్మేళనం అని తెలుసుకొంటుంది, కానీ అహం బ్రహ్మాస్మి అని కాదు.

సాధకుల తత్వజ్ఞన సముపార్జనకు దోహదపడే కొన్ని మహత్తరమైన విషయాలను/ ఆలోచనా విధానాలను మధ్వులు పరిచయం చేసారు అవి ముఖ్యం గా :

- స్వతంత్ర – పరతంత్ర స్థితులు
- సాక్షి
- భేదం అనే విషయాన్ని ధర్మి (One who practices dharma) స్వరూపం గా సవిశేష భిన్నం (identity – in – difference)
- పైన పేర్కొన్న విషయం నుంచి జీవుల మధ్య ఉన్న స్వరూప భేదం.
- పరబ్రహ్మము – జీవి మధ్య ఉన్న సంబంధం బింబ – ప్రతిబింబ సంబంధం.

- పరాధీనవిశేషాప్తి ఆధారం గా జీవులు ముక్త స్థితి లో సైతం పరతంత్రులుగా ఆనంద తారతమ్యం తో ఉండడం.

ఈ పదజాలం దీని వెనుక ఉన్న భావజాలం తత్వ విచారణలో ఒక సమూల సంస్కరణ ను తీసుకొని వచ్చాయి. ఎందుకంటే ఇవి పూర్వాచార్యులు ప్రతిపాదించిన విషయాలకు భిన్నం గా తాత్వికుల ప్రశ్నకు సమాధానాలు ఇచ్చాయి. ఒక్కసారి వీటి ఆవశ్యకతను ఆకళింపు చేసుకొంటే తత్వ శాస్త్రం లో ఉన్న ప్రశ్నలకు సమాధానం వెతికే విధానమే సమూలం గా మారిపోతుంది. ఒక కొత్త ఒరవడి, ఆధారం, పీఠిక, ఆధ్యాత్మిక ప్రపంచం గోచరమౌతాయి.

***

3. మధ్వాచార్య ఉపనిషత్తత్వ సమన్వయము

పదాలు, గుర్తులు, చిహ్నాలు విషయాన్ని తేలికగా తెలిపినా అవి ఒకచో అవి ప్రతిపాదించిన విషయాలనే వక్రీకరించనూవచ్చు. ఉదా : ద్వైతం అనే పదం రెండు అనే దానిని తెలియచేసినా ఏ రెండు అని శోధన చేస్తే జీవులు, పరబ్రహ్మం అని చెప్పినపుడు అక్కడ అనేకమైన జీవులు వాటికి పరమాత్మ తో ఉన్న సంబంధం అనే విషయం తెలుస్తుంది. ఈ విషయం మళ్ళీ ఒక్కో జీవికి ప్రత్యేకమైన సంబంధాన్ని భగవంతునితో తెలుపుతుంది. కనుక నిజమైన ద్వైత భావన జీవికి పరమాత్మ తో గల ఈ ప్రత్యక సంబంధాన్ని తెలిపేది అని తెలుసుకోవడం వలనే సరిగా అవగతమౌతుంది. ఇది వివిధమైన ఆస్తికత్వం అని కూడా చెప్పవచ్చు. ఇది చదువుచున్న పాఠకునికి అతను / ఆమె నమ్మే దైవం తో తనకు ఉన్న సంబంధం వ్యక్తిగతమైనది. ఇట్టి అనేకాలైన వయక్తిక ఆధ్యాత్మిక సంబంధాలు భగవంతునితో కోట్లాది జీవులకు ఉన్నపుడు ఈ సంబంధాన్ని ఏ పేరుతొ పిలుస్తాం. ఆ పేరు అందరికీ వర్తిస్చేదిగా ఉండాలి కనుక ద్వైతం అనే పదం "నాకు – పరమాత్మకు" అనే వైయక్తిక సంబంధాన్ని తెలుపుతుంది.

ఈ ద్వైత భావన కొందరు తత్వవేత్తలకు రెండు స్వతంత్ర మైన అస్తిత్వాల గురించి చెప్పేది గా తోచి అది గందరగోళానికి తద్వారా ద్వైత భావన దైత్య భావన అనే సిద్ధాంతానికి దారితీసింది. కాని మధ్వాచార్య హృదయంలో ద్వైతం అంటే ఒక సర్వస్వతంత్ర, సర్వవ్యాపక, సర్వాతీత బ్రహ్మమే ఈ సమస్త చరాచర జగత్తు కి ఆ జగత్తుని అర్థం చేసుకోవాడానికి ఆధారం అని. అంటే ఈ విశ్వం పరతంత్రం బ్రహ్మ స్వతంత్రం అనే జ్ఞానం కలగడం. ఈ జ్ఞాన సముపార్జనే సాధకుని పరమావధి అని వేదం వాఙ్మయం సూచించింది.

- “ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం” – చాందోగ్యోపనిషత్తు (ఒక్క విషయ జ్ఞానం తో సర్వ జ్ఞాన సముపార్జన సాధ్యం)

- “ఇచ్చా మాత్రం ప్రభో: సృష్టి:” - మన్డూక్యోపనిషత్తు (భగవంతుడు తన సంకల్పం చేత హేలగా ఈ చరాచర జగత్తుని సృజించాడు)

- “ద్రవ్యం కర్మచ కాలశ్చ స్వభావో జీవ ఏవ చ యదనుగ్రహతః సంతి, న సంతి యదుపేక్షయా” - భగవద్గీత ii 10 12 –(నా అనుగ్రహం తోనే ఈ సృష్టిలో ఉన్న ద్రవ్యం, కర్మలు, కాలము, జీవులు మొదలగునవి మనగలుగుచున్నాయి, నేను వీటిని ఉపేక్షిస్తే ఇవి ఉండవు)

విశిష్టాద్వైతం ప్రతిపాదించిన “ఈ చరాచర విశ్వం, పరబ్రహ్మం పరస్పర ఆధారాలు” అనే భావన విశ్వం లేనిదే పరబ్రహ్మాన్ని ఊహించలేము అనే స్థితిని కల్పిస్తుంది. అలాగే అద్వైత సిద్ధాంతం ప్రకారం బ్రహ్మమెంత సత్యమో అంతే సత్యం ఈ చరాచర జగత్తు అని చెప్పడం కుదరదు. అప్పుడు “ ***సత్యస్య సత్యం”*** అనే బృహదారణ్యకోపనిషత్తు వాక్యాన్ని, “ ***నిత్యో నిత్యానాం”*** అనే కఠోపనిషత్తు వాక్యాన్ని ఎలా సమన్వయము చేయాలి? అందుకనే మధ్వులు బింబ-ప్రతిబింబ భావన ద్వారా జీవాత్మ-పరమాత్మ సంబంధాన్ని నిత్య సత్యమైనదిగా నిరూపించారు. జీవాత్మ ఉపాధితో సంబంధం ఉన్నంత వరకూ ప్రతిబింబ ధ్వంసం అనేది జరుగదు. అసలు ఉపాధి లేకుండా జీవుడు ఉండడు, ముక్తిలో సైతం. కనుక జీవాత్మలు-పరమాత్మ నిత్యాలు. జీవులు తీసుకొనే ఉపాధుల ముఖ్య లక్షణం ఈ ప్రతిబింబ భావనను జీవుల అన్ని దశలలోనూ వ్యక్తీకరించడమే. కాని జీవులు సంసారం లో మమేకమై ఈ ప్రతిబింబ భావనను మరచి తమ ఉపాధి స్వరూపాలనే వాటి స్వస్వరూపం గా భావించి వారి సాధన కొనసాగిస్తారు. మధ్వాచార్య విశదీకరణ లో ముఖ్యమైన సత్యం ఏమంటే ఈ ప్రతిబింబం భావనలో ఉన్న జీవులు పరమాత్మ యొక్క అంతర్గత భాగం ఎప్పటికీ కావు. పరమాత్మ ఈ సృష్టి కి అతీతం గా మారని మహోత్కృష్టమైన స్థితిలో నిత్యం ఉంటాడు. ఇందుకు ఏవిధమైన బాహ్యోపాధి పరమాత్మకు అవసరంలేదు.

పరమాత్మ కు జీవాత్మకు మధ్యన ఉన్న ఈ బిమ్బప్రతిబింబ భావన సత్యమైనా ఇది పూర్తిగా వ్యక్తం కాదు జీవుని లో ఎందుకంటే జీవునకు తన జన్మతో ఉన్న సంబంధం వలన. సాధకుడైన జీవుడు తన అంతర్గతమైన స్వరూప విశేషాల వలన తన ఉపాధిని ప్రతిబింబించి తద్వారా తనకు పరమాత్మ తో ఉన్న పరతంత్ర సంబంధాన్ని అవగాహన చేసుకుంటాడు. కాబట్టి ప్రతిబింబ భావన అంటే బింబాన్ని (పరబ్రహ్మాన్ని) యధాతథం పోలి ఉండడం కాదు, తన ఉపాధిని జీవుడు ప్రతిబింబించడం ద్వారా పరమాత్మపై తాను ఎలా ఆధారపడి ఉన్నాడో తెలుసుకోవడం. ఇది జీవులకు భగవంతుని తో ఉన్న

స్వాభావిక సంబంధం. అదే విధంగా భగవంతుని ఈ సర్వ స్వతంత్రతత్వం కేవలం జీవులను తనలో లయం చేసికొనే ఒక ఆస్తిక భావన మాత్రమె కాదు. ఇది ఒక తత్వ భావన, తద్వారా పరమాత్మ అనంతగుణ పరిపూర్ణుడని, తనవలనే తాను నిశ్చయిమ్పబడతాడని, తనను తానే వ్యక్తీకరించుకోగలడని సాధకులకు తెలుస్తుంది. అట్టి బింబానికి (బ్రహ్మానికి) ప్రతిబింబమైన జీవుడు బ్రహ్మము వలే పరిపూర్ణుడై, తనవలనే తాను నిశ్చయిమ్పబడి, తనను తానె వ్యక్తీకరించుకోగల సత్తా పొంది ఉండడు అని చెప్పి జయతీర్థులు మధ్వాచార్య హృదయాన్ని ఆవిష్కరించారు. జీవుడు పరమాత్మ తో తనకు ఉన్న సంబంధం ద్వారానే తనను తాను తెలుసుకోగలడు. ఈ భావన ద్వారానే పరమాత్మ, పరమాత్మ సృజించిన ఈ విశ్వం, జీవాత్మల ఉనికి వాటి అనుభవాలను పరమ సత్యమని సాధకులకు అవగతమౌతుంది. ఇటువంటి వాస్తవంలో కాళ్ళు ఊన్చుకొని ముక్తికి సమాయత్తమయ్యే సాధకుణ్ణి మన మనః ఫలకంపై చూపుతుంది ఈ ద్వైత జ్ఞానం. ఈ జగత్తుని కాదని మరో జగత్తుని పొందడం కుదరదు. "అద్వైతం పరమార్థతః" అని మండుకోపనిషత్తు చెబుతుంది. అంటే భగవదాపేక్ష కోసం చేసే సాధనే పరమార్థం అనే ఆలోచన లో అద్వైతం (సర్వ తంత్ర స్వతంత్రమైన పరమాత్మ జ్ఞానం) సిద్ధిస్తుంది కాని జగత్తు యొక్క ఉనికిని త్రోసిరాజనడం వలన కాదు. జీవులు స్వతంత్రులు కానంతమాత్రాన వారు ఎల్లపుడు అదే స్థితిలో ఉండిన కారణాన వారి అస్తిత్వం నిజం కాదు అని చెప్పడం నిజమైన తత్వం కాదు. జీవుల నిరంతర అస్తిత్వం, వాటి మార్పు, వారు నిరంతరం పరబ్రహ్మం పై ఆధారపడడం ద్వారా వారి శాశ్వత ఉనికి తెలుస్తుంది. ఇది ***పరాధీనవిశేషాప్తి*** అనే తాత్విక చింతనకు మూలం.

అసలెందుకు ఈ చరాచర జగత్తు ఉండాలి? ఎందుకు వాటి ఉనికిని పరమాత్మ ఉపేక్షించాలి? అనే ప్రశ్నలు ఏ తత్వ శాస్త్రమైనా సమాధానాలు ఇవ్వవలసినవే. ఈ ప్రశ్నలకు ఉన్న ఒకే ఒక్క ఆస్తిక సమాధానం జయతీర్థులు ఇచ్చారు!

తాను చేసిన సృష్టికి అతీతం పరబ్రహ్మం అస్తిత్వం. కానీ తాను నిర్మించిన ఈ నిర్వహణా వ్యవస్థ లోని ప్రకృతి పురుషులు (అంటే జీవులు, పదార్థాలు) తనపై ఆధారపడిఉన్నప్పటికీ తాను వారితో కలసి ఉండడమే ఆతను ఎంచుకొన్న విధానం! ఇది ఆయన పెట్టుకొన్న పరిమితి ఇది ఆయనను సర్వోత్తమునిగా చూపుతుంది.

మధ్వులు ఈ విశ్వం లో ఉన్న రెండు వాస్తవాలను అత్యంత శ్రద్ధ తో ఒక నిర్దిష్ట మైన దృక్పథం తో ఒక గొప్ప తాత్వికుని గా తన అంతర్ నేత్రం తో వీక్షించి ఆ రెండు వాస్తవాల (స్వతంత్ర వాస్తవం – పరబ్రహ్మం; పరతంత్ర వాస్తవం – చారాచర జగత్తు, జీవులతో సహా) స్థితిని ఎటువంటి తర్కవాదననైన ఎదుర్కొనే రీతిలో విశదీకరించారు. తద్వారా జీవాత్మ యొక్క అహంకారం చుట్టూ తిరిగే తత్వాన్ని కాదని , పరబ్రహ్మం పై ఆధారపడిన చరాచర జగత్తుని అర్థం చేసికోవడం ద్వారా సాధకులు సాధించగల తత్వ

జ్ఞానం గా ఉపనిషత్తుల ఆధారం గా ద్వైతాన్ని నిరూపించారు. దురదృష్టవశాత్తూ మనదేశం లోనే కొందరు తత్వవేత్తలు మధ్వాచార్య తత్వ జ్ఞానాన్ని వైష్ణవ మతానికి సంబంధించిన చరిత్రగా చూసారు మినహా భారతదేశం లో జరిగిన తాత్విక పరివర్తన గా అవగాహన చేసికోలేదు.

పరమేశ్వరుడు, ఈశ్వరుడు, పరబ్రహ్మం, మొదలగు పదాలను భారతీయ తత్వవేత్తలు విరివిగా వాడినా వాటిని నిర్దిష్టమైన ఒక దైవ స్వరూపం తో సమన్వయము చేసి చెప్పలేదు. వేదవాక్కులను, పురాణాలను, ఉపనిషత్తులనూ బ్రహ్మసూత్రాలతో సమన్వయ పరుస్తూ మధ్వులు పరబ్రహ్మాన్ని శ్రీ మహా విష్ణువని తేటతెల్లం చేసారు.

“పరబ్రహ్మమొక్కటే” అని చెబుతూ అట్టి పరబ్రహ్మం శ్రీమహా విష్ణువే అని చెప్పడం లో తటపటాయించడం ద్వారా చాల మంది భారతీయ తత్వవేత్తలు వారి అసూయకతను ప్రదర్శించారు మినహా నిజమైన తత్వావిష్కరణను చేయలేదు. చిత్రమేమంటే భారతీయులు నిర్మించుకొన్న ప్రజా పరిపాలనా వ్యవస్థలో సర్వోత్తముడు ఒకడే అతడు మన ప్రధాన మంత్రి. ఎవరు ఆ పదవికి వస్తారో ఆయనను / ఆమెను ఈ సర్వోత్తమ స్థితి లో గౌరవించడం మన విధిగా భావిస్తాము. మరి ఈ చరాచర సృష్టి కి మూలాధారమైన వాడి పేరు, రూపం మన వేదవాఙ్మయం సమాధి భాష అయిన సంస్కృతం లో చక్కగా చెప్పినా అది చెప్పడానికి సంశయం! ఇదే ద్వైతాన్ని వైష్ణవమత సిద్ధాంతం గా చిత్రీకరించడానికి కారణం.

ఈ సమస్త జగత్తును దీని అనిర్వచనీయమైన అందాన్ని, వైవిధ్యాన్ని, విశిష్టత, దీని వెనుక ఉన్న అద్భుతమైన వ్యూహాన్ని “అప్పటికప్పుడు ఏర్పడిన మాయ” అనే ఒక్క మాటలో తీసిపేసి దీనిని ఎలా సాధనకు ఉపయోగించుకోవాలో అనే పలు ప్రశ్నలను అసలు లేవనేత్తకుండా ఇవి అడుగవలసిన ప్రశ్నలు కాదు అని చెప్పి సాధకుల సాధనను నిలిచిపోయే లా చేసిన సిద్ధాంతాల / మాయవాదనలను ఖండించడం లో మధ్వులు లేస మాత్రం కరుణ చూపలేదు. అలాగని ఈ చరాచర జగత్తుకి లేని ఉత్కృష్టను ఆపదిన్చనూ లేదు. ఈ చరాచర జగత్తు (ద్రవ్యం, కర్మ, కాలం, జీవులూ) వాస్తవాలు అని వాటికి ఎంతవరకూ ప్రాధాన్యత ఇవ్వాలో అంత వరకూ మాత్రమే ప్రాధాన్యతనిచ్చారు మధ్వులు. ఈ జగత్తు లో జీవులు “ఆరోపింప బడని స్వత్రంత్రం” (Non-superimposed dependence) ఫలితం గా ఉన్నవి కాదు అని అవి ఎప్పటికీ పరతంత్రులే (dependents) నని, వాటిని సృజించిన పరబ్రహ్మం వాటి అంతర్యామి గా ఉంటూ వాటికి భిన్నం గా ఉండి తానొక్కడే సర్వ స్వతంత్రుడు, సర్వోత్తముడి గా కాలాతీతం గా ఉంటాడు అని మధ్వులు తెలిపారు.

మధ్వాచార్య ఆలోచనా సరళి ఆయన ఆవిష్కరించిన తత్వజ్ఞానం తర్క సమ్మతంగా, జీవి కి పరబ్రహ్మానికి ఉన్న భేదాన్ని, సంబంధాన్ని అన్ని విధాల ఆమోదయోగ్యం గా విశదీకరిస్తుంది. ఎప్పటికీ తమ సాపేక్ష ఉనికిని కోల్పోని జగత్తుని, జీవులను మాయ అని చెబుతూ అద్వైతం చేసే గందరగోళాన్ని ఈ ద్వైత

విధానం చక్కగా పరిష్కరిస్తుంది. భగవంతుడు నిర్విశేషుడు గా నిర్గుణుడి గా అద్వైతం చూపుతుంది. కాని పరబ్రహ్మం సవిశేష-నిర్విశేష స్వరూపమని, నిర్గుణ-సగుణ, సాకార-నిరాకార మూర్తి అని మధ్వులు మాయవాదాన్ని ఖండన చేసి నిరూపించారు. అదే విధంగా రామానుజులు ప్రతిపాదించినట్లు పరమాత్మ పూర్ణత్వాన్ని జీవుల తో గల అంతర్గత సంబంధతో ముడిపెట్టడం వలన కలిగిన లోపాన్ని సరిదిద్ది వాస్తవిక ఆస్తిక భావనను సాధకులకు సప్రమాణం గా మధ్వులు పరిచయం చేసారు.

"ఏక విజ్ఞానేనాస్ సర్వ విజ్ఞానం" అనే చాందోగ్యోపనిషత్తు వాక్యాన్ని యధాతధం గా అనుభవానికి తీసుకొని వచ్చే లా తత్వ జ్ఞానాన్ని ప్రపంచానికి పంచి ఇచ్చారు.ఈ ఉపనిషద్వాక్యం సమస్త వేదం వాగ్మయానికి గల మాహాతాత్పర్యం. ఈ అవగాహన వలన అవాంతర తాత్పర్యాలు (అనగా చారచర జగత్తులో నిక్షిప్తమైన సత్యాలు) సులభాసాధ్యాలౌతాయి. మధ్వులు వ్రాసిన తత్వ సాంఖ్యాన గ్రంధానికి జయతీర్థులు చేసిన వ్యాఖ్యానం లో చివరి వాక్యం గా ఇదే మాటను చెప్పారు: "ప్రధాన విజ్ఞానాద్ అప్రధానం జ్ఞాతఫలం భవతి". కనుక శర్మ గారు ప్రతిపాదించిన "స్వతంత్ర-అద్వితీయ బ్రహ్మవాదం" అనే పేరు కూడా ద్వైత సిద్ధాంతాన్ని చక్కగా వివరిస్తుంది.

***

౪. భారతీయ తత్వ విచారణ – మధ్వాచార్య జ్ఞాన వితరణ

మధ్వులు చేసిన తత్వ విచారణ ఆయనకు పూర్వీకుల, సమకాలీనులు చేసిన తత్వ విచారణకు సమూలం గా భిన్నం. కేవలం ఈ విశ్వానికి అతీతంగా ఉన్న పరబ్రహ్మతత్వాన్ని అవగాహన చేసికొనే దిశగా ఒక నిజమైన తత్వవాదిగా మధ్వులు విచారణ చేసారు. జగత్తు, జీవులకు పరమాత్మతో గల సంబంధాన్ని తెలియచేయడానికి ఉపయోగపడేలా తత్వజ్ఞానాన్ని పరిచయం చేసారు. జగత్తు, జీవుల యొక్క గుణాత్మక, స్వరూపాత్మక విషయాల పట్ల ఎంతవరకూ ప్రాధాన్యతనివ్వాలో అంతవరకే ఇచ్చారు. ఎందుకంటే కేవలం జగత్తు, జీవుల వలనే అసలు తత్వం బోధపడదు కనుక. పరబ్రహ్మం పై అన్ని దశలలో, నిరంతరం ఆధారపడే స్థితిలో ఈ చరాచర జగత్తు ఉంది అనే నిర్ధారణకు సాధకులు రావడం సాధన యొక్క ప్రధమ కర్తవ్యం అనే భావనతో చేసినదే ఈ తత్వ విచారణ. అప్పుడే **"ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం"** సాధ్యం. ఈ కారణం వలన మధ్వులందించిన తత్వజ్ఞానం "ఈశావాస్య మిదం సర్వం యత్కించ

జగత్యాం జగత్" అనే ఈశోపనిషత్తు వాక్యం ప్రకారం ఉన్నది నిస్సంకోచం గా చెప్పవచ్చు. అందువలనే మధ్వలు చేసిన తత్వ విచారణ శంకరుల (నిర్విశేష అద్వైతానికి), రామానుజుల (పరస్పర సంబంధ అద్వైతానికి) , వృత్తికార, భాస్కర, బ్రహ్మదత్త సిద్ధాంతాలకు (బ్రహ్మ పరిణామ వాదాలకు) భిన్నంగా ఉంటుంది.

భౌతిక వాదాలకు సమన్వయముగా మధ్వులు నిరూపించిన జీవుల మధ్య అన్ని దశలలో గల తారతమ్యం, ద్వైత భావన, జగత్తు సత్యం అనే నిర్ధారణ, ప్రమాణాలు, సవిశేష భేదం (i dentity-in-difference) అనే పద ప్రయోగం భారతీయ తత్వ విచారణలో ప్రప్రధమం గా పొందుపరచని విశేషాలు. సవిశేషభేదం అనే పదప్రయోగం మధ్వులు అందించిన తత్వ జ్ఞానాన్ని పొందడానికి ఉపయోగపడే మూల సాధనం. కేవలప్రమాణ, అనుప్రమాణ, సాక్షిప్రమాణ అనే ప్రమాణాలు మధ్వులు అందించిన విశిష్టమైన తత్వ సాధకాలు. గతంలో వివరించిన బింబ-ప్రతిబింబ భావన ఒక ముఖ్యమైన జ్ఞానకోశం ఎందుకంటే ఇది ముక్తి పొందిన జీవుడు తన అస్తిత్వాన్ని కోల్పోక దానిని పరబ్రహ్మ తత్వానికి అనుకూలం గా మార్చుకోగలడమే అని చెబుతుంది. ఇలా చెప్పడం లో మధ్వులు తత్వ జ్ఞానం సత్యాన్ని సత్యం గా ఆవిష్కరించడమే తన విధి అని, తీయనైన ప్రదప్రయోగాలు, ఊహలు చేయకుండా నిష్కర్ష గా చెప్పడమే సమంజసమని తెలియచేసారు.

కర్మ సిద్ధాంతానికి స్వరూపబేధం, తారతమ్యం, అనే తాత్విక అంశాలు సంపూర్ణత్వాన్ని ఇస్తాయి అని నిరూపించారు తద్వారా కర్మ బేధాన్ని సాధించారు. దధీచి వధ బ్రహ్మ హత్యా పాతకం కాకపోవడం వృత్రాసుర వధ ఆ పాతకాన్ని ఇంద్రునకు చుట్టుకోవడం దీనికి ఉదాహరణ. ఈ కర్మభేద మనే అంశం కర్మ సిద్ధాంతానికి భారతీయ తత్వవాదన లో ప్రప్రధమం గా చక్కటి సమన్వయాన్ని, వివరణను ఇచ్చింది.

***

అస్తిత్వం

౫. మధ్వాచార్య తత్వ విచారణా సిద్ధాంతం

మధ్వాచార్య తత్వ విచారణ ప్రధానం గా రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది అవి:

౧. వాస్తవికత

౨ స్వతంత్రత

మొదటిది ఈ చరాచర జగత్తుని దేశ-కాల సంబంధాలతో వివరించడం. రెండవది పరబ్రహ్మ తత్వాన్ని ఆవిష్కరించడం. వాస్తవం తెలిసేది ఈ క్రింది మూడు లక్షణాల లో ఏదో ఒక లక్షణం గ్రహించడం ద్వారా:

౧. అస్తి (ఉనికి)

౨. భాతి (స్పృహ కలిగి ఉండడం)

౩. సత్తా (చైతన్యం కలిగి ఉండడం)

కనుక వాస్తవికతకు ప్రమాణం వీటిలో ఏ ఒక్కటైనా ఉండడమే. అప్పుడు రజ్జు సర్ప భ్రాంతి తో బ్రహ్మ తత్వాన్ని వివరించడం సాధ్యం కాదు ఎందుకంటే రజ్జు (తాడు) మనిషి అవగాహన, అనుభవం, స్మృతి లో ఉన్నది అలాగే సర్పమూ. ఈ రెండూ ఈ జగత్తు లో ఉన్న సత్యాలు. కనుక ఒక సత్యమైన విషయం తో ఒక అసత్యాన్ని (చిత్త భ్రాంతిని) ఎలా వివరించడం కుదురుతుంది? పైగా పాము అనే భావన భయహేతువు అది మనిషి ఒక దేశకాల స్థితి లో పొందిన అనుభవం ద్వారా దక్కిన జ్ఞానం. కనుక భ్రాంతికి మూల కారణం మనసు. మనసు తన ప్రజ్ఞతో లేని దానిని ఉన్నది గా ఊహించుకోవడం ద్వారా జీవునికి భయం కలిగింది. ఆ ప్రజ్ఞ ఒక దేశ-కాల స్థితి లో పొందిన అనుభవం ఆధారం గా దక్కినది. అంటే ఆజీవి కి ప్రత్యక్షం గా నిజమైన ఒక సర్పాన్ని చూసినపుడు కలిగింది. మరొక్క ఉదాహరణ: తాబేటి కేశాలు. ఇది ఒక ప్రతిపాదిత విషయం గా చెప్పినా వాస్తవం లో ఇది చూడడం సాధ్యం కాదు. ఎందుకంటే ఇది వాస్తవం లో ఏ దేశ-కాల పరిస్థితులలోనూ ఉండే విషయం కాదు. పైన చెప్పిన రజ్జు సర్ప భ్రాంతి లో రజ్జు, సర్పమూ సత్యాలే ఎందుకంటే అవి దేశ-కాల స్థితులలో కనిపించేవే. వాస్తవం అంటే అనుభవైకవేద్యం గా ఉండడమే. అంటే దీని తాత్పర్యం పైన తెలిపిన “రజ్జు సర్ప భ్రాంతి”, “తాబేటి కేశాలు” బ్రహ్మ తత్వాన్ని వివరించడానికి వీలుకాని పోలికలు.

వాస్తవం - మాంసనేత్ర గోచరం

సత్యాన్ని ఉనికి, వాస్తవం గా చూడడం పైనే శంకరుల తాత్విక ప్రతిపాదన ఆధారపడి ఉంది. కనిపించేది మాయ అని కనిపించనిది సత్యమని ఆయన ప్రతిపాదన (బ్రహ్మ సత్యం జగం మిథ్య). సాక్షీ భూతమైన ప్రపంచ దృగ్విషయాలు (వాన, గాలి, చెట్టు, గుట్ట, నది, భూమి, ఋతువులు) సత్యం కాదు అని శంకరులు అనడంతోనే నిజానికి తాత్విక జిజ్ఞాస పెరిగింది అసలైన సాధకులలో. సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పినట్లు తత్వ శాస్త్రం యొక్క ముఖ్యోద్దేశ్యం వాస్తవాన్ని అవాస్తవాన్ని, మారే దానిని మారని దానిని వేరు చేసి చూపడమే. కనిపించే ఈ జగత్తు వెనుక దాగిన కనిపించని పరమ సత్యాన్ని తెలుసుకోవడమే పరమావధిగా తాత్వికులు వారి సాధనను కొనసాగించారు ఈ ప్రపంచంలో. ఆధునిక భౌతిక శాస్త్రం మెకానికల్ ఎనర్జీ నుంచి ఎలేక్ట్రికల్ ఎనర్జీ ని సాధించడం కూడా ఒక విధమైన తత్వ సాధనే.

వాస్తవాన్ని నిర్ధారించడానికి కావలసిన మరొక అంశం అర్థక్రియాకరిత్వం. అంటే ముత్యపు చిప్పలో వెండి ని చూడడం ద్వారా కేవలం మరొక భ్రాంతి కలుగుతుంది తక్క ఆ వెండితో వస్తువులు చేసికోగలడం సాధ్యం కాదు. కాబట్టి వాస్తవం అనేది సర్వకాలలోనూ ఉండేది అది తర్కం తో సాధించేది కాదు. ఇప్పుడు గోచరమయ్యే జీవులు, జగత్తు యొక్క ఆయుషు పరిమితమైనా అవి సత్యాలే ఎందుకంటే అవి ఒక దేశ-కాల స్థితికి సంబందిచినవి కనుక అవి గోచరమయ్యే వరకూ ఈ ప్రపంచం లో అవి వాస్తవాలే.

వాస్తవికత దాని క్రమము

పరమాత్మ ఎంత సత్యమో ఈ చరాచర జగత్తు అంతే సత్యమని, అది దాని ఉనికికి మార్పుకి పరమాత్మ పై ఆధార పడి ఉంటుంది అనేది ఇప్పటి వరకూ చేసిన చర్చలో విదితమే. ఒకానొక దేశ-కాల స్థితి లో ఉన్న ఒకానొక చరమైన లేదా ఆచరమైన అస్తిత్వం (ఒక జీవి గాని, ఒక రాయి గాని) మాత్రమె సత్యం కాదు దాని పరివర్తన, నాశము కూడా పరమాత్మపై ఆధారపడి ఉండేవే అనేది ముఖ్యమైన సత్యం. ఎందుకంటే ఒక పెద్ద బండరాయి ముక్కలుగా మారి (గ్రానైట్) ఒక ఇంటిలో నివాసముండే ఒక జీవికి నిద్రకు ఉపయుక్తమౌతే అది కార్యా కారణ సంబంధం ద్వారా భగవంతుడు ఏర్పాటు చేసిన పరివర్తన. అలాగే జీవి తల్లి గర్భం లో చేరిన నాడే అది పుట్టే తేది, అది పొందే సంపత్తి, విద్య, చేసే కర్మలు, చివరికి నిధనమయ్యే నాడు అన్నీ పూర్వ నిర్ధారితాలై జీవిలో గుప్తం గా ఉంటాయి. ఇలాంటి గుప్తమైన వ్యవస్థను ఏర్పాటు చేసిన వాడు సర్వతంత్ర స్వతంత్రుడైన ఆ పరమాత్మ.

మధ్వులు ప్రతిపాదించిన పంచభేదాలు కేవలం ఈ సృష్టిని పరమాత్మ తత్వం తో అనుసంధానం చేయడానికే. ద్వైత సిద్ధాంతం యొక్క ముఖ్యోద్దేశ్యం ఈ చరాచర జగత్తు ని యధాతథం గా ఆకళింపు

చేసుకొని దాని పట్ల ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చేందుకు కాదు, దాని పరతంత్రాన్ని తెలుసుకొని తద్వారా స్వతంత్రమైన భగవానుని తత్వాన్ని తెలుసుకోవడానికి మాత్రమె. ఊహకు అందని వివిధత్వం, అనేకత్వం, తారతమ్యం ఉన్న ఈ విశ్వం ఇలా ఒక నిర్దిష్టమైన స్థితిలో ఉండడానికి కారణం ఈ సృష్టికి వెనుకనుండి నడిపించేవాడు ఉండడం వలెనే. భాగవత పురాణం ఇందుకు సాక్షి. ప్రహ్లాదుడు "అంతటా ఉన్నాడు హరి" అన్న మాటను నిజం చేయాడానికి - సమస్త స్థావర జంగామాలలో నిండి నిమిడీకృతమై ఉండి వాటి జీవన గతిని హేలగా నిర్దేశిస్తున్న ఆ శ్రీ మహావిష్ణువు - హిరణ్యకశ్యపుడు ఒక స్తంభాన్ని వేలితో చూపి "ఇక్కడున్నడా" అని అడిగిన వెంటనే ఆ స్థంభాన్నిపగులగొట్టి నారసింహావతారంలో బహిర్గతుడయ్యాడు. అంటే రాయి లో ఉన్నదీ వాడే పావురాయి లో ఉన్నదీ వాడే! లింగ పురాణం లో వేదవ్యాసుడు దాచిన మరొక్క విషయం "లీనమైన అర్థం " లింగం అని. మహారుద్రునికే రుద్రుడు శ్రీ లక్ష్మీనారసింహుడు.

***

౬. మధ్వాచార్య తాత్విక ప్రణాళిక

పరబ్రహ్మం అనంతగుణ పూర్ణమని (నీకెన్ని గుణాలు అని ఒక భాగవతుడు భగవంతుని అడిగితె "నాకే తెలియదు" అని భగవంతుడు అనాలి ఎందుకంటే నాకు తెలుసు అంటే అతని అనంతత్వం ఋజువు కాదు!!), పరబ్రహ్మం సంప్రసాదమని (తనకు తానె ఆనంద కారకమై ఉంటుదని), సత్యాలలో దాగిన సత్యమని, నిత్యాలలో దాగిన నిత్యం అని తద్వారా సమస్త వేద వాఙ్మయ సమన్వయము సాధ్యమని నిరూపించే పద్ధతే మధ్వాచార్య సిద్ధాంతం.

ఈ సృష్టి లో చేతనా వర్గం లో ఉన్న ఉపవర్గీకరణ లో దాగిన ఆస్తిక భావనే శ్రీ మహాలక్ష్మి. ఈ చేతనా ప్రకృతి లో ఉండే జీవుల ఇంద్రియాలకు, పంచ భూతాలకు, మహత్తుకి, అహంకారానికి అభిమాని దేవతలను కూడా ఇదే ఆస్తిక భావన లో చూడాలి. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, పంచరాత్ర ఆగమాలు ఈ భావనను విశదీకరిస్తున్నాయి (శంకరులు కూడా ఈ అభిమాని దేవతల ఉనికిని నిర్ధారించారు). చేతనా ప్రకృతి లో ఉన్న ఈ స్త్రీ తత్వానికి (శ్రీ మహాలక్ష్మికి) ఉన్న ప్రాధాన్యతా స్థానాన్ని తారతమ్యం లో పరమాత్మ తరువాయి స్థానమని చూపుతాయి మన వేదోపనిషత్తులు. శ్రీ మహాలక్ష్మి ***నిత్యముక్తయై***

పరతంత్ర గా ఉంటూ సమాన స్థితిని కలిగి ఉండి ఈ చరాచర జగత్తు యొక్క భవితవ్యాన్ని శాశిస్తుంది. తారతమ్యం లో శ్రీ మహాలక్ష్మి తరువాత చతుర్ముఖబ్రహ్మ, గరుడుడు, శేషుడు, మహారుద్రుడు ఉంటారు.

జగత్తులోని జీవులు రెండు వర్గాలు గా ఉంటాయి:

౧. ముక్తమైన అంటే విడుదల అయిన జీవుల వర్గం
౨. ఆముక్త మైన అంటే విడుదల కాని జీవుల వర్గం

ముక్త జీవుల లో హిరణ్యగర్భుడు (చతుర్ముఖబ్రహ్మ) జీవోత్తముడు, అలాగే మిగిలిన ముక్త జీవులు దేవతలు, ఋషులు, పితృ దేవతలు మొదలుకొని నరుల వరకూ వివిధ తారతమ్యముల తో ఒప్పి ఉంటారు. దేవతలలో సర్వ ప్రకాశునిగా, ఋషులలో అంతః ప్రకాశునిగా, మనుషులలో బహిఃప్రకాశకత్వం తో సర్వోత్తముడైన పరబ్రహ్మం భాసిస్తాడు అని మధ్వులు బ్రహ్మ సూత్ర భాష్యం లో తెలిపారు.

ఆముక్త /విడుదల కాని జీవులు మరలా ముక్తి యోగ్యులు, నిత్య సంసారులు, తమోయోగ్యులు (అంధ తమస్సు కి యోగ్యులు) గా ఉంటారు. ఈ త్రివిధమైన వర్గీకరణ మధ్వాచార్య అవగాహనకు ఉన్న ప్రత్యేకత.

అచేతనా(inanimate) ప్రకృతి భావ (positive), అభావ (negative) వర్గాలు గా ఉంటుంది. అభావ వర్గం మరలా ప్రాగ్భావ (antecedent negation), ప్రాధ్వంశ (subsequent negation) సదాభావ - సదా + అభావ - (absolute negation) గా ఉంటుంది.

౧. ప్రాగ్భావం (ఇంతకు ముందు లేనిది)
౨. ప్రాగ్ధ్వంశాభావం (ఇకపై ఉండనిది)
౩. సదాభావం (ఎల్లపుడూ ఉండనిది)

ఇంతటి విశ్లేషనాత్మక క్రమం ఏ తత్వజ్ఞానం లోను కానరాదు ఇది మధ్వాచార్య అత్యుత్తమ దార్శనికతకు నిదర్శనం.

మధ్వులు చేసిన ఈ తారతమ్య విశదీకరణ, జీవుల క్రమము అర్థం చేసికోవడం ద్వారా ఈ చారాచర సృష్టి బ్రహ్మము నుండి, బ్రహ్మముచే బ్రహ్మము లోకి లయమయ్యేది గా చక్కగా నిరూపించవచ్చు. అన్యధా ఇది సాధ్యం కాదు. ఏవిధమైన సమన్వయమూ ఇలా చూపలేదు. కనుక నిత్యానిత్య భావాలు శాశ్వతాలు.

నిత్య భావాలు: కాలము, అంతరిక్షము, వేదాలు, వ్యక్తావ్యక్తమయ్యే పంచ భూతాలూ, అహంకారిక ప్రాణము(ఆత్మ), మహత్తు, అహంకారము వాటి గుణాలైన సత్వ, రజస్, తమస్సులు.

ఈ నిత్య భావాల స్థూల మార్పులే అనిత్యాలు. ఉదా: కాలం నిత్యం ప్రవహించినా అది ఒక సంఘటనకు ముందు వెనుకల గా కూడా చూపబడడం అలాగే పైన తెలిపిన మిగిలిన అంశాలు.

అనంత గుణాలలో ముఖ్యమైనవి చేతన, సత్తా, శక్తి, సదృశ్యం ఇవి జీవులలో అంతర్గత విశేషాలు గా భాసిల్లుతాయి. ఇవి సవిశేషభేదం వలన తారతమ్యాన్ని చూపిస్తాయి. కార్యాకరణ సంబంధం, తాత్కాలిక గుణాలు, బీజ, జాతి గుణాలు, విశిష్టత, శుద్ధత వలన తారతమ్యం తెలుస్తుంది.

***

౭ విశేషాలు

అభిన్నోపి విశేషకత్వాద్ విశేషః

ఒక పదార్థానికి దాని గుణాలకు ఉన్న సంబంధం పై తత్వశాస్త్రాలు అనాదిగా శోధిస్తూనే ఉన్నాయి. ఈ విచారణకు మధ్వులు అందించిన సహాయం ఎనలేనిది అని చెప్పాలి.

స్వభేదాలను ప్రతిఫలించే పదార్థాల సమూహం ఈ విశ్వం. ఇలా ప్రతిఫలించేవే విశేషాలు. ఈ విశేషాలు పదార్థాల సాపేక్ష వివరాలను తెలియచేస్తాయి. ఈ విశేషాలు పదార్థాలకు జీవులకు మాత్రమె వర్తించవు అవ్యక్తమైన పరబ్రహ్మానికి, దేవతలకు కూడా వర్తిస్తాయి. . ఈ సాపేక్ష వివరాలు సవిశేష భేదం, భేదాభేదం (భేదం మరియూ అభేదం) గా వ్యక్తమౌతాయి. “విశేషం” శేషాన్ని నిత్యమూ పూర్ణమైన ఒక స్థితి తో కలుపుచూ ఆ శేషానికి ఉన్న విశేషాన్ని తెలుపుతుంది.

విశ్వం లో చేతనా వర్గానికి చెందిన విశేషాలు మారలా నిత్యాలుగా, ఉత్పత్తి కాబడ్డ విశేషాలు గా ఉంటాయి. జీవికి ప్రాకృతిక సంబంధం గా ఉండేవి నిత్యమైన విశేషాలు, వ్యక్తావ్యక్తం గా జీవులలో ఉండేవి ఉత్పత్తి కాబడ్డ విశేషాలు. ఉదా: మామిడి పండు లో మామిడి అనే గుణం నిత్యం. పండు అనే గుణం ఉత్పత్తి కాబడ్డ విశేషం. అంటే ఒకే మామిడి చెట్టుకి కాసిన మామిడి కాయలు అన్నీ ఒకే సారి పండవు ఎందుకంటే వాటి పుట్టుక సమయం లో తేడా ఉంది కనుక. ఒకవేళ కొన్ని ఒకేసారి పండినా ఒకేవిధమైన

రుచిని కలిగి ఉండవు ఎందుకంటే వాటికి ఎండా, గాలి, నీటి ద్వారా చేరే ఆహారము భిన్నం గా ఉండడమే. ఇంత సూక్ష్మమైన స్థితిలో తారతమ్యం దాగి ఉంటుంది.

కారణాత్మక, గుణాత్మక, పరిమాణాత్మక, రూపాత్మక, కాలాత్మక, వ్యాప్తి సంబంధ గుణాలు పదార్ధాలలో, జీవులల్లో మనం చూస్తూనే ఉన్నాము. ఇవి మానవ మేధ చూపించే వైరుధ్యాలు కాదు , ఇవి వాస్తవాలు ఎందుకంటే అంగడిలో లేత బెండకాయలు కావాలంటే ఒకే విధమైన వాటిని అందరూ ఒకేలా ఏరుకొని కొనుగోలు చేస్తారు మరి వ్యక్తుల మనో వ్యాపారాలు వివిధాలు కావునా బెండకాయలను లేత-ముదురు అని ఒకే విధం గా ఎలా చూపించాయి? ఎందుకంటే ఇవి మనసు చూపే తేడాలు కావు పదార్ధం యొక్క విశేషం కనుక. **కనుక ఈ భిన్నత్వం మిథ్య కాదు వాస్తవం**.

సూర్య కాంతి ని సూర్యుని నుంచి వేరుగా చూపలేము ఎందుకంటే సూర్యుని ప్రాధమిక గుణం కాంతిని ప్రసరిమ్పచేయడం. అలాగే ఒక తెల్ల జాడీ లో తెలుపుదనం జాడీ యొక్క ప్రాధమిక గుణం కాదు. ఎందుకంటే తెలుపుతనం కావాలి అంటే జాడీని మాత్రమె తీసుకోము. కానీ జాడీ ని తీసుకొని రమ్మంటే రంగుతో ప్రమేయం లేకుండా ఒక జాడీ ని తీసుకొని వస్తాము. అంటే గుణాలు పదార్ధాలకు ప్రత్యామ్నాయాలు కావు. గుణాలకు ప్రత్యేక అస్తిత్వం ఉండదు పదార్ధం లేకుండా. సవిశేష భేదం అంటే జీవులకు, జడ పదార్ధాలకు వాటి విశేషాల ఆధారం గా ఉన్న భిన్నత్వం తో కూడిన అస్తిత్వం. అద్వైతం లో కూడా బ్రహ్మాన్ని "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని చెప్పినపుడు ఆ లక్షణ వాక్యమే భగవంతుని విశేషం.

ఇహ తంతుషు పతః (ఈ దారాలలో ఉన్న వస్త్రం), ఇహ కుండే బాదరాణి (ఈ బుట్టలో బదరికా ఫలాలు ఉన్నాయి) అనే వ్యక్తీకరణలో ఆధార అధేయ భావాలు ఉన్నాయి. దారం వస్త్రానికి ఆధారం బుట్ట పళ్ళు ఉంచడానికి ఆధారం. విశేషాలకు స్వనిర్వాహకత్వం ఉంది ఎందుకంటే అవి నామవాచకం తోనే ఉంటాయి కనుక. ఆధార భావం వేరు ఆధేయభావం వేరు. వస్త్రం లో ఉన్న దారాలను వేరు చేస్తే వస్త్రం ఉండదు కాని పళ్ళను బుట్టను వేరు చేస్తే అవి వాటి అస్తిత్వాలకు కోల్పోవు కనుక ఇది అధేయ భావం. విశేషం అంటే వేరుచేయలేనిది అని అర్ధం. విశేషాల ప్రప్రధమ కర్తవ్యమ్ భేదాన్ని చూపడమే కాదు కలిపి చూపడం కూడా. అది ఎలా అంటే: తారతమ్యం ఒకే జాతిలో చూపడం ఒక జాతిని మరొక జాతితో పోల్చేసమయాన ఆ జాతి యొక్క ఏకత్వాన్ని చూపడం. ఉదా: పురుషులు, స్త్రీలు. పురుషులందరూ వీర్య వంతులు స్త్రీలు మాత్రమె గర్భధారణ చేయగలరు. అలాగే ప్రతి ఒక్క పురుషుని వీర్యం ఒక ప్రత్యేకత పొందియున్నదే అలాగే ప్రతి స్త్రీ ఒక ప్రత్యేకత తో ప్రతి జననాన్ని ఇస్తుంది. విశేషాల వర్గీకరణ ద్వారా వివిధమైన విశ్వం బాగా విశదమౌతుంది అని డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పారు. ఈ విశేషాలను మధ్వులు కేవలం అస్పష్టమైన లేదా అగుపించని తారతమ్యాల తో జీవులు పదార్ధాలు ఉన్నపుడు మాత్రమే వాటి

తారతమ్యం లేదా ఉత్కృష్టత తెలియచయడానికి ఉపయోగించారు. సహజమైన వ్యత్యాసాన్ని / తారతమ్యాన్ని త్రోసిరాజని విశేషాన్ని వాడడం మధ్వాచార్య ఉద్దేశ్యం కానే కాదు. కాబట్టి తారతమ్యం, విశేషం రెండూ వేరు వాటి సమన్వయము కూడా వేరే.

విశేషాన్ని కేవలం బాహ్యం లో నిరూపితమైన రెండు పదార్థాల మధ్య ఉన్న ***<u>సారూప్యాన్ని</u>*** వాటి అంతర్గత విశేషాలతో ***<u>వేరుగా</u>*** చూపడానికి మాత్రమే వినియోగించాలి (ఉదా: కవల ల మధ్య ఉన్న భేదం). భేదం, విశేషం అనేవి మధ్వులు ప్రపంచానికి ప్రసాదించిన ద్వైత సిద్ధాంతం లోని రెండు ముఖ్యమైన అంశాలు. ఇందు భేదానికి ఉన్న భూమిక ఉత్తమం.

జయతీర్థులు చెప్పినట్లు ఈ సృష్టి లో సారూప్యాలు అని ఋజువు చేయబడ్డ పదార్థాల యొక్క వ్యాప్తి వాటి భేదవ్యవహారాల ద్వారా కాని లేదా వాటి ధర్మ-ధర్మి (***ధర్మాన్ని వ్యక్తం చేసేది ధర్మి)*** భావన ద్వారా గాని జరుగుతుంది. ఈ అవగాహన ను వృద్ధి చెందుచున్న జీవరాశి లో ప్రతి జీవి యొక్క తారతమ్యాన్ని నిర్ణయించడానికి వినియోగించాలి.

***

ర. మధ్వాచార్య తారతమ్య సిద్ధాంతం

శ్రుష్టి లో జీవుల విశిష్టత వాటి వ్యక్తిగత విశిష్టత ద్వారానే తెలుస్తుంది కాని వాటిని ఒకటిగా చూపడం ద్వారా కాదు. తారతమ్యం అంటే వాస్తవికత యొక్క ఒక భాగం కాదు, అది పదార్థపు ఉనికి కి ఒక మూలాధారం. ఎందుకంటే ఒక పదార్థం / జీవి ఇతరులకు భిన్నం గా ఉన్నది అని సామన్య, నిర్దిష్ట స్థితిలో (ధర్మి స్వరూపం లో ఉన్నాయి అని) చెప్పడం తారతమ్యం యొక్క ముఖ్య లక్షణం. ***ధర్మాన్ని వ్యక్తం చేసేది ధర్మి*** నీరు పల్లమెరుగు అనే నానుడి లో పల్లానికి ప్రవహించడాన్ని (ధర్మాన్ని) నీరు (ధర్మి) వ్యక్తం చేస్తుంది.

మధ్వాచార్య సిద్ధాంతం లో పరబ్రహ్మం, జీవులు, జడ పదార్థాలు అనే మూడు అస్తిత్వాలు కలిసి ఒక వాస్తవాన్ని నిర్మించడం లో ముఖ్య భూమికను పోషిస్తాయి. జీవులు, పదార్థాలు అసంఖ్యాకం. పదార్థాల పరిణామక్రమం వివిధ దశలలో కూడా అసంఖ్యాకం. పరబ్రహ్మం సర్వోత్తముడు, స్వతంత్రుడు. జీవులు,

పదార్థాలు అస్వతంత్రులు, జీవులు జడపదార్థాలకంటే ఉత్తములు. ఇది మధ్వాచార్య తారతమ్య క్రమం. జీవుల, పదార్థాల వాస్తవికత వాటి దేశ-కాల స్థితులపై ఆధారపడి వాటి రూప, గుణ, సంబంధ, సహజ రీతులలో వ్యక్తం ఔతుంది.   ఇలా వివిధమైన భిన్నత్వం ముఖ్యం గా మూడు రకాలుగా గోచరమౌతుంది:

౧. స్వజాతీయ భిన్నత్వం – మేకల మంద లో ఉన్న ఒక మేక యొక్క భిన్నత్వం
౨. విజాతీయత – మేక కు పులికి మధ్య ఉన్న తేడా
౩. స్వగత భేదం - ఒక మేక లో ఉన్న భిన్నమైన ప్రకృతి.

ఈ మూడవ దానిని యధాతధం గా కాకుండా మధ్వులు పంచ బేదాల తో పాటు అవగాహన చేసికొని అప్పుడు జీవుల / పదార్థాల భేదాన్ని గమనించాలి అని అంటారు (ప్రకృష్ట: పంచ విధో భేదః). మధ్వులు ప్రపంచాన్ని ఈ విధంగా నిరూపిస్తారు:

ప్ర (ప్రకృష్ట = చక్కగా విశదీకరింప బడిన)
పంచ (ఐదు విధాల) సమ్మేళనం ఆ ఐదూ:

1. ఈశ్వరుడు – జీవి నడుమ గల వైవిధ్యం
2. ఈశ్వరుడు - పదార్థం నడుమ గల వైవిధ్యం
3. జీవి – జీవి నడుమ గల వైవిధ్యం
4. పదార్థం – పదార్థం నడుమ గల వైవిధ్యం
5. జీవి – పదార్థం నడుమ గల వైవిధ్యం

మన ఆధునిక శాస్త్రాలు 6 సిగ్మా అనే గుణాన్ని తయారైన ప్రతి వస్తువుకీ ఆపాదించినా తయారైన ప్రతి వస్తువు సవిశేష భేదాన్ని కలిగి ఉంటుంది. ఇది మధ్వులు అందించిన ఒక మహత్తర మైన తారతమ్య నిర్ణయం!

మాయవాదం త్రివిధమైన సత్యాన్ని (పరబ్రహ్మం, జీవులు, జడ పదార్థాల కలయిక తో ఏర్పడ్డ జగత్తుగా కాకుండా) మిధ్య అని చెప్పినపుడు ఈ పంచ భేదాలు ఇక పనికి రానట్లే!! జీవుల అనుభవానికి చిక్కిన తారతమ్యము మిధ్య కాదు అనేది విశ్వవిదితం. ఈ భిన్నత్వ దర్శనం, అనుభవం ఒక భ్రమ అని అనడం నిజమైన తాత్విక ఆలోచనా శ్రవంతి లో చేరదు. ఎందుకంటే మిత్యావాదం లో ఒక ఆత్మహత్యా సదృశ మైన వాదం ఉంది ఇది చివరికి ఆ వాదాన్ని సైతం మిధ్య గా మారుస్తుంది! ఈ వాక్యం లో తికమక మిత్యావాదానికి ప్రతీక!!

ఈ తారతమ్యమయమైన ప్రపంచం లో ప్రతి పదార్థం / జీవి లోనూ అవ్యక్తమై, స్వతః సిద్ధమైన తారతమ్యాలు ఉంటాయి ఇవి చూసే వారి స్థితి ని ఇష్టతను బట్టి గోచరం ఔతాయి. అంటే కనిపించేవే ఆ జీవిలో / పదార్థం లో ఉన్న తారతమ్యాలు అని చెప్పలేము ఎందుకంటే గోచరం కానివి కూడా ఉంటాయి కనుక.   ఇష్టత కు తోడు, దూరం, కాంతి, కాలం, దేశం, స్థితి, మొదలగునవి ఒక జీవికి / పదార్థాలకు ఉన్న అన్ని తారతమ్యాలను చూడలేక పోవాడానికి కారణాలు ఔతాయి.

***

౬. విశిష్టత, అంశి, శక్తి అనే వర్గీకరణలు

విశిష్టత అనే వర్గం లో విశేషన, విశేష్యము అనే భాగాలు ఉంటాయి.

"ఈశ్వరసర్వజ్ఞః" అనే వాస్తవం లో ఈశ్వరుడి సర్వజ్ఞాత్వాన్ని ఈశ్వరుడి యొక్క విశిష్టత గా చెప్పాలి. ఈ విశిష్టత విశేషణ, విశేష్యము ద్వారా ఏర్పడుతుంది. సర్వజ్ఞత్వం విశేషణ ఈ సర్వజ్ఞత్వం ఈశ్వరునితో కలసి ఉండడం లేదా అంతర్భాగం గా ఉండడం విశేష్యము. ఈ పదజాలం / నిర్వచనాలు ధారణలో ఉండడం వలెనే తారతమ్య గుర్తింపు సాధ్యమౌతుంది.

అంశ – అంశి

ఈ రెండు పదాలను భగవంతుని అవతారాల విషయం లో స్వరూపాంశగాను జీవుల విషయం లో భిన్నాంశ గాను అర్థం చేసుకోవాలి. భగవానుని అవతారాలు స్వరూపాంశ అంటే పూర్ణత్వాన్ని పొంది ఉంటాయి. కానీ దేవతల విషయం లో అంశ- అంశి పూర్ణం గా ఉండదు ఉదా: ఇంద్రుడు   – అర్జునుడు. మధ్వులు అందించిన తత్వజ్ఞానం ద్వారా దేవోత్తముడు, సర్వోత్తముడు సర్వ స్వతంత్రుడు అయిన విష్ణువు, జీవోత్తముడైన వాయువు మాత్రమె వారి అవతారాలలో పూర్ణత్వాన్ని పొంది ఉంటారు. మిగిలిన దేవతల విషయం లో వారి అంశ తో మానవ/ రాక్షస ఉపాధి తీసుకొన్నపుడు, దేవతలు తమ పరిపూర్ణ తత్వాన్ని వారు తీసుకున్న ఉపాధుల్లో పొందుపరచలేరు ఎందుకంటే స్వతంత్రత్వం లేక పోవడం వలన. వారు ఏ ఉపాధి తీసుకుంటారో ఆ ఉపాధి విశిష్టత ను అవశ్యం ప్రతిఫలిస్తారు. బలరాముడు, పంచపాండవులు ఇందుకు నిదర్శనం.

శక్తి

భగవానుని విషయం లో శక్తి సహజశక్తి, అతీంద్రియమైనది. ఈ సహజశక్తి భగవానునికి అంతర్గతమైనది. చేతనా వర్గానికి చెందిన అగ్ని, నీరు, ఆకాశం, భూమి, వాయువులలో భగవానుని శక్తే భాసించి వాటి స్వభావాన్ని చూపుతుంది. అందుకే లక్ష్మీ నారాయణుడిని ఇంద్రార్గత, మహారుద్రాన్తర్గత, ముఖ్య ప్రాణానంతర్గతుడు గా ధ్యానిస్తాము. అలాగే జీవులు పూజించే ప్రతిమలలో ఈ శక్తి ఆవాహన చేయబడి అది ఆధేయశక్తి గా భాసిస్తుంది.

***

౧౦. సదృశ్యత్వం Vs సాధారణత్వం

సదృశ్య అంటే పోలిక కలిగి ఉండడం. ఈ వర్గీకరణ ద్వారా మధ్వులు "సాధారణమైన" అనే భావనను తిరస్కరించారు. ఎందుకంటే మనిషి అనే పేరు మాత్రమె మనుష్య జాతిని ఇతర జాతులకు భిన్నం గా చూపడానికి ఉపయోగపడేది కానీ ప్రతి వ్యక్తీ ప్రత్యేక జీవే. కాబట్టి తత్వతః జీవులను ఒకే రాటకు కట్టి సిద్ధాన్తీకరించలేము. అదే విధంగా జీవులను భగవంతుని తో పోల్చలేము. అలాగే అసంఖ్యాకమైన పోలికల తారతమ్యాలను వాటి సంబంధాలతో కలిపి చూపలేము.

ఇతః పూర్వం చర్చించిన బింబ-ప్రతిబింబ భావన ను ఒక సారి చదవండి. సదృశ్య భావన దీనికి అన్వయం ఔతుంది. ప్రతిబిమ్బత్వం ఒక సదృశ్య భావన తోనే సాధ్యం. ఏ రెండు వ్యక్తులు ఒకే విధమైన ప్రతిబిమ్బత్వాన్ని బింబం (భగవంతుని) తో కలిగి ఉండరు. ఎందుకంటే వారి ఆస్తిక భావనలు, జ్ఞానం, సాధన, ఆనందం లో తారతమ్యాలు ఉంటాయి కనుక.

***

౧౧ ఆకాశము (దేశ) – కాలము

"దేశః సర్వత్రాస్తి; కాలః సదా2స్తి" – వ్యాసతీర్థ

ఋగ్వేదం లో తెలియచేసిన మహాప్రళయం ప్రకారం దేశమూ (ఆకాశము) - కాలమూ ఒక మహత్తరమైన చైతన్యం తో కూడి ఉంటాయి. దేశ-కాల స్థితుల లో జరిగిన అనేకమైన సంఘటనల తో పాటు ఈ చైతన్యం ఆకాశానికి (space) కాలానికి ఉండడం వలన అవి అనంతాలు. వాటి స్వరూప విశేషాల వలన ఈ దేశ-కాలాలు అనంతాలు అని మధ్వులు నిర్ధారించారు. **అంతేకాక ఆకాశం (space) ఒక శూన్యమైన భావన కాదని ఊహకు అందని సూక్ష్మాతి సూక్షమైన పదార్థాలతో నిండి నిమిడీకృతమై ఉన్నదే ఆకాశం (space is filled with an exceedingly finest material) అని అందుకే అది పంచ భూతాలలో ఒకటిగా పరిగణన లోకి తీసుకోబడినదని మధ్వులు ఒక అద్భుతమైన వివరణ ఇచ్చారు.** ఇది మధ్వులకు పూర్వం ఇతర వేదాంతులు ఎవరూ చెప్పని విషయం.

ఈ దేశ కాలాల ఉనికి ఒక అంతర్గతమైన చైతన్యం ద్వారా వ్యక్తమౌతుంది ఇది సాక్షి అనే భావనకు సమానం. అంటే జీవులలో ఎలా సాక్షి ప్రమాణం గా ఉందో అలాగే దేశ, కాలాల లో కూడా ఇదే ప్రమాణంగా ఉండి అదే వాటిని నియంత్రిస్తుంది. మధ్వాచార్య దార్శనికత ద్వారా భారతీయ తాత్విక ప్రపంచానికి మరొక అద్భుతమైన అంశం దొరికింది అదే ఆకాశ ద్వైతం. కదలిక ఆకాశాన్ని తెలుపుతుందని ఆధునిక జ్ఞానం చెబుతుంది కానీ మధ్వులు ఆకాశం కదలికలను సాధ్యం చేస్తుంది అని విశదీకరించారు. ఎందుకంటే ఆకాశం ఉంది అనే అవగాహన ముందు ఉంది ఆపై అది కదలికలకు అనుకూలత కలిగించింది అనే జ్ఞాన కలిగింది. దేశమూ కాలమూ కలసి అనంత మైన దేశ-కాల స్తితులను కలుగచేస్తాయి అనే భాగవత పురాణ వాక్కు ఆధారం గా మధ్వులు సిద్ధాంతీకరించారు. ఆకాశం ఈ సృష్టి లా పుట్టించ బడలేదు అది శాశ్వతమైన పదార్థం. ఎందుకంటే ఈ సృష్టి లోకి రాని ఆకాశాన్ని మనం ఊహించలేము అలాగే దాని పుట్టుక కూడా. బ్రహ్మసూత్ర భాష్యం ప్రకారం "ఈ శ్రుష్టిలో ప్రతి పదార్థం ఎదో ఒక లా భగవంతుని చే శ్రుష్టింప బడినదే ". అయితే దేశ కాలాల ఉనికిని సాధారణ భూతాల ఉనికి గా పరిగణించకూడదు. ఇది ఒక "బ్రహ్మకారణత్వవాద" వేదాంతిగా "పరాధీనవిశేషాప్తి" అనే తత్వం ఆధారం గా మధ్వులు ఈ బ్రహ్మ సూత్రానికి భాష్యం చెప్పారు. అలాగే అవ్యకృత ఆకాశం పేరు భూతాకాశం పేరు. అవ్యకృత ఆకాశం శాశ్వత మైనది. భూతాకాశం సృజింప బడినది. ఆకాశం ఉంది అనే జ్ఞానం సత్యం. మన లో జరిగే శారీరిక చర్యలు (పంచ ప్రాణాల ఆధారం గా జరిగే దేహాన్తర్గత చర్యలు) కదలికలకు ఆధారభూతమైన ఆకాశం భూతాకాశం. మానవ నేత్రానికి, విజ్ఞానానికి అందని ఆకాశం అవ్యకృత ఆకాశం ఇది శాశ్వతమైనది (black holes etc in the space). ఈ విజ్ఞత మధ్వులు భారతీయ తత్వ

శాస్త్రం లో మొదటి సారిగా వ్యక్తం చేసారు. అందుకే ఆకాశ ద్వైతం అని ఈ విజ్ఞతకు పేరుపెట్టారు జయతీర్థులు, వ్యాసతీర్థులు. "విశ్వాధారం, గగన సదృశ్యం" అనే విష్ణు సహస్రనామ ప్రకటన ఈ స్థితిని సమన్వయం చేస్తుంది. ఈ భూ వాతావరణం లో అలాగే మన దేహం లో ఉన్న ఆకాశ సూత్రాలు విశ్వాంతరాళం లో ఉన్న ఆకాశ ధర్మాల తో విభేదిస్తాయి.

ఆకాశమనే సత్యం మన పంచేంద్రియాలకు అందని విషయం అది మనలోని సాక్షి కి మాత్రమె అందిన విషయం. ఎందుకంటే ధారణ (జ్ఞాపకం) అవసరం లేకుండా మనం అతీంద్రియమైన మన మనసు తో ఆకాశం యొక్క ఉనికిని గ్రహిస్తాము. అందుకే "సాక్షి" అనే మనః ప్రమాణానికి ఆకాశంతో పోలిక! జీవుల ఉనికికి ఆధారం ఆకాశం "అవకాశమాత్రం హ్యాకాశః" అని మధ్వాచార్య ఉవాచ. దీనిని జయతీర్థులు ఇంకా విశదీకరించి "అవకాశాప్రదత్వాం" గా స్థిరీకరించారు. దేశ కాల స్తితులలో వివిధ ఉపాధులలో ఉన్న జీవులు ఆ దేశ కాల స్తితులకు జ్ఞాపకాలు గా ఉంటాయి. ఎందుకంటే ఉపాధులు భేదకారకాలు కావు దేశ-కాలాలు భేదకారకాలు. సాంఖ్య కారులు, యోగ సిద్ధాంత కారులు దేశ కాలాలు బుద్ధి కల్పితాలు అని అంటారు. ఆకాశం శబ్దం ద్వారా కంటి చూపు ద్వారా తెలుస్తుంది అని అంటారు కాని పుట్టు బధిరునకు (చెవిటి వానికి) అలాగే పుట్టు గుడ్డి కి సైతం ఆకాశం అనుభవం లోకి వస్తుంది. కనుక శబ్దం, దృశ్యం ఆకాశ ఉనికిని చెప్పవు సాక్షి ప్రమాణం ద్వారానే జీవుడు ఆకాశ ఉనికిని గ్రహిస్తాడు. ఈ సాక్షి ప్రచోదిత జ్ఞానం వలన దేశ-కాల స్తితులు జీవునకు అనుభవం లోకి రావడం వైజ్ఞానిక ప్రపంచానికి అవగతమయ్యే జ్ఞానం గా నిలిచింది. ఇది ద్వైతం లో ఉన్న మరొక అద్భుత వివరణ.

కాలము

ద్వైత వేదాంతం లో కాలము సర్వ అనుభవాలలో దాగిన ఒక అంశం. సౌషుప్తికానుభవం అంటే స్వప్న రహిత నిద్రా కాలం లో జీవుడు పొందిన శుఖం సాక్షి ఆధారం గా జీవునకు జ్ఞప్తికి వస్తుంది. సుషుప్తి లో జీవుని ఇంద్రియ వ్యాపారాలు మనసులో లయమై ఉంటాయి . అప్పుడు జీవుని లోని సాక్షి ఈ సుషుప్తి లోని అనుభవాలను జీవునకు అతీంద్రియ వ్యాపారం ద్వారా తెలియ చేస్తుంది అందుకే "ఏతావంతం కాలం శుఖమహమస్వాప్సం" (నేను సుఖమయం గా నిద్రపోయాను) అనే అనుభవం సాక్షి ద్వారా జాగృతావస్థ లోకి వచ్చిన వెంటనే జ్ఞప్తికి వస్తుంది జీవునకు. ఒక్క సాక్షి ప్రమాణం ద్వారానే కాలాన్ని నిర్ధారించగలం. సాక్షి కే స్వరూపేంద్రియం అని పేరు. అంటే మన ఆత్మ కు ఉన్న ఇంద్రియమే సాక్షి! బాహ్యానుభావాల ద్వారా మాత్రమె తత్వం అర్ధం కాదు. ఇతర అవస్థల లో ముఖ్యం గా సుషిప్తి అవస్తలో జీవుడి అనుభవాలను క్రోడీకరించిన మీదటే తత్వం అవగతమౌతుంది.

కాలం అనంతమైనది అలాగే అనంతగా భాగించబడేది కూడా. "త్రుటి లో తప్పిన ప్రమాదం" అనే పద ప్రయోగం మనకు సుపరిచితమే. ఇట్టి మూడు త్రుటి కాలాలు ఒక వేధ కాలం మూడు వేధలు ఒక లవం మూడు లవములు ఒక నిమేషం, మూడు నిమేషాలు ఒక క్షణం. ఈ విధంగా కాల విభజన కొనసాగుతుందని మధ్వులు చెబుతారు. ఆకాశానికి ఏ లక్షణాలు ఉన్నాయో అవే లక్షణాలు కాలానికి ఉన్నాయి.

***

౧౨. కారణత్వం

ఒక కారణం యొక్క నిరంతర కొనసాగింపే కారణత్వం. ఇది ఒక మార్పుని, దాని ఆరంభం మరియూ అంతంతో సహా తెలియచేస్తుంది. కారణత్వాన్ని అర్థం చేసికోవడానికి శాశ్వత పదార్థాలైన ప్రకృతి, జీవులు, కాలమూ, దేశమూ వాటి విశిష్టత అవసరం. కారణత్వం కేవలం కార్యా-కారణ సంబంధం తోనే సాధ్యం. ఇక్కడ కారణం వేరు కార్యం వేరు కాదు ఈ రెండిటి సమన్వయ ఫలితమే జగత్తు లో జరిగే ప్రతి సంఘటన. నిరంతరమూ కొనసాగుచున్న ఈ మార్పు లో జరిగే సంఘటనల వెనుక దాగిన రహస్యమే ఈ కార్యాకారణ సంబంధం. ఈ కార్యాకారణ సంబంధం లో దాగిన ఒక మహత్తు జగత్తు లో జరిగే నిరంతర మార్పుకి హేతువు. అందుకే మార్పు జరిగేది కేవలం మార్పు కోసం కాదు. ఈ నిరంతర మార్పు చరాచర పదార్థాల సాధన కొనసాగడం కొరకు. ఇది పరమాత్వ యొక్క అవ్యాజ్యమైన కరుణకు ప్రతీక. ఒక దేశ కాల స్థితి లో ఒక సంఘటన/మార్పు ఆరంభమై అది అంతమయ్యాక మరొక దేశ కాల స్థితి లో మరొక సంఘటన/మార్పు ఆరంభమౌతుంది వీటిని అఘటనాఘటన సమర్ధత తో సమన్వయము చేసేది ఆ సర్వతంత్ర స్వతంత్రమైన పరబ్రహ్మమే!

వర్తమానం లో ఒక జీవి/పదార్థం యొక్క అస్తిత్వం అది భూతకాలం లో గాని భవిష్యత్తు లో గాని లేకపోవడం వలెనే విశదమౌతుంది. అంటే ఒక అస్తిత్వం లేని స్థితి నుంచి అస్తిత్వం ఉన్న స్తితికి జీవులు పదార్థాలు వస్తున్నాయంటే కారణం వాటి విశేషం వలెనే. ఈ విశేషాలే జీవుల సంస్కారాలు. ఈ సంస్కారాలు ధరించే రూపం కార్యం. ఈ కార్యం పాక్షికమైన అవ్యక్తమైన స్థితిలో ఉంటూ కారణం గా వ్యక్తమై ఉంటుంది. ఇలా సృష్టి మొత్తం అనంతమైన ఈ కార్యాకరణ సంబంధాలకు వేదిక గా ఉంటుంది. ఇదే మధ్వాచార్య సదసత్కార్యవాదం.

***

౧౩. అభావం (Negation)

ప్రాధమికంగా గ్రహించిన ఒక విషయం లో ఒకటి లేదు అనో ఒక సంబంధం లేదు అనో లేక ఒక గుణం లేదు అనో చెబుతూ ఇంకొక విషయం సూచిస్తూ చేసిన వ్యక్తీకరణను అభావం అని నిర్వచించారు మధ్వులు. ఉదా: బల్లపై లేని జాడీ. అంటే బల్లతో సహసంబంధం లేని జాడీ ని గూర్చి చెప్పడం. ఇతః పూర్వం, బల్లపై ఉన్న జాడీ ని చూసిన వ్యక్తి తదనంతర కాలం లో బల్లపై జాడీ ని చూడకపోవడం తర్కతః దానికి ముందు చూడడం వలననే. అందుకే ఈ అభావం సాధ్యం. ఒకవేళ బల్లపై ఉన్న జాడీ, చీకటి వలన అగుపించని స్థితిలో వ్యక్తి అనుమానం ఆధారం గా దానికి చేసే వెతుకులాట లో కూడా అభావం ఉంది.

గతం లో చెప్పుకున్నట్లు అభావం మూడు విధాలు:

౧. ప్రాగ్భావం (ఇంతకు ముందు లేనిది)
౨. ప్రాగ్ధ్వంశాభావం (ఇకపై ఉండనిది)
౩. సదాభావం (ఎల్లపుడూ ఉండనిది) ఈ మూడవ దానికి సంబంధం ఉన్నది "ప్రతియోగి" అంటే కచ్ఛప కేశం (తాబేటి జుట్టు) కుందేలు కొమ్ము, మొదలగునవి.

వీటి గురించి మధ్వులు చెప్పడానికి కారణం చిత్త భ్రాంతి ఎలా కలుగుతుందో వివరించడానికే.

అభావం ఒక ప్రమేయం ఇది ఒక తత్వ జ్ఞానా సముపార్జన లో ఒక ప్రధానమైన అనుభవం. భావరూప జ్ఞానం, మిథ్యావాదం, భేదం, కారణత్వం అనే విషయాలను అవగాహన చేసికోవడానికి ఉపయోగపడే తత్వ విచారణా సాధనం ఈ అభావం. సత్యానికి రెండు పార్వాలు ధనాత్మకం, రుణాత్మకం.

జయతీర్థులు చెప్పినట్లు బల్లపై లేని జాడీ అంటే బల్లతో సహసంబంధం లేని జాడీ ని గూర్చి చెప్పడం. ఇతః పూర్వం, బల్లపై ఉన్న జాడీ ని చూసిన వ్యక్తి తదనంతర కాలం లో బల్లపై జాడీ ని చూడకపోవడం అభావం – ప్రథమ ప్రతిపత్తౌ నిషేధరూపత్వం. కాబట్టి అభావం ఒకానొక గుణం, వస్తువు లేకపోవడాన్ని సూచిస్తుంది మినహా దాన్ని అస్తిత్వాన్ని ప్రశ్నించదు.

సవిశేష భేదం అనే సిద్ధాంతం ఈ అభావం యొక్క ఋణాత్మక, ఘనాత్మక అంశాలను సమన్వయ పరచి తద్వారా ఒక విషయాన్ని ప్రతిపాదిస్తుంది. అసలు లేని దాన్ని గూర్చి చెబితే అది నిష్ప్రతియోగిక అని లేదా అప్రమాణిక ప్రతియోగిక అని చెప్పవచ్చు ఉదా: తాబేటి కేశాలు, కుందేటి కొమ్ము,

***

జ్ఞానాన్వేషణ (EPISTEMOLOGY)

౧౪. ప్రమాణ సిద్ధాంతం

చిత్త భ్రాంతులకు మానవుని జీవితం, అనుభవం తరచూ లోనౌచుంటాయి. అప్పుడు సత్యాన్ని ప్రతిపాదించాలంటే దానికి భ్రాంతి తో గల విభేదాన్ని ఋజువు చేయాలి. సత్యాన్ని ఆవిష్కరించడమే తత్వశాస్త్ర ప్రముఖోద్దేశ్యం. సత్యాన్ని అసత్యాన్ని తెలియచేసే సాధనాలు/దారులు చూపేదే తత్వశాస్త్రం. అనాది నుంచి మానవుడు స్వతహాగా తత్వాన్వేషి. ప్రతి మానవ అనుభవం ఒక పూర్వఅస్తిత్వాన్ని చెప్పక చెబుతుంది. ఉదా : వర్షం కురవడం అంతకు పూర్వం ఉన్న ఘనమైన కృష్ణమేఘ సముదాయాన్ని తెలుపుతుంది. అంటే వర్షానికి ప్రమాణం మబ్బులు ఉండడం. ఇప్పుడు మబ్బులు ఒక మాయ అని అంటే అనుభవం లోకి వచ్చిన వర్షాన్ని ఎలా తెలపాలి?

అందుకే భారతీయ తత్వాన్వేషణ లో ప్రమాణ్యం ఒక ప్రముఖ మైన పాత్ర పోషిస్తుంది. దేని ఆధారంగా ఈ ప్రాపంచిక దృగ్విషయాలను యథాతథం గా అర్థం చేసికొని వాటిని శోధిస్తామో అదే ప్రమాణ్యం. ఈ ప్రమాణ్యం అనే పదం నుంచి వచ్చినదే ప్రమాణం. ఈ ప్రమాణం రెండు విధాలుగా ఉంటుంది.

౧. కేవల ప్రమాణం – ఇది ప్రత్యక్ష ప్రమాణం అంటే ఇంద్రియాలు నేరుగా గ్రహించే ప్రతివిషయమూ/సంఘటనా

౨. అను ప్రమాణం – అనగా అనుమాన ప్రమాణం (పొగ ఉంది కనుక అగ్ని ఉంది అని చెప్పడం), శబ్ద ప్రమాణం (వేదం వాగ్మయం లో ఉన్న విషయాల ఆధారం గా స్థిరీకరించడం).

ఈ పై రెండు ప్రమాణాలు యథార్థాన్ని తెలియచేస్తాయి.

జయతీర్థులు ప్రమాణాన్ని ఎలా “యథా” “అర్థాన్ని” తెలుపుతుందో మరింత విపులం గా చెబుతూ : ఒక దేశ-కాల స్థితిలో ఉన్న ఒక పదార్థం గురించి లభ్యమైన జ్ఞానం ప్రమాణం అని అంటారు.

గుణము, ప్రకాశము, వ్యాప్తి అనే అంతర్గత తారతమ్యాల ఆధారం గా కేవల ప్రమాణం మరలా నాలుగు విధాలుగా చెప్పబడినది:

౧. ఈశ్వర జ్ఞాన
౨. లక్ష్మీ జ్ఞాన
౩. యోగి జ్ఞాన
౪. అయోగి జ్ఞాన

మొదటి రెండు స్వరూపజ్ఞాన సంబంధమైనవి చివరి రెండు వృత్తిజ్ఞాన సంబంధమైనవి. ఈ వర్గీకరణ కొంతవరకూ ఆస్తిక భావనతో చేసినదైనప్పటికీ, ఇది తాత్విక, మానోవైజ్ఞానికి విశిష్టత ను కూడా కలిగి ఉన్నది. యోగిజ్ఞాన ప్రమాణం యొక్క వ్యాప్తి ఋజు గణ జీవులకు, తాత్విక, అతాత్విక ఆత్మల వరకూ ఉంటుంది. అయోగిజ్ఞాన ప్రమాణం ముక్తియోగులకు చెంది ఉంటుంది.

***

౧౨. ఇంద్రియ గ్రాహ్యత (Perception), అనుమానము/ఊహ (Inference), వాక్కు(verbal testimony) ఆధారిత నిర్ణయం.

ఈ ప్రపంచం తో జీవులకు గల సన్నికర్షం (contact) దోషరహిత ఇంద్రియ గ్రాహ్యత లో అంతర్భాగం గా ఉన్న సాక్షి ప్రమాణ గ్రాహ్యత కలుపుకొని ఉన్నపుడే సాధ్యం అని మధ్వులు చెబుతారు. ఒక్క నేత్రం విషయం లో కాంతి పుంజం ఆధారం గా సన్నికర్షం ఉంటుంది మిగిలిన ఇంద్రియాలకు ప్రత్యక్షం గా పదార్థాలతో వాటి అభావాలతో కూడిన సన్నికర్షం ఉంటుంది. దోష రహిత గ్రాహ్యత కేవలం దైవ జ్ఞానం, లక్ష్మీ జ్ఞానం లేదా ముక్త జీవుల జ్ఞానం విషయం లోనే ఉంటుంది. ఉత్తమ జీవుల(ముక్తజీవుల) స్వరూప జ్ఞానం ఎప్పుడు దోష రహితమే. ఆముక్త జీవుల వృత్తి జ్ఞానం దోషాత్మకం ఎందుకంటే వారు ఇతః పూర్వం చెప్పినట్లు ముక్త యోగులు, ముక్త అయోగులు, తమోయోగులు కనుక.

మన ఇంద్రియజ్ఞానం పరిమితమైనది కాబట్టి మన గ్రాహ్యత కూడా పరిమితమైనదే. వ్యక్తిగత అనుభవాలు మొత్తాన్ని విడి భాగాలుగా చూపేవే మినహా సంపూర్ణ జ్ఞానాన్ని ఇచ్చేవి కావు. ఎందుకటే ప్రాపంచిక సంఘటనలు వ్యక్తి యొక్క ఇష్టత, అవి అతని దృష్టిని ఆకర్షించిన విధానం ఆధారంగా అర్ధం ఔతాయి. కనుక అనుభవం అనేది కేవలం సంఘటనల గ్రాహ్యత కాదు అది వ్యక్తి ఇష్టతకు ఉద్దేశ్యానికి కట్టుబడి ఉంటుంది. కాబట్టి మనసు బాహ్య సత్యాలను ఇంద్రియాలతో గ్రహించి ఒక స్వతంత్ర ధారణా యంత్రం గా జీవులలో పనిచేసి జీవుల సంస్కారాల ద్వారా ఈ ప్రపంచం తో వాటికి సంనికర్షాన్ని ఏర్పాటు చేస్తుంది . ఈ ప్రక్రియలో సాక్షి ప్రమాణం ప్రధాన పాత్ర పోషిస్తుంది. కనుక గ్రాహ్యతను (perception) సవికల్ప(determinate) నిర్వికల్పా లుగా(indeterminate) చెప్పడం కుదరదు.

అనుమానము / ఊహ (Inference):

సాధ్యత తో కూడుకున్న జ్ఞానం ద్వారా లభ్యమయ్యే గ్రహ్యత (Perception) పేరు అనుమానం లేదా ఊహ. ఒకానొక పదార్థ వినిమయం ఒకానొక వ్యాధి కి హేతువు ఔతుంది అని చెప్పడం సరియైన అనుమాన ప్రమాణం ఔతుంది. కనుక సాధ్యత, సాధన ఆధారం గా అనుమానం ఉన్నపుడు అది సరియైన ప్రమాణం ఔతుంది. పొగను చూసి అగ్ని ఉండని చెప్పడానికి ఏ విధమైన సరంజామా అవసరం లేదు. ***అలాగే ఆగమవాక్యాల పట్ల ఉన్న విశ్వాసం ఆధారం గా కూడా అనుమానం సక్రమమైనది గా ఉంటుంది. వ్యాసుని హృదయం తెలుసుకోవాలంటే ఆయన వ్రాసిన పురాణాలను, బ్రహ్మ సూత్రాలను, భాగవత, భారతాలను, భగవద్గీత ను అధ్యయనం చేయాలి. ఇవేమీ అధ్యయనం చేయకుండా పుక్కుటి పురాణాలు అనడం హేతుబద్ధం కాదు. ఆగమ వాక్యాలపై విశ్వాసం మనం పెట్టె అధ్యనం అనే పెట్టుబడి ఆధారం గా కలుగుతుంది.***

అనుమాన ప్రక్రియలో అంటే అనుమానాన్ని ప్రమాణం గా స్వీకరించడం లో చేసే వాదనలో ముఖ్యం గా “విరోధ” – అనుమానికి విరోధం గా పనిచేసే విషయ వస్తువులు/వాదనలు, “అసంగతి” - అనుమానానికి సంబంధం లేని విషయ వస్తువులు/వాదనలు అనే వర్గాలు ఉంటాయి. వీటిని ఛేదించి సాధించేదే అనుమాన ప్రమాణం.

వాక్కు ప్రమాణం (VERBAL TESTIMONY)

సమయస్మరణ, శబ్దన్యానుసంధానం ద్వారా వాక్కు ని ప్రమాణం గా స్వీకరించవచ్చునని అంటారు మధ్వులు. ఈ వాక్కు శబ్ద ప్రమాణం గా మారాడానికి హేతువులు:

౧. పౌరుషేయ వాక్కు – వ్యాసాది ముని విరచితాలైన పురాణాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, ఇతిహాసాలు, సంహితలు, మొదలగునవి (అనగా పురుష కృతాలైన గ్రంధాలు)
౨. అపౌరుషేయ వాక్కు – వేదం అపౌరుషేయం అనే విశ్వాసం భారతీయుల అవగాహన లో స్థిరంగా ఉన్న విషయం. ఎందుకంటే ఈ వేద వాక్కులు మార్చ శక్యం కాని విధం గా వ్యక్తమైన పదాల అమరికలు.

అపౌరుషేయత్వం, అనాదిత్వం వేదాలకు ఉన్న విశిష్టత. వేద వాక్కులను ప్రమాణం గా స్థిరీకరించడం లో మధ్వులు చేసిన కృషి ఆయనకు ముందు ఉన్న ఆచార్యులకు భిన్నం గా జరిగింది. ఇదే ద్వైత సిద్ధాంతాన్ని సామాన్య సాధకునికి తత్వజ్ఞాన్ని శులభం గా అందించగల స్థితికి తీసుకొని వెళ్ళింది. అపౌరుషేయత్వమే వేదాలకు మిక్కిలి విశిష్టతను అనుమాన రహిత స్థితిని తీసుకొని రాగలిగింది. వేదాలు కనిపించని భగవానుని వాక్కులు. ఏ వ్యక్తికో ఈ వేదాలను ఆపాదిస్తే తాత్వికులు మరలా ఆవ్యక్తి యొక్క గుణాలను, దేశ-కాల స్తితులకు, విశేషాలు ఆధారం గా ఆ వ్యక్తి చెప్పిన వాక్కులు గా వేదాలు చర్చనీయాంశాలు గా మారతాయి. కనుక ధర్మ-అధర్మ అనే భావనలు కేవలం అపౌరుషేయంగా ఉన్నపుడే వాటికి స్థిరత్వం ఉంటుంది. విశ్వం లో ఉన్న ఈ అతీంద్రియ శక్తి పట్ల విశ్వాసం లేని తాత్వికులు చేసే సిద్ధాంతాలు ఎలా మానవ జాతికి ఉపయుక్తం కావో అలాగే కేవలం పౌరుషేయాల ఆధారం గా చేసిన విచారణలు కూడా. అందువలన అపౌరుషేయమైన శబ్ద ప్రమాణం ఆధారం చేసిన ధర్మాధర్మాలే అత్యుత్తమ విదారణలు. పరతంత్రమైన వ్యక్తులు స్వకపోల కల్పితాలతో చేసిన సిద్ధాంతాలు కాలం లో నిలువవు. ఎవరి మాట వేదవాక్కు అని అంటామో ఆ మాట అపౌరుషేయమైన ఆ వేద వాక్కులతో సమన్వయము పొంది ఉన్నది అని అర్థం.

ఎవరో చెప్పిన మాటలు కూడా అపౌరుషేయాలే అని వేదాలలో నిక్షిప్తం చేస్తే ఆ మాటలు చాల సులువుగా తెలిసిపోతాయి ఎందుకంటే ఒక మహత్తరమైన విధానం లో చెప్పబడ్డ వాక్కుల మధ్య ఇవి ఇమడలేవు - ఇనుప గుండ్ల మధ్య ఉంచిన దూది పింజలు ఒక్క సారి ఉధృతం గా గాలి వీచినంత మాత్రం చే ఎగిరి పోయినట్లు. వేదాలుకు అంతర్గతం గా ఉన్న నిర్దోషత్వం అనే ప్రమాణం ద్వారా నిక్షిప్తం చేయబడ్డ పదాలు తేలిపోతాయి!

పరస్పర విరుద్ధమైన పురాణ ఇతిహాస, ఉపనిషత్ వాక్కులను సమన్వయ పరచి వాటి అర్థాలను సాధించడానికి ఉన్న ఏకైక ఆధారం వేదం. వేదం లో ఉన్న వాక్కులకు చేసిన వ్యాఖ్యానాలే మనకున్న ఇతర వైదిక వాగ్మయం.

ఉదా: జనకుడు తన, తన తమ్ముని కుమార్తలకు వివాహం చేయడం లో తను చేసే ప్రయత్నాలు సఫలీకృతం కావడంలేదనే వేదనను తొలగించడం కోసం శ్రీనివాస కల్యాణం తన రాజ్యం లో జరిపిస్తాడు. ఈ పురాణ వాక్కుని ఎలా సమన్వయము చేయాలి అనేది కేవలం అపౌరుషేయమైన వేదమే చెబుతుంది. అందుకే వేద వాక్కులు సమన్వయ సాధకాలు, వాటిని యథాదతం గా అర్థం చేసుకోవడం కుదరదు వాటి మహత్తు సమన్వయము ద్వారానే విదితమౌతుంది. ఉదా: అదే శ్రీనివాస కల్యాణం పీఠిక లో లో వశిష్టాది ఋషులు కలియుగ ఆరంభానికి ముందు (యుగ సంధి లో) యాగం చేస్తున్నపుడు ఆ యాగానికి భోక్త గా ఎవరిలి పిలవాలో ఎవరు సర్వోత్తముడో తెలియక పోవడం చిత్రం గా ఉంటుంది. ఎందుకంటే అంతకు ముందు వారు అనేక యాగాలు నిర్వహించిన వారే! పైగా వారు భ్రుగు మహర్షిని ఎంచుకొని ఆయనను విష్ణు, బ్రహ్మ, శివులలో ఎవరు ఉత్తముడో తెలుసుకోమని పంపడం. అంతటి భ్రుగువుకి విష్ణువు వక్షస్థలం పై తన్నడం సబబు కాదని తెలియక పోవడం వెనుక వ్యూహం కేవలం సమన్వయం ద్వారానే తెలుసుకోగలం. వేదం అంటే పరబ్రహ్మం కనుక “ఓం తత్తు సమన్వయాత్ ఓం” అనే బ్రహ్మసూత్రానికి ఆధారం ఈ అపౌరుషేయమైన వేదం. అటువంటి వేదం వాక్కు అత్యుత్తమ ప్రమాణం అని మధ్వులు తెలియచేసారు.

వేదం లో ఉన్న ప్రతి పదం పలు సమన్వయాలకు ఆధారం. శ్రీ రుద్రం లో ఉన్న “సంకర్షణ మూర్తి స్వరూపో” అనే మాటను ఎలా అన్వయించాలి అంటే తారతమ్యం ద్వారా అని సాధకులకు తమ సాధన లో తెలుస్తుంది. వేదం వాక్కుల అన్వయం రెండు స్థాయిలలో జరుగుతుంది అని మధ్వులు తెలిపారు. i. ఆ వాక్కు యొక్క నిర్దిష్టమైన అర్థం, ii. ఆ వాక్కుకి ఇతర వాక్కులతో ఉన్న సంబంధం అలాగే ఇతర వాక్కులతో ఉన్న సమన్వయ సంబంధం ఆధారం గా ఆ వేదం వాక్కు యొక్క పరిపూర్ణమైన అర్థం తెలుస్తుంది. ఇట్టి వాక్కుని ఏ ఋషీ లేదా పండితుడూ వ్రాసి వేదాలలో చొప్పించలేరు కనుక అపౌరుషేయత్వం వేదవాక్కులను అత్యుత్తమ ప్రమాణాలుగా నిరూపించింది.

***

౧౬. స్మృతి (జ్ఞాపకం) ప్రమాణం

స్మృతి ద్వారా లభ్యమయ్యే జ్ఞానం స్థిరమైనది కనుక ఈ స్మృతి కూడా సత్య శోధనలో ఉపకరించే ఒక ప్రమాణమే. న్యాయ సిద్ధాంతులు, మీమాంసకారులు, వారిని అవలంబించే అద్వైతులు స్మృతి ని ప్రమాణం గా అంగీకరించలేదు. విశిష్టాద్వైతులలో దీని పట్ల భిన్నమైన అభిప్రాయలు ఉన్నాయి. వీరిలో వేదాంత దేశికులు స్మృతికి ప్రమాణం గా ఒప్పుకున్నారు. మధ్వులు స్మృతి ప్రమాణాన్ని ప్రత్యక్ష ప్రమాణ వర్గం లో చూపారు. ఎందుకంటే స్మృతి (జ్ఞాపకం) వ్యక్తి యొక్క మనసు లో నిక్షిప్తమై ఉన్న విషయం. ఒక వస్తువు ఉన్నది అని చెప్పడం వెనుక కూడా ఒక మానసిక ప్రక్రియ ఉంది కనుక అది స్మృతి కి సంబంధించినదే. సాధ్యాసాధ్య నిర్ణయం, వ్యాప్తి, హేతువుని ఎరుగుట మొదలగునవి అన్నీ స్మృతికారకాలు కనుక వాటినీ ప్రమాణం గా నిర్ణయించాలి! ఒక సత్యాన్ని నిర్ధారించడానికి దానికి వ్యతిరేకమైన అసత్యాన్ని తెలుసుకోవాలి తెలుసుకున్న పిదప అది మన స్మృతిలో ఉండాలి.

మధ్వులు స్మృతి ప్రమాణాన్ని మరింత వివరిస్తూ: ఏవి జీవికి సంస్కారాలు గా ఉంటాయో అవి ఆ జీవికి తన గతం తో తన మనసు ద్వారా సన్నికర్షతను (contact) కలిగిస్తాయి. కనుక జీవి యొక్క సంస్కారాలు స్మృతి కారకాలు. ఈ విధం గా జీవి తన స్మృతి ద్వారా తన గతం తో (ఈజన్మ లేదా పూర్వ జన్మ లో ఉన్న గతం తో) సంబంధాన్ని కలిగి ఉండి తద్వారా ఈ ప్రపంచానికి సన్నికర్షతను కలిగి ఉంటాడు. ఒక వ్యక్తి తన గతాన్ని మరచి పోతే దానిని మరలా తాను పునరుద్ధరించలేడు ఎందుకంటే ఆ గతానుభవం అతనికి వయక్తిక విషయం. అటువంటి దానిని తానే మరచిపోతే అది ఇక అసాధ్యమైన విషయమే. కనుక స్మృతి యొక్క పాత్ర మహోన్నతమైనది దానిని ప్రమాణం గా స్వీకరించకపోవడం ఆత్మహత్యాసదృశం. అనుమానాలలో, ఇంద్రియ గ్రాహ్యాలలో తప్పులు ఉన్నట్లే స్మృతి పథం లోనూ ఉంటాయి. ఎలా వాటిని ప్రమాణాలుగా స్వీకరించామో అలానే స్మృతి ని కూడా స్వీకరించాలని మధ్వులు తీర్మానించారు.

ఒక దేశ-కాల స్థితిలో జరిగిన సంఘటన మరొక దేశ-కాల స్థితిలో అదే విధం గా జరుగదు అయినప్పటికీ ఒకానొక సంఘటనను స్మృతి లో ఉంచుకున్న జీవి ఆ సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకోవడం ద్వారా మరికొన్ని సంఘటనలనుంచి ముక్తి పొందవచ్చు లేదా లాభ పడవచ్చు. గతంలో ఉన్న ఒక స్థితి ఇప్పుడు ఉందా లేదా అనే విషయం తో సంబంధం లేకుండా జీవి తనను తాను గత స్మృతి ద్వారా నిర్దేశించుకుంటాడు.

మానవ స్మృతిలో ఉన్న జ్ఞాపకాలకు ఇది గతానుభవం, ఇది ఇప్పటి అనుభవము అనే ముద్రలు వేసి ఉండవు. స్మృతి ఎప్పుడూ నవ్యత తో ఉంటుంది. స్మృతిలో దాగిన అనుభవం అసంకల్పితంగా సరియైన దేశ-కాల స్థితి లో జీవికి స్ఫురణకు వచ్చి తదనుగుణంగా కార్యాలు చేయిస్తుంది.

స్మృతి ప్రమాణం యథార్థం అని చెప్పడానికి మరొక ఉదాహరణ: నీళ్ళలో ఈదగలగడం. ఇది జీవి నేర్చిన విద్య. జీవి స్మృతి పథం లో ఉండి అవసరమైనపుడు ఇది జీవికి ప్రయోజనాన్ని చేకూర్చడం (ఈదగలగడం అనే సామర్థ్యాన్ని పునరావృతం చేయడం) వలన ఇది యథార్థ మైనది అని తెలియుచున్నది. అలాగే పిట్ట గూడు అల్లడం. మనసు ద్వారా జరిగే సంస్కార సన్నికర్షత వలన ఎవరూ నేర్పకుండా పిట్ట తనంతతానుగా గూడుని అల్లగలడం. లతలకు అల్లుకోవడం ! ఈ ప్రపంచం లో ఉన్న జీవరాశి లో స్మృతి కారణం గా వాటి జీవన గతులు నిర్దేశింప బడుచున్నాయి. కనుక స్మృతి మానస-ప్రత్యక్ష ప్రమాణం. యథార్త్యం (valid) గా ఉన్న ప్రతి జ్ఞానం ప్రమాణమని చెప్పవచ్చు. ఇది ద్వైత భావనకు ఆలంబనం.

***

౧౭. యథార్థత్వ (validity) సిద్ధాంతం

మనకు ప్రమాణాల ద్వారా విషయాల పట్ల జ్ఞానం ఉన్నది-ఉన్నట్లు సిద్దిస్తుంది అని తెలుసుకున్నాము. దేని ఆధారంగా మన అనుభవాలు యథార్థాలు అని చెప్పగలం అనేది తత్వ విచారణలో జటిలమైన ప్రశ్న. ఆధునిక తాత్వికులలో కొన్ని పరీక్షల ద్వారా సత్యాన్ని సాధించవచ్చు అనే అభిప్రాయం ఉంది. అవి: స్థిరత్వం, సంబంధం, ఉత్కృష్టత, సూచికత్వం.

ప్రమాణం = యథార్థం. అటువంటి ప్రమాణాల ఆధారం గా సముపార్జించిన జ్ఞానం యథార్థమే ఔతుంది.

జ్ఞానం ఒకే కాలం లో పరస్పర విరుద్ధమైన యథార్థ - అయథార్థ స్థితులలో ఉండదు. జ్ఞానం తో కూడి ఉండేది సత్యం. ఒకానొక నిర్దిష్టమైన/సమంజసమైన అనుమానాన్ని నిరూపించడానికి మాత్రమె జ్ఞాన సంబంధమైన పరీక్షలు, చర్చలు అవసరమౌతాయి. పాలనుంచి నీళ్ళను విడదీయలేము అనేది జ్ఞానం. ఎంత కాచినా పాలు చిక్కదనాన్ని పొందుతాయిగానీ వాటిలో ఉండే నీరు వేరుపడదు. అధికం గా వేడి చేస్తే ఆ పాలు మాడి మసి గా మారతాయి.

జ్ఞానం బాహ్య పరీక్షల ద్వారా నిర్ధారిమ్పబడితే ఆ పరీక్షల అర్హత ఋజువు చేయడానికి మరొక పరీక్ష అవసరపడుతుంది ఇలా పరీక్షల పరంపర మొదలౌతుంది. కాబట్టి మనసుకు స్వరూపేంద్రియమైన సాక్షి ద్వారా జ్ఞానం యొక్క యథార్థత నిరూపించబడుతుంది అని మధ్వులు ఒక నిశ్చయమైన విషయాన్ని తెలియచేసారు.

ఈ జ్ఞానాన్ని పొందుచున్న ఆత్మ చైతన్య స్వరూపము, స్వయంప్రకాశము, పరప్రకాశము కనుక సాక్షి ద్వారా జ్ఞానము దాని యథార్థ్యము (validity) నిరూపించబడతాయి.

అద్వైత సిద్ధాంతం చెప్పినట్లు జ్ఞానం వ్యవహారిక, పారమార్థిక స్థితులలో ఉండదు ఎందుకంటే అది త్రికాలలో మార్పు చెందకుండా ఉంటుంది కనుక.   జ్ఞానం స్వతః ప్రామాణ్యం. దానికి ఇతర ప్రమాణాల అవసరం లేదు. ప్రత్యక్ష ప్రమాణం ద్వారా జీవుడు అనుభావించే సుఖ దుఃఖాలు "నిర్దోషేన్ద్రియ సన్నికర్ష ప్రత్యక్షం" ద్వారా తెలుసుకుంటాడు కనుక అవి యథార్థాలు మానవ గ్రాహ్యమైన భగవంతుని మూల   – అవతార రూప భేదాన్ని శృతులు తప్పు అని నిరూపిస్తాయి. కృష్ణావతారం పరిపూర్ణావతరం అని చెప్పడం దోషం. నారాయణుని అన్ని అవతారాలూ సంపూర్ణావతారాలే. ఒక సంపూర్ణ స్థితి నుంచి ఒక అసంపూర్ణ స్థితి ఉత్పత్తి కాదు – "పూర్ణమదః పూర్ణమిదం" అనే శాంతి పాఠం ఇక్కడ అన్వయం ఔతుంది.   అంటే ప్రత్యక్ష ప్రమాణం ఆగమ ప్రామాణం ద్వారా స్థిరీకరించ బడుతుంది. ఇలా స్తిరీకరించబడ్డ జ్ఞానం కలిగిన సాధకుడు సర్వోత్తముడైన భగవంతుని మూలరూపానికి అవతారరూపానికి మధ్య భేదాన్ని చూడడు, ఎందుకంటే పరమాత్మ సుఖ దుఃఖాలకు అతీతుడు -అవతార లక్షణాన్ని ప్రదర్శించినప్పటికీ (సీత కొరకు రాముడి చేసిన రోదన). ఈ స్థితిలో తత్వమసి "పరబ్రహ్మం నేనుగా ఉన్నాను" అనే అర్థం వచ్చే ఉపనిషద్ వాక్కుని జీవుడు "అతత్వమసి" గానే గ్రహిస్తాడు.

ప్రత్యక్ష, సాక్ష్యానుభావాలు శృతుల ద్వారా వాటి యథార్థతను నిర్ధారించుకొంటాయి. అందుకే అపౌరుషేయమైన ఆగమ ప్రమాణం (శబ్ద ప్రమాణం) అత్యుత్తమ ప్రమాణం. అందుకే ఆధునిక తాత్వికులు భారతీయ తత్వ జ్ఞానం "శృతుల" బందిఖానా నుంచి బయట పడలేదు అని ఎద్దేవా చేస్తారు!! అన్నీ "వేదాల్లో ఉన్నాయష" అని వెటకారం చూపారు. అపౌరుషేయమైన వేదాలు ఈ భారతావనిలో పుట్టిన అందరకూ అత్యుత్తమ ప్రమాణాలు కాలేవు. ఎందుకంటే వీటికి పరమాత్మ మాత్రమె స్వతంత్రుడు, ఈ చరాచర సృష్టి అంతా అతనిపై ఆధారపడి ఉంది అనే అత్యుత్తమ జ్ఞానం అందరికీ లభ్యం కాదు కనుక!! ఈ జ్ఞానంలోనుంచి పుట్టేదే శరణాగతి లక్షణం గా ఉన్న భక్తి, ఈశ-దాస భావన. ఇదే "ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం".

ఈ జగత్తు సత్యం కాదు అనే అర్థాన్ని స్ఫురించే ఆగమ వాక్యాలను "ఈ జగత్తు తనంత తానుగా వ్యక్తమైనది/ పుట్టినది కాదు అని ఈ చరాచర జగత్తు పరతంత్రమనే సత్యం తెలుసు కోవాలి. ఇదే అర్థం లో "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అనే వేద వాక్కుని అనుసంధానం చేయాలి. సత్యమైనది అంటే స్వతంత్రమైనది. అసత్యత పరతంత్రత.

***

౧౮. సాక్షి సిద్ధాంతం

తత్వాన్వేషణ లో ఏ ప్రమాణం ఆధారం గా యథార్థత ను నిరూపిస్తామో ఆ ప్రమాణం కోసం అనాదిగా శోధన జరుగుచూనే ఉన్నది. జ్ఞానం యొక్క యథార్థత అట్టి ప్రమాణం ద్వారా నిరూపించబడినపుడే అది సరియైన సిద్ధాంతం గా తెలుసుకోబడుతుంది. అపుడు సత్యం జ్ఞానానికి అంతర్భాగంగా ఉంటుంది అని సాధకుడు తెలుసుకోగలుగుతాడు. మానవ అనుభవాలలో ఉన్న తప్పిదాన్ని నిరోధించడం అసాధ్యమైన విషయమే. కాబట్టి ఈ తప్పిదాన్ని సైతం తొలగించగల ప్రమాణం యొక్క అవసరం సాధకునకు ఉంది.

ఈ విషయం లో జయతీర్థులు ఆరు విధానాల ద్వారా అత్యుత్తమ ప్రమాణాన్ని సాధించవచ్చునని వివరించారు, అవి:

౧. దోషరహిత ఇంద్రియ జ్ఞానం ద్వారా ఏర్పడ్డ ప్రమాణం
౨. దోష రహిత ఇంద్రియాలు సంగ్రహించిన జ్ఞానం
౩. సాధ్యత తో కూడిన జ్ఞానం
౪.అప్పటికే లభ్యమైన ఇతర జ్ఞానం తో ఏకీభవించ గలిగిన జ్ఞానమై ఉండడం
౫. ఇతర జ్ఞానాలతో విభేదించ కుండా ఉండడం
6. తనంత తానుగా దోష రహితం గా ఉండడం

ఈ పై ఆరు విధానాలలో ప్రమాణం స్వతః ప్రామాణ్య తను కలిగి ఉంటుంది సహజంగా. ఒక ప్రమాణానికి విరుద్ధమైన అంశం లేక పోవడం వలన ఆ ప్రమాణం ఉత్తమం అని చెప్పలేము. ఉదా: ఆకాశం నీలి రంగు

లో కనిపించడం. కనుక బాహ్య సాధనాలతో ప్రమాణం యొక్క యథార్థత ను నిరూపించలేము. అంతః ప్రమాణమైన సాక్షి ద్వారానే ఇది సాధ్యం. జ్ఞానం మనః ప్రవృత్తి కనుక అది స్వప్రకాశం కాదు. కాని సాధకుని ఆత్మకు స్వరూపేంద్రియమైన "సాక్షి" ద్వారా జ్ఞాన గ్రాహకత్వం ప్రమాణ పూర్వకం గా సాధ్యం ఔతుంది. అదే సాక్షి ప్రత్యక్ష ప్రమాణం. *ఈ సాక్షి ప్రత్యక్ష ప్రమాణమే మనకు సుఖాన్ని దుఃఖాన్ని ఏ అనుమానం లేకుండా తెలియచేస్తుంది. ఇది సుఖాన్ని ఇస్తుంది ఇది దుఃఖాన్ని ఇస్తుంది అని చెప్పడం లో మనిషి - నాస్తికుడైనా / మాయావాది అయినా - ఎటువంటి అనుమానానికీ గురికాడు. ఈ అనుమాన/ దోష రహిత ప్రమాణమే సాక్షి ప్రత్యక్ష ప్రమాణం. ఒకవేళ జ్ఞానం స్వతః ప్రామాణ్య తను కలిగి ఉన్న ప్పటికీ అది స్వరూపేంద్రియ మైన సాక్షి ప్రమాణం ద్వారానే నిర్ధారింపబడుతుంది. ఈ స్వరూపేంద్రియానికే "జ్ఞానప్రామాణ్యగ్రాహకత్వం" సహజం గా ఉంటుంది. ఇది తత్వజ్ఞాన సముపార్జనకు మధ్వులు మాత్రమే అందించిన ఒక బలమైన ప్రమాణం.*

సాక్షి ప్రమాణం ఒక మానసిక ప్రమాణం అని కొట్టివేసే తత్వవాదులూ ఉన్నారు. మనోగాతాలైన సుఖ, దుఃఖాలు, సంతోష, సంతృప్తి భావనలు స్వరూపేంద్రియమైన సాక్షి ద్వారా తెలిసేవే. కనుక సాక్షినిర్ధారిత జ్ఞానమే సత్యం.

***

౧౯. సాక్షి – ఒక చిట్టచివరి సత్య నిర్ధారణ

ఇంద్రియ గ్రాహక జ్ఞానాన్నే వృత్తి జ్ఞానం అని అంటారు. ఇది సాధారణమైన జ్ఞానం ఈ జ్ఞానం సాక్షి ప్రమాణం ద్వారా పరిపూర్ణతను పొందుతుంది. ఆత్మ ఎంత సత్యమో అంతే సత్యం దాని ఇంద్రియమైన సాక్షి. ఇది జీవిలో నిక్షిప్తమై ఉన్న ఒక అద్భుతమైన *చైతన్య-ఇంద్రియము* . ఆత్మ, సాక్షి అనేవి కేవలం వ్యవహారిక విభజన కోసం వాడే పదాలు ఇవి తత్వతః ఒకే అస్తిత్వాన్ని కలిగి ఉన్నాయి అదే ఆత్మ. ***మూడు కారణాలసత్యాల వలన సాక్షిని చిట్టచివరి నిర్ధారణ అని చెప్పవచ్చు :***

1. ***సాక్షి అన్ని ప్రమాణాలకు ఉన్న ప్రమాణం***
2. ***తార్కిక పరిపూర్తి సాక్షి ద్వారానే సాధ్యం***
3. ***అతీంద్రియ అంశాలైన కాలము, ఆకాశము, ఆత్మ స్వభావము, దాని గుణాలు, చిత్త ప్రవృత్తులు, సుఖ దుఃఖ అనుభవాలు, సుషిప్తి (మనసుకూడా విశ్రాంత స్తితి లో ఉండే స్వప్న రహిత కాలం లో) లో పొందిన నిద్రాకాలిక ఆనందం మొదలగునవి సాక్షి ద్వారానే జీవికి తెలుస్తాయి.***

స్వరూప, ఇంద్రియ అనే పదాలు కేవలం సవిశేష భేదాన్ని (అంటే జీవికి భగవంతుని తో ఉన్న భేదాన్ని) చూపడానికే వాడబడినవి. ఈ సాక్షి ప్రమాణం ప్రతి తాత్వికునికి అతను విశ్వశించిన సిద్ధాతం తో ప్రమేయం లేకుండ (అద్వైతమా, ద్వైతమా, విశిష్టాద్వైతమా అనే భేదం లేకుండా) మాయావాదికి, శూన్యవాదికి, ఆస్తికునకు, నాస్తికునకు, భౌతికవాదికి అందరికీ అంతిమ నిర్ధారణ ఇచ్చే అతీన్ద్రియం!!

స్వతంత్ర అద్వితీయ బ్రహ్మం లో సమన్వయము కాని జ్ఞానం కేవలం మానుష జ్ఞానం. అట్టి జ్ఞానం తత్వ జ్ఞానం కాదు. సాక్షి ప్రమాణాన్ని సాధారణ ఇంద్రియ ప్రమాణాలతో సమానం చేయడం వలన "ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం" సాధ్యం కాదు. మానసిక దర్శనమైన సత్యాన్ని పరీక్షలకు గురిచేయడం ద్వారా ఆ సత్యం ఇంకా బలపడుతుంది కాని అసత్యం కాదు ఎందుకంటే "సాక్షి" నియతయథార్థ్యం (absolute certainty) , సహజ శక్తి పూరకం (Intrinsically powerful) కనుక. ఈ లక్షణాలను మనసుకి ఆపాదించలేము ఎందుకంటే మనసు ఒక ఫలకం (అందుకే మనోఫలకం అనే పదప్రయోగం వాడుకలో ఉంది) అది ఆత్మ అనే సాక్షిని జీవుని అనుభవానికి తీసుకొని వస్తుంది.

***

౨౦ భారతీయ తత్వ విచారణలో దోష నిర్ణయ సిద్ధాంతం

నిశ్చయమైన సిద్ధాంతానికి వ్యతిరేకమైనదే దోషభూయిష్టమైన సిద్ధాంతం. ఈ దోషాన్ని ఎలా నిర్ధారించి నిరోధించాలి అనే విషయం తత్వం జ్ఞాన సముపార్జనలో అత్యంత కీలకమైనది.

ఇదం రజతం (ముత్యపు చిప్పలో చూసిన వెండి)
రజ్జు సర్ప భ్రాంతి (తాడుని పాము గా భావించి భయాన్ని పొందడం)

పైన తెలిపిన విషయాలు దోషభూయిష్ట జ్ఞానానికి అనాదిగా తత్వ చర్చలో వాడుచున్న ఉదాహరణలు. ఈ ఉదాహరణలను, వీటి లో దాగిన దోషాన్ని గ్రహించడం ఆధారం గానే సాధకుడు తాను గ్రహించే విషయ జ్ఞానమూ తద్వారా తత్వ జ్ఞానమూ నిశ్చయింపబడతాయి.

భారతీయ తత్వ శాస్త్ర వేత్తలు ప్రముఖం గా క్రింది తెలిపిన దోష నిర్ధారణ సిద్ధాంతాలను పరిగణ లోనికి తీసుకొని వాటి ద్వారా తత్వ జ్ఞానాన్ని స్థిరీకరించారు. అవి:

౧. బౌద్ధుల శూన్యవాదం
౨. న్యాయ, మీమాంసకారులు, శంకరులు చేసిన మాయావాదం
౩. రామానుజులు చేసిన అఖ్యాతిసంవలిత – యథార్థ ఖ్యాతి సిద్ధాంతం
౪. మధ్వులు చేసిన అభినవ – అన్యథా ఖ్యాతి సిద్ధాంతం

ప్రభాకరుల మీమాంశ ప్రకారం దోషం రెండు వైరుధ్యమైన అంశాలను కలిపి గ్రహించడం లో ఏర్పడ్డ విషయం. ఈ రెండు అంశాలలో ఒకటి కనిపించేది రెండవది ధారణ ఆధారం గా గ్రహించినది. ఏది ఏమైనా దోషం ఒక పాక్షికమైన సత్యం అంటే అది ఒక అసంపూర్ణ జ్ఞానం. ఇదం రజతం (ముత్యపు చిప్పలో వెండి) అనే చిత్త భ్రాంతి కి కారణం ప్రకాశత్వం, శ్వేతత్వం (whiteness). తద్వారా మనసు ఇచ్చిన తీర్పు ఆధారం గా దీనిని ఒక సత్యం గా పరిగణ లోనికి తీసుకోవడం.

జయతీర్థులు ఇదం రజతం ద్వారా చేసే తత్వ విచారణను ఖండిస్తారు. ఒకే వస్తువులో రెండు వస్తువులు ఒకే సారి చూడడం అనేది తర్కానికి అందని విషయం. ఎందుకంటే ఒకే వస్తువును ఒకే సమయం లో అనేకంగా చూడడం అసాధ్యం. జ్ఞానం స్వయంప్రకాశం అయినప్పుడు అట్టి జ్ఞానం సహసంబంధాన్ని చూడగలదు గాని వైరుధ్యాన్ని చూస్తూ ఒకటిగా భావించదు. ఈ విషయం లో మధ్వులు

ముత్యపుచిప్పను రజతమని భావించడానికి కారణం కనిపించే వస్తువుకి, వాస్తవంలో ఉన్న వస్తువుకి మధ్య ఉన్న వైరుధ్యాన్ని గమనించక పోవడమే అని చెబుతారు.

రామనుజులు ప్రభాకరులు చెప్పినట్లే ముత్యపు చిప్పలో రజతాన్ని చూడడం ఒక సాపేక్ష సత్యమని అది మొత్తానికి అసత్యం కాదు అని అని అంటారు. రామానుజుల ప్రకారం ప్రపంచం లో ఉన్న ప్రతి వస్తువు కొన్ని ఇతర వస్తువుల మూలకారకాలను ప్రతిఫలిస్తుంది ఉదా: పాంచీకరణ (మన శరీరం పంచ భూతాల సమన్వయము). కనుక ముత్యపుచిప్పలో ఉన్న రజత సంబంధ కారకాల వలన రజతం గా కనిపించడం లో సత్యం ఉన్నది. కాబట్టి రామానుజులు ఇది వైరుధ్యాన్ని గ్రహించక పోవడం (misapprehension) వలన కాదు, వస్తువులలో దాగిన తత్వాల ఆధారం గా చెప్పడం అని అంటారు. రామానుజుల దోష నిర్ణయం నిజానికి ముత్యపు చిప్పలో దాగిన రజతాన్ని చూపడానికే ఉపయోగపడుతుంది గానీ దోష నిర్ధారణ చేయదు.

బౌద్ధులు ముత్యపు చిప్పలో చూసిన రజతం మనస్సు యొక్క అంతర్గత విషయం. వాస్తవం లో ఉన్న / లేని వస్తువుల గూర్చి కూడా తెలిపే మనోగతమైన విషయాలను భౌతిక వస్తువులు గా మనస్సు చూపడం వలన కలిగిన దోషం అని అంటారు. వాస్తవంలో లేని వస్తువుల జ్ఞానాన్ని సైతం భౌతిక వస్తువులు గా చూపడం అనేది కేవలం తర్కానికి అందని విషయం. కనుక ఇది నిజమైన దోష నిర్ధారణ కాదు అని జయతీర్థులు వివరించారు. చిత్త భ్రమలో అసలు అస్తిత్వం లో లేని వస్తువుని సైతం చూడడం అనేది అవగాహనకు అందని విషయం!! ముత్యపు చిప్పను బాహ్యంలో కన్ను చూడడం వలన కలిగిన భ్రమ కేవలం మానసిక వీక్షణకు పరిమితం చేయడం లోపభూయిష్టం. భ్రమకు కారణం కన్ను చూడడం కాని మనసు చూసిన విషయాలు కావు.

న్యాయ సిద్దంతకారుల ప్రకారం ముత్యపు చిప్పలో కనిపించన రజతం భ్రమ అయినప్పటికీ రజతం అనేది ఎక్కడో ఒక చోట ఉన్నది. ఇది కన్ను చూసిన విధానంలో లోపం వలన రజతం గా కనిపించింది. అయితే జయతీర్థులు చెప్పినట్లు రజతం ప్రపంచం లో ఉన్నదా లేదా అనేది తర్కం లోని విషయం కాదు. ఆరోపిత రజతం అసలైన విషయం. ఒక వస్తువును మరొక వస్తువుగా చిత్త భ్రాంతి వలన ఊహించడం రెండు సత్యాలను తెలుపుతుంది. ఏదైతే రజతం అని మనసు చెబుతుందో అది విశ్వం లో సత్యమైన విషయం. అలాగే, అది రజతం కాదు, అది ముత్యపు చిప్ప అని తెలిసిందో అదికూడా వాస్తవం. అంతేకాక, కలిగిన చిత్త భ్రాంతి ఎప్పటికీ ఋజువు కాదు, రజతం ఉన్నది అని చెప్పడానికి.

గతం లో రజతాన్ని చూసిన సంస్కారం రజతం లా కనిపిస్తున్న ముత్యపు చిప్పను చూసి రాజతమే అనుకోవాడానికి కారణం. చిత్తభ్రమ ను అర్ధం చేసికోవడం లో అధిష్టాన (వాస్తవంలో ఉన్న రజతం) ప్రధాన (రజతం గా అగుపించిన ముత్యపు చిప్ప) రెండు వస్తువులూ వాస్తవాలే.

"ఇదం రజతం" అనే దోషాన్ని అద్వైతం అనిర్వచనీయఖ్యాతి అని చెప్పింది. ఈ భ్రమ లో ప్రస్తావించబడిన వస్తువు నిజం కాదని దాని అస్తిత్వమే లేదని వాదిస్తుంది అద్వైతం. గతం లో చూసిన రజతం వలన మనసు రజతం గా కనిపించే ముత్యపు చిప్పలో ఒక అనిర్వచనీయ రజతాన్ని తయారు చేస్తుంది. భ్రమ ఉన్నంతవరకే ఈ అనిర్వచనీయ రజతం ఉంటుంది. అది సత్తు కాదు అసత్తు కాదు అలాగని సదసత్ కాదు అనీ, అది సత్తు మరియూ అసత్తు అని చెబుతుంది. సత్తు అసత్తు అనేవి రెండు విషయాలు కాబట్టి వాటి సహ-అస్తిత్వం (కలసి ఉండడం) కుదరదు.   కాబట్టి ఈ వివరణను మధ్వులు ఖండించారు.

ఆత్మ సర్వ వ్యాపి అని చెప్పినపుడు అది ముత్యపు చిప్పలోనూ ఉన్నది. అటువంటి ఆత్మకు అవిద్యను ఆపాదించినట్లే కదా. అంతః గ్రాహ్యామైన అనగా సాక్షి ఆధారంగా లభ్యమయ్యే ఆనందంలా ఈ భ్రాంతిని వివరించలేము ఎందుకంటే బాహ్యేద్రియం చూడడం అనే క్రియ ద్వారా ఈ భ్రాంతి సంభవించింది కనుక. అందువల్ల ఈ భ్రాంతి కేవలం "అన్యథాఖ్యాతి" వలన సంభవించింది. ఆత్మకు జ్ఞానాన్ని, అవిద్యను ఆపాదించడం ఒకే మనిషి లో నేరస్తుణ్ణి, న్యాయమూర్తి ని చూడడమే. అద్వైతం చెప్పినట్లు సాక్షి తన అవిద్యతో రజతాన్ని చూడడం, నేత్రానికి రజతం కనిపించడం అనే రెండు క్రియల వలన అసలు భ్రాంతే సంభవం కాదు. అద్వైతం చేసే పదవిన్యాస సహిత తర్కం లో ఈ దోషం ఒక గందరగోళ స్థితికి దారితీస్తుంది. ఎందుకంటే అసలు ముత్యపు చిప్పే లేదు ఈ మాయారూపమైన జగత్తులో! ఉన్నదంతా ఒకే పర్దార్థం అదే పరమాత్మ అదే నీవు అని అద్వైతం చెబుతుంది. ప్రాతిభాసిక రజతం (భ్రమ వలన) వ్యావహారిక ముత్యపు చిప్పలో కనబడం అంటే స్వతః వ్యావహారికమైన రజతం వ్యావహారిక ముత్యపు చిప్పలో కనబడడమే. అంటే మాయలో మరో మాయను వీక్షించడం. అప్పుడు ముత్యపు చిప్ప ఎక్కడ ఉంది అంటే సముద్రం తీరంలో , అదీ మాయే, ఆ సముద్రం ఎక్కడ ఉంది, అది మాయ అయిన జగత్తులో, జగత్తు ఎక్కడ ఉంది? జగత్తు మాయ కాబట్టి అది లేదు, ఇలా తర్కించుకొంటూ పోతే సాధకునకు అందే తత్వ జ్ఞానం చిట్టచివరకు సూన్యం!! అనిర్వచనీయ వ్యావహారికత్వం అద్వైతం లో దోష నిర్ధారణ ను ఒక సంక్లిష్ట స్థితికి తెస్తుంది. ఇదే విధమైన తర్కం తో రజ్జు సర్ప భ్రాంతి ని కూడా వివరించ వచ్చు.

***

౨౧ మధ్వాచార్య దోష నిర్ణయ సిద్ధాంతం

వాస్తవమైన తత్వ జ్ఞానాన్ని ఆవిష్కరించే సిద్ధాంతాలకు ఇంద్రియ గ్రాహకత్వం లో ఉన్న దోషాలు, భ్రమలు అతి సహజమైన, సామాన్యమైన విషయాలు. నిజానికి వీటివలనే నిజమైన జ్ఞానం దక్కుతుంది. ఇవి యవనికలు. ఇవి తొలగితేనే జ్ఞానం సిద్ధిస్తుంది. జీవితం చాల విశాలమైన రంగస్థలం. దీనిపై సత్యాసత్యాలు నిరంతరం కదలాడుతూనే ఉంటాయి. జీవన గమనంలో మన అనుభవాలు నిత్యమూ నిశ్చయ జ్ఞానాలతో కూడి ఉండడం అసంభవం. కాబట్టి ఒక మంచి సిద్ధాంతం ఈ సత్యాన్ని పరిగణ లోనికి తీసుకొని ఈ భ్రమలను, నైరాశ్యాన్ని, దోషాలను, అనుకోని అవాంతరాలను ఎలా అర్ధం చేసికొని వాటినుంచి జ్ఞానాన్ని పొందాలో తెలియచేస్తుంది.

అందుచేత దోషభూయిష్టమైన మానవ అనుభవాలను సత్యాలు, అర్ధ-సత్యాలు అని పలు పదవిన్యాసాలతో సమర్ధించు కోవలసిన అవసరం లేదు, లేదా వీటిఅన్నిటినీ కేవల భ్రమలు అని మాయావాదం చేయవలసి పని లేదు అని మధ్వాచార్య అభిప్రాయం.

నిశ్చయాత్మకం గా ఉండడం జ్ఞానానికి ఉన్న నియమం. ఆత్మేంద్రియమైన సాక్షి ఆధారంగా సాధనలోని అనుమానాలను పలు పరీక్షల ద్వారా పరిహరించి, సాధకులకు సత్యాల పట్ల హామీని ఇస్తూ జ్ఞాన సముపార్జనకు దోహదపడడం ముఖ్యమని బాదరాయణ హృదయాన్వేషులు భావిస్తారు. ఇట్టి స్థితిలో ఒక అవాస్తవాన్ని వాస్తవంగా చూడడం, లేని సంబంధాన్ని, వస్తువుని పూర్వ జ్ఞానం ఆధారం గా ఊహించడం ద్వారా ఏర్పడినవి భ్రమలు అని ఒక వాస్తవిక అవగాహనను శులభమైన రీతిలో వివరించారు మధ్వులు. భ్రమ ఒక నిజాన్ని తదనంతర కాలంలో తెలియచేస్తుంది. “ఇక్కడ రజతం లేదు కేవలం లేని రజతం ఉన్నట్లు గా కనిపించింది” అని ఒక్కమాటలో “ఇదం రజతం” అనే దోషాన్ని పరిహరిస్తారు. “ అన్యథాఖ్యాతి” అనే పదం తో ఈ దోషాన్ని వివరిస్తారు. అనిర్వచనీయత “అసత్” విలక్షణత గా చెబుతూ “సత్తును” ఒక అవనికగా చూపుతారు అద్వైతులు.

ఇదం రజతం అనే భ్రమలో ప్రధానం గా మూడు విషయాలు ఉన్నాయి:

౧. ఇదంకర అధిష్టానం (ముత్యపు చిప్ప- ఇదం)

౨. ఆరోప్యం (“వెండి” అని - రజతత్వం)

౩. తాదత్మ్యం (సంసర్గం – సారూప్య సంబంధం)

పై మూడు ఒక బాధకజ్ఞానం అనే దోషానికి కారణాలు. ఈ దోషం మానవ సహజం ఇది మధ్వాచార్య సరళమైన వివరణ.

***

ప్రాపంచిక అనుభవాలు

౨౨. ప్రాపంచిక అనుభవం యొక్క వాస్తవం

గ్రాహ్యక (perceptual), హేతుబద్ధ, వాగ్మయాత్మక ఆధారాలతో వాస్తవం ముడివడి ఉంటుంది అని ద్వైతం చెబుతుంది. ఈ ప్రాపంచిక వాస్తవం పై విశ్వాసం ఆధ్యాత్మికత కు మూలస్థంభం వంటిది. పంచేంద్రియ గ్రాహకత్వానికి+ మనసుకి మించి ఏడవ గ్రాహ్యతకు మధ్వులు ఇచ్చిన పేరు "సాక్షి" అని ఇంతకుముందే తెలుసుకున్నాము. జ్ఞానం స్వతః ప్రమాణం ఎందుకంటే అది దానికి ఉన్న అంతర్గత లక్షణం. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సాంప్రదాయాలలో ఉన్న భారతీయ వేదాంత వేత్తలు ఈ సత్యాన్ని అవలోకనం చేసుకున్నవారే.

జగత్తు సత్యం అనేది ఇటువంటి స్వతః ప్రమాణతను కలిగియున్నది. జగత్తుని అద్వైతులు వ్యవహారిక, పారమార్థిక, ప్రాతిభాసిక సత్యం అని మూడు విధాలుగా వివరిస్తారు. ఈ వివరణ స్వతః ప్రమాణ మైన జగత్తుకి సరిపడదు. ప్రత్యక్ష ప్రమాణం గా మాంస నేత్రానికి గోచరమౌతున్న ఈ జగత్తు కేవలం కొంతకాలం ఉండేది కాబట్టి ఇది వ్యవహారిక సత్యం అని భావించడం సాధారణ అనుభవాలను తృణీకరించి శూన్యం నుంచి సిద్ధాంతాలను చేయడం. మానవ అనుభవాలు పరీక్షలకు, ప్రమాణాలకు లోబడి ఉండేవే కనుక అవి సత్యాలు. ఇవి అసత్యాలు అనడం "నా పంచేంద్రియ గ్రాహ్యతను నేనే కాదనడం" తో సమానం. ఇది ఒక అసంగత ప్రలాపం. ఈ సాధారణ సత్యాన్ని కాదంటే మరి అనుభవం లో ఉన్న "ఇది మంచి – ఇది చెడు" అనే విషయాల అస్తిత్వాన్ని కూడా గుండు సున్నా అని చెప్పడమే. అప్పుడు జగత్తు లో వైవిధ్య నిర్ణయం, అనుభవం, నైతికత, మొదలగు విలువలు లేకుండా కేవలం "నేను చూస్తున్నది సత్యం కాదు అనే అయోమయ స్థితి" లో మానవుడు మనుగడ సాగించడం కుదరదు!

వ్యాసతీర్థులు ఈ స్థితిని "వడ్డీ కోసం అసలును వదులుకోవడం" అని చమత్కరించారు. "ఇదం న రజతం" అని ఒప్పుకోకపోతే జరిగే పర్యవసానం అసలును వదులుకోవడమే!! అద్వైతం ఒక "స్వయః ధ్వంస కారక సిద్ధాంతం". ఒక ఆప్తవాక్యాన్ని విని తద్వారా సన్మార్గంలో వెళ్ళగలగడం కూడా అసత్యమైతే మరి ఇంద్రియ గ్రాహకత్వం ఎందుకు మనకు ఉన్నట్లు? అట్టి ఇంద్రియ గ్రాహకత్వం లో ఉత్కృష్టమైన సాక్షి ప్రత్యక్ష ప్రమాణం కూడా "ఇదం రజతం" లాంటి భ్రమే అయితే సాధారణ జీవితం ఎంత గందరగోళం గా ఉంటుందో?

వేదవాగ్మయం లో ఉన్న సగుణ ఉపాసన, కర్మకాండ ఈ మిథ్యావాదం లో కొట్టుకోనిపోయినట్లే! భక్తిలో పొందిన పారవశ్యం, ఆనందం, చీకటిలో పొందిన భీతి, సుషుప్తి లోని నిద్రాకాలిక సుఖం ఇవన్నీ లేనట్లే!! వీటికి ఋజువు అయిన ఆత్మేన్ద్రియం మైన సాక్షి ఉనికి ద్వైత సిద్ధాంతానికి ఆయువు పట్టు.

ఏదైనా ఇంద్రియ గ్రాహ్యత అభావమని చెప్పాలంటే ఆ గ్రాహ్యత కన్నా ఉత్తమమైన గ్రాహ్యత అవసరం అనడం కేవలం తర్కం ద్వారా వాటిని కాదనడం. ఇంద్రియ గ్రాహ్యత బాహ్య పరీక్షలకు తట్టుకోగల అంతర్గత ఆధారాలతో కలసి ఉంటుంది. ఉదా : అగ్ని దహించ గలగడం.

వ్యక్తిగత అనుభవమైన సాక్షి ప్రమాణాన్ని ఇతర ప్రమాణాలు తిరస్కరిస్తే ఎలాంటి సిద్ధాంతమైనా పేకమేడలా కూలిపోతుంది. మరి ఇంద్రియ గ్రాహ్యమైన భ్రమ కూడా సాక్షి ప్రమాణం గా ఉన్నదే కదా అప్పుడు భ్రమలకు వాస్తవాల కు మధ్య ఉన్న భేదాన్ని ఎలా సాధించాలి అనే ప్రశ్న రావచ్చును. దీనికి సమాధానం “అనుభవాలు మిథ్య” అని నమ్మిన అద్వైతి కూడా తన ఆత్మేంద్రియ సాక్షి ఆధారం గానే తన నమ్మకాన్ని స్థిరీకరించుకుంటాడు. అప్పుడు అతని నమ్మకం “అంతా మిథ్య” అనే మరో గొప్ప సిద్ధాంతం వలన వీగిపోయి తన అస్తిత్వమే ఒక శూన్య భావం అని చిట్టచివరికి సాధనలో శూన్య ఫలితాన్నే పొందుతాడు!! వాగ్మయ జ్ఞానం సైతం సాక్షి ప్రమాణం ద్వారానే సాధకునకు రూఢి ఔతుంది. ఇది సాక్షి ప్రమాణానికి ఉన్న ప్రాధాన్యత.

మధుసూధనసరస్వతి సాక్షి కేవలం వర్తమాన ప్రపంచానికే పరిమితం అని వాదించారు. అప్పుడు మూడు కాలాలకు వర్తించిన పారమార్థిక, వ్యావహారిక, ప్రాతిభాసిక సత్యాలు ఎలా ఖచ్చితం అని చెప్పగలం? మిత్యావాదాన్ని నమ్మే అద్వైతి సైతం తన సాక్షి ఆధారం గానే వీటిని ఊహించవలసి ఉంటుంది!

ఉదా : యజమానః ప్రస్తరః అనే వేద వాక్కు (బలి ఇచ్చునవి గుప్పెడు దర్భలు) ని యథాతథం ఒప్పు కోవడం సాధ్యం కాదు. పూర్వ మీమాంసకారులు చెప్పినట్లు ఈ వేదవాక్కుని సరియైన సమన్వయము తో అర్థం చేసుకోవాలి. ఇదే సత్యాన్ని మధ్వులు మహా వాక్యాలు అని అద్వైతులు చెబుతున్న వాటికి కూడా అన్వయిస్తారు.

“అహంబ్రహ్మాస్మి”, “ప్రజ్ఞానం బ్రహ్మ”, “అయమాత్మా బ్రహ్మ”, “తత్వమసి” అనే వాక్కులను సైతం ఈ విధంగానే సాక్షి ప్రత్యక్షం ఆధారం గా అన్వయం చేసుకోవలసిన అవసరం ఉంది. మనకు అనాదిగా ఉన్న స్మృతు లు శృతులను వాటి నిజమైన అర్థాలను సాక్షయానుభావం ద్వారానే తెలుసుకోగలం. ఎలా మనకు సుఖ దుఃఖాలు తెలుస్తాయో అదే విధం గా ఈ వేద వాక్కుల పరమార్థాలు సాక్ష్యానుభావం ద్వారానే అవగతమౌతాయి. జీవాత్మకు ఆపాదించిన బ్రహ్మతత్వం అసాధ్యమని ఈ సాక్ష్యానుభావం ద్వారా జీవుడు – దేవుడు అనే ద్వైత భావన సహజం గా కలిగి తీరుతుంది!

యథాతథ అర్థాల ఆధారం గా వేద వాక్కులు అర్ధంకావు పైగా అవి వేద ప్రతిపాదిత విషయాలను ధ్వంసం చేస్తాయి. మహా వాక్యాలు గా చెప్పబడుచున్నవి యథాతథం గా వేదం వాగ్మయం లో ఉన్నవే కాని వాటి ప్రతిఫలార్థాలు/ తాత్పర్యాలు (purport) మాత్రం వాటి యథాతథ అర్థాలకు భిన్నం అని మధ్వులు నిరూపిస్తారు. అందుకే మహాభారత తాత్పర్య నిర్ణయం వంటి గ్రంథాన్ని వ్రాసారు మధ్వులు.

***

౨౩ ప్రాపంచిక వాస్తవాలపై కొన్ని అభ్యంతరాలు వాటికి సమాధానాలు

స్వప్నం లో పొందిన సుఖం లేదా దుఖం జాగృతిలో జ్ఞప్తికి వచ్చినపుడు జీవుడు పొందే అనుభవాలు/ అనుభూతులు అసత్యాలు కావు ఎందుకంటే ఇవి భగవంతునిచే జీవుల సాధన/ఉద్ధరణ కొరకు కల్పించబడినవి కనుక. కొన్ని అనుభవాలు భౌతిక ప్రపంచం లో జీవులకు సాధ్యం కావు అవి స్వప్నావస్థ లోనే పొందవలసి ఉంటుంది కనుక అవి భగవద్కల్పితాలు.   ఈ స్వప్నాలు జీవి వాసనా బలం ఆధారం గా వచ్చేవి. ఈ వాసనా బలం జీవుల మనస్సులో అనాదిగా నిక్షిప్తమై ఉంటుంది. ఇదే ఈ జగత్తు సత్యం అని జీవికి నిర్ధారిస్తూ వస్తుంది. ఈ వాసనా బలం అతీన్ద్రియం గ్రాహ్యం కనుక దీని తాలూకూ విషయాలు అతీంద్రియ గ్రాహకమైన మనసు ద్వారానే అనుభవించాలి జీవులు. వీటిని ప్రాపంచీకరించడం అసాధ్యం. ఈ జీవికి ఉన్న వాసనలకు (agelong potencies) ఒక నిర్దిష్టమైన దేశ-కాల స్థితి ఉంటుంది ఆ స్థితిలోనే స్వప్నం కలుగుతుంది. శంకరులు కూడా స్వప్నాలు వాసనలకు పుట్టినవి అని చెబుతూ ఆ వాసనలు వర్తమాన జీవితం లోని జాగృదావస్థ కు సంబంధించినవి అని వివరిస్తారు. ఈ వివరణ భారతీయ తత్వ శాస్త్రానికి సరిపడనిది. ఎందుకంటే సమస్త వేదం వాగ్మయం జన్మ-పునర్జనం – జన్మ అనే చక్ర వర్తనాన్ని ఖరారు చేస్తుంది. కాబట్టి స్వప్నాలు కేవలం వర్తమానా జీవితం లో జాగృదావస్థకే సంబంధించిన వాసనల వలన కలిగేవి కావు. ఇవి పూర్వ జన్మ వాసానా బాలాన్ని వర్తమానానికి అన్వయిస్తూ మనసుకు స్వప్నం రూపంలో అనుభవాలు ఇచ్చే ఒక అద్భుత భగవద్సృష్టి.   స్వప్నం లో కనిపించిన స్థూలమైన విషయాలు / వస్తువులు వాస్తవంతో విభేదిస్తాయి అంటారు శంకరులు, మధ్వులు మరికొంత వివరం గా

చెబుతూ: జీవుల వాసనలకు ఆది లేదు, అట్టి వాసనల ఆధారం గా జీవులు పొందవలసిన అనుభవాలు పరమాత్మ యొక్క అద్భుత సృష్టి అయిన స్వప్నాల ద్వారా జీవులకు వ్యక్తిగతం గా ఇవ్వబడతాయి. ఈ వాసనలు ఇవ్వవలసిన అనుభవం బాహ్య జీవితం లో/ బాహ్య వస్తువులతో, సంబంధాలతో సాధ్యం కాదు కనుక స్వప్నంలో అది సాకారమౌతుంది! అందువలన స్వప్నాలు సైతం సత్యాలే. ఏ వాసనా బలం వలన ఏ స్వప్నం వచ్చింది అనేది జీవికి ఎప్పటికీ అంతుచిక్కని విషయం. స్వప్నం అసత్యం గా జీవులు భావించడానికి కారణం ఆ స్వప్నం లో ఉన్న అంశాలు జాగృదావస్తకు అన్వయించడం వలన. చిత్త భ్రమల (రజ్జు సర్ప భ్రాంతి) వలెనె స్వప్నాలు కూడా భయాలు కలిగిస్తాయి "ఇదం రజతం" లా ఆశలూ కల్పిస్తాయి ఎందుకంటే అవి మనసులో నిక్షిప్తమైన జ్ఞానం ఆధారం గా కలిగిన అనుభూతులు కనుక. ఇప్పుడు అద్వైతం చెప్పినట్లు కనిపించే జగత్తు అసత్యం అయితే స్వప్నం లో కనిపించే జగత్తు సత్యమా? అప్పుడు కనిపించేది అసత్యమే కనబడనిదీ అసత్యమే అయితే మరి జీవి గతి ఏమిటి ? ఒక్క సూటి ప్రశ్న తో జయతీర్థులు మిథ్యా వాదాన్ని నిరసిస్తారు "ఈ ప్రపంచం సత్యం కాదు అనే స్థితి ఎలా జీవుల సాధనకు మరింత మెరుగైన అవకాశం కల్పిస్తుంది?" అని!!

ఈ జగత్తు సత్యం కాదు అనే జ్ఞానం వలన జీవులు అందరూ అన్నీ చూడగలరా అన్నీ తెలుసుకోగలరా లేకా ఏదీ చూడలేరా ? అప్పుడు వయక్తికమైన జ్ఞానం ఎలా జీవులకు సిద్ధిస్తుంది? ఈ ప్రశ్నలకు అద్వైతం సమాధానం మిథ్యావాదం తో చెప్పలేదు.

***

౨౪. జగత్తు సత్యమని నిరూపించేశ్రుతి వాక్యాలు, సూత్రాలు

ఉపనిషత్తుల లో జగత్తు యొక్క ఆస్తికత, ద్వైత భావనే వాటి ఫలార్ధామని వివరించేవి లెక్కలేనన్ని వాక్యాలు ఉన్నాయి (*BrhUp;* iii. i. 13-24, *SvetUp* V. 5.; 1.9.*MundUp*. iii.1.12. *Katha Up*. ii.2.12; *IsaUp*.3, etc.). ఎన్ని పద చమత్కారాలు చేసినా వాటి సాధికారిక ఫలార్ధం మారదు. శంకరుల సిద్ధాంతం ప్రకారం ఉపనిషత్తులు రెండు రకాల అన్వయాలతో/ భాగాలతో ఉంటాయి.

౧. తత్వ భాగం / అన్వయం
౨. అతత్వ భాగం / అన్వయం

ఉపనిషత్తులలో ఉన్న అతత్వ భాగాలు లౌకిక, సామాన్య ధర్మాలను, విషయాలను తెలుపుతాయి. అతత్వం అంటే తత్వం కానిది అని. ఈ అతత్వ భాగాలు జగత్తు ఉనికిని, ఆత్మలను, పరబ్రహ్మాన్ని సృష్టి కర్త గా వివరించేవి లెక్కకు మిక్కిలి ఉన్నట్లు శంకరులు చెబుతారు. ఇదే విభజనను బ్రహ్మ సూత్రాలకు సైతం అన్వయించి వాటి పరమార్ధాలను నిర్ణయిస్తారు. నిజానికి ఈ విభజన వేదాంతం యొక్క ముఖ్యోద్దేశ్యాన్ని ముక్కలు చేసి చూపుతుంది. నిజానికి ఈ విభజన వేదాంతం యొక్క స్థిరత్వం ఒకే విధమైన అన్వయంతో సాధ్యమౌతుంది అనే పరమసత్యాన్ని త్రోసిరాజనే భావనను ప్రతిఫలిస్తుంది. మధ్వ వేదంతాకారులు సమస్త వేదవాగ్మయం పరబ్రహ్మం లో సమన్వయము ఔతుంది అనే ఒక మహత్తర ఆస్తిక భావనకు పట్టం కడతారు. ఇది మధ్వాచార్యులు సాధకులకు ఇచ్చిన అత్యుత్తమ భరోసా. ఇలా సమన్వయము చేయడం లో ఏవిధమైన లోపాన్ని జగత్తుకి ఆపాదించక ఆ జగత్తు యొక్క సత్యాన్ని నిరూపిస్తారు. కానీ అద్వైత సిద్ధాంతుల ప్రకారం వేదవాగ్మయం రెండు అర్ధాలు స్ఫురించే రీతిలో ఉండి సాధకులను ఒక మాయకు గురిచేస్తూ మాయ అయిన జగత్తు ను సత్యమనే భ్రమ ను కలిపిస్తుంది. ఇటువంటి స్థితిలో వేద వాగ్మయం లోని వాక్కులు సాధకులకు ఆప్త వాక్కులు ఎలా ఔతాయి?

ఒకవేళ జగత్తు మిథ్యే అయితే దాని ఉత్పత్తిని, పరిణామక్రమాన్ని , పంచ భూతాల విశిష్టతను, భగవంతుని పక్షపాత రహిత, వయక్తిక కర్మ ఆధారిత, తారతమ్య సహిత ప్రపంచ నిర్దేశికత్వం గురించి మరి శృతులు, సూత్రాలు వివరించ వలసిన అవసరం లేనేలేదే ? మరి ఎందుకు అవి వివరించాయి అనే దానికి అద్వైత దృష్టి తో ఆలోచిస్తే సమాధానం దొరకదు.

కనుక ఈ జగత్తు ప్రళయ కాలం లో పరమాత్మలో లయమయ్యే వరకూ పరమాత్మ ఎంత సత్యమో అంత సత్యమైనది. ఇందుకు మనం చేసి పితృకార్యాలే చక్కని ఉదాహరణ. వీటిని శంకారద్వైతం వేదవాక్కు గా భావించే వారు సైతం ఆచరిస్తారు. అంటే మిథ్య అయిన ఈ జగత్తులో మిథ్య అయిన పితృ లోకం లో ఉన్న మిథ్యా జీవులైన పితృ దేవతలకు పిండ ప్రాదానం కూడా మిథ్యే. ఎంత గందరగోళం. సాధన, దాని సాఫల్యం, సవిశేష భేదం, స్వభావం, తారతమ్యం ఆధారం గా జీవుల ప్రయాణం ఉంటుంది అని సమస్త వేద వాగ్మయాన్ని (అల్ప, మహా అనే వర్గీకరణ తత్వ, అతత్వ అనే భేదం లేకుండా) అలాగే ఈ జగత్తుని పరమాత్మ లో సమన్వయము చేసే విధానం ఒక్క మధ్వాచార్య ప్రబోధించిన ద్వైతం తోనే సాధ్యం.

అద్వైతం ద్వారా రామాయణ, భారత, భాగవత గ్రంథాలు, నారదీయ భక్తి సూత్రాలు సమన్వయము కావు. అలాగే సమస్త పురాణాలు, ఉపనిషత్తులు, సంహితలు కూడా. పరబ్రహ్మమైన శ్రీ మహా విష్ణువు ఒక్కడే సర్వోత్తముడు ఆయన ప్రభుత్వం లో ఒక్క ఉన్న బ్రహ్మ ఆది గా (అంతే చతుర్ముఖ బ్రహ్మ ప్రధముడి గా (జీవోత్తముడిగా) ఉన్న మహారుద్రుడు (ఈయనే ఇంద్రాది దేవతలకు దేవుడైన మహాదేవుడు), ఇంద్రాది (ఇంద్రుడు ప్రథముడిగా ఉన్న) దేవతలు, ప్రజాపతులు, ఋషులు, గంధర్వులు, యక్షులు, కిన్నరలు, కింపురుషాదులు, భువిపై ఉన్న సమస్త జీవులు, స్థావర జంగమాదులు వారి వారి తారతమ్యాన్ని అనుసరించి వివిధ పదవులలో నియమింపబడి సృష్టి స్తితి లయ అనే మూడు క్రియల్లో తమ వంతు పాత్ర పాటిస్తూ తమ సాధనను కొనసాగిస్తున్నారు. ఏకమేవా అద్వితీయం బ్రహ్మ అనే వేదం వాక్కుని ఒప్పుకున్నపుడు శ్రీ మహా విష్ణువుని సర్వోత్తమునిగా, సర్వాంతర్గతుని గా, సర్వ జీవ మనః సాక్షిగా నిశ్చయాత్మకమైన బుద్ధి తో సాధన చేయడానికి కేవలం ప్రారబ్ధ కర్మమే అడ్డు వస్తుంది అని అవగతమౌతుంది. ఈ అవరోధాన్ని సైతం భక్తి తో తొలగిన్చగలదు సుదుర్లభమైన వైష్ణవం. ఈ విధమైన అవగాహనా లోపానికి తార్కాణం నేడు శివుని, శాంభవిని, లక్ష్మిని, గణపతిని, సూర్యుని, సుబ్రహ్మణ్యుని, అయ్యప్పను, షిరిడీ సాయిని, రమణులను, వివిధ బాబాలను, గురువులను పరబ్రహ్మం గా భావించి సాధన కొనసాగించడమే. అనసూయకత, అధ్యయనం, సాక్షి ప్రమాణ ఆధారిత సాధన మాత్రమె వీటికి విరుగుడు.

***

౨౩. సృష్టి – అర్ధము, స్వభావము

ఈ పదార్ధ విశ్వం పరమాత్మ పొందిన పరిణామం కాదు అలాగని అది తనంత తానుగా వచ్చింది కాదు. పదార్థం, జీవుల యొక్క గర్భంలో పరమాత్మ వలన కలిగిన అంత: చైతన్యం వలన ఈ సృష్టి ప్రారంభమైంది. సృష్టి భగవంతుని అపారమైన కరుణకు, శక్తికి ఒక ప్రతీక. ఈ విధమైన సృష్టి చేయాలని పరమాత్మకు ఎందుకు అనిపించింది. అప్పటివరకూ నిద్రాణం గా తనలో ఉన్న సృజనా శక్తిని ఎందుకు జాగృతం చేసి ఈ సృష్టి చేయవలసిన అవసరం వచ్చింది పరమాత్మకు? ఈ ప్రశ్నలు అవశ్యం సాధకులకు వచ్చేవే. అందుకే మధ్వులు వీటికి సమాధానం గా చాల వివరణలు ఇచ్చారు.

సృష్టి ఒక యథార్ధ ప్రక్రియ. ఇది ఒక నిరంతర ప్రక్రియ. ఈ ప్రక్రియలో ఉన్న ముఖ్యమైన అంశాలు (కాలము, కర్మ, ద్రవ్యము, స్వభావము తో కూడుకున్న జీవులు) ఎల్లపుడూ పరబ్రహ్మం పై ఆధారపడి ఉంటాయి. పరమాత్మ శక్త, వ్యక్త స్థితుల్లో సందర్భానుసారం గా వ్యక్తమౌతూ ఈ సృష్టిని కొనసాగిస్తూ ఉంటాడు. సర్వజ్ఞత, సత్తా అనే సహజమైన విశేషాలతో పరమాత్మ ఒక కాలక్రమం లో సృష్టి, లయ అనే పరస్పర విరుద్ధమైన కార్యాలను చేస్తూ ఉంటాడు. ఈ కాల క్రమం ఎప్పుడు మొదలైంది మొట్ట మొదట గా అనేది సాధకులకు అందే జ్ఞానం కాదు. ఇదే సనాతన జ్ఞానం. ఇది తెలిస్తేనే నేను ద్వైతాన్ని నమ్ముతాను లేదా భగవంతుని అస్తిత్వాన్ని ఒప్పుకుంటాను అనే వితండ వాదాలకు అతీతమైన జ్ఞానం ఇది. సృష్టి ఆది ఎప్పుడు అనేది ముక్త జీవులకు సైతం అర్థం కాని విషయం. అదే పరమాత్వ తత్వం. ఆయనను పూర్తిగా వివరించగల సత్తా వాక్కుకి లేదు కనుక సాధకుల గ్రాహ్యతకు అందని విషయం – అందుకే "భూతకృద్ భూత భ్రుద్భావో భూతాత్మా, భూత భావనః, అప్రమేయో హృషీకేశ: పద్మనాభోమరప్రభు:" అని భీష్ముని చే కీర్తించబడ్డాడు శ్రీ కృష్ణుడు. జీవులు తీసుకొన్న వివిధ ఉపాధులలో ఉండే విశేషాలు, పుట్టే, గిట్టే సమయం వంటి వాటిని సహజమైన కాల భేదాలు (అవి కాలానికి, ఆకాశానికి ఉన్న స్వాభావికవిశేషాలు) నిర్ధారిస్తాయి. అలా సృష్టింపబడిన ఈ విశ్వం తనకు ఆధారభూతమైన పరమాత్మ తో నిత్యం సంబంధాన్ని కలిగి ఉంటుంది. పరిపూర్ణుడు, మారని వాడు అయిన పరమాత్మ వలన ఈ విశ్వం నిరంతరం మార్పులు చెందుతూ ఉంటుంది. కాబట్టి ఈ మారే విశ్వం నిరంతరం మారని పరబ్రహ్మ తో కలసి ఉంటుంది "ప్రవాహతో అనాది". ఇలా స్వతంత్ర – పరతంత్ర మనే ద్వైత భావనలోనే పరమాత్మ తత్వం ద్యోతకమౌతుంది అనాదిగా. నిజానికి ద్వైతం మధ్వులు మరల సాధకులకు అందించిన అనాదియైన సాధనా విధానం.

***

౨౬ శాశ్వత సృష్టి –పరాధీనవిశేషాప్తి

ప్రమేయమైన ఈ జగత్తు అప్రమేయమైన పరబ్రహ్మం పై ఆధారపడి ఉండడం అనే ద్వైత భావన ఆధారం గా వాస్తవిక ఆస్తికత్వం సాధనలో సాధ్యమౌతుంది. ఇదే తాత్పర్యార్థాన్ని శ్రుతి వాక్యాలు "స ఇదం సర్వమసృజత" అనీ తైత్తరీయోపనిషత్తు వాక్యం "యతో వా ఇమాని భూతాని జాయంతే" అనీ చెబుతున్నాయి.

కాలము-దేశము (ఆకాశము) సృజింప బడినవి అని చెప్పడం ఏ తత్వ వేత్తకూ ఎలా కుదరదో అలాగే ఎప్పుడూ శాశ్వతం గా ఉండే సృజింపబడని ద్రవ్యం, కర్మ, స్వభావికత తో కూడిన జీవులు బ్రహ్మంలో ఎలా సమన్వయము ఔతాయి అని చెప్పగలం? ఈ ప్రశ్న మధ్వులు అడిగేవరకూ ఎవరూ అడగని ప్రశ్నే ! ఇది మధ్వాచార్య దార్శనికతకు నిదర్శనం. దీనికి మధ్వులు ఇచ్చిన సమాధానం రెండు పార్శ్వాలలో ఉంటుంది:

౧. నిత్యమైన జగత్తు(ద్రవ్యం, కర్మ, కాలం, ఆకాశం, స్వభావికత తో కూడిన జీవులు) దాని ఉత్పత్తి
౨. అలా ఉత్పత్తి అయిన జగత్తు తాను వివిధ దశలలో పొందే మార్పుకి, వైచిత్రి కి భగవద్కృపపై ఆధారపడి ఉండడం – ఇదే పరాధీనవిశేషాప్తి.

నిత్యమైన జగత్తు నారాయణుని తో పరాధీనమై విశేషమైన ఆప్తి (సంబంధం) కలిగి ఉండడం. అంటే జగత్తు మూలతః శాశ్వతమైనంత మాత్రాన అది స్వతంత్ర స్వభావాన్ని పొంది ఉండలేదు. ఇది ఒక అమోఘమైన ఆస్తిక ఆలోచన మాత్రమే కాదు బ్రహ్మ సూత్రాలను, సమస్త వాగ్మయాన్ని మానవ జీవితానికి, సాధనకు సమన్వయం చేయడానికి ఉన్న ఒకే ఒక మూల సాధనం. ఈ సత్యమే "అహం బ్రహ్మాస్మి" అనే ఉపనిషద్ వాక్యానికి (దీనిని మాహా వాక్యం గా చూపే విధానానికి) ఉన్న "నేను బ్రహ్మనై ఉన్నాను" అనే వాక్యార్థం దాని ప్రతిఫలార్థం కాదని చెప్పక చెబుతుంది. మనః సాక్షి అనే వయక్తిక ప్రత్యక్ష ప్రమాణం ఆధారం గా ఈ "నేను బ్రహ్మనై ఉన్నాను" అనే అర్థాన్ని మనం వాస్తవం లో అనుభవం లోకి తెచ్చుకోగలమా? అలా ఎవరైనా తెచ్చుకున్న దృష్టాంతాలు వేద వాగ్మయంలో గానీ మానవ చరిత్రలో గానీ లేవు కాబట్టి ఇది ఎంతమాత్రమూ వీలు కాదు అనే నిశ్చయాత్మక బుద్ధి ని కలిగిస్తుంది మన అంతః సాక్షి.

పైన చెప్పిన విషయాన్ని ఋజువు చేస్తూ చరాచర జగత్తు యొక్క సద్భావవికారాలు (వివిధ దశలలో పొందే మార్పులు) మరియూ సృష్ట్యాద్యష్టకం (ఎనిమిది రకాలైన ఉనికికి సంబంధించిన విషయాలు) జగత్తు యొక్క శాశ్వత పరాధీనతను మరియూ బ్రహ్మము యొక్క స్వతంత్రతను విపులీకరుస్తున్నాయి.

సృష్ట్యాద్యష్టకం:

సృష్టి: స్థితి: సంహృతిశ్చ నియమో 2 జ్ఞాన బంధనే
బంధో మోక్షః సుఖం దుఃఖమావృతిర్జ్యోతిరేవ చ
విష్ణునా2స్య సమస్తస్య సమాసవ్యసయోగతః

సృష్టి, స్థితి, లయ, జ్ఞానం, బంధనం, మోక్షం, సుఖం, దుఃఖం అనే ఈ ఎనిమిది కార్యాల వలన సాధకులు తాము చేసే సాధనయొక్క చరమాంకం లో ఒక ఆవృతి కి లోనై తిరిగి జరామరణ చక్రం లో ఉండిపోవదమో లేక ఆ చక్రం నుంచి ముక్తి ని పొంది అపరోక్షానుభూతిని పొందడమో జరుగుతుంది. పరబ్రహ్మకు లోబడి ఈ ఎనిమిది నిర్ణయాత్మకాలు సృష్టి లోని చరాచర పదార్థాల జీవన గతిలో జరుగుతాయి. ఈ ఎనిమిది నిర్ణయాత్మకాలు మరియూ ఆకాశము, కాలం వంటి శాశ్వత సృష్టి అంశాల విషయం లో పరాధీన విశేషాప్తి గా జడ పదార్థాల విషయం లో వాటికి తగు రీతి అన్వయింప బడతాయి. జడపదార్థాలకు అపరోక్షాను భూతి ఉండదు కనుక ఈ ఎనిమిది నిర్ణయాత్మకాలలో వాటికి సంబంధించినవే పరిగణ లోకి వస్తాయి.

నిత్యానిత్య పదార్థాలలో అనిత్యాలు పరతంత్రం కాబట్టి వాటి ఉనికి పరమాత్మ పై ఆధారపడి ఉంది అని తర్కం తో సాధించినపుడు అలాగే నిత్యాలు (ఉదా: కాలము, ఆకాశము) నిత్యాలు గా ఉండడానికి సైతం అవి పరమాత్మ పై ఆధారపడి ఉండవలసిందే. వాటంతట అవి నిత్యాలు గా ఉండలేవు. కనుక నిత్యాలు కొన్ని పరిమితులకు లోబడి నిత్యాలు గా ఉంటాయి అలాగే వాటి నిత్యత్వం కోసం పరమాత్మ పై నిత్యమూ ఆధారపడి ఉంటాయి.

కాబట్టి పరాధీనత అనేది నిత్యాలకు అనిత్యాలకూ పరమాత్మ తో గల ఒక విశేషమైన సంబంధం. ఈ సృష్టి లోని సమస్త పరార్థాలూ వాటి నామం, రూపం, గుణాలు , ప్రయోజనం లో మార్పులు పొందినా వాటి మూలతః ఉన్న స్వభావం మార్పు చెందదు.   సృష్టి పదార్థాల లో మార్పు రెండు రకాలు:

౧. కొన్ని పదార్థాలు ఒకే రూపు గలిగి ఉండి వాటి గుణాలలో మార్పులు చేర్పులు జరుగవచ్చు ఉదా : మానవులు మరల మానవులు గా పుట్టడం జరిగినపుడు.

౨. కొన్ని పదార్థాలు మొత్తం మార్పులు పొంది కొత్త జీవులు గా పరిణామం పొందడం ఉదా గొంగళి పురుగు సీతాకోక చిలుకగా మారడం

అనాది నిత్యాలు అయిన కాలము, ఆకాశము, జీవులు, పదార్థాలు, వేదము క్రింది తెలిపిన విధం గా వాటి పరాధీన విశేషాప్తి ని వ్యక్తం చేస్తాయి.

నిత్య పదార్థం	**పరాధీన విశేషాప్తి వ్యక్తమయే విధానం**
చేతనా ప్రకృతి (శ్రీ మహాలక్ష్మి)	సృజించ వలననే కోరిక కలిగి ఉండడం వలన సృష్టి ఆరంభం కావడం
అవ్యకృతాకాశము	**నిర్దిష్టమైన పదార్థాలతో సంబందాన్ని ఏర్పాటు చేసుకోవడం**
ప్రకృతి	**మహత్తు, తత్వాలలో మార్పు చెందడం**
కాలము	**కాల గణన ప్రారంభం కావడం**
మహాదాది	**వ్యాప్తి, కుంచించు కొను స్వభావాన్ని పదార్థ భాగాలు పొందుట**
జీవులు	**శారీరాన్ని, ఇంద్రియ జ్ఞానాన్ని పొందుట (లింగ స్వరూప ధారణ)**
వేదములు	**మార్పునలవి కాని ఒక నిర్దిష్టమైన క్రమం లో ఏర్పడిన పదములు గా వాటి అర్థములతో సహా భగవద్శక్తి ఆవిర్భావము పొందుట**

పరాధీన విశేషాప్తి కేవలం ధర్మి (చరాచర పదార్థము) యొక్క విశేషాలకు సంబంధించన మార్పుకు మాత్రమె అన్వయం ఔతుంది, ధర్మి యొక్క మూల స్వారూపానికి కాదు ఎందుకంటే ధర్మి స్వరూపం నిత్యం. కనుక జీవుల శరీర ధారణ అనే ప్రక్రియ అశాశ్వతమైనది దానికి జీవుల మూల స్వరూపం (ఆత్మ స్వరూపం) తో అశాశ్వతమైన సంబంధమే ఉంటుంది. అందువలన ఆత్మ శాశ్వతమైనది దేహాల తో ఉన్న జీవుల గుణాలు అశాశ్వతాలు. దీనిని మరింత వివరిస్తూ వ్యాసతీర్థులు “అశాశ్వతమైన జీవుల గుణాలకు ఆత్మ మూల స్వరూపానికి ఉన్న సంబంధం సవిశేష బేధం తో కూడుకొని ఉన్నది” అని చెబుతారు. ఈ సంబంధం జీవులు పొందిన స్వరూపం నిలచేవరకూ మాత్రమె ఉంటుంది. అందువలన ఆత్మ కు శరీరం తో ఉన్న సంబంధం భేదాభేద సంబంధం. కర్మలననుసరించి మరణానంతరం ఆత్మ తదుపరి గతిని పొందుతుంది. సృష్టి లో ఉత్పత్తి అయ్యేవి విశేషాలు వాటిని ఆత్మ ఒక దేహాన్ని పొంది కలిగి ఉంటుంది.

ఈ పై సిద్ధాంతాన్ని బౌతిక వస్తువులు జగత్తు లో పొందే మార్పులకు వర్తించి చెప్పడం లేదా ఈ మార్పుల ఆధారం గా పై సిద్ధాంతాన్ని స్థిరీకరించడం కుదరదు. ఉదా: మట్టి ని కుమ్మరి కుండగా మార్చిన తరువాత కుండ మన్ను అని చెప్పలేము. కుండ తయారు చేయడానికి మన్ను ఉపయోగ పడింది. కుండను పగుల గొట్టి మరల మన్ను కొన్ని ప్రక్రియల ద్వారా చేయవచ్చు కాని కుండగా ఉండగా ఇది మన్ను అని

చెప్పడం కుదరదు. ఎందుకంటే కుండలో మన్ను యొక్క సంస్థానం (సమ్యక్ = చక్కగా ఉన్న, స్థానం = స్థితి అంటే మన్ను లాంటి స్థితి) లేదు కనుక. అలాగే పాలు పరుగు గా మారడం.

శంకరులు "ఆకాశవత్ సర్వగతశ్చ నిత్య:" అనేశ్రుతి వాక్యానికి అమిత ప్రాధాన్యమిచ్చి బ్రహ్మమే సర్వస్వాన్ని సృజించాడు అని చెప్పారు. సృజింప బడని నిత్య పదార్థాల గురించి ఆయన చెప్పలేదు అలాగే ఆ పదార్థాల పరాధీన విశేషాప్తి కూడా. ఇది చెప్పని నాడు భగవద్గీత శ్లోకాన్ని "ద్రవ్యం కర్మచ కాలశ్చ ... " ఎలా అన్వయం చేయగలము?

***

౨౭. మధ్వాచార్య విశ్వ పరిణామ సిద్ధాంతం

సాంఖ్యం, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాల ఆధారం గా విశ్వాన్ని దాని ఆవిర్భావాన్ని, విశ్వపదార్థంలో ఇమిడి ఉన్న అంశాలను ఆపదార్థ పరిణామాన్ని సాధకులకు అర్థమయ్యే రీతిలో మధ్వులు తన ఆలోచనా సరళి ని ఆవిష్కరించారు.

మహాభారతం, భాగవతం ఇతర పురాణాల నుంచి ఎక్కువగా అలాగే పంచరాత్ర ఆగమం నుంచి ఎన్నో దృష్టాంతాలను మధ్వులు ఎంచుకొని విశ్వ పరిణామాన్ని సిద్ధాంతీకరించారు. ఇందులో పంచరాత్ర ఆగమం ఇప్పటికీ చాల మంది సాధకులు క్షుణ్ణం గా శోధించవలసిన గ్రంథం. ఈ పంచరాత్ర ఆగమం ఉపనిషత్తుల లో చెప్పబడ్డ ఆస్తిక భావాలను ప్రోదిచేసి సాధనకు సాధికారతను కలిగిస్తుంది. రామానుజుల వేదాంత వాదన పంచరాత్ర ఆగమం పై ఆధారపడి ఉన్నప్పటికీ ఆయన మధ్వులు చేసినంత శోధన చేయలేదనే చెప్పాలి ఎందుకంటే కాలగర్భం లో కలసి పోయిన ఎన్నో పంచరాత్ర ఆగమానికి సంబంధించిన సంహితలను వెతికి మరీ తన వాదనను వినిపించారు మధ్వులు తద్వారా ఆయన తత్వాన్ని స్థిరీకరించారు. ఇవి ఇప్పుడు ఉపలభ్యం కావు కనుక వాటిని త్రోసిరాజనడం గాలిని చూడలేము కనుక దాని ఉనికిని కాదనడం తో సమానం. మధ్వాచార్య తర్క చట్రంలో ఆయన అందించిన తత్వజ్ఞాన సంపదలో ఈ సంహితలు చక్కగా ఇమిడిపోవడం వీటి సాధికారతకు ఉన్న ప్రత్యక్ష ప్రమాణ మనే చెప్పాలి.

ఐతిహాసిక సాంఖ్యాన్ని అనుసరించే మధ్వులు సహజం గానే పకృతి పరిణామ వాదాన్ని సమర్థించారు. న్యాయ విశేషకులు చెప్పినట్లు ఆరంభవాదానికి, అణువాధారిత పరిణామ వాదానికి ఇది వ్యతిరేకం. విశ్వ పరిణామక్రమం లో ప్రకృతి మూలస్థానం. ఇట్టి ప్రకృతి సైతం పరబ్రహ్మం కు పరాధీనయై ఉంటుంది ఇది

రామానుజులు, మధ్వులు స్థిరీకరించిన సిద్ధాంతం. సృష్టి క్రమం లో ఈ ప్రకృతి మొదట సరితూగగల స్థితిలో ఉన్న ద్రవ్యం రూపం లో ఉంటుంది. ఇట్టి ద్రవ్యం ఒక్కసారి తన సమ స్థితిని కోల్పోయి 24 విధాలుగా పరిణామం చెందుతుంది. ఈ క్రమం లో సాత్విక, రాజసిక, తామసిక గుణాలు ఈ సృష్టి లోని అన్ని పదార్థాలలో వాటి ఉపాధి, కర్మల ఆధారం గా వాటి స్థితులను నిర్ణయించుకొని ఈ చరాచర విశ్వం లో ప్రవేశిస్తాయి. ఈ 24 విధాల రూపాంతరం ఈక్రింది తెలిపిన విధం గా ఉంటుంది:

కర్మేంద్రియ పంచకం:	**జ్ఞానేంద్రియ పంచకం:**	పంచ తన్మాత్రలు:	పంచ భూతాలు
వాక్కు	త్వక్కు = చర్మం	శబ్దం	పృథ్వి
పాణి (కర ద్వంద్వం)	చక్షువు = కన్ను	స్పర్శ	జలం
పాదం (పాద ద్వంద్వం)	రసన = నాలుక	రూపం	అగ్ని
పాయువు (గుదము)	శ్రోతం = చెవి	రసం = రుచి	వాయు
ఉపస్థ (పురుషాంగం లేదా యోని)	ఘ్రాణం = ముక్కు	గంధం = వాసన	ఆకాశము

1. ప్రకృతి లో కలిగిన పరిణామ క్రమంలో ద్రవ్యము శక్తి పొందిన ప్రప్రధమ మైన మార్పు మహత్తు.
2. అహంకారము వయక్తిక మార్పుకు నాంది
3. బుద్ధి వివక్షకు ఆధారం
4. మనస్సు ఆలోచనలకు కేంద్రం

పైన తెలిపిన ఇరువది విధాలైన మార్పులు మహత్తు, అహంకారము, బుద్ధి మరియూ మనస్సు గా ఏర్పడిన చింతనా వ్యవస్థ (౪) మొత్తం కలిపి 24 విధాల మార్పులు సృష్టి క్రమం లో సంభవించాయి అని మధ్వాచార్య ఉవాచ.

అహంకారము మరలా మూడు విధాలైన మార్పులు పొందుతుంది అవి :

వైకరిక

తైజస

తామస

తైజస నుంచి వచ్చినవే కర్మేంద్రియ పంచకం మరియూ జ్ఞానేంద్రియ పంచకం. తామస అహంకారం నుంచి వచ్చినవి పంచ తన్మాత్రలు. ఈ ఇరువది నాలుగు రూపాంతరాలుగా ప్రకృతి సూక్ష స్థూల స్థితులలో ఈ

బ్రహ్మాండం లో వ్యక్తమౌతూ ఉంటుంది. ఈ సిద్ధాంతానికి తత్వాభిమాన దేవతలను అనుసంధానం చేస్తూ చక్కని సమన్వయాన్ని సాధించారు మధ్వులు. ఈ తత్వాభిమాన దేవతల ఆధారం తోనే ఈ సృష్టి లో జీవన క్రియ కొనసాతుగుంది. ఇలా కొనసాగే స్థితికి మరియూ తత్వాభిమాన దేవతలకు అంతర్గతుడు సర్వోత్తముడైన శ్రీ మహా విష్ణువు.

సత్వ, రజో, తమస్ అనే గుణాలను చేతనా ప్రకృతి రూపమైన శ్రీ మహాలక్ష్మి శ్రీ, భూ, దుర్గా స్వరూపాలలో ఉండి నడిపిస్తుంది. ఈ సృష్టి లయమయ్యే కాలం లో 1/8 భాగం లో పునః సృష్టి జరుగుతుంది అని మధ్వాచార్య ఉవాచ.

లయ కాలం లో దేని నుంచి ఏవి పుట్టాయో అవి వాటి లో లయమౌతూ చివరికి తత్వాభిమాన దేవతలు కూడా వారి మూల స్వరూపాలలో లయమౌతాయి. ఇది విడుదలైన ఆత్మలకు సంసారం లో ఉన్న ఆత్మలకూ వర్తించే క్రమం.

***

౨౮ బ్రహ్మ పరిణామ మరియూ వివర్త వాదాల విమర్శ

విశ్వావిర్భావము విశ్వానికి పరబ్రహ్మం తో ఉన్న సంబంధం గురించి ఎటువంటి చిక్కులూ లేని అత్యంత సరళమైన శైలి లో ఆస్తికదృక్పథం లో మధ్వులు వివరించారు.

ఈ విశ్వం గా ఆ భగవంతుడే వ్యక్తమయ్యాడు అని, ఉన్నది ఒక్కటే పదార్థమని, అదే దొంగ గా దుంగ గా కనిపించి మిథ్య అయిన ఈ జగత్తు లో వివిధ మాయలకు సాధకుని గురిచేస్తుందని, సాధకుడు నిజానికి ఎవరో కాదు మాయ తొలగని భగవంతుడే అని. మాయ తొలగితే నేనే బ్రహ్మం అనే జ్ఞానం సిద్ధిస్తుంది అని ప్రవచించే ఆధ్యాత్మిక వాదులు అసలు భగవంతుని ఉనికినే శంకించే స్థితికి సాధనను తీసుకొని వెళ్లి పెద్ద గందరగోళాన్ని కలిగిస్తున్నారు అని చెప్పక తప్పదు. అలాగే బ్రహ్మ పరిణామ వాదులు చెప్పినట్లు సచ్చిదానంద స్వరూపుడైన భగవంతుడు దుఃఖ మాయమైన జీవులు గా మారి సంసారం లో పడి తిరిగి స్వస్థితి ని పొందుతున్నాడు అనే సిద్ధాంతం అసలు ఆధ్యాత్మిక ఆలోచాన విధానానికే గొడ్డలి పెట్టు. బ్రహ్మమే మొదటిగా ఉన్నది ఆ బ్రహ్మమే:

౧. ధర్మి పరివర్తన (బ్రహ్మ పదార్థ పరివర్తన)
౨. ధర్మ పరివర్తన (బ్రహ్మ గుణ పరివర్తన) చెంది అటుపై:

౧. నిజస్తితి కి తిరిగి వచ్చే
౨. నిజస్థితికి తిరిగి రాని విధాలుగా

మొత్తం నాలుగు విధములైన మార్పును "ఇతర బాహ్యమైన మంత్రాంగము వలన" పొంది ఈ విశ్వ ఆవిర్భావానికి కారణమౌతున్నాయి అని చెప్పే బ్రహ్మ పరిణామ వాదం, బ్రహ్మము కంటే వేరైన ఇతర బాహ్యమైన మంత్రాంగానికి లోబడి బ్రహ్మం యొక్క ఆస్తిత్వం ఉంటుందని చెప్పడం ఒక బహుహీనమైన వాదం తక్క తత్వం కాదు.

బ్రహ్మము తక్క సృజించ బడని నిత్య పదార్థాలైన ఆకాశము కాలము కర్మలు, ఆత్మలు అనేవి లేవని, ఉన్నది బ్రహ్మమొక్కటే నని చెప్పే ఈ బ్రహ్మ పరిణామ వాదం పరస్పర భిన్నమైన వాదం. ఇతర "బాహ్యమైన మంత్రాంగం యొక్క పాత్ర వలన" బ్రహ్మమొక్కటే అనే వాదం తనంత తాను గా వీగి పోతుంది. అలాగే బ్రహ్మం తనంత తానుగా తన ఇచ్ఛ ప్రకారం ఈ సమస్త చరా చార జగత్తు గా పరివర్తన చెందడం కార్యా కారణ సంభందాన్ని, బ్రహ్మము యొక్క సర్వజ్ఞాత్వాన్ని గేలి చేస్తూ ప్రతిపాదించిన సిద్ధాంతం. బ్రహ్మ జీవి గా మారడం మరల ఆ జీవి తన బ్రహ్మత్వాన్ని తెలుసుకొని బ్రహ్మలో ఐక్యం కావడం సాధనకు లేసమాత్రమైన ఉపయోగపడని విచిత్ర మైన తత్వం.

నిత్యానంద, నిర్మల, నిర్వికార, అనంత కళ్యాణ గుణ సంపన్నుడైన పరబ్రహ్మం పరమ దుఃఖభూయిష్టమైన స్థితి కి దిగజారడం పరమాత్మ యొక్క అఖండత్వానికి ఏమాత్రమూ సరిపడని వితండ వాదం. దీనిపై వాదన కూడదు అని నిషేధించడం తత్వ జ్ఞాన శోధన, సాధన ను విడచిపెట్టమని చెప్పడం తో సమానం.

నిర్వికారః అక్షరః శుద్ధః అని శ్రుతి వాక్యాలో ఎన్నో చెబుతున్నా బ్రహ్మ పరిణామ వాదం ప్రకారం బ్రహ్మము పొందే మార్పులో బ్రహ్మము యొక్క మూల స్థితి యథాతథం గా ఉంటుంది అని వివరిస్తుంది. ఇది ఎలా సాధ్యమో తర్కానికి అందని విషయం ఎందుకంటే బ్రహ్మము అఖండము, అద్వితీయము, కనుక ఇన్ని విధాలుగా (ఖండాలుగా) ఉన్న ఒక్క బ్రహ్మ పదార్థం విడువడదు. ఒకవేళ బ్రహ్మం పరివర్తన పూర్తి గా చెందినది అని భావిస్తే అప్పుడు మూలం లో ఉన్న బ్రహ్మ పదార్థం పూర్తిగా వినియోగిమ్పబడి శూన్య స్థితిని పొందినట్లు భావించడం తత్వతః కుదరదు. ఎందుకంటే బ్రహ్మజ్ఞానాన్ని పొంది జీవులు మోక్షాశక్తులు గా మారడం అనే స్థితి కి అర్థం ఉండదు కనుక.

శ్రుతులలో చెప్పబడినవి అని ఉదహరిస్తున్న వాక్యాల అర్థాలు ఫలితార్థాలు గా గ్రహిస్తే ఈ గందరగోళం అంతా సమసిపోతుంది కాని ఆశ్రుతి వాక్యాల అర్థాలను పరిణామ వాదానికి అన్వయించే రీతిలో చెబితే ఈ గందరగోళం కొనసాగుతూనే ఉంటుంది. తర్కాన్ని, సంస్కృత భాష ను సమాధి భాషగా గ్రహించి గూడార్థాలను వెలికి తీస్తేనే అసలు విషయం బోధ పడుతుంది. ఈ విషయం మరింత గా వివరించడానికి నా ఆధ్యాత్మిక మిత్రులు రఘోత్తమరావు గారు ఒక అంతర్జాల వాదం లో చేసిన వ్యాఖ్యాలు క్రింద పొందుపరచడమైనది:
http://eemaata.com/em/issues/201403/3567.html?allinonepage=1

1. *ఇక ప్రజ్ఞావాదం గురించి వారి మాటల్లోనే "प्रकर्षेण जानन्ति इति प्रज्ञाः । तदावाद प्रज्ञावादः प्रज्ञमतविरुद्धवदं वदसि । कथम् ? – गतासून् ।". గతాసూన్ అన్న పదాన్ని ఎలా గత+అసూన్ అని విడదీసి చదువుతామో (గత సున్ అని చదవమో) అలానే ప్రజ్ఞ+అవాద గా చదవి చూడమని చెప్పారు. ప్రజ్ఞ అన్న ది పుంలింగం గనుక ప్రజ్ఞ+అవాద = ప్రజ్ఞావాద అన్న ది దుష్టసంధి కాదని నా అభిప్రాయం. లేదూ ప్రజ్ఞా అన్న స్త్రీలింగంతోనే ప్రయత్ని స్తే ప్రజ్ఞా సంబంధిత అవాదః అని సమాసం చేసి దాన్నుండి ప్రజ్ఞావాద అన్న సంధిని చేయవచ్చు అని నా బుద్ధికి తోస్తోంది. ఐతే ప్రజ్ఞావాద పదాన్ని "చక్కటి వాదం" అన్న అర్థంలో కాక విరుద్ధార్థంలోనే ఎందుకు చదవాలన్న దే అసలు విషయం.*

అర్జునుడు పోయినవాళ్ళ గురించి , ఉన్న వాళ్ళ గురించి బాధపడుతూ శాస్త్రవిరుద్ధమైన మాటల్ని మాట్లాడాడు కనుక అర్జునుడిది అశాస్త్రీయమైన వాదమని గీతాచార్యుని భావమని మధ్వ వ్యాఖ్యానం. దీనికి పూరకమేది ? అని అంటే "కార్పణ్యదోషోపహతస్వభావః ప్రుఛ్ఛామిత్వాం ధర్మ సమ్మూఢచేతాః " అన్న అర్జునుని మాటలే. ధర్మ సమ్మూఢుడైనాడు గనుకనే అధార్మి కమైన "ప్రజ్ఞావాద" నను చేశాడు అర్జునుడు.

1. *ప్రజ్ఞ పుంలింగం కానప్పుడు స్త్రీలింగం కూడా కాకూడదు. నపుంసకం అసలే కానోపదు (ఇది హాస్యానికే సుమండీ!)*

మేదినీ కోశం ప్రకారం ప్రజ్ఞః అన్న ది త్రిలింగ పదము అంటే పురుష , స్త్రీ, నపుంసకాల్లో వాడొచ్చు.

"ప్రజ్ఞస్తు పండితే వాచ్యలింగో " అన్న వ్యాఖ్యానం మేరకు ప్రజ్ఞను పండితుడు అన్న అర్థంలో వాడినప్పుడు పుంలింగంగాను , "బుద్ధౌ చ యోషితి " మేరకు బుద్ధి అన్న అర్థంలో వాడినప్పుడు స్త్రీలింగంగాను పరిగణించాలని మేదినీకరుని ఉవాచ.

మధ్వాచార్యులు "ప్రజ్ఞస్తు పండితః" అన్న పుంలింగానికి ప్రాధాన్యతనిచ్చి ప్రజ్ఞ+అవాద = ప్రజ్ఞావాద అని వ్యాఖ్యానించారు. అర్జునుడు పుం కాబట్టి ప్రజ్ఞ అన్నది కూడా పుం గానే వాడారు. ఆవిధంగా 'ప్రజ్ఞా'గా కాకుండా ప్రజ్ఞ అని హ్రస్వాంతం చేస్తే సవర్ణదీర్ఘసంధి సూత్రం సక్రమంగానే కుదరడమే గాక గీతాచార్యుని ఆంతర్యం కూడా అవగతమవుతుందని మధ్వోవాచ!

మీరన్నట్టు స్త్రీలింగార్థంలో వాడితే ప్రజ్ఞావాదాన్ని బుద్ధివాదంగా పరిగణించాలి. అప్పుడు ప్రకర్షేణ జానాతి ఇతి ప్రజ్ఞాః అన్న అర్థం కుదరదు. ఎందుకంటే మానవ బుద్ధికి తోచినదల్లా శాస్త్రసమ్మతం కాబోదు. ఈ విషయాన్ని (స్త్రీలింగ ప్రజ్ఞను)కూడా ప్రస్తావిస్తూ మధ్వాచార్యులు "అర్జునా! బుద్ధి (కి తోచిన)వాదాన్ని చేస్తున్నావు (భాషసే) కానీ అది పండితుడు చేయవలసినది కాదు (నాను శోచంతి పండితాః) " అని కృష్ణుడు ఉపదేశించాడని వ్యాఖ్యానించారు.

ఇక ప్రజ్ఞా ప్రతిష్ఠితా గురించి – సంస్కృత మూలంలో ఈ రెండు పదాల్ని కలపకుండా విడివిడిగా వ్రాయడం వల్ల "ప్రజ్ఞావాద"లా కలపడానికి , సంధి చేయడానికి అవకాశం లేదు. మీరు కూడా రెండింటిని విడిగానే వ్రాశారు! ఇక్కడ మళ్ళీ మేదినీకోశార్థాన్ని వాడుతూ 'ప్రజ్ఞ'ను పుంలింగంగాను 'ప్రతిష్ఠితా'ను విశేషణంగాను వాడితే రెండవ పదం ముందరి పదానికి బలం చేకూరుస్తుంది. ఆ విధంగా ప్రజ్ఞ , ప్రతిష్ఠితా అన్నవి రెండు వేరు వేరు పదాలుగా వాడబడడం వల్ల ఎటువంటి సంధి, విసంధులకి అవకాశం లేదు.

ఈ పై సంవాదం ద్వారా సంస్కృత భాష పట్ల ఉన్న సదవగాహన వలనేశ్రుతి వాక్యాల ప్రతిఫలార్థాలను సాధకుడు అర్థం చేసికోగలదు అని అవగతమౌతుంది.

***

బ్రహ్మము సర్వజ్ఞమై ఉండి అజ్ఞాన స్థితిని పొందడమనే విషయాన్ని ఏశ్రుతి వాక్యాలూ చెప్పలేదు. కాబట్టి ఈ శృష్టి క్రమంలో కాలం, ఆకాశం, మొదలగు పదార్థాలు వ్యక్తం కావడానికి ఒక మాధ్యమం కారణమైనది అనే విషయం తేటతెల్లమౌతుంది. ఆ మాధ్యమమే శ్రీ మహాలక్ష్మి (చేతనా ప్రకృతి).

ఛాందోగ్య ఉపనిషత్తు కి వ్యాఖ్యానం వ్రాస్తూ మధ్వులు ఉద్దాలకుడు తన కుమారునికి తత్వోపదేశం చేసే విధానాన్ని ఆధారం గా చేసికొని ఈ జగత్తు మొత్తం చేతనా ప్రకృతి పై ఆధాపడి ఉంటుందని వివరించారు. కొన్ని ఉదాహరణలు వారి వివరణలు:

౧. ఆవు పేడ నుంచి తేలు ఉద్భవించడం (అంటే జడ పదార్థం నుంచి చైతన్య పదార్థం పుట్టడం!). తేలు యొక్క శరీరం పేడ ఆధారం గా రావచ్చు కాని తేలు ఆత్మ కు ఆధారం పేడ అని చెప్పలేము!

౨. మనిషి శరీరం నుంచి గోళ్ళు, వెంట్రుకలు పుట్టడం: ఆత్మ శరీరం లో ఉన్నంత వరకూ వీటి పెరుగుదల ఉంటుంది ఒక్క సారి ఆత్మ (ప్రాణం) నిష్క్రమిస్తే ఇవి వీటి పెరుగుదలను కూడా కోల్పోతాయి. ఎందుకంటే ఈ పెరుగుదల శరీరధర్మ వలన జరిగినది.

౩. జీవి బాల్యావస్థ నుంచి వృద్ధాప్యం వరకు జరిగే మార్పులు: ఇవి ఆత్మ వలన కలిగిన మార్పులు కాదు ప్రకృతి సిద్ధమైన పాన్చబౌతిక జగత్తులో ఏజీవి కైనా ఈ మార్పులు సహజాలే.

పై మూడు ఉదాహరణలూ బ్రహ్మ పరిణామ వాదాన్ని తత్వతః స్థిరపరచలేవు. బ్రహ్మ పదార్థ విశిష్టత కేవలం ఆత్మలలో మాత్రమె చూడగలం. దీనివల్ల నిశ్చయాత్మకంగా సాధకులకు బ్రహ్మము మార్పుచెందని ఒక అద్వితీయ సర్వోత్తమ శక్తి అనే ఒక ప్రధానమైన విషయం బోధ పడుతుంది. రామానుజులు చెప్పినట్లు ఇట్టి పరబ్రహ్మం ప్రకృతి ద్వారా జగత్తుని సృజించి పోషించి మరల తన సంకల్పం తో లయం చేస్తున్నాడు. ఈ విషయం లో ఎటువంటి అనుమానమూ లేదు కానీ ఇక్కడ బ్రహ్మ పరిణామామసేది లేనేలేదు. కనుక పరబ్రహ్మం అనంత గుణ పరిపూర్ణుడై పరతంత్ర అయిన చేతనా ప్రకృతి ద్వారా సృష్టి కార్యాన్ని నిర్వర్తిమ్పచేస్తున్నాడు.

వివర్తవాద సమీక్ష

"ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం" అనే ఛాందోగ్యోపనిషత్తు వాక్యాన్ని బంకమన్ను తెలిస్తే ఆ బంకమన్ను తో తయారు చేయబడిన సమస్త వస్తువులు తెలుస్తాయి అనే వ్యావహారిక సమన్వయము తో వివరించడం హాస్యాస్పదం. ఈ విధం గా తత్వ జ్ఞానానికి సంబంధించిన విషయాల స్థితిని సాధారణ స్థాయికి తీసుకొని రావడం సబబు కాదో అలాగే ఈ వివర్త వాదం బ్రహ్మ పరిణామ వాదానికంటే ఎక్కువ గందరగోళాన్ని సృష్టిస్తుంది.

ఏ విధమైన కారణత్వం లేకుండా కేవలం గోచరమయ్యే జగత్తు కి సాధకుని అజ్ఞానం కారణం అని చెప్పడమే వివర్తవాదం. నిజానికి ఏది అవాస్తవం అని చెప్పబడుతుందో అది ఒక విషయాన్ని తప్పుగా

గ్రహించినదని అర్థం! వివర్త వాదం ప్రకారం ఉన్న ఆ ఒక్క బ్రహ్మ ప్రదార్థం దొంగ గా దుంగ గా “కనిపిస్తుంది” అని స్థిరీకరించడానికి కావలసిన సరంజామా ఎంత వెతికినా కనిపించదు ఎందుకంటే అసలు కనిపించేది అవాస్తవం కనుక!!

అద్వైతం చెప్పినట్లు ఈ జగత్తు ఒక అనిర్వచనీయమైన ఉత్పత్తి అది మాయ లేదా అవిద్య వలన గోచరమౌతుంది అని అనుకొంటే మరి పారమార్థిక సత్యమైన పరబ్రహ్మం మాయ తో కూడి ఈ భౌతికం గా కనిపించే జగత్తుకి కారణం అని చెప్పడం కుదరదు ఎందుకంటే పారమార్థిక సత్యం లో భాగమైన ఆనందం, జ్ఞానం కూడా వ్యక్తం కావాలి ఈ జగత్తులో.   అలాగే మాయతో కూడి జగత్తుని సృజించాడు అని చెప్పినపుడు మాయతో పాటు మార్పు చెందే తత్వం గ పరమాత్మను అర్థం చేసుకోవాలా ? అప్పుడు నిర్వికార అనే గుణానికి పరబ్రహ్మాన్ని ఎలా సమన్వయము చేస్తాము? వివర్త వాదం నిజం గా ఒక గందరగోళమే!!

విశిష్ట మైన అద్వైతం చెప్పినట్లు ఆ విశిష్టమైన ప్రకృతి బ్రహ్మమని చెప్పవచ్చా అంటే చెప్పలేము ఎందుకంటే మార్పు చెందే ప్రకృతి మార్పు చెందని పరబ్రహ్మం తో పోలికకు రాదు. కాదు, ప్రకృతి పరమాత్మ యొక్క శక్తి అంటే పరమాత్మకు నిర్వికార అనే గుణాన్ని ఆపాదించలేము.   కాదు, మాయ యైన జగత్తు మాయ ద్వారా సృజింప బడుతుంది అని అంటే ఏ విశేష్యం (మూలమైన బ్రహ్మ పదార్థం) నుంచి ఆ విశిష్టత (ప్రకృతి) వచ్చిందో అది మరలా ఒక భ్రాన్తికారక రూపాన్ని పొందింది అని చెబితే మరలా పరబ్రహ్మానికి వికారం కలిగినట్లే కదా? అది నిజమైన వికారం కాదు అని అంటే అప్పుడు ఆ విశిష్టత (ప్రకృతి) లో వచ్చిన మార్పు మార్పు కాదనే అర్థం !

బంక మన్ను కుండకు భౌతికమైన కారణం. కానీ దీని అర్థం వివర్తవాదం ప్రకారం మాయ అయిన జగత్తు లో మాయ అయిన కుండకు బ్రహ్మ పదార్థం తన విశిష్టత (ప్రకృతి) ద్వారా కారణం అని చెప్పడమే. అంటే బ్రహ్మము కూడా వికారాన్ని పొందుతుంది అని చెప్పక చెప్పడమే !!

ఈశ్వరుడు జగత్తుకు నిమిత్త కారకుడు మాయ జగత్తుకు ఉపాదానం(భౌతిక కారణం). ఉపాదానం అనే పదాన్ని తాత్వికులు ఎవరూ వాడని రీతిలో అద్వైతం వాడి వివర్తవాదాన్ని స్థిరీకరించే ప్రయత్నం చేస్తుంది. అప్పుడు శుద్ధ బ్రహ్మము ఈ మాయయైన జగత్తుకు కారణం అని చెప్పడం సాధ్యం ఔతుంది (అప్పుడు శుద్ధ మైన బ్రహ్మము ఆ శుద్ధత్వాన్ని కోల్పోయినట్లే) ఈ విధమైన వివర్తవాదం చివరికి బ్రహ్మ సూత్రాల లోని ప్రకృత్యాధికరణ పై శంకరులు చేసిన వ్యాఖ్యానాన్ని సైతం త్రోసిరాజంటుంది!!!

ఈ గందరగోళాన్ని నివృత్తి చేయడానికే మధ్వులు నిత్యాలైన ఆకాశము, కాలము ఎలా బ్రహ్మము పై ఆధారపడి ఉన్నాయో అదే విధం గా చేతనా ప్రకృతి (శ్రీ మహా లక్ష్మి) ని కూడా పరతంత్ర గా తెలియచేసారు.

"కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః" అనే విష్ణు సహస్ర నామ శ్లోక పాదం లో "కారణం" అనే నామాన్ని ఆధారం గా చేసికొని ఒక అమోఘమైన సత్యాన్ని వాదిరాజ తీర్థులు విశదీకరించారు.

అమ్మను కూడా గుర్తించని స్తితిలో ఉన్న పాపకు ఊయల పై తిరిగే మరబొమ్మ ను చూసినా ఏవిధమైన భావనా కలుగదు ఎందుకంటే గురుతెరగని స్థితి లో ఆ పాపాయి ఉంది కనుక. మరి అట్టి పాపాయికి స్నానానికి ముందు నలుగు పెట్టి నేలపై ఒక మెత్తని వస్త్రం పరచి పడుకో పెడితే కాళ్ళు చేతులు ఆడిస్తూ సూన్యం లోకి చూస్తూ కేరింతలు కొడుతూ నవ్వడానికి కారణం ఏది? ప్రతి క్రియకు ఏదో కారణం ఉండాలి కదా? దీనికి మన ఆధునిక శాస్త్రాలు ఏ విధమైన వివరణను ఇస్తాయి? అలాగే నిద్రలో పాపాయి ఏడ్చే ఏడుపుకి, నవ్వే నవ్వుకి కారణం ఏమిటి?

వాదిరాజులు ఒక్క మాటలో దీనికి సమాధానం ఇస్తారు: "కోట్ల జన్మల వాసనా బలం, యమ సదన దర్శనం, స్వర్గ నివాసం, దైవ నింద, దైవారాధన మొదలగు సంస్కారాల ప్రభావం బాల్యావస్థలో గురుతెరుగని స్థితిలో ఉన్న పాపాయి నవ్వుకి, నిద్రలో ఏడుపుకి లేదా సంతోషానికి కారణం. ఈ జగత్తులోకి వచ్చినప్పటికీ పూర్వ జన్మ వాసనలు ఇంకా స్మృతి పథం లో కదలాడడమే దీనికి కారణం. ఇదే పూర్వ జన్మ కు ఉన్న ప్రత్యక్ష ప్రమాణం". ఎలా వర్షం కురవని ప్రాంతం లో ప్రవహించే నది దాని మూల స్థానం లో కురిసిన వర్షం వలన వరదనీరు చేరి పొంగి ప్రవహించి ఒకచొ వర్షమే కురవని గ్రామాన్ని ముంచుతుందో అదే విధం గా ఎప్పటి నుంచో ఉన్న వాసనా బలం నవ్వు ఏడ్పు లా పసి కందు లో వ్యక్తమౌతాయి. ప్రాణోత్క్రమణ స్థితి లోనూ జీవి భౌతిక శరీరం లో ఉండి అభౌతిక / అలౌకిక దృశ్యాలను చూడగలుగుతాడు. జీవుల మరణానంతర అనుభవం తెలుసుకోవడం ఎలా అసాధ్యమో బాల్యావస్థలో జీవుడు పొందే అనుభవాలు కూడా!!

ఇటువంటి విచిత్రమైన స్థితుల జీవులకు అతి విచిత్రమైన అనుభవాలను ఇచ్చే వాడు శ్రీ మహావిష్ణువు. చరాచర జగత్తు లో జరిగే సకల కార్యాలకు కారణం ఆతడు.

***

ఆత్మ సిద్ధాంతం

౨౯. ఆత్మతత్వం యొక్క సారాంశము

మధ్వాచార్య తత్వ జ్ఞాన ఆవిష్కరణలో ఆత్మలు వివిధములైన చైతన్యానుభావాలు కలిగిన వయక్తిక నిత్యమైన కేంద్రాలు. ఒక ఆత్మ పొందిన అనుభవాలు మరొక ఆత్మ పొందిన వాటితో వైవిధ్యం కలిగి ఉండి, ఆ వైవిధ్యం వలన అవి ప్రత్యేకతను పొందుతాయి. ఇలా ఆత్మలు పొందిన అనుభవాలు బదిలీ చేయడానికి ఆస్కారం లేని స్థితిలో ఉంటాయి. కనుక అన్ని ఆత్మలూ కొన్ని నిర్దిష్టమైన సారూప్య లక్షణాలు కలిగి ఉన్నప్పటికీ వాటి వయక్తిక లక్షణాలు భిన్నంగా ఉంటాయి.

ప్రతి ఆత్మ కు ఒక నిర్దిష్టమైన చేతన, వాస్తవం, ఆనందం, ఒకదానిపై కేంద్రికరించబడిన దృష్టికోణం ఉంటాయి. ఇవి ఇతర ఆత్మలలో పునరావృతం కాని విధం గా ఉండే స్థితిని ప్రతీ ఆత్మ పొంది ఉంటుంది. ఇది ఆత్మ యొక్క వయక్తిక స్వభావం. జయతీర్థులు ఆత్మను ఈ విధం గా నిర్వచించారు:

“ఆత్మ ఒక చైతన్యం తో కూడుకున్న వ్యక్తిత్వం కలిగిఉండి ఇచ్ఛ, గ్రాహ్యత, కార్యక్రమం అనే మూడు ధర్మాలను ప్రతిఫలిస్తుంది. చైతన్యం, అనుభవం, క్రియలు “యోగ్యతానుసారంగా” తగు నిష్పత్తి లో ఆత్మ యొక్క వ్యక్తిత్వం లో సమ్మిళితమై ఉంటాయి. ఈ విధంగా ఆత్మ తన హృదయం లో ఆనందాభిలాష తో, నైతికత తో, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కూడుకున్న విషయాలను దాచుకొని ఉంటుంది.”

ఆత్మల స్వభావం వారి ఉత్కృష్టమైన స్థితిలో తెలుస్తుంది ఆ స్థితిలో అమలినమైన ఆనందం, స్వచ్ఛమైన జ్ఞానం తో అవి భాసిస్తాయి. ఆత్మలు ఈ స్థితి లో ఎటువంటి దుఖానికి లోను కావు. ఇటువంటి ఆత్మ, లింగశరీరాన్ని పొంది జీవుని గా మారినపుడు సుఖ దుఃఖాలకు లోబడి సంసారం లో నిమగ్న మౌతుంది.

ఈ జీవుడు సంసారానికి , ముక్తికి బద్ధుడై ఉంటూ తనని తాను అన్ని స్థితులలోనూ "ఇది నేను" అని తెలుసుకొంటూ ఉంటాడు.

ఆత్మ తన జ్ఞాన, ఆనంద స్థితులను బట్టి తన యోగ్యతను బట్టి ఈ విశ్వక్రమానుగత శ్రేణి (కాస్మిక్ హైరార్కీ) లో ఉన్న ఆత్మల నడుమ తన స్థానాన్ని పొందుతుంది. ఈ ఆత్మలు సంసారం లో ఉన్నపుడు ముక్తిని పొందినపుడూ బ్రహ్మమునకు బద్ధులై ఉంటాయి. సంసారం లో ఉన్న దుఃఖం నిజానికి ఈ ఆత్మలకు బాహ్యమైన విషయం. కానీ ఆ దుఃఖం కేవలం ఆత్మ ఒక వాస్తవమైన సంఘటనలో తాదాత్మ్యం చెంది తనకు లేని స్వతంత్రాన్ని తన చర్యల లో ప్రవర్తన లో ప్రదర్శించడం వలన కలిగేది. ఉదా : అపాత్రదానం, తనది కాదు అని తెలిసీ ఆ వస్తువును పొందడం.

ముక్తికి వెళ్ళిన ఆత్మల లో తారతమ్యాన్ని ఎలా గ్రహించాలి? ప్రాణోత్క్రమణం అయిన పిదప అన్ని జీవులు తమ ఉపాధులను త్యజించి స్వస్వరూపమైన ఆత్మ స్వరూపాన్ని పొంది ఉన్న స్థితి లో ఆ వయక్తిక స్వభావం ఆత్మల్లో ఎలా బయల్పడుతుంది?

నిజమే ఇవి క్లిష్టమైన ప్రశ్నలే. అయితే మానవుని అంతిమ లక్ష్యం తన స్వ స్వరూప దర్శనం (ఆత్మ సాక్షాత్కారం పొందడం దీనినే అపరోక్షానుభూతి అంటారు). ఇది అందరి తత్వకారుల, అన్ని మతాల సారాంశం. ఈ లక్ష్యం ఛేదించిన నాడు మనం మన చూపుడు వేలుతో సూచించి చెప్పగలం "ఇది ఆత్మలను భిన్నం గా చూపడానికి ఆధారం అని". కాని అది చెప్పినంత శులభం కాదు. అద్వైతుల పరిభాష లోచెప్పాలంటే ఆత్మసాక్షాత్కారం పొందిన జీవుడు ఆత్మకు అవిద్యకు ఉన్న సంబంధాన్ని తెలుసుకొని, ఆరెంటికీ అందని స్థితిని పొందగలడు. అప్పుడు ద్వైతులు ఆత్మల నడుమ ఉన్న భేదం వారి సహజ లక్షణం అని అదే సాధికారత తో చెప్పవచ్చును ఎందుకంటే ఈ ఆత్మ సాక్షాత్కారం అందరి జీవులకు అందని అనుభవం. ఇదే ఆత్మల మధ్య ఉన్న భేదానికి రుజువు. ద్వైత పరిభాషలో మధ్వులు ఈ భేదానికి ఉన్న మూల కారణం "అవిద్య" అని దానినే స్వగుణచ్ఛాదిక అని తెలియచేసారు. ఇది ఆత్మ యొక్క స్వస్వరూపానికి ఆచ్ఛాదన వేసి జీవునికి తెలియకుండా చేస్తుంది. ఈ అచ్ఛాదనను (మాయను) తొలగించి మన లోనికి మనం తొంగి చూస్తె కలిగేదే అపరోక్షానుభూతి. ఇది సాధకుల అంతిమ లక్ష్యం.

ఒక జీవుడు మరొక జీవుని వ్యక్తిగత అనుభవాలను నాలుగు దృక్కోణాల(4D) లోనూ పొందలేక పోవడమే ఆత్మల మధ్య అంతర్యానికి రుజువు . న్యాయ విశేషికులు చెప్పినట్లు "వ్యవస్థితో నానా" ఇక్కడ వ్యవస్థ అంటే వివిధత్వం తెలిపే స్థితి అని అర్థం. ఒకే సంఘటన లో పాల్గొన్న వివిధ వ్యక్తులు వివిధ రకాలుగా ఆ సంఘటనను అనుభవిస్తారు అది సంతోషం కావొచ్చు దుఃఖం కావొచ్చు. ఇది ఆత్మల

నడుమ ఉన్న అంతర్యం తేటతెల్లం చేస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి ఒక సంఘటనలో పొందిన అనుభూతికి తన అనుభవాలకు అనుసంధానం చేసి తన వైవిధ్యాన్ని తనకు తెలియకుండానే తెలియచేస్తాడు. అంటే ఆత్మల నడుమ ఉన్న వైవిధ్యం “అనుసంధానం” అనే ప్రక్రియ వలన స్థిరీకరింప బడుతుంది. ఈ అనుసంధానం మధ్వులు అందించిన అమోఘమైన జ్ఞానం దీనివలన ఆత్మల వ్యక్తిగత గుర్తింపు సాధ్యం ఔతుంది. కొన్ని నామ మాత్రం గా తెలియచేసే ఒకే విధమైన అనుభూతులు కేవలం భాషా పరంగా సామ్యాన్ని చెబుతాయి కాని ఫలార్థం గా చెప్పవు. అనుభవం లో తారతమ్యం ఆత్మల సహజ స్వభావం.

జీవుల అనుభవాల అనుసంధానం ఈ జన్మకు సంబంధించిన అనుభవాలతో మాత్రమె ఉండవచ్చు అని చెప్పలేము. ఎందుకంటే గూడు కట్టాలి అనే సంకల్పం, ఆ గూడు అల్లగలగడం అల్లిన పిదప గుడ్లు పెట్టి పొదిగి పిల్లలు బయటకు వచ్చాక వాటిని సాకి తన కర్తవ్య నిర్వహణ చేయడం పిచుక కు ఎలా సాధ్యం అయింది? మానవుని కంటే అధమ స్థాయి లో ఉన్న ఈ పిచుక ఈ విధమైన అనుసంధానం చేసికోగలిగినపుడు మానవులు గతానుభవాలతో ప్రస్తుత అనుభవాలను అనుసంధానం చేసికోవడం తద్వారా వారి వ్యక్తిత్వాన్ని చాటుకోవడం సహజమే. ఈ వాదనను బ్రహ్మ పరిణామ వాదానికి వాడితే జీవుడు తన అనుభవాలను తానూ దైవం లో భాగం గా ఉన్నపుడు పొందిన అనుభవాలకు సైతం అనుసంధానం చేసికో గలడు!! అప్పుడు నిరంతరం శుఖ దుఃఖాలకు అతీతమైన బ్రహ్మానందాన్ని ఈ అనుసంధానం ద్వారా పొందగలడు. **మరి ఇది సాధ్యం కాలేదు ఎందుకు?** ఎందుకంటే పరబ్రహ్మం, జీవులు వేరు వేరు కనుక. ఈ జ్ఞానం పరిపూర్ణం గా కలిగిన వాడు భగవంతుడు ఇదే మాటను గీత లో కృష్ణుడు చెప్పాడు (*Gita XV. 18). ఈ శ్లోకం ద్వారా కృష్ణుడే దేవుడు అని ఎలా చెప్పగలం అనే అభ్యంతారానికి సమాధానంచెప్పడానికి కాదు ఇక్కడ ఉదహరించింది, కృష్ణుని మించిన వేరే పరమాత్మ ఉన్నాడని చెప్పే ఆధారాలు సమస్త వేదవాగ్మయం వెతికినా దొరకవు అని చెప్పడానికి. అదే కృష్ణుడు అదే గీత లో తానె పురుషోత్తముడని, పరమాత్మ అని ప్రకటించాడు.*

మోక్ష స్థితిని పొందినజీవులు పరమాణువ్యక్తులని వీరికి నిర్దిష్టమైన రూపం, అంగాలు, నామం, క్రమం ఉంటుందని ఇవి సంసారం లో ఉన్న జీవులకు అందని విషయాలు అని ముక్త జీవుల గురించి మధ్వులు తెలియచేసారు.

***

౩౦. నిత్యమూ పరతంత్రమైన ఆత్మలు

ఆత్మలు ఉపాధులను పొంది సంసారం లో ఉన్న జరామరణ స్థితి నుంచి విముక్తిని పొంది మోక్ష స్థితి ని చేరినా అవి ఎల్లపుడూ పరతంత్రులే. సహజంగా వాటికి ఉన్న పరిమితులు ఈ పరతంత్ర స్థితికి కారణాలు. ముక్తస్థితి ఆత్మల ను వారి స్వస్థితి ని తెలుసుకోవాడానికి తద్వారా అపరోక్షానుభూతిని పొందడానికి ఉన్న ప్రతిబందకాలను తొలగించి సుఖైక స్థితిలో ఉంచుతుంది. ఈ స్థితిలో ఆత్మలు వాటి పరతంత్రాన్ని (పరమాత్మపై ఆధారపడి ఉండడాన్ని) సంపూర్ణం గా తెలుసుకొని వారి సాధనలో ఉత్కృష్ట స్థితిని పొందుతాయి. కాబట్టి ఇలా పరబ్రహ్మం పై ఆధారపడి ఉండడం ఒక సమసిపోయే స్థితి కాదు అది శాశ్వత మైన స్థితి. ఈ పరాధీన స్థితి పుట్టుకకు ముందు, మరణించిన తరువాత జీవుడు చాల స్పష్టం గా అనుభవిస్తాడు. అలాగే ప్రళయ కాలం లోను, స్వప్నాలలోనూ, సుషుప్తి లోనూ ఆఖరికి మూర్ఛ స్థితి లోనూ ఈ పరాధీనం అనుభవం లోకి వస్తుంది. కేవలం జాగృదావస్థ లోనే జీవుడు స్వాహకారంతో, స్వతంత్ర భావం తో ప్రవర్తిస్తాడు. కనుక జీవునికి ఉన్న పరిమితులు భాహ్య అంతః స్థితులలో వ్యక్తమౌతాయి. బాహ్య స్థితి లో ఉన్న పరిమితులు సమసి పోయేవే కాని అంతః స్థితిలో ఉన్నవి నిత్యాలు. సృష్ట్యాద్యష్టకం లో వివరించిన విధం గా ఈ పరాధీనత ప్రస్పుటం గా వ్యక్తం ఔతుంది.

అస్పృజ పదార్థాలలో ఒకటైన ఈ ఆత్మలు నిత్యమైన పరబ్రహ్మం తో నిత్యమూ ఒక శ్రేణి తో కూడిన సంబంధం కలిగి ఉంటాయి. ఈ సంబంధం నాలుగు రకాల ఆవరణాల తో కప్పబడి ఉంటుంది:

౧. లింగ శరీరం – ఆత్మ ఒక ఉపాధిని పొందడం

౨. ప్రారబ్ద కర్మ – ఫలవంతమైన స్థితి లో ఉన్న కర్మ అనుభవానికి రావడం

౩. కామము – ఇదే జీవి యొక్క క్రియలకు బీజం

౪. భావరూపజ్ఞానం – ఇది జ్ఞానాభావం (అభావమైన జ్ఞానం). ఇది ఒక గుణాత్మకమైన, తమోగుణ జనితమైన జ్ఞానం. ఈ జ్ఞానం శుద్ధమైన ఆత్మ స్వరూపాన్ని ఒక కప్పి ఉంచుతుంది. ఎప్పుడైతే అపరోక్ష జ్ఞానం జీవునకు సిద్ధిస్తుందో అప్పుడు ఈ భావరూప జ్ఞానం పటాపంచలౌతుంది.

జీవులకున్న స్వగుణచ్చాదన (ఇది అవిద్య అనే పదానికి ఉన్న ప్రతిఫలార్థం) వలన వారి ఆత్మలకున్న సహజమైన తత్వం తెలియదు. ఈ అజ్ఞానికి కేంద్ర బిందువు అహంకారం. స్వయంప్రకాశాకత్వం ఉన్న ఆత్మ తో దీనికి అసలు పోలికే ఉండదు. ఈ అజ్ఞానం బింబ-ప్రతిబింబ భావనను జీవికి కలుగకుండా ఒక

గుణాత్మకమైన ఆచ్చాదన లా పనిచేస్తుంది. ఇటువంటి స్వాతంత్రతా భావాన్ని కలిగి ఉండడమే జీవులు సంసారం లో ఉండడానికి హేతువు. విష్ణురహస్యం ఈ అద్భుతమైన అజ్ఞానం (అవిద్య) కలిగిన వ్యక్తి ఎలా ఇతరుల బలహీనతలను పసిగట్టి వాటికి పరిహారాలు సూచిస్తూ తన బలహీనతలను మాత్రం గుర్తించినా వాటిని గూర్చి చెప్పడో తెలుపుతుంది.

ఎందుకు ఈ అజ్ఞానం ఆత్మలను ఆవరిస్తుంది అంటే అది ఒక అంతుచిక్కని రహస్యం. అదే విష్ణు రహస్యం. ఆది ఎరుగని ఈ అజ్ఞానం ఆత్మలను ఆవరించి వాటి పరాధీనవిషేశాప్తిని తెలుసుకోవడానికి ఒక పెద్ద ప్రతిబంధకం గా నిలుస్తుంది. ఎప్పటి నుంచి ఆత్మలు భగవంతునికి పరాధీనం గా ఉండడం మొదలైందో చెప్పడం కుదరదు. ఇటువంటి ఆది ఎరుగని స్థితిని ఇచ్చింది అలాగే ఆత్మలకు ముక్తిని ప్రసాదిస్తున్న వాడు భగవంతుడే.

ఆత్మల పట్ల భగవదేచ్ఛ చాల సరళం గా ఉంటుంది. ఆత్మ పరబ్రహ్మాన్ని తెలుసు కోవాలి అలాగే వారి ఆత్మ స్థితిని కూడా తెలుసుకోవాలి. ఇందుకు జీవుడు తనకు ప్రకృతి సిద్ధంగా సంక్రమించిన మాలిన్యాలను తొలగించుకొని, అవిద్యను అధిగమించి భౌతిక, జ్ఞానాత్మక మరియూ నైతిక ప్రయత్నం చేసి ఒక చక్కని ఆధ్యాత్మిక స్థితిని పొందాలి. అట్టి వారి పట్లే భగవంతునికి ప్రీతి కలుగుతుంది. ఒక అనుద్వేగకరమైన స్థితిలో జీవుడు ఉన్నపుడు అతని అధ్యాత్మిక చింతన శుద్ధ సాత్విక స్థాయిని చేరి ఆపై అతని సాధనా లక్ష్యాన్ని చూపుతుంది. స్వాహన్కార ఖండన తరచూ చేసుకొనే సాధకులకు ఆ లక్ష్యాన్ని చేరే మార్గం సుగమం చేస్తుంది. లింగ శరీరం, ప్రారబ్ధ కర్మ, మొదలగు నవి పరమాత్మ జీవుల సాధనకు తోడ్పడేందుకు కల్పించిన సంబారాలు. వీటి ఆధారం గా జీవులు తమ ఆత్మ స్వరూపాన్ని చూడగలిగే లా సాధన చేయాలి. ఇది విష్ణురహస్యం లో చెప్పబడిన సృష్టి కి కారణం.

యోగ్యత కలిగిన జీవులకు ఆ జనార్ధనుడు ఎలా మోక్షాన్ని ఇస్తాడో అదేవిధం గా అయోగ్యులకు సంసార బంధాన్ని కూడా ఇస్తాడు. ఆత్మలు అసంఖ్యాకములు. అవి ఆదిఎరుగని కర్మల బంధం లో ముడివడి ప్రకృతి గర్భం లో లింగ శరీరాల తో వసిస్తూ ఉంటాయి. వీటికి ఒక ఉపాధి, ఇంద్రియాలు మొదలగునవి కల్పించి, జన్మిమ్పజేసి, ఈ ఆత్మలు తమతమ ఉపాధుల లో ఉండి తమ కర్మలను భగవంతుని పట్ల భక్తి భావం తో చేసేలా ఒక అనుకూలమైన స్థితిని ప్రతి ఆత్మ కు ఏర్పాటు చేస్తుంది ప్రకృతి. ఈవిధమైన ఏర్పాటు ఉన్నపుడే ఆత్మలు పరమాత్మ పై తమకున్న భక్తి ని తమ యోగ్యతననుసరించి చాటగలవు తద్వారా మోక్షానికి అర్హత ను పొందగలవు. యోగ్యతానుసారం గా చేసే కర్మానుష్టానమే జీవులకు ఉన్న దత్త స్వాతంత్ర్యం (free will) ఏ జీవులు ఈ విధమైన కర్మానుష్టానం లో వైక్లబ్యాన్ని పొందుతాయో అవి మరలా సంసార బంధం లో చిక్కుకుంటాయి.

జీవుల పతనాన్ని వివరించడం చాల తేలికైన విషయం. జీవుల ఉద్ధతిని విశదీకరించడం లో తత్వజ్ఞానం యొక్క అవసరం మెండు. ప్రారంభమెరుగని ఈ విశ్వప్రక్రియ కు జీవులు వాటి స్వరూప స్వభావాల వలన జోడింపబడి ఉంటాయి.

***

౩౧. ఆత్మల స్వప్రకాశకత్వం

ఆత్మ కు స్వప్రకాశకత్వం భగవంతుని వలన కలిగే లక్షణం. ఆత్మలు జ్ఞాన స్వరూపాలు, ఇది వాటి శుద్ధమైన స్థితికి ఉన్న గుణం. ఆత్మలు సంసార బంధం లో ఉండడానికి కారణం అవి భగవంతుని పై ఆధార పడి ఉండడమే. ఆత్మలకు ఉన్న ఈ స్వప్రకాశత్వం ద్వైత భావన వలెనే ఆత్మలకు తెలుస్తుంది. అద్వైతం లో చెప్పినట్లు ఆత్మ ఒక శుద్ధమైన జ్ఞాన స్థితి, ఆ స్థితి లో వేరెవ్వరు ఉండరు అంటే అప్పుడు తెలుసుకొనేది, తెలుసు కుంటున్నది, తెలుసుకోబడుతున్నది ఒకే వస్తువు అయినప్పుడు ఆ వస్తువు ఇతరులను తెలుసుకోవడం, ఆ ఇతరులతో తెలుసుకోబడడం కూడా జరగాలి. ఎందుకంటే మధ్వులు చెప్పినట్లు ఆత్మకు స్వత:సిద్ధమైన ఊహ/అనుమానం తో కూడిన జ్ఞానం ఉంటుంది. అలాగే సర్వ జ్ఞానానికి సంబంధించిన విషయ వస్తువు తాను గా, ఆ సర్వజ్ఞానం గా ఉండడం సాధ్యం కాదు. ఇంకా విపులం గా చెప్పాలంటే ఆత్మ లోనే సర్వజ్ఞానమూ ఉంటె మరి ఆ ఆత్మ తనని తాను తెలుసుకోవలసిన అవసరం ఏముంటుంది దీనినే ***<u>కర్తుర్కర్మ భావవిరోధం</u>*** అంటారు. మరో విధం గా చెప్పాలంటే ఆత్మ తనను తానే ప్రభావితం చేసుకోవడం. ఇది అసాధ్యమైన క్రియ కనుక ఇది స్వనాశన హేతువు.

ఆత్మ “అహం” అనే భావనను పొందడమే దాని స్వప్రకాశత్వానికి ప్రత్యక్షం గా ఉన్న నిదర్శనం. దీనిని తర్క పండితులు ఇది ఒక మనో భావన అని తేల్చి చెప్ప వచ్చు కాని మానసిక గ్రాహ్యత కూడా ఆత్మజ్ఞానం లో ఒక అంశమే. ఆత్మలో ఈ విశ్వచైతన్యం (పరమాత్మ) యొక్క అంశ ఉంటుంది అని వాదన చేసే వారికి వారు సుషిప్తి లో అనుభవించిన నిద్రాకాలిక సుఖం వారికి జాగృతికి రాగానే ఎలా తెలుస్తుంది? మరి ఆ స్థితిలో పరబ్రహ్మం యొక్క అంశం చేసే పని ఏమిటి దాని వలన ప్రయోజనం ఏమిటి? అందువలన ఆత్మ యొక్క స్వప్రకాశత్వం నిశ్చయమైనదే.

"నేను నాకు తెలుసు" అనే మాట వ్యాకరణ రీత్యా సరియైనదే కావచ్చు కాని తత్వ రీత్యా అసాధ్యం. సంసారం లో ఉన్న జీవులు ఆత్మసాక్షాత్కారాన్ని పొందినపుడు మాత్రమె ఈ మాటను వినియోగించ వచ్చు. ఇతర కాలాలో ఈ మాట కు ఎటువంటి విలువా లేదు.

ఆత్మల లోని "సవిశేష" భేదం ఆధారం గా వాటిని గుర్తించ వచ్చు. ఇది అద్వైతం లో నిర్విశేషం గా ఉన్న ఆత్మల వలన సాధ్యం కాదు. శృతులు ఆత్మను ఒక చైతన్య వంతమైన తనను తాను తెలుసుకొనే పదార్థం గా వర్ణిస్తున్నాయి.

***

౩.౨. సంసార బంధనం - స్వభావజ్ఞాన వాదం

మధ్వాచార్య సిద్ధాంతం ప్రకారం ఆత్మలు నిత్యాలు అవి పరమాత్మ కనుసన్నలలలో సాధన సాగిస్తూ ఉంటాయి. మహాప్రళయం ముగిసిన ప్రతిసారీ ఈ ఆత్మలను పరమాత్మ సృష్టి క్రమానికి ముందుభాగం లో ప్రవేశ పెడతాడు. ఎందుకంటే అవి వాటి అమితమైన కర్మ ఫలాలను, వాసనా బలాలను పూర్తిగా అనుభవించి వారి వారి గమ్యస్థానాలను చేరుకోవాలిగనుక. కనుక సృష్టి కేవలం నిరోధించలేని ఒక క్రియ తద్వారా వ్యక్తిగత కర్మ ఫలాలు అనుభవం లోకి వచ్చి ఆత్మల పరిపూర్ణ వికాసానికి దోహదపడతాయి. ఈ విధంగా ఆత్మల నిత్యాత్వాన్ని వాటి పరాధీనతను పరమాత్మ యొక్క స్వతంత్రతను, ఆయన ప్రభుత్వాన్ని వెల్లడి చేస్తాయి. ఇట్టి వ్యవస్థ మాత్రమే జీవుల నైతిక, ఆధ్యాత్మిక అవసరాలను తీర్చుకొనుటకు ఉపయుక్తమౌతుంది.

జీవుల సంసార బంధనాలు, జీవులలో ఉండే మలినాలు వాటి నిజమైన స్వరూపం కానే కావు. అసృజమైన ఆత్మల లో ఉత్తమమైనవి శిలలో దాగిన అతి విలువైన లోహముల వోలె ప్రకృతి గర్భం లో ఆది ఎరుగని గతం లో వసిస్తూ ఉంటాయి. అలాగే అధమ మైన ఆత్మలు కూడా. ఎలా ఈ శిలలు ధ్వంసం అయినపుడు ఆ లోహాలు బయటకు వస్తాయో అదే విధం గా ప్రళయానంతరం ఈ ప్రాకృతిక శిల నుంచి బయటకు వస్తాయి. వీటి సాధన (పరిణామ క్రమం) కొనసాగడం కోసం పరమాత్మ తగు సమయం లో శ్రీ, భూ, దుర్గ ల రూపంలో ఉన్న ప్రకృతి ద్వారా ప్రతీ మహాప్రళయం తరువాతా సృజ్యసృష్టి చేస్తాడు.

కాలం లో ఎప్పుడు ప్రారంభమైనదో తెలియని స్థితిలో జరిగేది ఈ విశ్వసృష్టి. ఇది భగవంతుని కృపకు లోబడి జరిగేది. అవ్యక్త స్థితి లో ఉన్న ఆత్మలను భూమిపై తన తిరోధాన శక్తి తో పుట్టించి వాటి తో నిరంతర సంబంధం కలిగి ఉండి వాటి కర్మల ననుసరించి ఉద్ధతికి, పతనానికి సహకారియై పరమాత్మ స్వపర గుణ వర్జితుడు గా జీవుల పట్ల వ్యవహరిస్తాడు.

ఆత్మల కు సంసారం తో ఉన్న బంధం వాటికి అనాదిగా ఏర్పడ్డ మానసిక అభిమానం వలన సృష్టికి రాగానే తనంత తాను గా (అంటే ఏ విధమైన ఇతర శక్తి వలన కాకుండా) వ్యక్తమై వివిధ అనుభవాలను పొందడానికి కారణమౌతుంది. ఈ అనుభవాలు సత్యమని చెప్పడానికి "సాక్షి" జీవులకు ఉన్న ప్రత్యక్ష ప్రమాణం.

జీవులకు ప్రాకృతిక సంబంధం తెగిపోయేది కేవలం సాధన ద్వారా. సాధన అంటే, స్వాధ్యాయం, (గీత లో చెప్పినట్లు "అనుద్వేగకరం వాక్యం, సత్యం ప్రియ హితం ...") నాహం కర్తా హరి: కర్త అనే జ్ఞానం తో నిష్కామ్య భావనతో కర్మలను చేసి భక్తితో, శరణాగత బుద్ధితో, పరమాత్మ నామ సంకీర్తన ద్వారా ఇది సాధ్యం ఔతుంది. సత్యసంకల్పుడైన భగవానుడు జీవుల సాధన ప్రాకృతిక బంధం ద్వారానే కొనసాగడం ద్వారా అవి ఆత్మసాక్షాత్కారాన్ని పొందడం సాధ్యమని ఈ విధమైన ఏర్పాటు చేసాడు. ఆత్మల సహజమైన స్థితిని ఆత్మల నుంచి భగవంతుడు దాచి ఉంచలేదు ఆత్మలు వివిధ ఉపాధులలో చేసిన కర్మల ఫలితం గా అవి తమ స్వరూప జ్ఞానాన్ని మరచిపోయాయి. కర్మరాశి ధ్వంసమైనపుడు ఈ జ్ఞానం తనంత తానుగా భాసిస్తుంది. అసంఖ్యాకమైన ఆత్మల సాధన కొనసాగాలంటే భావరూప జ్ఞానం జీవికి పుట్టుకనుంచీ ఉంటె సాధ్యం కాదు. ఉదా:

- బాల్యం లో పునః సృష్టి చేసే శక్తి లేదా తనకు వ్యతిరేకమైన లింగధారుల పట్ల కాముకత లేకుండా కేవలం యవ్వన కాలం లోనే భగవంతుడు ఇది సాధ్యం చేయడం.

అద్వైతం ప్రకారం ఉన్నదొక్కటే పదార్థం అదే పరమాత్మ అని అంటే అట్టి పరమాత్మ లోకి అజ్ఞానం / అవిద్య ఎలా ప్రవేశించాయి? అవిద్య ఉపాధి వల్ల కలిగింది అంటే, ఆ ఉపాధి ఎక్కడి నుంచి వచ్చింది? మరి ఆ ఉపాధి సత్యం అంటే మరి అది అద్వైత సిద్ధాంతానికే గొడ్డలి పెట్టు కదా? అందుకనే అద్వైతులు ఉపాధులు, ఈ మొత్తం జగత్తే సత్యం కాదు అంటారు. ఇదే విషయాన్ని చెబుతూ మన భారత రాష్ట్రపతి రాధాకృష్ణన్ "అసలు అజ్ఞానం బ్రహ్మమును ఎలా ప్రభావితం చేసింది? ఉపనిషత్తులు ఈ విషయం పై ఏమీ చెప్పలేదు ఎందుకంటే అటువంటి సమాచారం ఉండడం సాధ్యం కాదు కనుక" అని వ్యాఖ్యానించారు. అవిద్య, పరబ్రహ్మం కలసి ఉండడం సాధ్యం కాని విషయం. మధ్వాచార్య తత్వజ్ఞానం భగవంతుని ధర్మస్వరూపం గా జీవుల ఉద్ధరణ కు సహకారి గా చూపితే శంకరుల అద్వైతం పరబ్రహ్మాన్ని అవిద్యకు లొంగి పోయే ఒక దయనీయ స్థితి లో చూపుతుంది.

ద్వైతం పరబ్రహ్మానికి (శ్రీమన్నారాయణునకు) జీవులకు మధ్య పరమచ్ఛాదికం గా ప్రకృతి (శ్రీ మహాలక్ష్మి ఉండి) పరమాత్మ యొక్క అనంత గుణ పరిపూర్ణత్వాన్ని, స్వతంత్రతను, శాశ్వతత్త్వాన్ని చక్కగా చూపుతుంది. అద్వైతం లో అవిద్య యొక్క ప్రభావం వలన ఉన్న ఒకే బ్రహ్మం అనేకం గా మారుతుంది. ఉన్నదొక్కటే పదార్థం అది దొంగ గా దుంగ గా మాయ వలన అవిద్య వలన రూపాంతరం చెందిది అని అద్వైత సిద్ధాంతం ఘోషిస్తూ జగత్తును మాయ, మిథ్య, భ్రమ అని చెబుతుంది. ఇట్టి అవగాహన మిథ్య అయిన శరీరం తో, మిథ్య అయిన జగత్తులో మిథ్య అయిన సాధన చేస్తూ చివరికి మిథ్యా స్థితిని పొందడానికి మాత్రమె సహకరిస్తుంది. అద్వైతులు ఆ నాలుగు మహా వాక్యాలను మననం చేసుకొంటూ జీవ బ్రహ్మైక్య స్థితిని సాధిస్తారు అని చెబుతున్నపుడు నిజమైన సాధకుల్లో మరింత గందరగోళం కలిగి నిజం గానే మిథ్యా స్థితిని పొందుతారు. ఇది సైద్ధాంతికంగా ఉన్న భేదం.

సంసార బంధం సత్యం కాదని ఎందుకంటే అది సత్యం అయితే అది సమసిపోవడం సాధ్యం కాదని అద్వైతం భావిస్తుంది. ఇక్కడ వాస్తవానికి శాశ్వతత్వానికి ఉన్న భేదం గమనించాలి. వాస్తవమైనది శాశ్వతం కానవసరం లేదు.   భగవంతుని కృప వలన అనాది అయిన అజ్ఞానం కూడా సమసిపోయి జీవి ఆత్మసాక్షాత్కారాన్ని పొందగలడు.

మధ్వాచార్య సిద్ధాంతం వాస్తవం తో ముడిపడి ఉంది. సంసారం లో ఉన్న జీవి ప్రతిస్థాయి లోనూ పొందే అనుభవాలు వాస్తవాలు. జీవి పరమాత్మ పై ఆధారపడి ఉన్నప్పటికీ అతనికి కర్తృత్వం భోక్తృత్వం వాస్తవం లో అనుభవం లో ఉన్న విషయాలు. ఈ విషయాలు కేవలం భగవంతుని వలన పొందుతున్న అనుభూతులని తెలుసుకోకపోవడమే అవిద్య. **ఇట్టి అవిద్య కూడా వాస్తవమే** . ఇదే పంథా లో ఇంద్రియ జ్ఞానం కూడా వాస్తవమే. ఆకలి అనుభవించేది జీవుడు. ఆ ఆకలిని కలిగించే వాడు వైశ్వానరుడు (భగవద్గీత: అహం వైశ్వానరో భూత్వా ...). మనది మనది అనుకున్నదంతా వాడిదే అనే భావన తో చేసే సాధన ద్వైత సాధన. నాది అనే భావన వలన జీవుడు సంసారం లో తాదాత్మ్య స్థితిని పొంది తదనుగుణం గా కర్మలను చేసి ఇదే సంసార కూపం లో ఉండిపోతున్నాడు.

ఆత్మల వలె కర్మ అవిద్య అనేవి చైతన్య స్వరూపాలు కావు. అటువంటి అచైతన్య విషయాలు చైతన్యస్వరూపమైన ఆత్మ ను ఎలా తమకు బద్ధుని గా మార్చాయి అనే ప్రశ్న సాధకుల మనస్సులో జనించక మానదు. దీనికి సమాధానం గా రామానుజులు అనాది అయిన సంసారం వలన జీవులు అవిద్యకు కర్మలకు బద్ధులు గా ఉంటారు అని చెబుతారు. అప్పుడు అవిద్య కూడా అనాదియైనదని చెప్పవచ్చు కదా ? అందుకే మధ్వులు జీవులకు ఉన్న సంసార బంధాన్ని పరమాత్మ యొక్క సత్యసంకల్పం తో అనుసంధానం చేస్తారు.   జీవుల దేహాన్తర్యానం పరమాత్మ యొక్క కృప వలన జరిగే క్రియ. ఇది పరమాత్మ యొక్క ఆప్తకామత్వానికి ప్రతీక. సృష్టి ని చేసేది కేవలం జీవుల ఉద్ధరణ కోసమే.

సృష్టి ని ఇంత ధర్మయుక్తమైన క్రియ గా చూపేది ద్వైతం మాత్రమే. రాముని గా అవతరించిన నారాయణుడు ఆదిత్య హృదయం పఠించి సూర్యుని ధ్యానం చేసినా, రామేశ్వరం వద్ద శివుని అభిషేకం చేసినా ఈ ధర్మయుక్తమైన క్రియను చూపడానికే – యద్యతాచారతి శ్రేష్టః....

జీవుల సంసార బంధాన్ని దాని ఆదిని తెలిపే సిద్దాంతాన్ని స్వభావజ్ఞాన వాదం అని మధ్వులు పిలుస్తారు. జీవుడు ఎప్పడు తాను స్వతంత్రుడిగా భావించి భగవంతునిపై అతనికి ఉన్న పరాధీనవిశేషాప్తిని మరచిపోతాడో అప్పటి నుంచి చేసిన కర్మల ఫలితాన్ని అనుభవించడానికి మరల పరమాత్మ కృపవలన ప్రకృతి తో సంబంధాన్ని కలిగి ఉండి ఈ సంసారంలోకి ప్రవేశిస్తాడు. ఎప్పుడైతే స్వభావజ్ఞానాన్ని పొంది కర్మలను చేయడం ప్రారంభిస్తాడో అప్పటి నుంచి అతని యాత్ర ముక్తి వైపు నడుస్తుంది.

జీవి అహంకార ప్రభోదుడై అజ్ఞానం / అవిద్య వలన స్వభావజ్ఞానాన్ని కోల్పోయి స్వరూపానందానికి దూరమై సుఖ-దుఃఖ మాయమైన సంసార చక్రం లో పరిభ్రమిస్తూ ఉంటున్నాడు. సవిశేష వ్యక్తిత్వాన్ని కలిగిన ఆత్మ పరాధీనయై సాధనను కొనసాగించక అదే సవిశేష వ్యక్తిత్వం వలన దాచుకున్న వాసనా బాలలకు లొంగి సంసార చక్రం లో పడిపోచుది.

ద్వైతం లో సంసార బంధం సాధ్యం (possible) ఆత్మ సవిశేషం. అద్వైతం లో సంసార బంధం కేవలం హేతుబద్ధం (plausible) ఆత్మ నిర్విశేషం. ద్వైతం లో నియత పతి-పత్నిత్వం అద్వైతం లో ఉన్నదొకటే ఆత్మ.

***

33. పురుష బహుత్వం – స్వరూప బేధం

పురుష అనే శబ్దానికి పురము లో నివసించు వాడు అని అర్థం - భాగవతం లో పురంజనోపాఖ్యానం. పురము అనగా దేహము. పురుషుడు అంటే దేహి. ఆత్మకు లింగభేదం లేదు. లింగ భంగ స్థితిలో ఆత్మ తన స్వస్వరూపాన్ని పొంది ఉంటుంది. ఇటువంటి ఆత్మలు అసంఖ్యాకం గా ఉంటాయి. తత్వ శాస్త్రం కేవలం జీవుల ఆవిర్భావం పట్ల ఎంత శద్ధ చూపుతుందో అంతే శ్రద్ధ వాటి గతుల పై కూడా చూపుతుంది. ఇది కేవలం ఆత్మకు ఉన్న సవిశేష బేధం ద్వారా మాత్రమె సాధ్యం. ఆత్మల దేహాంతర యానం లో ఒక

దేహం లో ఉన్నపుడు చేసిన కర్మలు, పొందిన వాసనా బలాలు ఆత్మలో నిక్షిప్తమై ఆత్మకు తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని ఇస్తాయి. ఈ కర్మలు, వాసనా బలాలు ఆత్మను వీడవు.

జీవుల మానసిక, శారీరిక, ఆధ్యాత్మిక విషయాలలో ఉన్న తారతమ్యాలు సహజాలు. బాదరాయణుడు బ్రహ్మ సూత్రాలలో కేవలం కర్మ సిద్ధాంతాన్ని, సంసారం యొక్క అనాదిత్వాన్ని మాత్రమె తెలియచేసాడు. ఈరెండు సిద్ధాంతాల ద్వారా జీవుల నడుమ ఉండే తారతమ్యాలు వాస్తవమైన ప్రాధమిక విషయాల ద్వారా తెలుస్తాయి. అద్వైతం ప్రతిపాదించిన అవిద్య తత్వ శాస్త్రం లో చొప్పించబడ్డ ఒక అనవసర గందరగోళం.

కర్మల అనాదిత్వం జీవుల అనాదిత్వం తో కలసి జీవుల మధ్య ఉన్న తారతమ్యాన్ని తెలుపుతుంది. కర్మ సిద్ధాంతం వలన వెల్లడి అయ్యే తారతమ్యం చివరికి ఈ విశ్వ వ్యవస్థలో ఉన్న తారతమ్యాలను సైతం చూపుతుంది కానీ అది జీవుల తారతమ్యాన్ని తెలియచేలేదు. తారతమ్యాలు వాస్తవాలు, అవి జీవి స్వభావాన్ని ఆధారం చేసుకొని వ్యక్తమౌతాయి. కర్మ సిద్ధాంతం నిజానికి తనంత తానుగా జీవుణ్ణి సంసారం లో బద్ధుని చేయదు. జీవుడు గత జన్మలలో చేసిన కర్మల అద్రష్ట ప్రభావం వలన, అవి వాటికి ముందు జన్మల లో చేసిన కర్మల తాలూకు అద్రష్ట ప్రభావం వలన, ఇలా అనాది యైన కర్మల అద్రష్ట ప్రభావాల వలన జీవుడు తన తారతమ్యాన్ని తనకు తెలియకుండానే నిర్ణయించుకొని తద్వారా మంచి, చెడు అనే పనులు చేసే స్వాతంత్ర్యాన్ని (ఇదే దత్త స్వాతంత్రం అని మధ్వులు చెప్పారు) పొందుతాడు. ఇలా కర్మ సిద్ధాంతాన్ని మీరి జీవుల తారతమ్యాన్ని అవగతం చేసుకోవడం ద్వారా మధ్వులు తత్వ శాస్త్రానికి ఒక చక్కటి ఆలంబనను అందించారు. దీనివలన విశ్వ జీవన విధానం లో ఉన్న వైవిధ్యం తెలుస్తుంది. జీవుల నడుమ ఉన్న స్వభావ భేదం ఆధారం గా వ్యక్తమయ్యే విషయాలుగా కర్మను, సంసార బంధాన్నిమధ్వులు నిరూపించారు.

గత జన్మల ద్వారా పొందిన వ్యక్తిగత అనుభవం యొక్క విశిష్టత, సంపాదించిన వ్యక్తిగత సామర్ధ్యం, గుణ సంపత్తి, కర్మల తాలూకు భారం మొదలగునవి అంతిమంగా ప్రతీ ఆత్మను ఒక ప్రత్యేకమైన జీవుని గా మలుస్తాయి. ఈ స్థితి లో ఉన్న ఆత్మ అన్ని దశలలో పొందే అనుభవాలను ఒక “అర్ధవంతమైన రాశిగా” చూడగలుగుతుంది. ఒకే విధం గా ఉన్న కవలల లో సైతం వారి భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక సరళి పరమాణు స్థాయి లో ఉన్న అతి చిన్న మార్పు వలన వారు వైవిధ్యం గల వ్యక్తులు గా పరిగణించబడతారు. జీవుల బహుదత్వానికి ఉన్న ప్రాముఖ్యత కేవలం ఈ ప్రత్యేకత వలెనే తెలియబడుతుంది. **ఇటువంటి జీవుల ప్రత్యేకతకు కర్మల ఆనాదిత్వం తోడ్పడి వారిని మరింత ప్రత్యేక జీవులు గా చూపుతుంది.**

భాగవతం లో కృష్ణుడు గోవుల కాపరిగా ఉండి ప్రతి గోవు కి ఒక ప్రత్యేకమైన పేరు పెట్టి వాటి వ్యక్తిగత విశిష్టత ఎరిగి వాటిని సాకి లోకానికి ఈ ధర్మ శూక్ష్మాన్ని తేటతెల్లం చేసాడు. అలాగే సామాన్య జీవితం లో ఒక గొర్రెల కాపరి కి సైతం గొర్రెల తో సాంగత్యం వలన ప్రతి గొర్రెను గుర్తించి వాటి అవసరాలను తీర్చగలిగే సామర్థ్యాన్ని పొందగలడు. సర్వజ్ఞుడైన భగవంతుడు జీవుల సాధనకు ఏది అవసరమో అది వారు ఎలా పొందవచ్చో ఎప్పటికప్పుడు తెలియ చేస్తూ సృష్టి, స్థితి, లయలను అవ్యాజ్యమైన కరుణతో హేలగా నిర్వహిస్తున్నాడు. మానవ, జంతు, పక్షి, వృక్ష, జలచర, ఉభయచర మైన ఈ సమస్త జీవ రాశి లో ఉన్న ప్రతి జీవుడూ తనదైన "స్వభావ భేదాన్ని" కలిగి ఉండి తనను తాను మంచి గానో చెడుగానో వ్యక్తం చేసుకొంటూ ఉన్నాడు. ఇది కేవలం కర్మ సిద్ధాంతం వలన కలిగిన వ్యక్తీకరణ కాదు. అందుకే గీత లో భగవానుడు ***"స్వభావో" జీవ ఏవచ*** అని తెలియచేసాడు. ఈ స్వభావం తో కూడిన జీవుడే వైవిధ్యతకు మూలం. ఈ సృష్టి లో ముక్త, అముక్త జీవుల ఉనికి జీవుల మధ్య ఉన్న ఈ స్వభావభేదాన్ని నిరూపిస్తుంది. *ఉన్న దొకటే పదార్థం అంటే ఆ ఒక్క పదార్థం లయ అనే ఒక్క సంకల్పం చేసినంత మాత్రం చేత మొత్తం జీవరాశి ముక్తిని పొంది ఉండాలి. అప్పుడు కర్మల ఆత్మల అనాదిత్వానికి అర్థమే లేదు!*

***

౩౪. జీవుల స్వరూప తారతమ్యానికి, జీవ త్రయివిధ్యకు గల సహేతుక ఆధారం

మధ్వాచార్య ఆత్మ సిద్ధాంతం ఆత్మ యొక్క స్వభావ భేదం మాత్రమే కాకుండా ఆత్మల నడుమ గల స్వరూపభేదం గూర్చి కూడా సహేతుకమైన వివరణను ఇస్తుంది. ఆత్మల నడుమ గల స్వరూప తారతమ్యం ముక్త స్థితిలో ప్రస్ఫుటమౌతుంది. అప్పుడే ఆత్మలు వాటి స్వస్థితిని తెలుసుకోగలవు. ఈ వివరణ భారతీయ తత్వ శాస్త్రాల లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది. ఇది మధ్వాచార్య విశిష్టత ను చాటుతుంది. దీనితో పాటు జీవుల త్రివిధమైన వర్గీకరణ కూడా మధ్వాచార్య ఆత్మ సిద్ధాంతానికి ఉన్న ప్రత్యేకత.

జీవులు ముక్తి యోగులు (salvable), నిత్య సంసారులు (ever-transmigrating), తమోయోగులు(damnable) గా ఉంటారని గతం లో చెప్పుకున్నాం. అసృజమైన ఆత్మలు వాటికున్న స్వభావ భేదం ద్వారా సంక్రమించిన దత్త స్వాతంత్ర్యం తో కర్మలను ఎంచుకొని తద్వారా యోగ్యాయోగ్య స్థితులను పొందుచున్నారు.

ఈ సృష్టి లో ఉండే మంచి చెడుల మిశ్రమమనే వైచిత్రి ఆస్తికతకు ఒక సవాల్. ఈ వైచిత్రి నుంచి ఎలా విముక్తి పొందేది? ఎందుకు కొందరికే కష్టాలు, కొందరికే సుఖాలు? ఎందుకు ఆధ్యాత్మిక పురోగతి సాధించే అవకాశాలు అస్తవ్యస్తంగా అనుభవం లోకి వస్తాయి? ఇలా తారతమ్య భూయిష్టమైన ఈ సమస్త జీవ రాశి, విశ్వం ఎలా అనంత గుణ పరిపూర్ణుడైన భగవంతుని తో సమన్వయము ఔతుంది? ఈ ప్రశ్నలు మానవాళి ని అనాది గా వేధిస్తూనే ఉన్నాయి.

ఈ అన్ని ప్రశ్నలకు ఉన్న సమాధానాలు:

1. జీవులకు గల దత్త స్వాతంత్ర్యం వారిని మంచి/చెడు దారులను ఎన్నుకొనే స్వేచ్ఛనిస్తుంది.
2. జీవుల స్వభావ భేదం ఆధారం గా ఈ దత్త స్వాతంత్ర్యం వాడబడుతుంది. దీని అర్థం జీవుల బహుదత్వం ఎలా అసంఖ్యాకమో అలాగే వారు ఎంచుకొనే మార్గాలు కూడా!!
3. దత్త స్వాత్రంత్ర్యం కేవలం జీవులకు ఉన్న అవకాశం మాత్రమె అది కేవలం మంచి మార్గాన్నే ఎంచుకోమని చెప్పదు, మంచి చెడు మార్గాల ఎన్నిక చేసేది జీవుల స్వభావం.
4. జీవులు – సర్వోత్తముడైన దైవం వేరు వేరు.

రామానుజుల సిద్ధాంతం ప్రకారం నిత్యసూరిలు (సంసార బంధం నుండి విడివడి పరబ్రహ్మం లా ఎప్పటికీ ఉండే స్థితిని పొందిన వారు) ఉన్నపుడు నిత్య సంసారులు కూడా ఉండాలి. అలాగే వి.అద్వైతం ప్రకారం శ్రీమహాలక్ష్మి ఈ నిత్యసూరిల కంటే తారతమ్యం లో ఉత్తమ స్థితిలో ఉన్నపుడు తారతమ్యం ఉన్నది అని ఒప్పుకోవలసిందే. భారతీయ తత్వ శాస్త్రం ప్రకారం మానవులు వేరు దేవతలు వేరు. బ్రహ్మ సూత్రాలు దేవతలను ఒక విశిష్టత కలిగిన జీవులు గా తెలిపాయి. ఈ తరగతి కి చెందిన ముక్త జీవుల (సాధ్యులు) కు ముందు తరం వారిని గూర్చి కూడా శృతులు తెలిపాయి. వి. అద్వైతం చెప్పినట్లు విశ్వక్సేనుడు, గరుడుడు, అనంతుడు మొ. వారు నిత్య ముక్తులు (దేవతలు). మన వేద వాగ్మయం చతుర్ముఖ బ్రహ్మకు నిత్య ముక్తులలో (దేవతలలో) అత్యున్నత స్థానాన్ని ఇచ్చింది. ఈయన జీవోత్తముడే కాదు పరమాత్మ నుంచి ఉద్భవించిన మొదటి తనయుడు.

అనేక ఉపనిషద్వాక్యాలు, పురాణ వాక్యాలు, (*SvetUp*, vi. 18), (*Prasna Up*, v. 2), (*ChanUp*, iv. 15.6), *TaittUp* (ii.1), (*Kurma Purana*, 1.12.269) చతుర్ముఖ బ్రహ్మను జీవోత్తముని గా కీర్తించి

ఆయన జీవుల సాధనకు ఎలా సహాయపడునో వివరిస్తాయి. చతుర్ముఖ బ్రహ్మ ఆది గా (అందుకే బ్రహ్మాది దేవతలు అనే పదం వాడుకలోకి వచ్చింది) గల దేవ వ్యవస్థను మధ్వులు, ప్రతి దేవత యొక్క స్థాయి, పదవి, తారతమ్యం మొదలగు విషయాలతో వివరించారు. ఈ దేవవ్యవస్థ ఆధారం గా ఈ విశ్వ పరిణామం జరుగుతుంది. ఈ స్థాయిలు కేవలం ఊర్ధ్వ ముఖ చలనం తో మాత్రమె కాదు సాధనా లోపం వలన అవి అధోముఖం గా కూడా ఉంటాయి. ఇలా మానవులు, దేవతలు వారి స్వభావ తారతమ్యాన్ని అనుసరించి గతులను / పదవుల ను పొందుతారు.

జీవులలో కొందరు స్వాభావికంగా మంచి మార్గం లో ఉండడానికి ఇష్టపడడం అలాగే కొందరు చెడు మార్గానికి ఆకర్షితులు కావడం ఉంటుంది. కాని దేవతలలో ఈ వ్యత్యాసం ఉండదు, వారికి పాపం అంటదు (BrhUp. i.5.20).

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభు:
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే - (Gita V.14)

పరమాత్మ ఈ లోకం లో కర్మలను సృజించడు ఆకర్మలు చేయమని జీవుని ప్రేరేపించడు అలాగే జీవులు చేసిన ఆ కర్మ ఫలాలను కూడా సృజించడు ఇవి అన్నీ ఆ జీవి స్వభావం ప్రకారం వర్తిస్తూ ఉంటాయి.

సత్యం అన్ని సమయాలలోనూ / సందర్భాలలోనూ ఆహ్లాదకరం గా అనిపించదు. కొన్ని కఠోర సత్యాలు మనిషికి రుచించవు. అందుకే మధ్వాచార్య త్రివిధ వర్గీకరణ, స్వరూప తారతమ్యం, స్వరూప భేదం అనే విషయాలు కొందరికి నచ్చవు. నేనే బ్రహ్మం, నాకు వాడికి తేడా లేదు, నేను వాడినైపోగలను, నిజానికి నేను వాడినై ఉన్నాను అనే మాటల ఎంతో ఊరట ఇస్తాయి. వాడు నీవు వేరు అంటే అహంకారం తిరస్కరిస్తుంది. అందుకే ద్వైతం త్వరగా వంటబట్టదు!!

***

౩౫. ఆత్మల నడుమ ఉన్న స్వాభావిక తారతమ్యం దానికి వేదాలలో నిక్షిప్తమైన ఋజువులు

ఆత్మల నడుమ తారతమ్యం పై మధ్వులు వారి అనుచరగణం వేద కాలం లోని మరియూ వేదకాలానంతర సాహిత్యం లో నిక్షిప్తమైన ఎన్నో ఋజువులలో కొన్ని ఋజువులను నమూనా గా తెలియచేసారు. వాస్తవానికి ద్వైత సిద్ధాంతం అనాదిగా ఉన్న తత్వం అని సాధికారికంగా ఈ రుజువులు వివరిస్తాయి. ఇవి క్షుణ్ణం గా నిరుక్తం, చదస్సు, వ్యాకరణం మొదలగు సంస్కృత భాషా సూత్రాలను అన్వయం చేసినమీదట జీవుల లో త్రయివిధ్య ను చాల స్పష్టం గా తెలుపుతాయి. ఇట్టి ఋజువులు మన వేదం వాగ్మయం లో పెక్కు కలవు. ఈ జ్ఞానం అనాదిగా ఎన్నో తరాలకు అందించబడింది. అవి:

వేద వాగ్మయం లో :

(*RV* X. 48.7)
(*RV* vi. 47.16)
(*RV* vi. 47.17)
(*RV* vi. 47.21)
(*RV* i. 182.6)
(*RV* vii. 104.1)
(*RV* vii. 104.5)
(*IsaUp* 3)
(*TaittUp* ii.8)

వేదకాలానంతర వాగ్మయం లో :

1. యో యచ్ఛ్ర ద్వః స ఏవ సః (*Gita*,xviii.3)

2. అసూర్యా నామ తే లోకా అంధేన తామసా వృతా (*IsaUp* 3)

3. త్రివిధా భవతి శ్రద్ధా దేహినాంస స్వభావజ
4. సాత్వికీ రాజసీ చైవ తామసీ చైతి - (*Gita* viii.2)

5. ఊర్ధ్వ గచ్ఛతి సత్వస్య, మధ్యే తిష్ఠంతి రాజసాః
6. జఘన్యాగుణవృత్తిస్య అథోగచ్ఛతి తామసాః - (*Gita* xvi.18)

(*Gita* xvi.5, xvi.6, xvi.20)

(*Gita* xvi.18)
(*Gita* viii.2)

(*Gita* xvi.3)
(*Bhag* vi.14.5)
(*Mbh* XII.261. 47-50)
(*Padma* quoted by Madhva in *BSB* iii.i.21)
(*Visnu Rahasya* XXXIII)
(*Visnu Rahasya* Ch.V)

మధ్వులు తెలియపరచిన త్రివిధ్య (త్రివిధమైన ఆత్మ గతి) ఒక విశాలమైన దృక్పథం తో అర్థం చేసుకొని చూస్తే జీవుల స్వభావం పట్ల మరింత అవగాహన అలాగే జీవుల కు దక్కే గతులు ఎలా నిర్దేశింప బడతాయో మనకు తేలికగా అర్థం ఔతుంది. ఈ గతులు ఒక అనంతమైన పునః శ్రేణి (continuum) అనుకొంటే వాటికి ఇరువైపులా కలి పురుషుడు వాణీశ్వరుడు (చతుర్ముఖ బ్రహ్మ) ఉంటారు.

త్రయివిధ్య సిద్ధాంతం అవగతమైతేనే జీవుల అనాదియోగ్యత (beginninglessfitness) అర్థం ఔతుంది. ఈ అనాది యోగ్యతే జీవుల నడుమ ఉన్న భిన్నత్వానికి మూలకారణం. జీవుల స్వభావం, యోగ్యత, అవకాశం ఈ అనాది యోగ్యత వలన తేటతెల్లమౌతుంది. ఈ వివరణ కర్మ సిద్ధాంత వివరణ కు, దత్త స్వాతంత్రానికి (free will) మించిన స్పష్టతను సాధకునకు ఇస్తుంది. దేహిలో స్వాభావికంగా జనించిన సత్వ, రజో, తమో గుణాలు అన్ని సిద్ధాంతాలకు మూలమైన అంశాలు. ఏది స్వభావామో దానిలో మార్పు ఉండదు. మధ్వాచార్య సిద్ధాంతం జీవులు వారి సాధన లో భాగం గా తమ స్వభావానికి అనుగుణంగా ఉండే విధానాలను ఎంచుకొనే విషయాన్ని తెలియచేస్తుంది. కర్మ సిద్ధాంతం ప్రకారం పూర్వనిర్ధారితమైన గతులను గూర్చి తెలుపదు. అలాగే ఈ త్రయివిధ్య సాంఖ్యులు తెలిపిన త్రయిగుణ్య సిద్ధాంతానికి సమానం కాదు. జీవ చైతన్యం ఈ త్రిగుణాలకు అతీతం గా ప్రకృతికి అతీతం గా జీవుల స్వభావ భేదాన్నిఅనుసరించి వర్తిస్తుంది. ఇది మధ్వులు అందించిన విశేషమైన వివరణ.

మహా ప్రళయానంతరం చతుర్ముఖ బ్రహ్మకు గోచరమైన దృశ్యం: విశ్వం మొత్తం మాహాప్రళయ జలాల లో మునిగిపోయినపుడు ఆత్మలు మాత్రమె ఆయనకు కనిపించాయి – నిత్యం ఏవ తద్భూతం.

మధ్వాచార్య సిద్ధాంతం ప్రకారం జీవుల ఆధ్యాత్మ జీవిన విధానం జీవుల అంతర్గతమైన వ్యవహారం ఇది బాహ్య శక్తులకు లోబడి ఉండదు. విశిష్టాద్వైతం పేర్కొన్న నిత్యసూరులు, నిత్యసంసారులు అనే భావన సైతం త్రివిధా శ్రద్ధ అనే గీతా వాక్యానికి కట్టుబడి ఉండేదే. కాబట్టి త్రయివిధ్య అనేది మధ్వాచార్య స్వకపోల కల్పితం కాదు. ఇది పూర్తిగా వేద వాంగ్మయం, తదనంతర వాంగ్మయానికి అన్వయమైన విషయం. అదేవిధం గా స్వరూప భేదం తదనుసార కర్మ సిద్ధాంతానికి అనుగుణమైన విషయం.

***

౩౬. పరబ్రహ్మం తో జీవులకు గల సంబంధం

రూప-ప్రతిరూప, అంశ –అంశి, ఛాయ-పురుష, శరీర-శరీరిన్, అభాస-అభాసక, అగ్ని-విస్ఫులింగ, అనే పేర్లతో వేదవాఙ్మయం జీవికి పరబ్రహ్మం తో ఉన్న సంబంధాన్ని తెలిపింది. అద్వైత తత్వం అధిష్టానారోప్యభావ లేదా బింబ-ప్రతిబింబ భావన అని తెలిపింది. రామానుజులు దీనిని శరీర – శరీరిభావ లేదా శేష-శేషిభావ అని తెలిపారు. భేదాభేద వాదులు (అద్వైతులు), విశిష్టాద్వైతులు ఇచ్చిన ఈ పేర్లతో పిలిచే సంబంధాన్ని వాటికి ఇచ్చిన వివరణను మధ్వులు తిరస్కరించి బింబ-ప్రతిబింబ సంబంధం జీవి యొక్క ఆనాది స్థితిని భగవంతుని తో గల అలౌకిక సంబంధాన్ని ఒక విశిష్టత తో తెలిపేదిగా నిరూపించారు. మధ్వులు ఈ బింబ-ప్రతిబింబ భావనను ఒక పదార్థాన్ని దర్పణం లో చూసినపుడు కలిగిన ప్రతిబింబం తో పోల్చి వివరించలేదు. దీనికి కారణం జీవి-దైవం నడుమ మరొక పదార్థం ఉండే అవకాశంమే లేదు. కాబట్టి భగవంతుని రూపం ఒక మాధ్యమం ద్వారా జీవిలో ప్రతిబింబించలేదు. దీని అర్థం సంసార పరిభ్రమణం లో పడిన జీవుడు తన స్వరూపాన్ని, స్వభావాన్ని మరచి అహంకారం తో వర్తించి “పునరపి మరణం పునరపి జననం” అనే చక్రం లో చిక్కుకొని ఉంటాడు. కేవలం ముక్త స్థితిలో మాత్రమె తన పరతంత్రాన్ని, భగవంతుని తో తనకు గల సహజమైన సంబంధాన్ని తెలుసుకోగలడు ఇది జీవునికి పరమాత్మ తో ఉన్న అపురూపమైన సంబంధం.

ఋగ్వేదం లో(*RV* VII. 47.18) ఉన్న ఈ బింబ-ప్రతిబింబ భావనను:
రూపం రూపం ప్రతిరూపం బభూవ
తదస్య రూపం ప్రతిచక్షణాయ
(ప్రతిజీవి యొక్క రూపానికి మూల రూపం భగవంతునిది. అటువంటి మూల రూపాన్ని ప్రతి జీవి గ్రహించాలి).

గీతలో(ii, 12) తెలిపిన పరతంత్రాన్ని ఆధారం గా చేసికొని జీవుని ఉనికి, చైతన్య స్థితి, కర్మల కొరకు భగవంతుని పై ఆధారపడి ఉండడాన్ని మధ్వులు తెలియచేసారు.

జీవికి భగవంతునితో గల సంబంధం ఒక పవిత్రమైన విడదీయలేని నిత్యమైన, సత్యమైన ఒక మహోత్కృష్టమైన సంబంధం. ఇది ఆత్మ యొక్క మూల రూపం భగవంతునితో అనాది గా ఏర్పరచుకొన్న సంబంధం. ఇది ఎప్పటికీ అంతం కాని అలాగే మార్పు లేని, మీరిపోని సంబంధం. ఈ సంబంధం జీవికి సంసారంలో ఉన్నపుడు జ్ఞప్తికి రాదు కేవలం ముక్త స్థితిలో ఉన్నపుడే తెలిసి జీవిని సుఖైక స్థితిలో ఉంచేది. ముక్తి అంటే పూర్ణమైన జ్ఞానాన్ని పొందడం. అట్టి జ్ఞానం ద్వారా మాత్రమె జీవి పైన తెలిపిన బింబ-

ప్రతిబింబ సంబంధాన్ని తెలుసుకోగలుగుతాడు. తన ప్రతిబింబ స్వరూపం ఒక అభాస కాదని, సత్యమని, ఒక అధ్భుతమైన సంబంధమని జీవికి తెలిసే స్థితి ముక్త స్థితి. ఈ స్థితిలో జీవి తాను శాశ్వతంగా పరమాత్మపై ఆధారపడి ఆ ఆధారం మూలంగా ఆనంద స్వరూపాన్ని పొందగలుచున్నాను అనే జ్ఞానాన్ని కలిగి ఉంటాడు.

ఈ సంబంధం కలిగి ఉన్న జీవి

౧. ప్రతిబింబం బాహ్యమైన మాధ్యమం (ఉపాధి) ద్వారా ఏర్పడినది కాదు
౨. ఆ బాహ్యమైన ఉపాధి పైదొలగినంత మాత్రాన ప్రతిబింబం (జీవుడు) నశించి పోదు
౩. ప్రతిబింబం జీవం లేని పదార్థం కాదు

ఈ విధంగా ముక్త స్థితి లో భిన్నత్వం, తదాధీనత్వం, తత్సాదృశ్య గుణాలతో ఒప్పి ఉంటాడు జీవుడు ఇది బ్రహ్మ సూత్రకారుడు విపులంగా తెలిపిన విషయం. ఈవిదంగా ముక్త స్థితిలో సైతం జీవుడు తన ఉనికికి, ఆనందానుభూతికి పరబ్రహ్మం పై ఆధారపడి ఉంటాడు. ఇది జీవుడి స్వలక్షణం, నిరుపాధిక సంబంధం. ఈ సంబంధం లేని పక్షంలో జీవుడి అస్థిత్వమే ఉండదు. వేదాంత పరిభాషలో జీవుడు, పరబ్రహ్మ అనాది శాశ్వత స్తితి కలిగి ఉన్నవారు కనుక వారి పరస్పర సంబంధం కూడా అట్టి శాశ్వతత్వాన్ని కలిగి ఉండడం సహజం. ఇట్టి సంబంధానికి అవిద్య కారణం కానే కాదు.

నిత్యో నిత్యానాం (KathaUp iii.213)
నిత్యః సర్వగతః స్థాణు: (*Gita* ii.24)
నత్వేవాహం (KathaUp iii.213)

ఈ అలౌకిక సంబంధం వలెనే లౌకిక సంబంధం స్థిరీకరించబడుతుంది, ముక్తస్థితి పట్ల సరియైన అవగాహన కలుగుతుంది. ఆత్మ యొక్క శాశ్వతత్వం ఈ సంబంధం వలెనే తెలుస్తుంది. చిట్టచివరికి తన ఉనికినే కోల్పోయే జీవుడు ముక్త స్థితి కోసం ఎందుకు ప్రాకులాడాలి? తాను ఉన్నపుడే ముక్త స్థితి లో పొందే ఆనందాన్ని అనుభవించగలడు అనే నిజం మధ్వులు ఈ సంబంధానికి ఇచ్చిన వివరణ ద్వారా తెలియచేసి ఒక సశాస్త్రీయ దృక్పదాన్ని తత్వజ్ఞానం కోసం చేసే సాధన పట్ల కలిగించారు.

జీవుల సవిశేష భేదం, స్వరూప ఉపాధి వారిని వారి సంబంధాన్ని ఒక వైవిధ్యం తో కూడుకొన్నది గా తెలుపుతుంది. కోట్లాది జీవులకు కోట్లాది రకాల సంబంధాలు పరమాత్మ తో కలిగి ఉంటాయి. వారి ఆనంద తారతమ్యం కూడా అంతే. ఇదే తత్ త్వం అసి అనే ఉపనిషద్వాక్యానికి ఉన్న అసలైన అర్థం. ఆనందం,

చైతన్యం, ఆనాదిత్వం జీవునికి పరమాత్మకు ఉన్న పోలికలు. ఈ పోలికలు ఉన్నంతన మాత్రాన జీవుడు పరబ్రహం తో సమానం ఎన్నటికీ కాలేడు.

మరొక్క ఉదాహరణ ద్వారా మధ్వులు ఈ బింబ-ప్రతిబింబ సంబంధాన్ని తేటతెల్లం చేస్తారు:

ఇంద్రధనుస్సు:
సూర్యుని కిరణాలు వాన నీటి బిందువుల గుండా ప్రసరించడం వలన అవి వక్రీభవనం చెంది విబ్జియోర్ గా విభాగింపబడి చూపరులకు ఏడు రంగుల ఇంద్రధనుస్సు గా గోచరమౌతాయి. వాతావరణంలో మిగిలిన కాలాల కన్నా వర్షాకాలంలో నీటి ఆవిరి పెద్ద పెద్ద బిందువుల రూపంలో ఉంటుంది. సూర్యుని నుంచి వెలువడే ధవళకాంతి ఆ నీటి బిందువుల గుండా వెళ్లేప్పుడు గాలిని , నీటిపొరను వేరుచేసే అంతరోపరితలం(interface) వద్ద వక్రీభవనం (refraction)చెందుతుంది. ఇలా వక్రీభవనం చెందే కోణాలు వివిధ తరంగదైర్ఘ్యాల (wavelengths)కు వేర్వేరుగా ఉండడం వల్ల ధవళకాంతిలోని వివిధ కాంతి తరంగాలు ఏడు రంగులుగా విడిపోతాయి. ఇలా విసిసెకర్రలాగా విస్తరించుకున్న సప్తవర్ణాలు, ఆ బిందువు అవతలివైపున ఉండే అంతరోపరితలం వద్ద అంతర్గతతరంగాలు ఏడు రంగులుగా విడిపోతాయి. ఇలా విసిన కర్రలాగా విస్తరించుకున్న సప్తవర్ణాలు , ఆ బిందువు అవతలివైపున ఉండే అంతరోపరితలం వద్ద అంతర్గత సంపూర్ణ పరావర్తనం (Total Internal Reflection) చెంది మన కంటిని చేరుతాయి. అంటే ఇంద్ర ధనుస్సు సూర్య కిరణాల ప్రతిబింబం. వాన నీటి బొట్టు కి సాధారణ అద్దానికి తేడా ఉంది. ఈ తేడా జీవి యొక్క సవిశేష భేదం ఈ భేదం అంతర్గత సంపూర్ణ పరావర్తనం. ఇదే రీతిలో జీవుడు పరమాత్మ యొక్క ప్రతిబింబం. నీటి బిందువులు సూర్య కిరణాలను తమద్వారా ప్రసరిమ్పచేసుకోవడం వలన ఆ సూర్యకిరణాల వైభవాన్ని తెలియచేస్తున్నాయి, కాబట్టి ఈ నీటి బిందువులు చైతన్యవంతమైనవి, సాధారణ దర్పణం జడ పదార్థం.

జీవుడు నీటి బొట్టులా భగవంతుని వైభవాన్ని (విభూతిని) ప్రపంచానికి తెలియచేస్తాడు. సాగర గర్భంలో ఉండే జీవ వైవిధ్యం పరమాత్మ వైవిధ్యాన్ని తెలియచేసినట్లు. భగవద్విభూతి అధికం గా తమలో ప్రదర్శిచే భాగవతోత్తములు, వారి ప్రేమ, కరుణ, జ్ఞాన, వైరాగ్య గుణాలు భగవంతుని వైభవాన్ని తెలియచేస్తారు. ఒక్క మాట లో చెప్పాలంటే మనమంతా నీటి బొట్టులం. మన లో ఉన్న చైతన్యం భగవద్కృపను, వైభవాన్ని పొందగల అర్హత, సత్తా, అలాగే ఆయన అనంత గుణాలను తిరిగి ప్రసరింప చేయగల సామర్థ్యం కలిగిఉంది. ఇలా ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక, తాత్విక సత్యాన్ని బిమ్బ-ప్రతిబింబ భావన ఆవిష్కరిస్తుంది. జీవునికి భగవంతునితో గల సాంగత్యం ఇంతటి మహత్తరమైన సంబంధాన్ని తెలియచేస్తుంది అని బ్రహ్మ సూత్రకారుడైన బాదరాయణుడు చెప్పక చెప్పాడు (*BS* iii.2.19).

జీవుల ఉపాధి ద్వివిధమైనది. ఒకటి బాహ్య ఉపాధి. రెండవది అంతర్గత ఉపాధి. బాహ్య ఉపాధి (శరీరం, మనసు, అవి పొందే మార్పులు) ముక్త స్థితి లో నాశనమైపోతుంది కనుక జీవుడు తన అంతర్గత ఉపాధి ద్వారా ముక్త స్థితి లో ఆనందానుభూతిని పొందుతాడు. ఈ రెండు విధాలైన ఉపాధులు నాశనమైతే ఇక జీవుడు ముక్త స్థితి లో సాధించేది ఏముంటుంది? ఈ అంతర్గత ఉపాది జీవుని స్వరూపోపాధి. ఈ ఉపాధి లో జీవుడు తన పరతంత్ర స్వభావాన్ని, జ్ఞాన, ఆనంద గుణాలను తన స్వభావ సిద్ధం గా ఏర్పడ్డ పరిమితికి లోబడి ప్రదర్శిస్తాడు. బాహ్యోపాది గల జీవుడు సంసారంలో నిమగ్నమై సృష్టిఆది నుంచి తనకు ఏర్పడ్డ లౌకిక విషయాల పట్ల సంబంధం తో మమేకమై తన నిజస్వరూపాన్ని తెలుసుకోలేక నానా అవస్థలకు లోనై స్వతంత్రుడను అనే భ్రమలో చిక్కుకుంటున్నాడు.

భక్తి భావన ఉద్బుధమైన కొలదీ జీవుని లో పరమాత్మ పట్ల అవగాహన పెరిగి తద్వారా భక్తి తీవ్రత పెరిగి వివిధమైన పరిపక్వ స్థితులను సాధించి చివరికి సాధకుడు ముక్త స్థితిని పొందగాలుగుచున్నాడు.

అంశ – అంశి భావన లో జీవుడు భిన్నాంశ గా వివిధ ఉపాధులు పొందితే, పరమాత్మ స్వరూపాంశ గా అవతారాలు స్వీకరిస్తాడు. స్వరూపాంశ అంటే అంశి కి భిన్నమైనది కాదు. అంశి తో సమానమైనది. మత్స్య కూర్మ, రామ, కృష్ణ అవతారాలు అన్నీ పరిపూర్ణమైన అవతారాలు. కాని జీవుని విషయం లో కాదు అంశి ఉపాధి ని పొందినపుడు ఆ ఉపాధి లక్షణాన్ని అవశ్యం పొంది తన స్వస్వరూపానికి భిన్నం గా ఉంటాడు ఉదా: ఇంద్రుడు – అర్జునుడు.

మధ్వులు జీవికి ఈశ్వరునకు కొన్ని నిర్దిష్టమైన స్పర్శ కోణాలు ఉంటాయని అవి జీవికి ఈశ్వరునకు మధ్య ఉన్న వ్యవస్థ గూర్చి, స్థాయిని గూర్చి తెలుపుతూ అది అవినాశమైనదని తెలియచేస్తారు. ముక్త స్థితిలో సైతం వాస్తవం, చైతన్యం ఆనందం అనే గుణాలతో ఒప్పుచూ జీవి యొక్క పరతంత్రాన్ని, తారతమ్యాన్ని అన్ని స్థితుల లోనూ నిర్ధారణ చేస్తుంది. ఈ కారణం గానే ముక్త స్థితిలో ఉన్న జీవి ఒకచో ఈశ్వరునితో పోలిక కలిగి ఉన్నట్లు చెప్పబడినది మన వేదం వాగ్మయంలో. అంతమాత్రం చేత జీవి పరబ్రహ్మం తో సమమైన స్థితి కలిగి ఉంటాడు అని చెప్పరాదు.

ఆత్మయొక్క అంతర్యామి గా పరబ్రహ్మం భాసిస్తూ విడదీయలేని సంబంధాన్ని జీవితో కలిగి ఉంటాడు మినహా ఏకీకృతం కాడు. దీని అర్థం జీవి పరబ్రహ్మం లో ఇక్యం కాడు. మరోలా చెప్పాలంటే, జీవి విశ్వాన్ని శాశించే, నియంత్రించే, పరిహరించే స్థితిని ఎన్నటికీ చేరడు. ఈ క్రియలు కేవలం పరబ్రహ్మకే సాధ్యమయ్యేవి. కనుక ఈ విధమైన పరిమితి తో కూడిన జీవి కి ఇది స్వభావమని చెప్పబడినది, అవిద్య కాదు! కనుక స్వరూపైక్యత, సంపూర్ణ స్వభాపైక్యత మినహాయిస్తే జీవి ముక్త స్థితి లో జ్ఞానం, ఆనందం తో భాసిస్తూ ఈశ్వర లక్షణాలను ప్రతిబిమ్బిస్తాడు మినహా ఈశ్వరుడు కాబోడు. ఇది ద్వైత సిద్ధాంతం యొక్క

విశిష్టమైన సారాంశం. శృతులు తెలిపిన ఐక్యత ఒక స్థాయిలో ఉన్న ఈ సారూప్య సంబంధం గురించే కాని జీవి – ఈశ్వరుని మధ్య ఉన్న స్వభావైక్యత గురించి కాదు శృతులు ఎక్కడా ఈ విషయాన్ని చెప్పలేదు. ఈశ్వరుడు ఒక్కడే సర్వస్వతంత్రుడు.

***

పరబ్రహ్మ సిద్ధాంతం

౩౨. ఈశ్వర స్వాతంత్ర్యం

మధ్వులు తెలియచేసిన అనాదియైన తత్వ సిద్ధాంతం లో స్వతంత్రమైన పరబ్రహ్మం ఒక అతి ముఖ్యమైన/ ఆయువుపట్టు అయిన అంశం. ద్వంద్వమైన విధానం ద్వైతం లో స్వతంత్ర   – పరతంత్ర స్వభావాలుగా వాసికెక్కాయి. భారతీయ తత్వ వాదులలో మధ్వులు పరబ్రహ్మన్ని స్వతంత్ర, అనిర్వచనీయ కరుణా సింధువుగా ఒక ప్రముఖమైన స్థానంలో ఉండడానికి ఈ ద్వంద విధానమే ముఖ్యమైన కారణం. ప్రకృతి-పురుషుల (జీవుల) కు అతీతమైన స్వతంత్రత తో పరబ్రహ్మ ఒప్పి ఉంటుంది. "పరాధీన తో కూడిన విశేషమైన ఆప్తి" తో ప్రకృతి (శ్రీమహాలక్ష్మి), సమస్త చరాచర జగత్తు ఆయనపై ఆధారపడి ఉంటాయి.

మధ్వులు తన అంతర్నేత్రం ద్వారా గ్రహించిన ఈ పరాధీన విశేషాప్తి వారిని సమస్త తత్వజ్ఞుల కంటే ఉన్నతమైన స్థాయికి తీసుకొని వెళ్ళింది. తత్వతః మధ్వాచార్య సిద్ధాంతం చక్కగా అమరినట్లు సరిపోతుంది ఇది మరియే సిద్ధాంతం తోనూ సాధ్యపడదు దీనికి తార్కాణం బాదరాయణుడు బ్రహ్మసూత్రాలలో (ii.1.14) ఉదాహరించిన ఋగ్వేద పదం "ఆరంభణ"   *Rg Veda* x.81.2. శంకరులు ఈ పదానికి చేసిన సమన్వయము అద్వైత సిద్ధాంతాన్ని మితిమీరిన స్థాయిలో జరిగిన మిత్యావాదం గా నిరూపించింది మినహా అసలైన తత్వాని ఆవిష్కరించలేకపోయింది.

పరబ్రహ్మం యొక్క అనిర్వచనీయ స్థితిని క్రింది తెలిపిన ఎనిమిది విశ్వనిర్ధారితాలుకేవలం ఒక అసంపూర్ణ స్థాయిలో మాత్రమె విశదీకరించగలవు తద్వారా, పరబ్రహ్మ విశ్వరూపాన్ని ఆతని చర్మ రంధ్రాలలో కదలాడుచున్న అనేక విశ్వాలను సాధకులు వీక్షించే స్థితికి కేవలం ద్వైతమే తీసుకొని వెళ్ళగలదు.

నిత్య పదార్థం	**పరాధీన విశేషాప్తి వ్యక్తమయే విధానం**
చేతనా ప్రకృతి (శ్రీ మహాలక్ష్మి)	సృజించ వలననే కోరిక కలిగి ఉండడం వలన సృష్టి ఆరంభం కావడం
అవ్యకృతాకాశము	**నిర్దిష్టమైన పదార్థాలతో సంబంధాన్ని ఏర్పాటు చేసికోవడం**
ప్రకృతి	**మహత్తు, తత్వాలలో మార్పు చెందడం**
కాలము	**కాల గణన ప్రారంభం**
మహాదాది	**వ్యాప్తి, కుంచించుకొను స్వభావాన్ని పదార్థ భాగాలు పొందుట**
జీవులు	**శారీరాన్ని, ఇంద్రియ జ్ఞానాన్ని పొందుట (లింగ స్వరూప ధారణ)**
వేదములు	**మార్చనలవి కాని ఒక నిర్దిష్టమైన క్రమం లో ఏర్పడిన పదములు గా వాటి అర్థములతో సహ భగవద్భక్తి ఆవిర్భావమునొందుట.**

ఈ సమస్త విశ్వం ఒక మాహా యంత్రంగా గోచరమై వివిధ భాగాలతో ఒప్పుచూ ఆ భాగాలు మరలా ఉపభాగాలు కలిగిఉండి ఇలా మానవ మస్తిష్కానికి అందని రీతిలో పలు విభజనలతో ఒకటిపై మరియొకటి ఆధారపడి ఉంటూ ఒక చక్కని రీతిలో వర్తిస్తూ, ఈ స్థితికి మూల కారకుడైన వాడి పట్ల విశేషమైన ఆప్తి తో వాడినే ఆరాధిస్తూ ఉండే స్థితిని మధ్వులు తన తత్వవాదనలో ఆవిష్కరిస్తారు (మధ్వాచార్య ద్వాదశ స్తోత్రం). ఈ ఆవిష్కరణ తో మధ్వులు సమాధాన పడకుండా మరి కొన్ని కీలక ప్రశ్నలు సంధిస్తారు :

పరబ్రహ్మం ఒక పరిమితికి లోబడి వర్తించాలా ?

పరమాత్మ తన ఇచ్చకు అతీతం గా ఉన్న స్థితులకు ఒడంబడి తనను వాటికి అన్వయించు కొనుచూ తను సాధించ వలసిన కార్యాన్ని సాధిస్తాడా?

గతం లో చెప్పుకున్నట్లు వీటికి సమాధానం ఒక్కటే: పరమాత్మ ఈ చారాచర జగత్తు యొక్క ఉనికికి పరిణామానికి ఆధారం. కనుక వీటికి లోబడి ఉండడం అనేది ఆయన తనకు తానుగా జీవుల ఉద్ధరణ కొరకు విధించుకొన్న ఒక ధర్మ వర్తనం. అంటే అనాదియైన ఒక సత్యం (జీవులు) మరొక అనాదియైన తనకంటే మహత్తరమైన సత్యం(పరమాత్మ) పై ఆధారపడి ఉండడం. పరమాత్మ జీవులను, వారి

స్వభావాలను, కాలాన్ని, ద్రవ్యాన్ని సృజించి తన ఇచ్చానుసారం సృష్టి క్రమాన్ని నిర్దేశించగలడు కానీ ధర్మచక్ర వర్తనం కొరకు, కార్యాకారణ సంబంధం, ఆత్మల వ్యక్తిత్వం ఆధారంగానే ఈ చార చార జగత్తు యొక్క పరిణామం జరిగేలా నిర్ణయించాడు (*Bhag*ii.10.12).

కాబట్టి అస్పృజమైన ఆత్మలు ఉన్నపుడు అస్పృజమైన ద్రవ్యం కూడా ఉన్నట్లే అని వేదాంతులు ఒప్పుకోవడానికి ఏ శషభిష లు అవసరం లేదు Brahmasutras (ii. 1.15). సర్వశక్తిమంతుడైన పరమాత్మ తను సాధించ వలసినది జీవులు, ద్రవ్యం ఉన్నా, లేకున్నా సాధించ గలడు కాని అట్టి పరమాత్మ చారాచర జగత్తు యొక్క పరిణామం ప్రస్తుత స్థితిలోనే జరగాలని నిర్ణయించాడు. ఇలా నిర్ణయించడంలో పరమాత్మ తనపై ఆధారపడిన ఈ చరా చార జగత్తుపై తనకున్న అవ్యాజ్యమైన కరుణను తన భక్తులు అనుభవించే అవకాశాన్ని కలిగించాడు.

***

౩ఠ. పరబ్రహ్మ గుణాలు/ లక్షణాలు

జ్ఞానాన్వేషణ వాదం లో(epistemological argument) పరమాత్మ యొక్క పరిపూర్ణత్వాన్ని సర్వగుణపూర్ణత్వం, సర్వదోషగంధవిధూరత్వం అనే రెండు ముఖ్యమైన లక్షణాలతో సమన్వయము చేసినపుడే ఆ వాదం వేదమౌతుంది. ఎందుకంటే కేవలం ఈ రెండు గుణాల ద్వారానే మనం పరమాత్మ తత్వాన్ని విస్తారం గా ఆవిష్కరించగలం. భగవంతుడు మానవ మేధస్సుకి అందని ఒక మహాదృగ్విషయం.

భూమా సంప్రసాదాదధ్యుపదేశాత్ (i.3.8) అనే బ్రహ్మ సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ మధ్వులు: పరమాత్మ (నారాయణుని) యొక్క అమితత్వం (transcendence) ఆతని అనంతమైన ఆనంద స్థితి కాల, దేశ (space) గుణాలకు అతీతం గా ఉంటుంది. ఈ త్రివిధమైన (కాల దేశ, గుణ) స్థితులను అధిగమించగల శక్తి ఒక్క నారాయణునికి మాత్రమె ఉంటుంది కనుక అది ఆతని పరిపూర్ణ స్థితిని తెలియచేస్తుంది. నిత్య ముక్త అయిన శ్రీమహాలక్ష్మి కి కాల దేశ, గుణ స్థితులను అధిగమించగల శక్తి ఉన్నప్పటికీ ఆమె గుణైరపూర్ణ – ఒక పరిమితి గల గుణాలు కలది. కనుక ఆమె విష్ణువుపై ఆధారపడి ఉంటుంది. ఇక జీవులందరూ దేశ, గుణ విషయాలకు లోబడి వర్తిస్తూ తాత్కాలిక వ్యాప్తిని కాలం విషయం లో(కాలతో వ్యాప్తి) పొంది ఉంటారు. రాఘువేంద్రులు చెప్పినట్లు జీవులు అజ్ఞానం, అస్వతంత్రం, దుఃఖ భావాలకు లోబడి, మలినాలతో కూడుకొని, ఇతరులతో సములై లేక అధములై వర్తిస్తుంటారు.

నారాయణుడు అమలినుడు ఆతని ప్రజ్ఞ అన్ని కాలాలలో దేశాలలో గుణాలలో అక్షరమై విరాజిల్లుతూ ఉంటుంది. అవికారః సదాశుద్ధః అనే బ్రహ్మ సూత్రం (*BS* iii.2.11) దీనిని తెలుపుతోంది. ఆత్మ అనే పదాన్ని వివరిస్తూ శ్రీధర స్వామి వారు: అ-తత (అన్నిటా ఉన్నది) మాత్ర (అన్నీ తెలుసుకొనేది) కనుక పరమాత్మ అంటే అన్నిటా ఉండి అన్నిటినీ తెలుసుకొనేవాడు అని అర్థం.

కాబట్టి నారాయణునకు సమానుడు, అతీతుడు లేడు అనే జ్ఞానం, అట్టి నారాయణుడి పరిపూర్ణత్వంపై భక్తితో, రాజీపడని, అచంచలమైన విశ్వాసంతో మధ్వులు చేసిన తత్వ వాదానికి వివిధమైన అస్తిత్వ భావనల నుంచి శూన్యవాదం నుంచి ఎదురయ్యే వాదనలను దీటుగా ఎదుర్కోగల సత్తాను ఇచ్చింది. అందువలనే నారాయణుని అవతారాలకు పరిపూర్ణావతారం(కృష్ణావతారం) అని, మానవావతారం (రామావతారం) అనే భిన్నమైన లక్షణాలను ఆపాదించడం ఆయన యొక్క అనంతగుణపరిపూర్ణత్వాన్ని శంకించడమే!! మధ్వాచార్య వ్యాఖ్యానాలు అద్వైతాన్ని అద్వితీయమైన పరబ్రహ్మం విషయం లో మాత్రమె సమన్వయము చేసాయి.

బృహదారణ్యక ఉపనిషద్ శ్లోకం ప్రకారం :

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావిశిష్యతే

నారాయణుని పూర్ణత్వం స్థిరీకరించ బడుతుంది. అలాగే శ్వేతోపనిషత్తు vi.8 శ్లోకం:
పరా s స్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ
పరమాత్మ కున్న శక్తి ఆతనికి స్వభావతః ఉన్నది కనుక అవతార సమయం లో చూపిన లోపాలు లీలలు.

ఏకోదేవః సర్వభూతేషు గూఢః సర్వ వ్యాపి సర్వభూతాంతరాత్మ
కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ (*SvetUp*vi.11)

“కేవలో నిర్గుణశ్చ” అనే నిర్గుణ వాక్యాలుసైతం భగవానుని సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు, అద్వితీయుడు, కర్మాధ్యక్షుడు, సాక్షి సర్వమూ తెలిసిన వాడుగా కీర్తిస్తాయి. ఈ నిర్గుణ వాక్యాలు మనశ్రుతులలో మరి కొన్ని గుణాలతో కలిపి చెప్పబడినవి కనుక వీటిని వేరుగా భావించక చదివినపుడే పరమాత్మ యొక్క పరిపూర్ణత్వం అవగతమౌతుంది. నారాయణుడు అపహతపాప్మా – ఏ విధమైన పాపములు అంటని, మచ్చలేని వాడు కనుక నిర్గుణుడు అని, ప్రాకృతమైన స్వభావాలకు అతీతుడని అర్థం స్ఫురింప చేయడానికి వాడిన పదమే నిర్గుణం. ఇదే మాటను మాహాభారతం : త్రిగుణ్య వర్జితమజం విభుమాఘమీశం అని కీర్తించింది (*Mbh*.i.1.1). గుణాలు ప్రకృతి జనకాలు కనుక ఆ ప్రకృతి కే అతీతుడైన

వాడు నారాయణుడు అని చెప్పడానికి నిర్గుణుడు అనే పదప్రయోగం జరిగింది. గుణము లేక పోవడమూ ఒక గుణమే !!

Brahma Sutras(1960) బ్రహ్మ సూత్రాలపై సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు వ్రాసిన పుస్తకం లో పేర్కొన్నట్లు, ఒక 'Let me be many' నేను అనేకమగుగాక అనే సృజనాత్మక ఆలోచన పరబ్రహ్మకు చెందినది. పరమాత్మ లోని సృజనాత్మక శక్తి ఆయనతో కలసి ఉంటూ ఆయనతో విభేదిస్తుంది. లేదంటే ఈ శక్తి వలన సృజింప బడ్డ ఈ జగత్తు తారతమ్యం లేని ఒక అందమైన లోకం గా భాసిల్లాలి. ఆ శక్తే మహాలక్ష్మి:

భేదాభేదాత్మికా శక్తి: బ్రహ్మ నిష్టా సనాతని

పరమాత్మ శంకరులు చెప్పినట్లు నిర్విశేషుడైతే ఎన్నో విశేషాలతో కూడిన ఈ శ్రుష్టి సాధ్యం కాదు. సగుణ – నిర్గుణశ్రుతి వాక్యాలు కలిపి చదివితేనే అసలైన అర్థం భాసిస్తుంది. అస్థూలం, అనణు అనే మాటలు నిర్గుణత్వాని మాత్రమే తెలియచేయవు!! పరమాత్మ యొక్క "చిక్కడుశ్రుతి లతికావళి, చిక్కడు సనకాది ఋషుల చిత్తాబ్జములన్" అనే తత్వాన్ని స్ఫురిస్తుంది. మరొక్క ప్రమాణం సగుణ శృతులు చాల వరకూ తమంతతాము వివరణను ఇస్తాయి నిర్గుణ శృతులు

ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్ (పురుష సూక్తం) అనీ, సత్యకామత్వ సత్యసంకల్ప అనీ, య: స్సర్వజ్ఞ: సర్వవిద్ అనీ మన వేద వాగ్మయం ఘోషించింది సగుణ పరమాత్మ గానే. పతంజలి చెప్పినట్లు : అపవాదైరుత్సర్గా బాధ్యన్తే - మినహాయింపులు కేవలం సాధారణ సూత్రాల విస్తృతిని నియంత్రిస్తాయి. కనుక నిర్గుణ వాక్యాలు సాధారణ వాక్యాలు, సగుణ వాక్యాలు మినహాయింపులు. "సత్యంజ్ఞానమనంతం" బ్రహ్మ అనే దానిని సగుణ వాక్యాలే వివరించ గలవు. సత్యకామ సత్యసంకల్ప అనేశ్రుతి వాక్యాలు ఉపాసన మార్గాలు. సగుణ బ్రహ్మోపాసన చక్కగా కుదిరే ఉపాసన. న ఇతి న ఇతి అని ఖండిస్తూ పొతే మిగిలేది అనంత గుణ పూర్ణత్వమే. సగుణ శృతులు ఉపజీవ్యాలు అంటే తమమంత తాము గా స్వతంత్రం అర్థాలతో ఉండేవి నిర్గుణశ్రుతి వాక్యాలు అస్వతంత్రాలు అవి ఎల్లపుడు సగుణశ్రుతి వాక్యాల పై ఆధారపడి ఉండేవి- ఉపజీవక .

***

౩౯. బ్రహ్మమును విశదీకరించే విధానం

అద్వైతం, ద్వైతం పరమాత్మ ను గూర్చి "స్వప్రకాశకత్వం" (self-luminous) అనే ఒకే విశేషాన్ని వాడినా ఇవి విరుద్ధమైన నిర్వచనాలను స్వప్రకాశకత్వానికి ఇచ్చాయి. అద్వైత తార్కికుల ప్రకారం ఆత్మకు తనను, తన ఉనికిని తాను తెలుసుకోవడం ఆధారం గా భగవానుడు అవగతమౌతాడు. ద్వైత సిద్ధాంతం ప్రకారం ఆత్మ జ్ఞానం ఎటువంటి స్థితిలో ఉన్నప్పటికీ ప్రతి వ్యక్తీ తన తాహతుకు తగ్గ రీతిలో భగవద్ జ్ఞానాన్ని పొందగలడు. కాబట్టి తెలుసుకోవడంలో ఉన్న తారతమ్యమే ఈ రెండు సిద్ధాంతాల నడుమ ఉన్న ప్రధాన భేదం. ఈ భేదం కేవలం పదాల లో మాత్రమె కాదు పదార్ధం లో సైతం ఉన్న భేదమే. ఏది పూర్తిగా తెలియబడదో అది సాధకుల యోగ్యతానుసారం వివిధ స్థాయిలలో తెలియబడుతుంది. నిర్వికారుడు, నిర్విశేషుడు, నిరాకారుడు అయిన పరబ్రహ్మ ఎలా సత్యంజ్ఞానమనంతం బ్రహ్మ అని చెప్పబడతాడు అంటే అద్వైతం లో ఉన్న చిక్కు బయటపడుతుంది. నిశ్చయాత్మకమైన పరబ్రహ్మ నిశ్చయాత్మకం గా తెలియబడనివాడు కాదు అలాగే సంపూర్ణం గా తెలియబడేవాడూ కాదు !!

భగవానుడు సంపూర్ణం గా ఎవరికీ తెలియడు అప్పుడు అలా తెలుసుకున్న వానికి పరమాత్మ కు అభేదం అని చెప్పవచ్చు. ఎవరికీ సంపూర్ణం గా అందని వాడే పరబ్రహ్మ. పూర్తీ గా తెలియబడడం ద్వారా పరమాత్మ ఒక పరిమితి లోనైనవానిగా గుర్తింప బడతాడు. నిజానికి ఆయన అపరిమితుడు. ఇది నిజం కావాలంటే నిత్య ముక్త అయిన లక్ష్మి కి కూడా ఈయన పూర్తిగా తెలియబడి ఉండకపోవడమే!!

ఒకవేళ అవిద్య వలన పరమాత్మకున్న కొన్ని లక్షణాలు సాధకునకు ద్యోతకం కానిపక్షం లో కొన్ని సాధారణ విశేషాలతో పరబ్రహ్మాన్ని చెప్పడం వలన పరమాత్మ పట్ల ఉన్న పాక్షిక జ్ఞానం పాక్షికం గా ఆయన లక్షణాలను తెలుపుతుంది అని మధ్వాచార్య నిర్ణయం. కాబట్టి పరబ్రహ్మ నిర్విశేషుడు అని అనడం సాధ్యమే కాదు.

అవిద్య శూన్యం లో వ్యాప్తి కాదు అలాగే ఆ శూన్యాన్ని కప్పి ఉంచలేదు – ఈ వాక్యం చదవడానికి కించత్ క్లిష్టం గా ఉంది కదూ? ఇదే విధమైన క్లిష్టత భగవద్గీత లోని విభూతి యోగాన్ని అద్వైత సిద్ధాంతం తో సమన్వయము చేయడం లో మరింత ప్రస్ఫుటం గా వ్యక్తమౌతుంది!! సాధకుల ఊహకు అందని విషయం నిర్విశేషమైన పరమాత్మ. ఎందుకంటే అట్టి ఊహ పరమాత్మ ఉనికినే శంకించే స్థితికి సాధకుణ్ణి తీసుకొని వెళుతుంది. విభూతి యోగం – జగం మిధ్య తో ఎలా సమన్వయము ఔతుంది? ఈశ్వర విభూతి తో ఒప్పుచున్న ఈ జగత్తు భ్రమ అయితే ఈశ్వర విభూతి కూడా భ్రమయే. మృగాణాంచ మృగేంద్రోహం అనే గీతా వాక్కు అసత్యమా ?

నిర్వికార, నిర్విశేష, నిరాకార పరబ్రహ్మం రుజువులకు దొరకదు కనుక అది సాధకుల ఉపాసనకు అందనిది. అప్పుడు చిన్న కష్టం వచ్చినా అన్నిటా ఉంటాడు అని నమ్మి దేవుడి ని వేడుకొనే భక్తులకు ఊరట ఎలా కలుగుతుంది? సమస్త వాగ్మయం లో పొందుపరచిన రుజువులు ఈ నిర్విశేష పరబ్రహ్మానికి ఎలా అన్వయం ఔతాయి?

***

౪౦. సవిశేష పరబ్రహ్మ

సర్వధర్మవిహీనస్య ధర్మారోపః క్వ దృశ్యతే? – అనువ్యాఖ్యానం

అన్ని పదాలకు, ఆధారాలకు అందని వాడు కనుక పరబ్రహ్మం నిర్విశేషుడు అని అంటే అట్టి పరబ్రహ్మాన్ని తెలపడం అద్వైతానికి అసాధ్యమౌతుంది అనే అభిప్రాయాన్ని త్రివిక్రమ పండితులు వ్యక్తం చేసారు. అనంతగుణపరిపూర్ణుడైన పరమాత్మను సవిశేషం గానే తెలుపగలము. అనంతమైన ఆయన గుణాలు నాలుగు ప్రధానమైన విశేషాలతో ఉపాసన చేయగలము అవే:

సత్

చిత్

ఆనంద

ఆత్మ

సత్ = పరిపూర్ణత్వానికి, నిర్దోషత్వానికి, అపరిమితత్వానికి ప్రతీక
ఆత్మ = అతత్వాత్, మాతృత్వాత్ ఆత్మ అని నిరుక్తం చెబుతోంది. ఆత్మ సర్వవ్యాపకమైనది, మాతృక వంటిది అంటే అన్ని ఆత్మలకు ఇది సర్వ స్వతంత్రమైన మాతృక. కనుక పరబ్రహ్మ ఒక వ్యక్తిత్వం. ఆతని వ్యక్తిత్వానికి తనదైన ఒక లక్షం కూడా ఉంటుంది. ఆ వ్యక్తిత్వం తో పరమాత్మ ఈ సమస్త విశ్వం ఒక అనుభవం అని అది వచ్చి పోయే సంబంధం లేని దృశ్యాలమయంగా కాక ఒక సహేతుకమైన, సమగ్రమైన జీవన సరళిగా తనకు మాత్రమె ఉన్న ప్రజ్ఞ తో నిర్వహిస్తూ ఉంటాడు అని మధ్వులు తెలిపారు. పరబ్రహ్మ ఈ నిర్వహణలో గ్రహిస్తూ, అనుభవిస్తూ, ఆలోచిస్తూ, లక్ష్యిస్తూ, ప్రేమిస్తూ నియంత్రిస్తూ ఈ విశ్వ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు.

పరమాత్మ వ్యక్తిత్వం ఒక మహత్తరమైన ప్రజ్ఞతో, శక్తితో, లక్ష్యంతో, చైతన్యంతో అపరిమాణ, అనూహ్యస్థితి లో ఉంటుంది. ఈ స్తితి ని వర్ణన చేస్తూ మధ్వులు గీతాభాష్యంలో ఇలా అంటారు:

అతి పరిపూర్ణతమ-జ్ఞానైశ్చర్యానందయశః శ్రీశాక్త్యాదిమామశ్చ్య భగవాన్ (Madhva, *GB* ii.72)

ప్రజ్ఞానం బ్రహ్మ అనే వాక్యానికి అర్థం బ్రహ్మమే. ఆయనే తెలుసుకొనే వాడు తెలియబడేది కూడా, ఆయనే ఆనందము, ఆనంద అనుభవమూ కూడా సచ్చిదానందుడు ఇలాగే తెలియబడతాడు కాని నిర్విశేషం గా కాదు అని మధ్వాచార్య తీర్మానం. కాబట్టి పరబ్రహ్మ నిరాకారుడు స్థూల సూక్ష్మ స్తితులకూ అతీతుడు. ఉపనిషత్తులు, పురాణాల నుంచి మధ్వులు ఈ స్థితికి తార్కాణం గా ఈ క్రింది వాటిని ఉటంకిస్తారు:

తస్యాపి శరీరశ్రవణాత్ "ఆనందరూపమమృతం - (*MundUp* ii 2.7);
సువర్ణజ్యోతి - (*TaittUp*)
దహరో s స్మిన్నంతరాకశః - (*ChanUp* viii 1.1);
సహస్ర శీర్షా పురుషః, రుక్మవర్ణం కర్తారం, ఆనందం బ్రహ్మణః, (*Bhag*vi.4.48)
విజ్ఞానశాక్తిరహమాసమనంతశక్తే - (*Bhag*iii.44.24).

జీవులకు ఉన్న సవిశేష భేదం అనే ప్రమాణం పరమాత్మకూ వర్తిస్తుంది ఈ సవిశేష భేదమే పరమాత్మ యొక్క సర్వోత్తమత్వాన్ని తెలియచేస్తుంది. ఇన్ని గుణాలు విశేషాలు ఉన్న పరమాత్మ అతని జగద్వ్యాపారం లో పృథక్త్వాన్ని (otherness) తెలియచేస్తాడు.

మధ్వాచార్య దార్శనికతలో పరమాత్మ బుద్ధి మనో అంగ ప్రత్యంగ వత్తుడు అట్టి వానిని బుద్ధి, మనస్సు, అంగ ప్రత్యంగాలు కలిగిన సాధకులు లక్ష్యం గా చేసుకొని సాధన చేయాలి. భగవంతుని శరీరంలో సత్యం, జ్ఞానం, ఆనందం అనంతం గా ఉంటాయి. ఇది ఆయనకున్న దేహానికి మనకున్న దేహానికి గల విశిష్ట మైన తేడా. ఇలా సాధన చేయడం, ఉపాసన చేయడం శులభం.

పైంగిశ్రుతి తో తెలిపినట్లు:

సద్దేహాః శుఖగంధశ్చ జ్ఞానభాః సత్పరాక్రమః
జ్ఞానాజ్ఞానః శుఖాశుఖః స విష్ణు: పరమో మతః

పైన తెలిపిన షడ్గుణాలు (ఆరు గుణాలు) లేదా మరొకచోట చెప్పిన అష్ట గుణాలు కేవలం భగవంతుని "సర్వగుణా నంతర్భావో" అని తెలియచేయడానికే అని మధ్వాచార్య తాత్పర్యం.

అనంత, అఖండ, విశేషాత్మకం, గుణాత్మకం పరబ్రహ్మం అనేది ఈ చర్చ ద్వారా విశదం. పరమాత్మ గుణాలు, విశేషాలు ఒకదానితో ఒకటి చక్కగా సమన్వయమై జగద్వ్యాపారాన్ని అఘటనాఘటనసమర్థత తో నిర్వహిస్తాయి. ఆయన విశేషాలు గుణాలు వేరు ఆయన వేరు కాదు కనుక ఇక్కడ అద్వైత భావన ప్రస్ఫుటం గా సాధనలో ఉండాలి.

గుణ అనే పదాన్ని ధర్మ అనే అర్థం తో చదవాలి. గుణాలు పరమాత్మకు స్వాభావిక ('intrinsic') విషయాలు. పరమాత్మ సర్వజ్ఞత అనంతవిశేషాత్మకం. ఈ సర్వజ్ఞత ఈ విశ్వం లో ఉన్న అణువణువు గురించి పూర్తి అవగాహన దాని భూత, వర్తమాన, భవిష్యద్ స్థితుల పై నియంత్రణ తో కూడుకొని ఉంటుంది – మమవర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః అనే గీతా వాక్యానికి (4.11) ఇది వివరణ.

ఈశ్వర నిర్ణయం రెండు రకాల అంశాలతో ఒప్పి ఉంటుంది:

౧. శక్తి (latent)
౨. వ్యక్తి(patent)

ఈ రెండు పూర్వనిర్ధారిత క్రమంలో ఒకదానికి ఒకటి ప్రతిబంధకం కాకుండా, లేదా ఒకదానిపై మరొకటి వ్యాప్తి చెందకుండా పనిచేస్తాయి (౨౩ వ అధ్యాయం చూడండి).

జీవులు పొందే భ్రమల విషయం లో భగవానుని సర్వజ్ఞత ఎలా ఋజువౌతుంది అనే ప్రశ్నకు సమధానం గా జయతీర్థులు ఇలా అంటారు : మన చిత్తం పొందే భ్రమలు మనలో సాక్షి గా (అంతర్యామి గా) ఉన్న భగవానునికి తెలియకపోతే ఆయన సర్వజ్ఞుడు కాడనే చెప్పాలి. అలాగని మనం ముత్యపుచిప్ప లో రజతాన్ని చూస్తె భగవంతుడూ రజతాన్ని చూస్తాడని అర్థం కాదు. ముత్యపుచిప్ప లో రజతాన్ని చూసిన మన అజ్ఞానాన్ని మాత్రం భగవంతుడు గమనిస్తాడు.

లౌకిక విశేషాలతో, గుణాలతో భగవానుడు తెలియబడుతూ తన అలౌకిక శక్తి యుక్తుల ను సాధకులకు పరిచయం చేస్తున్నాడు.

***

౪౧. భగవానుని విశ్వ వ్యాపారాలు

నిమిత్తమాత్ర ఈశస్య విశ్వసర్గనిరోధయో:
హిరణ్యగర్భః శర్వశ్చ కాలఖ్యారూపిణస్తవ - (*Bhag* x.71.8)

హిరణ్య గర్భుడు, శర్వుడు (శివుడు) మొదలగు దేవతలతో నిమిత్తమాత్రం గా ఈశ్వరుడైన నారాయణుడు ఈ విశ్వ వ్యాపారాన్ని నిర్వర్తిస్తున్నాడు.

మధ్వులు ఒకే నారాయణుని లో అనేక దేవతలు వారి వ్యాపారాలను సమన్వయము చేస్తూ భగవానుని అద్వైత తత్వాన్ని (భగవద్గీతను అద్వైతామృతవర్షిని అనడానికి మూలకారణం ఇదే) ఆవిష్కరిస్తారు. ఉదా : వినాయక చవితినాడు గణేశాంతర్గత నారాయణుని శివరాత్రి నాడు మాహారుద్రాన్తర్గత నారాయణుని ఉపాసన చేయడం అసలైన ఆస్తిక భావన. పూజ చివర చేసే సమర్పణ “కృష్ణార్పణమస్తు” అన్నపుడే ఆపూజా ఫలం దక్కేది – సర్వదేవ నమస్కారం కేశవం ప్రతి గచ్ఛతి అని చెప్పడానికి కారణం ఇదే!!

నారాయణుని వివిధ శక్తుల స్వరూపమే దైవ పదవులు. సాధననుసరించి ఉత్తమమైన జీవులు ఈ పదవుల్లో నియమింపబడి ఆ భగవానుని శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తూ తద్వారా వారి పదవులను నిర్వహిస్తారు.

ఇలా వివిధ దేవతల ద్వారా నారాయణుడు ముఖ్యం గా ఎనిమిది విశ్వవ్యాపారాలను తన అనన్యమైన శక్తితో నిర్వహిస్తూ ఉంటాడు:

1. సృష్టి
2. స్థితి
3. లయ
4. నియంత్రణ
5. జ్ఞానప్రదానం
6. నిగూఢత్వం
7. సంసార బంధనం
8. ముక్తి

ఈ విశావ్యాపారాలు చేసే పరబ్రహ్మమే జీవులలో, జీవుల ద్వారా

జాగృతి,

స్వప్న,

సుషిప్తి,

మూర్ఛ చివరిగా

మరణ స్థితులను నియంత్రించుచున్నాడు.

విష్ణు రహస్యం (XII.22-23) లో పరమాత్మ యొక్క సర్వస్వతంత్రాన్ని మరచి జీవులు తమకు తమ ఉపాధిని అనుసరించి పొందిన దత్త స్వాతంత్ర్యాన్ని ఎలా తమ స్వతత్ర్యమని భ్రమిస్తారో ఈ శ్లోకం వివరించింది :

సర్వస్తుషు యా శక్తి: సా మదియైవ నాన్యథా

మయైవదత్తం స్వాతంత్ర్యం కేవలేష్వపి వస్తుషు

తావన్మాత్రేణ మోముగ్ధా స్వాతంత్ర్యం మన్వతే నిజం

స్వాతంత్ర్యే ऽ పహుతే పశ్చాజ్జానంతి పరతంత్రతాం

కాబట్టి జీవులు తమ సాధనను “సంసారమోక్షస్థితిబంధహేతు:” అనే భావన తో చేయడమే పరమావధి.

బంధకో భావపాశేన భావపాశాచ్చ మోచకః

కైవల్యదః పరం బ్రహ్మ విష్ణురేవ సనాతనః (*Skanda* quoted by Sridhara Svamin)

జీవులను వారి స్వభావం, సవిశేష భేదం, సాధన, కర్మల అనుసారం సంసార బంధంలో ఉంచే వాడు అట్టి బంధం నుంచి మరలా అవే ఆధారాలతో జీవులను విముక్తి చేసే వాడు, చివరికి కైవల్యాన్ని ఇచ్చేవాడు, సనాతనుడైన, పర బ్రహ్మమైన విష్ణువే! మోక్ష స్థితిలో సైతం జీవుల యోగ్యతను అనుసరించి వారికి వయక్తిక ఆనందాన్ని ఇచ్చేవాడూ నారాయణుడే!!

***

౪.౨. పరబ్రహ్మ వ్యక్తమయ్యే విధానాలు

ఋగ్వేదం ప్రకారం (*RV* x.129.2-3) ప్రళయానంతరం పరమాత్మ తన స్వాభావికమైన ఆనంద స్థితి, అనంతమైన వైభవంలో ఉండిపోతాడు. అటుపిమ్మట విశ్వ ఆవిర్భావానికి హేతువుగా తాను వివిధ దశలలో రూపాంతరం చెందుతాడు. ఈ రూపాలు అనంతాలు అయినప్పటికీ పరస్పరం పోలి ఉంటాయి ఒక్క సంఖ్యా పరమైన విభేదం తక్క. ఈ రూపాలను చతుర్వ్యూహ రూపాలు అని అంటారు, అవే:

- వాసుదేవ
- ప్రద్యుమ్న
- అనిరుద్ధ
- సంకర్షణ

ఈ రూపాలు విముక్తి (ప్రళయానంతర రూపాంతరం), సృజన, స్థితి మరియూ లయ అనే కార్యక్రమాలు చేయగలడం అనే శక్తిని పొంది ఉంటాయి. ఆపై పరమాత్మ దశ అవతారాల స్వీకరణ, తదనంతరం వందల, వేల (లెక్కలేనన్ని) రూపాలలో రూపాంతరం చెందుతాడు. పంచరాత్ర పదజాలం ప్రకారం పరమాత్మ యొక్క అవతారాలను శుద్ధ శృష్టి అంటారు. వాటినే వ్యూహ వర్గాలు అని కూడా అంటారు. రామానుజుల సిద్ధాంతం ప్రకారం పరమాత్మ వ్యక్తమయ్యే విధానం ఐదు రకాలు గా ఉంటుంది:

౧. రూపాలు

౨. అవతారాలు

౩. వ్యూహాలు

౪.రూపాంతరాలు

౫.అంతర్గతాలు

మధ్వులు మొదటి వర్గీకరణ మినహా మిగిలన నాలుగు వర్గీకరణలతో ఏకీభవిస్తారు. ఈ వర్గీకరణ నడుమ భేదాన్ని చూపరు. ఎందుకంటే పరమాత్మ విషయం లో తారతమ్యం, స్వగతభేదం ఉండదు (నేహ నానస్తి కించన). పర-వాసుదేవ వర్గాన్ని పరబ్రహ్మం షడ్గుణ రాశిగా (జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజస్) గా చూపడం మిగిలిన వ్యుహ రూపాలను సంకర్షణ-జ్ఞాన, బల; ప్రద్యుమ్న- ఐశ్వర్య, వీర్య; అనిరుద్ధ- శక్తి, తేజస్ అని కేవలం రెండు విశేషణాలతో చెప్పడం సరియైన సమన్వయము కాదని మధ్వాచార్య ఉవాచ.

రామానుజుల అంతర్యామి వ్యక్తీకరణ, మధ్వులు అందించిన బిమ్బరూప వ్యక్తీకరణ పరిశీలిస్తే ద్వైత సిద్ధాంతం లో ఈ బింబ రూపం అతి ప్రధానమైన స్థానాన్ని సంపాదించుకొంది అని తెలుస్తుంది. ఈ బింబ-ప్రతిబింబ భావన పై విస్తారమైన వివరణ జరిగింది, చదువగలరు.

అవతారాల విషయం లో మధ్వులు నిస్సంకోచం గా భగవానుని అన్ని అవతారాలూ పరిపూర్ణావతారాలని తేల్చి చెప్పారు. శంకరులు, రామానుజులు వ్యాసుని విష్ణు రూపం గా చెప్పినా పరిపూర్ణ అవతారం గా పరిగణించ లేదు. ఈ లోపాన్ని మధ్వులు సరిదిద్దారు. అటుపై వి.అద్వైత పండితులైన సుదర్శన సూరి మధ్వాచార్య అవగాహనను, ఈ విషయం లో అనుసరించారు. కానీ తదనంతరం వచ్చిన వేదాంత దేశికులు మాత్రం వ్యాసుని ప్రారబ్ధ కర్మ అనుభవించే ఒక జీవి గా మాత్రమె భావించారు.

ఉపనిషద్వాక్యాలు, పంచారాత్ర వాక్యాలు ఆధారం గా మధ్వులు నారాయణు నకు ఆయన తీసుకొనే అవతారాలకు అభేదం అనే విషయాన్ని తేటతెల్లం చేసారు:
పూర్ణ మదః పూర్ణ మిదం ... (*BrhUp* V.1)
ఉదరమంతరం కురుతే *(TaittUp* ii.7)
వాసుదేవ ఏవైతే సర్వే- (Sankara's *BSB*. ii.2.44)

శంకరులు అవతారాలను భగవానుని మాయ గా చెబుతూ మాయ అయిన జగత్తులో భౌతిక రూపాలు అని అభిప్రాయపడ్డారు. రామానుజులు పరమాత్మ అవతారాలు దివ్యం ప్రాకృతం అని చెబుతూ (Ramanuja, *GB* iv.9) వాటిని అభౌతికాలు గా చెప్పారు. రామానుజుల ప్రకారం అవతారాలు అనిత్యాలు. మధ్వాచార్య ప్రకారం అవతారాలు నిత్యాలు. న తస్య ప్రాకృతా మూర్తిర్మామ్సమోదో s స్తిసంభవా (*Varaha Purana*, XXXIV.40). ఇదే విషయాన్ని వేదాంత దేశికులు కూడా ఇదే పురాణ వాక్కు ని వాడి చెప్పారు - సర్వే నిత్యాః శాశ్వతశ్చ దేహాస్తస్య

* * *

సాధనా విచార

౪౩. జీవుల స్వేచ్ఛ మరియూ ఇచ్ఛ (FREEWILL) – మధ్వాచార్య సిద్ధాంతం

నియతి మరియూ వేదాంత విషయాలలో జీవుల స్వేచ్ఛ భగవానుని నియంత్రణ అనే విషయాలు అధిక ప్రాధాన్యతను సంతరించుకొని ఉంటాయి. మధ్వులు ఈ రెండు విషయాలను పరస్పర స్థిరమైన విషయాలు గా వెల్లడి చేస్తారు.

ప్రపంచం లో ఉన్న దుఃఖానికి మూల కారణ జీవులే భగవానుడు కాదు అనే విషయాన్ని తత్వ జ్ఞాన జిజ్ఞాసువులు గ్రహించాలి. ఇదే మధ్వాచార్య స్వరూపభేద వాదానికి మూల కారణం. శంకరుల ప్రకారం ఆత్మ నిర్విశేషం కాబట్టి దాని అస్తిత్వమే లేదు అనీ, ప్రపంచ వ్యాపారాలు అన్నీ అవిద్య లేదా అజ్ఞానం ఆత్మపై ఆరోపిమ్పబడడం వలన అనుభవం లోకి వస్తున్నాయని, మోక్షం అనేది కొత్తగా సాధించ వలసిన విషయం కాదు కేవలం ఈ అవిద్య / అజ్ఞానం తొలగిపోతే ఆత్మే పరమాత్మ అయిపోతుంది అని చెప్పడం వలన మిథ్య అయిన జగత్తు లో చేసే ఆధ్యాత్మ సాధన యొక్క అవసరం కూడా మిథ్యే ఔతుంది!! నైతికత తో కూడిన వాస్తవ అవగాహనలో అద్వైత సిద్ధాంతం సాక్షి అనే విషయాన్ని పూర్తిగా విస్మరిస్తుంది అని తెలిసిపోతుంది. ఆత్మపై కర్తృత్వ భావన మనసు ద్వారా ఆపాదింప బడితే ఆ మనసే జీవి అస్తిత్వానికి హేతువు ఔతుంది.

ఒక స్ఫటికం పై ఒక ఎర్రని తామరను ఉంచితే ఎలా స్ఫటికం ఎర్ర గా మారుతుందో అలాగే ఆత్మపై కర్తృత్వ భావన ఆరోపిమ్పబడడం వలన జీవుడు నేను సత్యం అనుకుంటాడు అని అద్వైతం చెబుతుంది. దీనినే సోపాధికభ్రమ (స+ఉపాధిక) అని అద్వైత పరిభాష లో అంటారు. ఐతే ఈ భ్రమ లో స్ఫటికం ఎరుపు మందారం ఎరుపు రెండు వైవిధ్య మైన అనుభవాలు. అంటే ఆత్మ కర్తృత్వం మనస్సు యొక్క కర్తృత్వం అనుభవం లో తెలిసేవే. పైగా మనసు సాక్షి గ్రాహ్యతకు లోనౌతుంది కనుక ఈ కర్తృత్వం స్వానుభావమే ఔతుంది, కర్తా శాశ్త్రార్థవత్వాత్ (ii.3.33) అనే బ్రహ్మ సూత్రాన్ని ఆధారం గా చేసుకొంటే. కాబట్టి ఆత్మ

అన్ని క్రియలకూ ఆధారం. ఈ సత్యాన్ని అంగీకరించని పక్షం లో శాస్త్రాలు విధించిన విధి, నిషేదాలు, నైతిక నియమాలు మొదలగునవి అన్నీ వాటి ఔన్నత్యాన్ని కోల్పోతాయి.

శాస్త్రం అంటే శాశించునది. అట్టి శాస్త్రం, “ఆత్మే పరమాత్మ” అయితే అట్టి పరమాత్మను సైతం శాశించ గలదా? కాబట్టి ఉన్న సమస్త శాస్త్ర వాక్యాలు జీవిని (ఆత్మను) ఉద్దేశించినవే అనే విషయం తేటతెల్లం. కాబట్టి ఆత్మ వేరు పరమాత్మ వేరు. శాస్త్రం నిర్దేశించిన శ్రవణ, మనన నిదిధ్యాసన అనే మార్గాలు కేవలం ఆత్మ ఉద్ధరణకు మాత్రమె చెప్పబడినవి. ఒకవేళ ఆత్మ కర్తృత్వాన్ని ఆపాదించుకున్న పరమాత్మ అంటే ఈ శాస్త్ర మార్గాల వివరణ చేయడం అసాధ్యమే . సాధకుడు ఆ నాలుగు మహా వాక్యాలను మననం చేసికొంటూ నేనే బ్రహ్మ అని, నిత్యానిత్య విషయజ్ఞానం తో ధ్యానం లో ఉండిపోతే చివరికి అవిద్య / అజ్ఞానం తొలగి బ్రహ్మ గా మారిపోతాడు అని భావిస్తే శంకరులే సాంఖ్యకారుల సిద్ధాంతాన్ని ఖండిస్తూ అన్న ఈ మాటలను ఎలా అర్థం చేసికోవాలి?

“కర్తృత్వం బుద్ధికి సంబంధించినది ఆ బుద్ధి జీవికి చెందినది”(*BS* ii.3.36)

కాబట్టి అజ్ఞానం / అవిద్య వలన జీవి అనర్థాలకు గురియైతే ఆ అనర్థాల భోక్త కూడా జీవే కాబట్టి అట్టి జీవి ఈ అనర్థాల నుంచి ముక్తి కోరుకోవడం సర్వ సాధారణ విషయం. జీవి యొక్క నైతికత జీవి ఉద్ధరణ కు దోహదం చేస్తుంది అంటే అట్టి నైతికత జీవి యొక్క పాంచభౌతిక శరీరం ద్వారానే వ్యక్తమయ్యే విషయం. కనుక జీవి అనుభవం మరియూ ఈ జగత్తు మిథ్య కాదు అనే విషయం స్పష్టం ఔతుంది. అలాగే కర్తృత్వ భావన ఉన్నంత మాత్రం చేత జీవి స్వతంత్రుడు కాబోడు. రామానుజులు గీతా భాష్యం (*Gita* XVIII.16) లో చెప్పినట్లు జీవి ఐదు అంశాల ద్వారా ప్రభావితుడై తన జీవనాన్ని కొనసాగిస్తాడు అవి : శరీరం, ఆత్మ, ఒక వ్యవస్థ, శారీరక విధులు, దైవ నిర్దేశికత్వం. కర్మలు చేయడం లో జీవులకు ఉన్న ఇచ్ఛ స్వభావతః వారి పూర్వ కర్మ లను అనుసరించి కలుగుతుంది కనుక వారు చేసే కర్మలు “యథేచ్చాసి తథా కురు”. అందుకే కొందరు మాత్రమె ముక్తి కి వెళితే మరి కొందరు సంసార చక్రం లో తిరుగుతూ ఉంటారు. భవన నిర్మాణ ప్రణాళిక వేసిన వ్యక్తి కి అనుగుణం ఎలా ఒక వడ్రంగి గా పని చేస్తాడో జీవులు కొన్ని కర్మలు చేయడం కొన్ని చేయక పోవడం అనేది ఆ భగవానుని ప్రణాళిక ను బట్టి ఉంటుంది. వడ్రంగి కి ఉన్నది తన పని చేయడం లో గల నైపుణ్యం మాత్రమె. ఎలా ఆ నైపుణ్యాన్ని వినియోగించాలో ఇంజనీర్ నిర్దేశిస్తాడు, పని మొదలు పెట్టడం నుంచి. కనుక వడ్రంగి తన ఇచ్చానుసారు తన నైపుణ్యాన్ని వినియోగించలేడు. ఇదే రీతిలో జీవుని కర్మలను భగవానుడు అతని పూర్వ కర్మల ఆధారం గా నిర్దేశించి ఆ కర్మలు చేయడానికి సానుకూలతను సైతం కలిగిస్తాడు. జీవుడు తన స్వబావాన్ని ఆధారం చేసుకొని తన నైపుణ్యాన్ని ఆ కర్మలు చేయడం లో ప్రదర్శిస్తాడు. జీవులు కర్మలను చేయడం లో ప్రదర్శించే వారి వారి నిపుణత, ఇచ్ఛ విషయం లో భగవానుడి జోక్యం ఉండనే ఉండదు. కేవలం భగవంతుడు జీవులకు

కర్మలు చేసే స్థితి ని కలిగిస్తాడు మినహా ఆ కర్మలు చేయడం లో నిబంధనలు విధించడు (*Gita* xviii.63). జీవులు వారికి ఉన్న జ్ఞానాన్ని బట్టి, నైతికతను బట్టి, వారి స్వభావానుసారం, ఇచ్చానుసారం కర్మలను (మంచి వో చెడ్డవో) ఎంచుకొని నిర్వహిస్తారు. జీవుల కొరకు భగవానుడు శాస్త్రాలను ఇచ్చి వాటి లో విధి నిషేధాలను తెలిపి వాటి అధ్యయనం, అనుష్టానం ద్వారా సద్గతి పొందవచ్చు అనే భరోసాను సైతం ఇచ్చి మరీ కర్మలు చేయడం లో జీవులను వారి వారి ఇష్టానికి వదులుతాడు. "కృత ప్రయత్నాపేక్షః"(*BS* ii.3.42) అనే బ్రహ్మ సూత్రం ఇదే విషయాన్ని తెలుపుతుంది.

జీవుల కున్న సృజనాశక్తి వారి సామర్థ్య, ప్రయత్నాలలో వ్యక్తం ఔతుంది. ఒక వేళ జీవుడు స్వతంత్రుడైతే అతనికున్న సమస్త సృజనాశక్తిని ప్రతి కర్మ చేయడానికి వెచ్చించ వలసి వస్తే (ఉదా: అతిగా తిన్న ఆహారం జీర్ణం చేసుకోవడం మొదలుకొని ఒక సంక్లిష్టమైన జీవన సమస్యను పరిష్కరించడం వరకూ) అది అసాధ్యమైన విషయం ఔతుంది. అలాగని జీవిలో కొన్ని అంతర్గత వ్యవస్థల ద్వారా ఈ పనులు నిర్వహిస్తాడు అని అంటే ఆ వ్యవస్థలు ఒకే వ్యవస్థ (వ్యక్తిత్వం) తో సమన్వమై పనిచేయాలి. విశేషాల ఆధారం గా జీవుడు తన స్వతంత్రాన్ని ప్రదర్శిస్తాడు అని అంటే ఆ విశేషాలు కేవలం జీవుల నడుమ ఉన్నఅంతర్గత భేదాన్ని తెలపడానికి మినహా వాటికంటూ ప్రత్యేకమైన శక్తి ఉండదు. కనుక ఈ విశేషాలకు శక్తిని ఇచ్చే ఒక బాహ్య శక్తి ఒకటి కావాలి ఆ శక్తే భగవానుడు. అలా శక్తి ని పొందిన విశేషాలు ఎంతవరకూ జీవి సామర్థ్యాన్ని, ప్రయత్నాన్ని వినియోగించాలో అంతవరకూ మాత్రమె వినియోగించి కర్మలను చేయడానికి జీవులకు దోహద పడుచున్నాయి. భగవానుడు అఘటనాఘటన సమర్థుడు "అఘటితఘటనా పటీయసి శక్తి:" ఆ శక్తి తో నే హేలగా కార్యా కారణ సంబంధాలు కలిగించి జీవుల కర్మాచరణ కు దోహదపడుతున్నాడు. ఉదా : ఒక మంచి పని చేయడానికి జీవి సంకల్పిస్తే ఆ పని ఎంత మంచి గా చేయాలో నిర్దేశించేది ఆ జీవి యొక్క స్వభావం, పూర్వ కర్మ ఫలం ఆధారం గా భగవానుడు ఆ జీవి లోని విశేషాలకు (identity in difference) శక్తిని ఆపాదించి జీవి ద్వారా చేయిస్తాడు. **ఇలా చేయడం లో నిర్దాక్షిణ్యం గా నిష్పాక్షికం గా వ్యవహరిస్తాడు.** ఇలా చేయడం లోనే భగవానుని మహత్తు తెలుస్తుంది. విహిత కర్మాచరణ విస్మరిస్తే (తల్లి తండ్రులను గౌరవించడం వారి క్షేమాన్ని కోరడం వారికి ఉన్నత స్థితిని ఇవ్వడం మొదలగునవి) అలాగే అట్టి కర్మాచరణ చేయడం వలన జీవికి తగిన ఫలితాన్ని ఇవ్వడంలో భగవానుడు నిష్పాక్షిక, నిర్దాక్షిణ్య గుణాలను ప్రదర్శిస్తాడు. ఇలా చేయడం ద్వారా శాస్త్ర వాక్కులకు ప్రామాణ్యతను భగవానుడు కలిగిస్తున్నాడు.

మధ్వులు అందించిన జీవుల స్వరూప భేదం, స్వభావం, విశేషాలు వీటి ఆధారం గా జరిగే కర్మాచరణ అనే ముఖ్యమైన విషయాలు కర్మసిద్ధాంతాన్ని సమగ్ర స్థాయిలో అర్థం చేసికోవడానికి ఎంతగానో దోహదపడ్డాయి. ఇలా చెప్పడం లో మధ్వులు చేసిన విచారణ తత్వ జ్ఞానం లో చాల ఉత్కృష్టమైనది. కర్మ

ఒక స్వతంత్రాన్ని సూచిస్తుంది. ఆ స్వతంత్రం ఒక ఎంపికను సూచిస్తుంది. జీవి ఒక కర్మను చేయడం లో ఒకానొక మార్గాన్నే ఎందుకు ఎంచుకున్నాడు అనే ప్రశ్నకు కర్మ సిద్ధాంతం జవాబు చెప్పలేదు. ఎందుకంటే అలా ఒకానొక మార్గాన్ని ఎంచుకోవడం లో జీవి తన అంతర్గత స్వభావాన్ని తన స్వరూప యోగ్యతను వ్యక్తం చేస్తాడు అని చెప్పడమే సరియైన సమాధానం.

మధ్వులు అందించిన అనాదిస్వరూప యోగ్యత మన తత్వజ్ఞాన అవగాహనను జీవుల అనాది కర్మ ను అర్థం చేసుకోవడం లో మరింత ముందుకు తీసుకొని వెళుతుంది. ఈ అవగాహన ద్వారానే జీవుల అనాది స్వభావం, స్వరూప యోగ్యత సాధకులకు అవగతమౌతుంది. ఈ సిద్ధాంతానికి మధ్వులు హఠ అనే పేరును ఇచ్చారు. పురుష ప్రయత్నం ద్వారా వివిధ మంచి, చెడు కర్మల రూపం లో ఈ జీవుల స్వభావం పూర్తి స్థాయి లో వ్యక్తమౌతుంది. జీవులు తమ సత్తాను, ప్రవృత్తి ని వినియోగించుకోవడానికి భగవానుని పై ఆధారపడి సత్వ, రజో, తమో గుణాలను ప్రదర్శిస్తారు.

శుద్ధ సత్వ గుణాన్ని ప్రదర్శించి తద్వారా భాగవత ధర్మాన్ని జీవ కర్తృత్వ భావనను వ్యక్తం చేయడం లో భీమ సేనుడు భారతం లో - ముఖ్యం గా వానప్రస్థ పర్వం లో అత్యుత్తమ స్థాయి లో - కృతార్థుడయాడు అని మధ్వులు వివరించారు.

జీవుల కర్మలను తన ఇచ్చానుసారం నియంత్రించగల సత్తా భగవానునికి ఉన్నప్పటికీ, భగవానుడు, జీవుల కర్మాచరణ లో జోక్యం చేసుకోకపోవడం ద్వారా శాస్త్ర ప్రమాణాలకు అత్యుత్తమ స్థితిని ప్రసాదించాడు. అసలు శాస్త్ర వాక్యం వ్యక్తం చేసేదే పరమాత్మ స్థితిని.

జీవుల స్వరూపాన్ని మార్చడం జీవుని అస్థిత్వాన్ని మొత్తం గా ధ్వంసం చేయడమే ఔతుంది కనుక అది మాత్రం భగవానుడు చేయడు. ప్రపంచ తాత్విక వాదనలలో వివిద ప్రశ్నలు సాధకులు లేవనెత్తుతూనే ఉన్నారు వాటి లో ముఖ్యం గా:

౧. భగవంతుడే జీవులను సృష్టించి నపుడు ఎందుకు జీవులకు భగవానుని పూర్ణత్వం అబ్బలేదు ?

ఈ పై ప్రశ్నకు సమాధానమే అద్రుష్టానియమాత్ *BS* ii 3.51 అనే బ్రహ్మ సూత్రం. అదృష్ట అంటే జీవుల అనాది స్వరూప యోగ్యత ఇదే జీవుల కు భగవానుని మధ్య ఉన్న తారతమ్యానికి ముఖ్యకారణం. జీవులలో అసుర స్వభావం వారి శుద్ధత కు అవరోధం ఈ అసుర ప్రవృత్తి ని నిరోధించాలంటే జీవులు శాస్త్రం చెప్పిన విధి నిషేధాలను పాటించాలి అలా పాటించి నపుడు జీవులలో ఉన్న తత్వాభిమాని దేవతలు, ఇంద్రియాభిమాని దేవతలు వారికి సముచితం గా సహకరిస్తారు. ఏ జీవుడు తత్వాభిమాని దేవతల అనుగ్రహం పొందుతాడో వాడు భగవానుని కరుణకు పాత్రుడౌతాడు. అంటే జీవియొక్క యోగ్యత

పెరిగి తదనుకూల బుద్ధి ప్రచోదనం జరుగడానికి భగవానుడు సకహరిస్తాడు. ఇదే భగవద్ కరుణకు లోనవడమంటే. భగవానుడు తనే అనేకం అయ్యాడు అనే మాటకు అర్థం తన స్వస్థితి లో ఉంటూ చరా చార వస్తువులలో అంతర్గతుడయ్యాడు / సాక్షి గా ఉన్నాడు అని అర్థం. అప్పుడు ఉపాధికి, ఆ ఉపాధిలో ఉన్న సాక్షికి భేదం ఉండనే ఉంది. కనుక ఏకమేవా అద్వితీయం బ్రహ్మ. జీవుల అనాది స్వరూప యోగ్యత వలన వారు భిన్నం గా వర్తిస్తారు.

***

౪౪ జీవుల నైతిక పురోభివృద్ధి లో చెడు భావనలకు ఉన్న సంబంధం

ఈ సృష్టి లో ఉన్న చెడు, దుఖం అనే రెండు అంశాలు ముఖ్యం గా ఆస్తిక భావనకు గొప్ప ప్రతిబంధకాలు. అనాదిస్వరూప యోగ్యత (doctrine of natural selection), జీవుల దత్త స్వాతంత్ర్యం (freedom and freewill) అనే అనే సిద్ధాంత విషయాలు విడమరచి చెప్పడం ద్వారా మధ్వులు ఈ ప్రతిబంధకాలను నిరోధించే మార్గాన్ని చూపారు. అలాగే త్రివిధమైన జీవుల వర్గీకరణ ద్వారా ఈ సైద్ధాంతిక విషయాలు మరింతగా విశదీకరింప బడ్డాయి. కాబట్టి ఈ సృష్టి లో ఉన్న ఆసురీ ప్రవృత్తులను ఎలా పరబ్రహ్మానికి సమన్వయము చేస్తాము అనే ప్రశ్నకు ఇప్పటికే సమాధానం దొరికిపోయింది – "వైషమ్య నైర్ఘుణ్యఅధికరణ" అనే బ్రహ్మ సూత్రం కూడా ఇదే సమాధానాన్ని ఇచ్చింది. కాబట్టి చెడు యొక్క ఉనికి మంచి యొక్క అస్తిత్వాన్ని పెంపొందించడానికే.

ఆసురీ ప్రవృత్తి ఉన్న వ్యక్తులను గౌరవించి అనునయించే వారు లోకంలో ఉంటారు. అట్టి వారికి నైతికత ఉండదు. అందుకే ఏకొద్ది పాటి స్వప్రయోజన సాఫల్యం కోసమైనా ఎటువంటి మారణ హోమానికైనా సిద్ధం ఔతారు. ఇటువంటి వారిని గూర్చి మన స్మృతులలలో ప్రస్తావనలు ఉన్నాయి.

Gita, xvi.16-20
RV ii.23.16
MaitriUp. vii.8

మానవుని ఆధ్యాత్మిక ప్రస్థానాన్ని అర్థం చేసుకోవాలంటే క్షీణం కాని, పరస్పర విరుద్ధమైన జీవన విధానాలను, సైజాలను పరిగణ లోనికి తీసుకొని తద్వారా ముక్తి ని అర్థం చేసుకోవాలి . సర్వముక్తి అనే స్థితి (universal salvation) ఒక పగటి కల మాత్రమె. సంసార బంధం అనేది ఒక వాస్తవ స్థితి మాత్రమె

కాదు కొందరికి అది ఒక వదలని చక్ర బంధం (నిత్య సంసారులు). నిత్య సంసారుల జీవన సరళి లో అంతర్లీనం గా ఉన్న దత్త స్వాతంత్ర్యం (freedom and freewill) శాస్త్రం విధించిన విధి నిషేధాలకు అనుగుణం గా వినియోగించు కొంటె కొందరు ఈ నిత్య సంసార బంధం నుంచి ముక్తులై ఉత్తమ జన్మలు ఎత్తి తద్వారా ఉత్తమ సాధన చేయడానికి యోగ్యతను సంపాదించగలరు.

మానవ జన్మ ఎత్తినంత మాత్రం చేత ఈ ఉపాధి మాత్రమె దైవత్వ ప్రాప్తికి యోగ్యం అని చెప్పడం సాధ్యం కాదు. ఈ విషయం లో పిపీలకాదులను విస్మరించడం తగదు. ఈ విశ్వ వ్యాపారం లో ఉన్న అసలైన నైతికత ప్రతి జీవికీ యోగ్యతానుసారం సాధనా మార్గాన్ని చూపడమే. ఈ సృష్టి లో శాంతియుత సహజీవనం కోరే వారు ఉన్నారు అలాగే వారి ఉనికిని భద్రం చేసుకోవడానికి వేరొక సమాజాన్నో, వర్గాన్నో అంతం చేయడమే పరమావధి గా ఉన్న వారు ఉన్నారు. ఈ వైవిధ్యాన్ని ఆకళింపు చేసుకున్నదే అసలైన నైతిక విధానం – నహి సర్వాధికారికం శాస్త్రం.

జీవ వైవిధ్యం విశ్వ నిర్మాణంలో ఉన్న ఒక ఉత్కృష్ట లక్షణం. ముక్తిర్హిత్వా s న్యథారూపం స్వరూపేణ వ్యవస్థితి: (*Bhag* ii.10.6).

కావునా పరమాత్మ సృష్టి లో ఎందుకు దుఖం, శోకం ఉంది అని ప్రశ్నించడానికి కారణం పైన తెలిపిన విషయాల పట్ల అవగాహన లేకపోవడమే. చెడు ప్రభావాలకు లోను కాకుండా, చెడు మార్గాలను పట్టకుండా, చెడు ఇచ్చే స్వల్పకాలిక సుఖాలకు లొంగి పోకుండా ఎవరు సాధన చేస్తారో వారే ఈ లోకం లో ఉన్న దుఃఖం నుంచి, శోకం నుంచి తమను తాము కాపాడుకోగలరు. ఇట్టి సాధనలో కొందరు సఫలీకృతులౌతారు కొందరు మధ్యలో వారి సాధనను విడచి మరల స్వల్పకాలిక సుఖాలకు లోబడి సంసార చక్రం లో ఉండిపోతారు. కొందరు ఎప్పటికీ తమ సాధన పట్లే ఒక ఆలోచన లేకుండా జీవిస్తారు. ఆసురీ ప్రవృత్తి యొక్క ప్రభావం బాగా తెలిసిన వాళ్ళు వైరాగ్య భావనను పెంపొందిచుకొని తమ స్వచ్ఛతను కాపాడుకొంటూ సదా భగవద్ భక్తి తో ఉంటారు.

***

౪౫. అధికారుల వర్గీకరణ

సాధన అనే ప్రక్రియ లో సాధకుని అభివృద్ధి అతని భౌతిక, నైతిక, ఆధ్యాత్మిక పూర్ణత్వం పై ఆధారపడి ఉంటుంది. కర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు స్థూలం గా సాధకుని భౌతిక, నైతిక, ఆధ్యాత్మిక సామర్థ్యాల కు సంబంధించినవి. మధ్వులు వివిధములైన సాధకులకు ఒక విస్తారమైన సాధనా సరళిని వివరించారు. ఈ సాధకులను ఆయన అధికారులు అని పిలిచారు. వీరు:

1. ఉత్తములు (దేవతలు)
2. మధ్యములు (ఋషులు, గంధర్వులు)
3. కనిష్టులు (మనుష్యోత్తములు)

మానవ ఆత్మలు కేవలం బహిర్ప్రకాశం ద్వారా అపరోక్ష జ్ఞానాన్ని పొందగలవు.
ఋషులు, గంధర్వులు అంతః ప్రకాశం ద్వారా పొందగలరు
దేవతలు అంతటా ప్రకాశం అనే అనుభవం తో భగవానుని చూడగలరు.

ఆత్మల లో వర్ణ, లింగ, కుల బేధాలు లేకుండా మరలా:

అంకితులు
స్వచ్ఛమైనవారు
జ్ఞానులు
అనే మూడు వర్గీకరణలు ఉన్నాయి.

మనుష్యోత్తముల కంటే క్రింది స్థాయిలో ఉన్న వారు సదా దేహాంతరయానం చేస్తూ ఉంటారు అంటే సంసార చక్ర భ్రమణం లో చిక్కుకొని ఉంటారు.

సూత్రకారుడు (వేద వ్యాసుడు – సాక్షాత్ శ్రీ హరి), స్మార్త స్మృతి లో చెప్పినట్లు గానే సాధకులు వారి యోగ్యతను అనుసరించి వారి సాధనలో అభివృద్ధిని సాధించ గలరు. తాత్విక జ్ఞానం పొందడానికి శాస్త్ర శోధన అనే మార్గం కేవలం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాల వారు మాత్రమె అనుసరించడానికి అర్హులు (అధికారులు). స్త్రీలు, శూద్రులు కేవలం పురాణ, ఇతిహాస, పంచరాత్ర గ్రంధాల ద్వారా మాత్రమె సాధన చేయాలి. తద్వారా భగవానుడు నిర్దేశించిన వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించి వారి సాధనకు అధికారులు కాగలరు. చిత్రం ఏమంటే మన ప్రభుత్వాలు విధించిన విధి నిషేధాలు పాటిస్తాం, చివరికి జైలు శిక్ష కూడా అనుభవిస్తాం, కాని అవి వేదవాక్కులైతే మాత్రం నిరసిస్తాం, హక్కుల కోసం పోరాటం చేస్తాం. ఇది కలియుగ ధర్మం.

అద్వైత సిద్ధాంతం చెప్పినట్లు ఆపత్సన్న్యాసం ద్వారా ఏ వర్ణానికి చెందినా వారైనా శాస్త్ర శోధన చేయవచ్చు అని చెప్పలేదు. అలాగే సన్యాసాశ్రమ స్వీకారం ఎవరికైనా ప్రతిబంధకాలు లేని నిరంతర సాధనకు ఒక చక్కని అవకాశం కల్పిస్తుంది అని చెప్పారు. అలాగే మనకున్న భాష్యకారులలో మధ్వులు ఒక్కరే అత్యుత్తమ ఆధ్యాత్మ సాధన చేసిన స్త్రీల గురించి ప్రస్తావించి వారికి బ్రహ్మవిచార అధికారం వేదాంతం ద్వారా ఉన్నదని చెప్పారు.

***

౪౬. సాధనా సరళి

తాత్విక విచారణ యొక్క పరమార్థం ముక్తి ని పొందడం. ఇది ఎలా పొందాలి అనే ప్రశ్న సహజం గా అందరికీ ఉత్పన్నం ఔతుంది. దీనికి జవాబు గా ఒక క్రమాన్ని మన శాస్త్రాలు నిర్దేశించాయి:

సంసారిక జీవనం తో తాదాత్మ్యత నుంచి దూరం కావడం (వైరాగ్యం)
పరమాత్మా పట్ల అచంచల భక్తి
పరమాత్మ కథా శ్రవణం
నామ, కథా మననం
పరమాత్మ పై ధ్యానం
సాక్షాత్కారం

వైరాగ్య భావన అనేది ప్రధమ మెట్టు సాధనకు. మనసు కేవలం ఒక విషయాన్నే ఒక సమయం లో పట్టుకోగలదు అది సంసార సుఖాలనా లేక ఆధ్యాత్మ విద్యనా అనేది సాధకులు నిర్ణయించుకోవలసిన విషయం. పరమాత్మ పట్ల ఉన్న ప్రగాఢ ప్రేమ ద్వారానే వైరాగ్యం సిద్ధిస్తుంది. బింబ-ప్రతిబింబ భావన ఈ ప్రేమకు ఒక సహజత్వాన్ని ఒక స్ఫూర్తి ని ఇస్తుంది. ఈ విధమైన వైరాగ్య స్థితి నిష్కామ్య కర్మ ద్వారా, సహనం ద్వారా, అధ్యయనం ద్వారా, ఆలోచన ద్వారా సిద్ధిస్తుంది. ఇటువంటి కర్మలు గత జన్మల లో చేసిన వారికి ఈ జన్మలో ఆ ఫలం అనుభవం లోకి వస్తుంది. అందుకే వారికి అనువైన వాతారణం ఒనగూరుతుంది.

శ్రవణం సాధకులకు కావలసి ఆధ్యాత్మిక ఆలోచనా పరంపరను సరఫరా చేస్తుంది. ఇలా పురాణేతిహాసాలు విన్నాకా వాటిని మననం చేసుకోవడం ద్వారా ఒక నిర్దిష్టత ఏర్పడుతుంది. ఉదా: ఒక చక్కని ప్రసంగాన్ని విన్న ఒక తల్లి దాని సారాన్ని పిల్లలకు చెప్పడం ద్వారా స్వయం గా ఒక గురు ముఖతః విన్న విషయాల పట్ల తనకు ఒక నిర్దిష్టత కలుగుతుంది.

శ్రవణం అంటే అధికారుల (పౌరాణికుల) ద్వారాశ్రుతులలో స్మృతుల లో ఉన్న విషయ సంగ్రహణ. ఇది అజ్ఞానాన్ని తొలగించి సాధనకు ఉపయోగపడుతుంది. మననం ద్వారా సంగ్రహించిన విషయ జ్ఞానాన్ని దైనందిన జీవితానికి అన్వయించుకొనే అవకాశం కలుగుతుంది. మననం అన్వయం చేసుకోవడం లో వచ్చే సమస్యలను, విపర్యయాలను (తప్పుగా అర్థం చేసుకోవడాన్ని) పరిష్కరిస్తుంది. అప్పుడు శాస్త్ర విషయాలు ఏది చెప్పదలచుకున్నవో దానిని మాత్రమె మనసు పట్టుకోగలుగుతుంది. శాస్త్ర విషయాలు పరోక్ష మార్గాల ద్వారానే నిశ్చయమౌతాయి. అందుకే పురాణాలు ఇతిహాసాలు వచ్చాయి. నిధిధ్యాసన లేదా ధ్యానం ద్వారా విషయ దర్శనం కలుగుతుంది.

అద్వైతం శ్రవణాన్ని ప్రధమం గా చెప్పి మనన, ధ్యానాలను రెండవ ప్రాధాన్యంగా చెబుతుంది. రామానుజులు ధ్యానాన్ని ఉత్తమ మైనది గా చెబుతారు. కానీ మధ్వులు ఈ మూడు మార్గాలకు సమాన ప్రాధాన్యతను ఇస్తారు ఎందుకంటే ముక్తికి ఉన్న ఒక్క ఉపాయం భగవానుడే అనే భావన శ్రవణం ద్వారా కలిగి అది మననం ద్వారా స్థిరపడి ధ్యానం ద్వారా అనుభవం లోకి వస్తుంది.

బ్రహ్మ సూత్ర భాష్యంలో మధ్వులు సాధకులకు ఒక ఆదర్శ గురువు యొక్క ఆవశ్యకత ఎంతో ఉంది అని చెప్పారు. ఒక సద్గురు అనుగ్రహం (ప్రసాదం) వలెనే శ్రవణం, మననం ఫలవంతం ఔతాయి అని ఉపనిషద్ కథను (సత్యకామ) ఉటంకించి చెబుతారు. సత్యకాముడనే బ్రహ్మచారికి దేవతల అనుగ్రహం ఉన్నప్పటికీ గురు అనుగ్రహం కావాలని కోరుకోవడం లో ఉన్న ఆంతర్యం ఇదే అని చెబుతారు (*ChanUp* iv.9).

వ్యక్తిగత సాధన, గురు అనుగ్రహం ద్వారానే సాధన పరికత్వత చెందుతుంది . గురు భక్తి యొక్క గొప్పతనం, ఆవశ్యకత గూర్చి ఆచర్యత్రయం లో ఎవ్వరూ ఇవ్వని రీతిలో ప్రాధాన్యతను మధ్వులు ఇచ్చారు. గురుభక్తి ఆస్తికతకు ఉన్న అంతర్గత లక్షణంగా బ్రహ్మసూత్ర భాష్యకారులలో మధ్వులు మాత్రమె తెలియచేసారు. గురు అనుగ్రహం వలన మాత్రమె సాధన పరిక్వతను పొందుతుంది. శ్రవణం, మననం చక్కగా జరిగిన పిమ్మట ధ్యానం అత్యంత కీలక దశను చేరుకొంటుంది. ఆ స్థితిలో గురువు యొక్క ఆవశ్యకత మెండు (*SvetUp* vi.23).
సాధకుడు ఒకవేళ తన గురువును మార్చదలచుకుంటే ప్రస్తుత గురువు వద్ద అనుమతి తీసుకొని మాత్రమె ఈ మార్పుని చేయాలి. సాధనా క్రమం లో నిదిధ్యాసన కు మధ్వులు ఉత్తమ స్థానాన్ని (శ్రవణం, మననం తగు రీతి చేసిన పిదప) ఇచ్చారు. శ్రవణం మననం అంగాలు గా ధ్యానం అంగి గా మధ్వులు

పేర్కొన్నారు. శ్రవణం మననం ద్వారా తత్వనిర్ణయం సాధనలో జరుగుతుంది. అనంతరం పరమాత్మ యొక్క అనంతమైన గుణాలలో ఎదో ఒక గుణ వైభవాన్ని తన సాధనకు అన్వయించుకొని ఆ గుణాన్ని ధ్యానం చేయడమే ఉపాసన. సాధన, సాధ్యత మధ్య ఉన్న అన్యోన్య సంబంధం పై మధ్వులు ప్రాధాన్యత ఇచ్చి తద్వారా ముక్త స్తితి లో (స్థాయి, తీవ్రత, గుణము, కాలము ఆధారం గా) తారతమ్యం, అధికారం ఆధారపడి ఉంటాయని చెప్పారు. అనువ్యాఖ్యానం లో (*AV* iii.4.16) చెప్పిన దాని ప్రకారం ఈ తారతమ్యం ఇలా ఉంటుంది:

- రుద్రుడు లవణ సముద్రం లో పది బ్రహ్మ కల్పాలు తీవ్రమైన తపస్సు ఆచరించాడు.
- ఇంద్రుడు ఒక కోటి సంవత్సరాలు పొగను పీలుస్తూ భయంకరమైన తపస్సు ఆచరించాడు.
- సూర్యుడు తన తలను క్రిందికి వంచి పది వేల సంవత్సరాలు తమపమాచరించాడు.
- యముడు తన శరీరాన్ని సూర్య కిరణాలకు అభిముఖం గా ఉంచి వేయి సంవత్సరాలు తమపమాచరించాడు

కాబట్టి సాధన లో తారతమ్యం అనాది గా ఉన్న విషయమే. తారతమ్యం లేదంటే పైన చెప్పిన ఘోరమైన సాధనలను సమన్వయం చేయడం సాధ్యం కాదు. అందువలన ఒక సమగ్రమైన సరళి సాధనకు అవశ్యం ఉండాలి. అందుకే తత్వ విచారణ లో నైతికతకు చాల ప్రాధాన్యత ఉంది. ఈ నైతికత ద్వారానే తారతమ్య నిరూపణ జరుగుతుంది. అప్పుడే సాధకుల్లో సాధన పట్ల ఆశక్తి పెరుగుతుంది. విశ్వపరిణామ సిద్ధాంతం లో ఈ నైతికతకు ప్రముఖమైన స్థానం ఉంది. ఈ విశ్వం లో ఉన్న సమస్త పదార్థాల విలువ, లేక విలువ లేని స్థితి, అలాగే జీవుల ప్రవర్తన పై వాటి ప్రభావం తత్వ నిర్ణయం లో అతి ముఖ్య మైన విషయాలు. భారతీయ తాత్విక విచారణ జీవన పరమార్థం సాధించడం కోసం చేసే ఒక తీవ్రమైన సాధన. సాధన పలు విధాలు గా ఉన్నప్పటికీ ఈ సాధనలో నైతికత ఇమిడి ఉంటుంది.

మధ్వులు సూచించిన నైతికత మార్గం లో ఈ అంశాలు ఇమిడి ఉంటాయి :

౧. విచారము లేదా కారణ యుక్త ఆలోచన, సాధన పట్ల చేసే వేదాంత విచారణ
౨. త్రివిధమైన కర్మ (కర్మ, భక్తి, జ్ఞాన మార్గాలతో కూడుకున్న)
౩. భక్తి, ఉపాసనల యొక్క స్వభావం, విశిష్టత
౪. అపరోక్ష జ్ఞానం యొక్క ప్రాధాన్యత
5. అపరోక్ష జ్ఞాని యొక్క నైతిక నియమాలు

౪౭. కర్మ యోగం – జ్ఞాన యోగం

అతిముఖ్యమైన సాధనా విధానాలు అన్నీ కర్మ మార్గం, జ్ఞాన మార్గం, భక్తి మార్గంలో భాగాలే. వీటిలో కర్మయోగం ప్రధమ పంక్తిలో ఉంటుంది. కొన్ని వేదాంత మార్గాలలో కర్మయోగం ప్రవృత్తి మార్గమని, మీమంసకారుల ప్రాకారం వేద విహితమైనశ్రుతి స్మృతి చెప్పిన కర్మలను వర్ణాశ్రమ ధర్మాన్ని ఆచరించి చేయడం ద్వారా ఇహము నందు లేదా పరము నందు ఫలాన్ని పొందవచ్చు అనే విధానం అని చెప్పబడుచున్నది.

శంకరుల గీతా భాష్యం లో కర్మ-జ్ఞాన సముచ్చయం (synthesis) జరుగలేదనే చెప్పాలి. కర్మను కామ్య కర్మ గా చెబుతూ భాష్య రచన జరిగింది కాని నిష్కామ కర్మ – ఆత్మ జ్ఞానం యొక్క సముచ్చయం చేయలేదు. కొందరు మహాత్ములు చేసే కర్మలను కర్మలు అనడానికి కూడా శంకరులు వెనుకాడారు. కానీ కర్మ యోగం యొక్క ప్రముఖోద్దేశ్యం కర్మ అనే భావనకు జ్ఞానం తో అన్వయం చేయడమే. జనకుడు, ప్రియవ్రతుడు మొదలగు మహాత్ముల కర్మలను నిష్కామ కర్మ గా ఆత్మజ్ఞాన యుక్తం గా చూపడమే భగవద్గీత ముఖ్యోద్దేశ్యం. దీనికి కృష్ణుడే ఒక చక్కని ఉదాహరణ ఎందుకంటే ఒక క్షత్రియుని గా కృష్ణుడు చేసిన కర్మలు సాధకులకు చక్కని ప్రమాణాలు. అందుకే శంకరులకు ముందు కాలం వారైన భాస్కరులు, బ్రహ్మదత్త వంటి వేదాంతులు, అనంతరం వచ్చిన రామానుజులు కూడా జ్ఞాన కర్మసముచ్చయం యొక్క ఆవశ్యకతను వెల్లడించారు. తదనంతరం మధ్వులు కర్మ యోగాన్ని విస్తారం గా వివరిస్తూ కర్మ, జ్ఞాన యోగాల మధ్యన ఉన్న సమన్వయ లోపాన్ని నిష్కామ, జ్ఞానపూర్వం కర్మ అనే పదాల ద్వారా సవరిచారు. జ్ఞానాత్మక కర్మాచరణ ద్వారానే ఆధ్యాత్మ సాధన సాధ్యం ఔతుంది అని వివరించారు. తత్కర్మ హరితోషం యతు అనే భాగవత వాక్యం (*Bhag* iv.29.49), యజ్ఞార్థాత్కర్మణో s న్యత్ర లోకో s యం కర్మబన్ధన: అనే గీతా వాక్కు (*Gita* iii.9) ఇదే విషయాన్ని చెబుతున్నాయి.

మద్వుల వివరణ ప్రకారం లోకం లో రెండు రకాలైన అధికారులు ఉంటారు:

౧. సాంఖ్యులు ౨. యోగులు

అలాగే రెండురకాలైన జ్ఞానులు ఉంటారు

౧. జ్ఞాననిష్టులు – సనకసనందనాదులు వారు పుట్టుకతో యోగులు వారు కర్మరహిత జ్ఞాన పంథాను అనుసరిస్తారు.

౨. మిగిలిన వారు జనక మహారాజు, ప్రియవ్రతుడు మొ. వారు దైవ నిర్ణయం ద్వారా కర్మ మార్గాన్ని అనుసరిస్తారు

భాగవత పురాణం ప్రకారం ప్రియవత్రుడు అనే రాజు బ్రహ్మజ్ఞానాన్ని అనుభవిస్తూ ఆ పరమానందం లో అరణ్యానికి చేరి తపమాచారిస్తాడు. అప్పుడు సాక్షాత్తు చతుర్ముఖ బ్రహ్మ ఆతనికి ప్రత్యక్షమై అతనిని క్షాత్ర ధర్మాన్ని వీడవద్దు దానిని అవశ్యం ఆచరించాలని ఉపదేశించిన మీదట మరల రాజ్యాధికారాన్ని చేబట్టి జ్ఞానం తో కూడిన కర్మలను ఆచరిస్తాడు (Sk.V.1.). ఇటువంటి వారు చేసి కర్మలకు లోకసంగ్రహ అని పేరు. వీరు ధర్మాచరణ కోసం లోక కళ్యాణార్థం కర్మలు చేస్తారు.

కాబట్టి సగటు సాధకులమైన మనం కేవలం కర్మల ద్వారానే మన సాధన కొనసాగించాలి. కర్మయోగాన్ని ప్రవృత్తి మార్గం అని చెప్పడం ద్వారా వేదాంతులు కేవలం కర్మ చేయడం అనే స్థూల అర్థాన్ని ఇచ్చే లా వ్యాఖ్యానించడం లో ఉన్న లోపాన్ని సరిదిద్ది నివృత్తి మార్గమంటే కర్మను భక్తి తో నిష్కామం గా చాకచక్యం గా చేయడం అని అసలైన అర్థాన్ని ఇచ్చారు. ఇందుకు వ్యాస స్మృతి ని ఉటంకించారు: "నిష్కామం జ్ఞానపూర్వం తు నివృత్తమిహ చోచ్యతే"-
నిష్కామం మరియూ జ్ఞానం తో కూడిన స్థితి ఈ భువిలో పొందే మోక్షం అని పేర్కొంటారు. ఇదే వాక్యం మను స్మృతి లోను కూర్మ పురాణం లోను (i.2.64) కనిపిస్తుంది. రామనుజులు వారి శ్రీ భాష్యం లో ఉటంకించిన పంచారాత్ర వాక్యాలు ఇదే వాక్యార్థాన్ని తెలుపుతాయి (తస్మాత్ సమ్యక్ పరం బ్రహ్మ వాసుదేవాఖ్యమవ్యయము, అస్మాదవప్యతే శాస్త్రాద్ జ్ఞాన పూర్వేణ కర్మణా (ii.2.41)). ఈ విధమైన భావనే నిజానికి గీత లో చెప్పబడిన సన్యాసం నైష్కర్మ్య యొక్క మూలార్థం. జ్ఞానం తో కూడిన నిష్కామ కర్మ ద్వారానే మోక్షం సిద్ధిస్తుంది. నిష్కర్మ కర్మ అంటే చేస్తున్న కర్మ పట్ల ఇచ్ఛలేకపోవడం కాని కర్మను సాదా ఆచరించడం. ఇలా కర్మలు చేయడం ద్వారా కర్మ ఫలాల పట్ల మోజు తగ్గి జ్ఞానం వైపు సాధన మళ్ళుతుంది. ఎలా ఒక తల్లి తన బిడ్డకు ఆముదం సేవించడం పట్ల సుముఖత చూపడానికి ఒక మధురమైన పదార్థం దక్కుతుంది అనే ఆశ చూపుతుందో అదే విధం గా సాధకుడు తనకు ఇష్టం కాని కర్మలను సైతం చేయడం పట్ల సుముఖత చూపి ఆపై పొందే మోక్ష ఫలం పట్ల అనురక్తి కలిగిఉండాలి. అంటే ఆముదం సేవించడం రాను రాను ఆ బిడ్డడికి ఒక విధి ఔతుంది తద్వారా మంచి ఆరోగ్యం కలిగి తన సాధనకు ఆ ఆరోగ్యం ఉపయుక్తమౌతుంది. అంటే సాధన చక్కగా కొనసాగడం అనేది ధ్యేయం ఆరోగ్యం స్థిరంగా ఉండడం అనేది అనుషంగిక ప్రయోజనం. కర్మ నశ్యం లేనిది. ఎలా ఒక సూక్ష్మ జీవి తామర తంపరలా పెరుగుతూ పోతుందో కర్మ కూడా అంతే. ఒక శాస్త్రీయ అంచనా ప్రకారం, ఒక మనిషి ఒక జన్మలో తన ౧౪ వ సంవత్సరం నుంచి ఆచరించిన కర్మ యొక్క ఫలం అనుభవించాలంటే కనీసం ౧౦ జన్మలు ఎత్తాలి. మన శాస్త్రాలు చెప్పే విధి నిషేధాలు తాత్కాలిక ప్రయోజనాల కై కాదు సరియైన సాధన కొనసాగడానికి తద్వారా మోక్ష సిద్ధికి - జ్ఞానాగ్ని సర్వ కర్మాణి భస్మసాత్ కురుతే. అలా జ్ఞానాగ్ని లో దగ్ధ మైన కర్మల వలన అప్రారబ్దం కలుగుతుంది అంటే అట్టి కర్మలకు ఫలం ఇక ఉండదు. నిష్కామ కర్మ ద్వారా మనసు శుద్ధతను (mental purification) పొందుతుంది, అది సాధనకు ఎంతో ఉపయుక్త

మౌతుంది. సాధకుడు ధ్యానం ద్వారా అపరోక్ష జ్ఞానం పొందిన పిదప తన కర్మ రాశి అంతా ఆ జ్ఞానాగిలో భస్మమై అప్రారబ్ధ స్థితిని పొందుతాడు. అందువలన మధ్వులు సాధకులు వైరాగ్య ప్రాప్తి కొరకు నిష్కామ కర్మలను చేయడం అలవరచుకోవాలని ఉపదేశిస్తారు. పరోక్ష జ్ఞానం పొందిన పిదప చేసే కర్మ అప్రారబ్ధ మై జీవి యొక్క ఆనందోద్రేకానికి (*welling up of spiritual bliss)* కారణం ఔతుంది.

మధ్వులు ఈశోపనిషత్తు రెండవ శ్లోకానికి గీతలో ని iii.20 శ్లోకానికి ఒక సంపూర్ణమైన వ్యాఖ్యానాన్ని జ్ఞానోత్తరకర్మ అనే పదప్రయోగం ద్వారా చేసి తద్వారా కరమయోగానికి ఉన్న సముచిత స్థానాన్ని స్థిరీకరించారు. ఈ విధంగా మధ్వులు భారతీయ తత్వవేత్తలలో ప్రముఖ ఒక విశిష్టమైన స్థానాన్ని అలంకరించారు. తోటి మనిషికి సాయపడడం జ్ఞానికి ఉన్న నైతిక భాద్యత అని చెప్పింది కూడా ప్రధమం గా మధ్వులే! నానా జన హితం కోరడం వారికి చేతనైన సహాయం చేయడం, న్యాయబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలకు పన్నులు కట్టడం, ప్రభుత్వాలు ప్రకటించిన విధి నిషేధాలను పాటించడం, మొదలగునవి జ్ఞాని యొక్క నైతిక బాధ్యత గా మధ్వులు తెలియచేసారు.

***

౪౮. భక్తి భావన – దాని స్థితులు, వివిధ విధానాలు

జీవులు అపరోక్ష జ్ఞాన సిద్ధి కొరకు, భగవద్ సాక్షాత్కారం కొరకు చేసే సాధనలో భక్తికి ఒక ఉత్కృష్ట మైన స్థానాన్ని మధ్వులు ఇచ్చారు. ఏ భగవంతుని భక్తితో తలుస్తున్నాడో ఆ భగవానుడు దయార్ద్ర హృదయుడై భక్తుని వైపు కదలాలి. అందుకు ఆ భక్తునికి భగవంతుని అనంతగుణ పరిపూర్ణత, మాహాత్మ్యం గూర్చి ఒక సదవగాహన ఉండాలి. కాబట్టి భక్తి అనగా భగవంతుని పట్ల స్థిరం గా కొనసాగే ఒక ప్రగాఢమైన అనుబంధం. ఈ అనుబంధం లో అంతర్గతం గా ఉన్న ప్రతిబంధకాలను, తనపై, తనవారిపట్ల తనకు సంబంధించిన వస్తువుల పట్ల ఉన్న ప్రేమను అభిమానాన్ని అధిగమించి కేవల పరతంత్ర భావనతో ఆ సంపూర్ణమైన, దోషరహితమైన, అమలినమైన పరమాత్మ సాన్నిధ్యాన్ని త్రికరణ సుద్ధి గా కోరుకోవడం భక్తి అని శాస్త్రీయం గా నిర్వచించారు జయతీర్థులు . ఇటువంటి భక్తి రసం లో జీవులు మునిగి ఉన్నపుడే బాహ్య స్పృహ ను కోల్పోయి అమితానందాన్ని పొందగలరు అదే భక్తి పారవశ్యం అంటే. దీనిసే గీత (II,69) ఛాందోగ్య ఉపనిషత్తు (vii.24.1) లోని శ్లోకాలు వివరిస్తాయి. ఈ భక్తి ప్రకటితమైనపుడే ప్రతిబింబ భావన అనుభవంలోకి వస్తుంది. అంటే బాహ్య స్పృహను కోల్పోయి భక్తి పారవశ్యం లో ఉన్నపుడే సంసారం బంధ విముక్తి జరిగి ప్రతిబింబత్వం అనుభవం లోకి వస్తుంది. వేదాంత సూత్రాలలో భక్తికి ఒక కీలకమైన స్థానం

భారతీయ భాష్యకారులలో మధ్వులు మాత్రమె ఇచ్చారు. బాదరాయణుడు ప్రసాదించిన బ్రహ్మ సూత్రాలకు సరియైన భాష్యం కేవలం ఈ భక్తి భావన ఆధారం గానే సాధ్యం. సాధనలో భక్తికి ఉన్న ప్రాముఖ్యత తద్వారా మొక్షాసక్తత సత్యం కావడం, భక్తిని వేదాంతం నుంచి వేరు చేసి చూపెతే సాధ్యం కాదు అనే విషయాన్ని ఖరారు చేస్తుంది. అసలైన ఆస్తికత భక్తి భావన తో కూడిన వేదాధ్యయనం వలెనే సాధ్యం. భక్తి అనగా కేవలం ఒక మూఢ నమ్మకం లేదా ఉద్వేగం కాదు అది శ్రవణం, మననం ద్వారా ధ్రువీకరించ బడిన ఒక మహత్తరమైన భావాన సంపత్తి.

మధ్వులకు ముందు వచ్చిన రామానుజులు, శంకరులు వారు వ్రాసిన బ్రహ్మ సూత్ర భాష్యం లో భక్తి ని ప్రస్తావించలేదు. భగవద్గీత లో భక్తి యోగంలో భక్తిని గూర్చి తెలిపాడు కనుక వ్యాసుడు బ్రహ్మ సూత్రాలలో దానిని ప్రస్తావించలేదు అనే వాదన కూడా ఉంది కాని ఈ వాదన చెల్లదు అని చెప్పడానికి కారణం బ్రహ్మ సూత్రాలు భగవద్గీత కు ముందుగా ఇవ్వబడ్డవి. పైగా బ్రహ్మ సూత్రాలు భక్తి ని విడచి అంతకంటే సాధనకు ఉపాసనకు సంబంధించిన అనేక ఇతర విషయాలను ప్రస్తావించాయి అని అనడం సబబు కాదు. బ్రహ్మ సూత్రాలలో ఉన్న సాధనాధ్యాయం లో బాదరాయణుడు భక్తి ని ప్రస్తావించలేదు అనడం భారతీయ ఆస్తికతను ఒక విచిత్రమైన కోణం లో చూపడమే. శంకరులు అన్వియించిన సగుణ బ్రహ్మవాదం లో భక్తి ఒక ప్రముఖమైన సాధన అని చెప్పక చెప్పారు. కనుక సాధనాధ్యాయం లో భక్తి ని ప్రస్తావించకపోవడం మధ్వులకు ముందు ఉన్న భాష్యకారుల లోపం అని చెప్పక తప్పదు. మహాత్మ్యజ్ఞానం ద్వారానే భక్తి మూఢభక్తి కాదు అని నిరూపించబడుతుంది. అంటే భక్తి ఏకాగ్రత తో కూడిన శ్రవణం, అధ్యయనం, మననం, వలన పరిపుష్టతను పొందుతుంది. కేవలం నామజపం భక్తి కాదు. అంతేకాదు, మధ్వులు, నిజమైన భక్తులకు మరొక లక్షణాన్ని ఆపాదిస్తారు: నైతిక స్వచ్చత, నిబద్ధత, వైరాగ్యభావన, స్వాభావికంగా ప్రాపంచిక సౌఖ్యముల పట్ల విముఖత కలిగి ఉండుట నిజమైన భక్తికి ఉండే లక్షణాలు. మనసు రెండు విషయాలను ఒకే సమయం లో పట్టుకోలేదు భక్తి ఉండడమో లేక పోవడమో ఏదో ఒక్క స్థితి లో ఉండడమే సాధ్యం. స్వచ్చత లేని భక్తి, భక్తి కాదు అని తేల్చి చెప్పారు మధ్వులు. శారీరిక వాంఛలపై పరిపూర్ణమైన అదుపు, పక్షపాత రహిత బుద్ధి, భగవంతుని పై అవ్యాజ్య మైన ప్రేమ భక్తులకు ఉండవలసిన ప్రాధమిక అర్హతలు అని మధ్వులు వివరించారు. అందుకే మధ్వులు “వినా జ్ఞానం కుతో భక్తి: కుతో భక్తిం వినా చ తత్” (*GB* ix.p.65) అని వ్యాఖ్యానిస్తారు – జ్ఞానం లేని భక్తి ఎక్కడ? భక్తి లేని జ్ఞానం ఎక్కడ?.

మధ్వులు వారి అనునయులు వివరించిన భక్తి ఎటువంటి శృంగార వ్యాఖ్యలకూ తావివ్వనిది. ఉత్తర భారత వైష్ణవ సిద్ధాంతంలో, జయదేవుని అష్టపదులలో, చైతన్య, వల్లభ సిద్ధాంతాలలో శృంగారం మిళితమై ఉంటుంది. రామనుజులకు ముందు ఉన్న ఆళ్వార్ సాహిత్యంలో సైతం కృష్ణ భక్తిలో శృంగారం ప్రస్పుటం గా తెలుస్తుంది.

కృష్ణుని కై పొందిన విరహ వేదన, బెంగాల్ వైష్ణవ సాంప్రదాయం లో చాల స్పష్టం గా గోచరమౌతుంది.

కేవలం అమలినమైన ప్రేమతో భగవంతుని పట్ల ప్రేమను వ్యక్తం చేయడం లో కన్నడ హరిదాసులు (శ్రీపాదరాజ, వ్యాసతీర్థ, పురందరదాస, విజయదాస మొదలగు వారు) హరికథామృతసార వ్రాసిన జగన్నాథదాస ఎలా భగవానుడు భక్తుని మొరను వింటాడో తెలుపోతూ వ్రాసిన ఈ పదాలు ఒక చక్కని ఉదాహరణ:

'God listens seated, to the Bhakta
Who sings to Him in ecstasy, lying down.

మేనువాల్చి మాధవుని కై గానం చేస్తే
శ్రద్ధగా కూర్చొని మరీ ఆలకిస్తాడు ఆ హరి (భీష్ముడు)

He stands and listens to the one
Who sings to Him – seated comfortably.

హాయి గా కూర్చొని హరినామ స్మరణ చేస్తే
నిలబడి మరీ ఆలకిస్తాడు మురారి (పాండురంగడు)

He comes dancing upto him that sings standing.

నిలుచొని నీరజాక్షుని గానం చేస్తే
నాట్యమాడుతూ దరికిచేరి మరీ వింటాడు విధాత తండ్రి (గోపికలు నిలబడి పాడితే కృష్ణుడు నర్తించాడు)

To him that dances and sings,
God says 'I'll show Myself to him'.

పరవశం తో నర్తిస్తూ నృసింహ స్మరణ చేస్తే
తన దర్శన భాగ్యమే భక్తునికి ప్రసాదిస్తాడు (హరిదాసులు నర్తిస్తూ పాడితే ముక్తినిచ్చాడు)

Verily, Hari is most accessible to his own.

సదా హరి తన భక్తులకు లభ్యుడే

Never for a moment does He stay away from them.

లిప్త కాలం సైతం వదలదు తనవారిని ఆ గోపాలుడు

But fools caught in Samsara
Know not how to make Him their own.'

సంసార బద్ధులైన మూర్ఖులు
ఎరుగరు హరి ని తమ వాడిని చేసుకొనే రీతి
(*Harikathamrtasara,* ii.5)

దాస సాంప్రదాయం లో వ్యక్తమైన భక్తి కామభక్తి కాదు పరమ పవిత్రమైన ప్రేమతో కూడిన భక్తి. భక్తి అనగా ప్రేమతో కూడిన అనుబంధం. భాగవత పురాణం లో వివిధ రీతుల్లో హరిని స్మరించినప్పటికీ మోక్షం సిద్ధించింది అనే వ్యాఖ్యానాలు ఉన్నప్పటికీ అవి సాధకులు తమ దేశ కాల స్తితులకు అన్వయించుకొని భక్తి పట్ల సదవగాహనను అలవరుచుకోవాలి.

కామం క్రోధం, భయం స్నేహం, మైత్రీం సౌహృద్మేవచ
నిత్యం హరౌ విదధాతే యాంతి తన్మయంతాం హి తే - (*Bhag* x.29.15) . అలాగే ఇతర భాగవత శ్లోకాలు కూడా ఇదే విధమైన అర్థాన్ని ఇస్తూ ఉన్నాయి (*Bhag* VII.1,30) (*Bhag* xi.5.48) (*Bhag* vii.1.29)

కాబట్టి వేద / పురాణ వాక్కులు పరస్పర విరుద్ధం గా ఉన్నాయని తీర్మానించడం సబబు కాదు అమలిన మైన ప్రేమ తో కూడిన భక్తి వలెనే అసలైన ఫలం లభిస్తుంది. భక్తులు మూడు విధాలు గా ఉంటారు:
౧. ఉత్తములు
౨. మధ్యములు
౩. కనిష్టులు

భక్తి యొక్క స్వభావం, తీవ్రత ఆధారం గా ఈ తారతమ్యం ఉంటుంది. భక్తి అచంచలం గా ఉండాలంటే ఏ విధమైన నాస్తిక భావనలకూ తావులేని విశ్వాసం పరమాత్మ పట్ల ఉండాలి ఇది విష్ణు మహాత్మ్య జ్ఞానం ద్వారానే సాధ్యం. అప్పుడే ఈ సమస్త విశ్వం యొక్క ఉనికి కి మూలాధారమైన విష్ణువు పైనే సాధకుని సత్తా, ప్రతీతి, ప్రవృత్తి ఆధారపడి ఉంటాయి. ఈవిధమైన భక్తి తో సాధకుడు తనకు సాధ్యమైన రీతిలో బింబ-ప్రతిబింబ భావనను వ్యక్తం చేస్తాడు. ప్రేమ, జ్ఞానం తో కూడుకొన్న భక్తి అసలైన భక్తి. జ్ఞానం అంటేనే భక్తి. భక్తి అంటే జ్ఞానం, ప్రేమ కలిసిన ఒక అధ్భుత మానసిక స్థితి. జ్ఞాన సిద్ధి అంటే అమలిన భక్తి అలవడడమే.

భక్తి లో తారతమ్యం:

దేవతలకు ఋషులకు చేసే భక్తి పూర్వక పూజాదులు కృతకం గా చేసేవి కావు అవి ఆధ్యాత్మిక తారతమ్యం తో కూడుకొని చేసే సమర్పణలు. దేవతలు విష్ణువు యొక్క ప్రభుత్వం లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొంది ఉంటారు. వీరిని తత్వాభిమాని దేవతలు అని పిలుస్తారు. విశ్వ వ్యాపారం లో వీరికి ఒక నిర్దిష్టమైన పరిధి, నియంత్రణ తో కూడుకొన్న పాత్ర పిండాండ- బ్రహ్మాండ స్థాయి లో ఉంటుంది. ఇటువంటి

మహత్తరమైన బాధ్యతతో దేవతలు సాధకుల సాధనను వారి యోగ్యతననుసరించి ప్రభావితం చేస్తారు. ఈ విషయాలను సమగ్రం గా వివరించింది కేవలం మధ్వులు మాత్రమె. మధ్వాచార్య కాలానికే అంతరించి పోతున్న, మరచిపోయిన వేదవాగ్మయం, పంచారాత్ర స్మృతుల ఆధారం గా మధ్వులు ఈ వివరాలను తెలియచేసారు. వీటి ఆధారం గానే ఉపనిషత్తులను ఇతర వేదవాగ్మయాన్ని వ్యాఖ్యానించి సమన్వయము సాధించారు మధ్వులు. తద్వారా దేవ లోకానికి మనుష్య లోకానికి ఉన్న అవినవభావ సంబంధాన్ని తేటతెల్లం చేసారు. ప్రస్థాన త్రయానికి భాష్యం వ్రాసిన ఏ ఆచార్యుడూ ఈ సమన్వయాన్ని సాధించలేదు.

తత్వాభిమాని దేవతల అనుగ్రహం వలెనే హరి అనుగ్రహం పొందగలరు సాధకులు. ఎందుకంటే ఈ దేవతలు అత్యుత్తమ హరి భక్తులు. తారతమ్యం లో దేవతలు మానుష సాధకుల కంటే ఎంతో ఉచ్చ స్థితి లో ఉన్న జ్ఞానయోగులు, స్వప్రకాశకులు. ఈ తత్వాభిమాని దేవతలే మనలో ప్రచోదనం చేసి మన సాధనకు తగ్గ ఫలాని ఇస్తూ ప్రోత్సహిస్తారు. వీరి సహాయం వలెనే మన శరీరం, మనస్సు బుద్ధి ఆధారం గా మన సాధన హరి వైపు సాగుతుంది.

దేవతలు శ్రీహరి యొక్క ప్రకాశాన్ని ప్రసారం చేసే సాధనాలు. వీరిలో ముఖ్యప్రాణుడు జీవోత్తముడు, దేవ తారతమ్యంలో ఉత్తమాధికారి. మానవుల సాధనా మార్గం లో దేవతలు నిర్దేశికులు. కాబట్టి భక్తి అనే అత్యుత్తమ సాధనా మార్గాన్ని వివరించాలంటే దేవతల, ఋషుల పాత్ర అవశ్యం వివరించాలి. దేవతల ఋషుల సాధన కొన్ని కల్పాల కు విస్తరించి ఉంటుంది.

ఈ విధం గా మధ్వులు ముప్పై మూడు కోట్ల దేవతలను (supposedly endless Polytheism) మానవులు చేసే సాధనతో, భక్తి మార్గంతో సమన్వయం చేస్తూ భారతీయ తత్వ శాస్త్రం లో(వేదాల ను పురాణాల ను ఉటంకిస్తూ) విష్ణు సర్వోత్తమత్వాన్ని (the fundamental Monotheism of rational philosophy) తారతమ్యం ఆధారం గా ఆవిష్కరించారు, ఒక అద్భుతమైన జ్ఞానాన్ని ప్రసాదించారు.

అభాసకోస్య పవనః పవనస్య రుద్రః శేషాత్మకో గరుడ ఏవ చ శక్రకామో
వీన్ద్రేసయోస్తదపరే త్వనయోశ్చ తేశామృష్యాదయః క్రమశ ఊనగుణాః శాతాంశాత్ (*KathaUp*. ii.2.13)

మధ్వులు మూడు రకాలుగా భక్తిని విభజిస్తారు:
౧. పరోక్షజ్ఞాన సిద్ధికి ముందు (mediate knowledge of the Deity),
౨. పరోక్షజ్ఞాన సిద్ధి అనంతరం
౩. అపరోక్షజ్ఞాన సిద్ధి తరువాత (*after direct realization*)

మూడవ స్థితిలో ఉన్న భక్తి లోనే సాధకులకు భగవంతుని అత్యర్థప్రసాదం (absolute grace) దక్కుతుంది. అప్పుడే బింబ (ఈశ) ప్రతిబింబ (దాస) స్థితి సుస్పష్టం గా సాధకునికి అవగతమౌతుంది తద్వారా సాధన సంపూర్ణమౌతుంది. ఈ మూడు విధాలైన భక్తి స్థితులను జయతీర్థులు పక్వభక్తి, పరిపక్వ భక్తి, అతి పరిపక్వ భక్తి అని వ్యాఖ్యానించారు. ఆఖరి స్థితి లోనే సాధకులు సుఖరూపాలను పొంది అనంతానందభూతిని (a crescendo of inffable joy) పొందుతారు.

భక్తి మార్గంలో మధ్వులు వివరించిన ఈ స్థితి సాధకులకు స్ఫూర్తి దాయకమైన ఒక అద్భుతమైన ఆవిష్కరణ. బెంగాలు లో గోస్వాములు – చైతన్య సాంప్రదాయం , మరాఠా దేశం లోని యోగులు భక్తి ని ఒక సాధనం గా కాక భక్తే సర్వశ్వం గా భావించారు. ఈ భక్తి యొక్క ప్రకాశం కేవలం జనన-మరణ చక్రం నుంచి పొందే ముక్త స్థితిలో మాత్రమె కాక మోక్ష స్థితి లో సైతం భాసిస్తూ ఉంటుంది. ఇదే జీవుల స్వరూపానందం. అందుకనే మోక్ష స్థితిలో ఆత్మనాశనము కాదు స్వరూపానందాన్ని ఆస్వాదిస్తూ తనదైన, వయక్తిక మొక్షానందాన్ని అనుభవిస్తూ అవినాశి గా ఉండిపోతుంది. ఈ స్థితినే ఒక తమిళ కవిసాధువు తాయుమనవార్ అనే ఆయన చక్కగా చెప్పారు " *Enru nan anru ni : un adimai allavo*" ఎప్పుడు నువ్వున్నవో అప్పటినుంచీ నేనూ ఉన్నాను (I and Thou are coeval), కానీ నేను నీకు ఎప్పుడూ దాసుడనే కదా? (But then am I not your slave all the while?). ఇదే విషయాన్ని కఠోపనిషత్తు (*KathaUp*. ii.2.13) తెలియచేస్తుంది. మోక్షం అనగా సాధకుని కి అంతర్గతమైన స్వరూపానందానికి తొలగిన బాహ్యమైన అచ్చాదనం. జీవునికి ఈశ్వరునకు మధ్యన ఉన్న ఆకర్షణ ముక్త స్థితి లో ప్రబలమౌతుంది. సంసారం లో ఉన్న సాధకులకు ఈ ఆకర్షణ శక్తి అంతగా అనుభవం లోకి రాదు, ఒకచో వచ్చి పోతూ ఉంటుంది కూడా. కాని ముక్త స్థితిలో పొందే అనుభవం మాత్రం సంసారం లో ఉన్న జీవులకు తెలియని విషయం కాబట్టి దీనిగురించి, దీనిని (స్వరూపానందాన్ని) వివరించి చెప్పడం సాధ్యం కాదు. ముక్తి లో వయక్తిక స్థితి ధ్వంస మైతే ఆ ముక్తి కి అర్థం ఉండదు. జీవి పరమాత్మ కాజాలడు. ఇది మధ్వులు అందించిన అమోఘమైన తత్వ శాస్త్ర విజ్ఞానం. భాగవత పురాణం లో చెప్పబడ్డ సనకసనందనాదులు పొందే మోక్షానందాన్ని వివరించడం కుదరదు ఎందుకంటే మోక్షం సిద్ధించిన తరువాత కూడా భక్తి భావనతో వారు శ్రీ హరి తో ఒక అవినవభావసంభందాన్ని పొంది ఉంటారు. వీరు సాయుజ్య స్థితిని సైతం కాదని ఆత్మనివేదన చేసి భక్తి తత్పరత తో బ్రహ్మానందాన్ని పొందుతూ ఉంటారు – నైకాత్మ్యతాం మే స్పృహయంతి కేచిత్ (*Bhag* iii.25.34). ఏకత్వమప్యుత్ దీయమానం న గృహ్ణాతి – సాయుజ్య స్థితిని సైతం తిరస్కరించే భక్తి పారవశ్యం. మధ్వులు స్వయం గా ఈ పారవశ్యాన్ని అనుభవించే స్థితిలో ఉండి ఆయన వ్రాసిన మహాభారత తాత్పర్యనిర్ణయ గ్రంథం లో దీనిని వివరం గా ఇలా తెలియచేస్తారు:

యః సర్వగుణసంపూర్ణః సర్వదోషవివర్జితః

ప్రీయతాం ప్రీత యేవాలం విష్ణుర్మే పరమః సుహృత్ !!

శంకరాద్వైతం లో భక్తి కేవలం జ్ఞాన సముపార్జన చేయడానికి ముందు వ్యవహారిక స్థితి లో ఉండే సాధనా మార్గం కనుక, జ్ఞానమే ప్రధానమైన మార్గం కనుక, భక్తి తత్పరత పట్ల మధ్వులు చెప్పినంతగా శంకరులు చెప్పలేదు. శంకరులు భక్తికి తక్కువ స్థానం ఇవ్వడమే ఇందుకుగల కారణం. కానీ మధ్వులు మాత్రం జ్ఞాన పూర్వక భక్తి, మహాత్మ్య జ్ఞానం, ప్రేమ భక్తి తో మేళవించి భక్తి కి ఒక అపురూపమైన స్థానాన్ని సాధనలో ఆవిష్కరించారు. శ్రావణ, మనన, ధ్యానాలతో కూడికొని ఉన్న ఉపాసన ద్వారా భక్తి ని తెలియచేసారు.

సాధనా భక్తిని గూర్చి మధ్వులు గీతా తాత్పర్య నిర్ణయ గ్రంథం లో ఇలా వివరిస్తారు :

భక్త్యా ప్రసన్నః పరమో దధాద్ జ్ఞానమనాకులం
భక్తిం చ భూయసీం తాభ్యాం ప్రసన్నో దర్శనం వ్రజేత్
తతో ऽ పి భూయసీం భక్తిం దధాత్తాభ్యాం విమోచయేత్
ముక్తో ऽ పి తద్వశే నిత్యం భూయోభక్తిసమన్వితః

తాత్పర్యం: సాధకుల భక్తి తో ప్రీతి చెందిన పరమాత్మ తన అనంత గుణ స్వభాన్ని తెలిపే జ్ఞానాన్ని పొందే అనుకూలతను సాధకులకు ప్రసాదిస్తాడు. అటుపై తన దర్శన భాగ్యాన్ని ప్రసాదిస్తాడు. తదనంతరం సాధకుల భక్తిని మరింత ఇనుమడింపచేసి వారి ప్రాకృతిక బంధనుంచి విముక్తులను చేస్తాడు, ముక్త స్థితిని పొందిన సాధకులు సదా భక్తిభావం తో భగవంతునికి వశులై ఉంటారు.

నిత్యముక్త అయిన లక్ష్మి (శ్రీ) విష్ణువు తో కలసి ఒకవిధమైన సమాన స్థితిలో ఉంటూ ఆయనకు అత్యంత గొప్ప భక్తురాలుగా సదా ఉంటుంది అని మధ్వులు ఒక్కరే వివరించారు. సాయుజ్య స్థితి సైతం కాదని సనకసనందనాదులు ఏకాంత భక్తులు గా ఉండడానికి ఇష్టపడ్డారు అని మధ్వులు గీతా భాష్యం లో తెలిపారు.

ఎక్కడ మన వేద వాగ్మయం లో జ్ఞానమే మోక్షాన్ని ఇస్తుంది అని చెప్పబడిందో అక్కడ జ్ఞానం అంటే భక్తి తో కూడికొని ఉన్న జ్ఞానమే. జ్ఞానం భక్తి కి పర్యాయపదం. మహాత్మ్య జ్ఞానం, స్నేహం (ప్రేమ) తో కూడికొని ఉన్న భక్తి నే అసలైన జ్ఞానం అని కూడా అర్థం చేసికోవాలి. శంకరుల జ్ఞాన-మోక్ష వాదాన్ని ఈ విధం గా మధ్వులు ఖండించారు. కాబట్టి జ్ఞానం తో భక్తి ఉన్న అవినవభావ సంబంధాన్ని "ఏకదేశేన ఏకదేశిలక్షణ" (the implicit reference by one constituent factor to the other) అనే సంబంధం ఆధారం గా గ్రహించాలి.

అలాగే జ్ఞానం లో ఇమిడి ఉన్న ప్రేమ పూర్వక భక్తి ని అజహల్లక్షణం (part put for the whole) గా అన్వయించాలి. ఈవిధమైన అన్వయం భక్తి-జ్ఞాన యోగాలకు మధ్వులు అందించి భారతీయ వేదాన్తులలో ఒక ప్రత్యేక మైన స్థానాన్ని పొందారు.

***

౪౯. ధ్యానము దాని స్థానము

అపరోక్ష జ్ఞానం (*direct perception* of God**)** ద్వారానే సంసార విముక్తి లభ్యం. తత్వతః అవ్యక్తమైన పరమాత్మ వ్యక్తం కావాలంటే ఆయన కృప ఉండాలి. ఎంత వారకూ వ్యక్తమైతే సాధకుడు చూడగలడో అంతవరకూ మాత్రమె వ్యక్తమౌతాడు పరమాత్మ. అతని అనంతమైన స్వరూపాన్ని మాంస నేత్రాలు చూడలేవు కనుకనే అర్జునునకు దివ్య చక్షువులు ఇచ్చి మరీ తన విశ్వరూపాన్ని చూపాడు కృష్ణుడు. అది చూసి దిగ్భ్రమ చెంది (దిక్కులు తెలియని స్థితి కలిగి) అర్జునుడు ఉపసంహరించమని వేడుకొన్నాడు.

కేవలం సుదీర్ఘమైన ధ్యానం ద్వారానే అపరోక్ష జ్ఞానం సిద్ధిస్తుంది. ఎప్పుడైతే సాధకుడు నారాయణుని పరిపూర్ణత్వం పై స్థిర బుద్ధి తో భక్తి తో శక్తిమేరకు సాధనచేస్తాడు అప్పుడే భగవానుడి కృపకు పాత్రుడై అతని సాక్షాత్కారాన్ని పొందగలుగుతాడు. ఇట్టి ధ్యానానికి యోగ్యతమేర ప్రాధమిక అధ్యయనం చేయాలి (అది శ్రవణం కూడా కావచ్చు) అటుపై చదివిన, విన్న విషయాలపట్ల చింతన చేసి సదవగాహన సాధించాలి (మననం). అటుపై మనసు లో కలిగే వివిధ సంశయాలను నివృత్తి చేసుకోవడానికి తత్వ విచారణ జరగాలి. ఇక్కడే మధ్వులు కేవలం సమన్వయం సాధించడం కోసమే తర్కాన్ని వాడాలి కాని ఇతరులను కించపరచడానికో సమన్వయం తో సంబంధం లేని విషయంవాడమో చేయకూడదు అని హెచ్చరించారు. శ్రవణ, మనన నిదిధ్యాసన కలిపి జిజ్ఞాస అని అంటారు. అటుపై జరిగేది కేవలం ధ్యానమే. శాస్త్రార్థాలను తెలుసుకోవడం ఒక స్వతంత్రమైన ఉపాసన. ఈ ఉపాసనలో వచ్చే సంశయాలను ఒక సద్గురువు ద్వారా పరిష్కరించుకొని ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ధ్యానాన్ని కొనసాగించాలి. ఒక వేళ సద్గురు దొరకడం దుర్లభమైతే సాధికారం గా కొందరు గురువులు చేసిన వ్యాఖ్యానాలను చదివి సంశయ నివృత్తి చేసికోవాలి. యోగ శాస్త్రం చెప్పిన విధం గా ఈ ధ్యాన ప్రక్రియను యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహర, ధారణ మొదలగు ప్రక్రియలను ధ్యానం తో అనుసంధానం చేయాలి. అట్టి ధ్యానాన్ని “అవిచ్చిన్న పరోక్షజ్ఞానసంతత:” అని దీనినే సమాధి స్థితి అని చెబుతారు.

శ్రవణ మనన ధ్యానాల ద్వారా కలిగిన పాండిత్యం, మౌనానికి దారితీస్తుంది, ఆ మౌనం అంతః శోధనకు ఉపకరిస్తుంది అదే బ్రహ్మణ్య స్థితి అని బృహదారణ్యక ఉపనిషత్తు చెబుతుంది (*Brh Up* iii.5.1). శంకరులు కూడా ఇదే విషయాన్ని గీతా భాష్యం లో ఉటంకించారు *GB* (ii.11).

***

౩౦. ప్రతీకోపాసన

పలు ఆరణ్యక వాక్యాలు, ఉపనిషద్వాక్యాలు ప్రతీకోపాసనగూర్చి వివరించాయి. ఒక అధిదైవ స్వరూపమో లేక ఒక నామమో ఆధారం గా ఉపాసన జరుగవచ్చు.

నామ బ్రహ్మేత్యుపాసీత్, మనో బ్రహ్మేత్యుపాసీత్, అన్నం బ్రహ్మేతి వ్యజానాత్, అధిదైవతం ఆకాశో బ్రహ్మేతి. ఇలా అధిభౌతిక, ఆధ్యాత్మ అంశాల ఆధారం గా అభేదోపాసన చేయవచ్చు. కాని గమనించవలసి విషయం ఏమంటే ఈ విధమైన ఉపాసనలు సూచనాత్మక ధ్యాన క్రియలు. ధ్యానం లో స్థిరత్వాని సాధించడానికి ఇవి ఉపకరిస్తాయి. అప్పుడు బ్రహ్మమనే భావన ఈ ప్రతీకలలో ప్రేరేపించి ధ్యానం చేయడం జరుగుతుంది. ఇది శంకరులు ఇచ్చిన వివరణ. రామానుజులు కూడా దీనితో ఏకీభవిస్తారు.

ప్రతీకోపాసన విషయం లో మధ్వాచార్య ఆలోచన పై వివరణకు భిన్నం గా ఉంటుంది.

న ప్రతీకే న సః
ప్రతీకలలో బ్రహ్మత్వాన్ని ప్రేరేపించవలసిన అవసరం లేదు ఆ ప్రతీకలో ఉన్నది పరబ్రహ్మమే అని ఉపాసన చేయాలి అంటారు మధ్వులు .

ఆరణ్యకాలు, ఉపనిషత్తులు రహస్యాలను కొందరు (అధికారులు, ప్రత్యేకమైన సాధన అధ్యనం చేసిన వారు) మాత్రమె అర్థంచేసుకోనేలాగు చెప్పడానికి ప్రసిద్ధాలు. పరోక్షప్రియా ఇవ హి దేవా ప్రత్యక్షద్విషః అని చెప్పినట్లు అవి వివరించిన ప్రతీకోపాసన పరోక్షంగా ఉంటుంది. కానీ ప్రతీకోపాసన ఇలా బ్రహ్మమును ఒక ప్రతీక లో ఆపాదించి, ప్రేరేపించి చేయడం ద్వారా ఒక పరిమితమైన ఉపాసనకు సాధకుని బద్ధుడుగా చేస్తుంది అని మధ్వాచార్య ఉవాచ.

భగవానుని గాలిలో, అగ్నిలో, ఔషధులలో, నిగిలో, నేలలో, వనాలలో, శిఖరాలలో, అంతటా, అన్నిటా చూడగలగడం సాధించిన పిదప ప్రతీకోపాసన లో ఆ అనుభూతులు సమన్వయ పరచగా పొందే ఆనందమే వేరు. కనుక ఏదైతే ఉపాసన చేయబడుతుందో (ఉపాస్య = పరబ్రహ్మ) అది ఆ ప్రతీక యొక్క స్థితిని పెమ్పొందిన్చినా అది సాధకుని సాధనను పరిమితం చేసి తద్వారా అతని ఆధ్యాత్మ స్థితిని దిగాజార్చకూడదు. రాళ్ళను రాప్పలను పూజిస్తారు ఈ భారతీయులు అని హేళన చేసే వారికి మధ్వులు సరియైన సమాధానం గా ఈ క్రింది బ్రహ్మోపాసనా మార్గాన్ని సూచిస్తారు:

అనంతగుణ పరిపూర్ణుడు గా పరబ్రహ్మను తెలుసుకొన్న మీదట, అట్టి పరబ్రహ్మన్ని ధ్యానం చేయడానికి ఆ ఆనంతమైన గుణాలలో ఒకటో రెండో - ధారణా శక్తి ని బట్టి మనసుకు హత్తుకున్న - గుణాలను తీసుకొని వాటిపై ధ్యానాన్ని నిలపాలి. నాలుగు గుణాలను ఒక సాధకుడు తీసుకొని ధ్యానం చేయగలడు. కేవలం ఒక్క గుణాన్ని మాత్రమె ధ్యానం లో నిలుపుకోగల సాధకులను తృణ జీవులు అని అంటారు.

ఇక్కడ మా గురువులు గోదావరి పుష్కరాలపై వ్రాసిన ఒక చిన్ని వ్యాసం లో చెప్పిన మాటలు ఈ సందర్భం లో ఉచితమైనవి:

“పుణ్య సంపాదనయే మనుష్య జన్మ ప్రధానోద్దేశ్యం అని పురాణ కథల ద్వారా తెలిసివస్తుంది.

స్థూలంగా పుణ్యం అంటే మంచితనం అని చెప్పవచ్చు. సచ్ఛీలత, సద్వర్తన, సత్యశీలతలను ప్రతి నిత్యం ఆచరించడమే పుణ్య సంపాదనకు మార్గాలు. భారతీయ సనాతన సాంప్రదాయం ప్రకారం ప్రతి వ్యక్తి బ్రహ్మచర్యం, గృహస్థ, వానప్రస్థ, సన్యాసం అనే ఆశ్రమ రీతుల ద్వారా కూడా పుణ్య సంపాదన చేయవచ్చు. ఇవన్నీ వ్యక్తి యొక్క అంతర్నివిష్టాలైన చెడు చింతనలను రూపు మాపడానికి ఉద్దేశించినవి.

అంతరంగ శుద్ధికి భారతీయ సాంప్రదాయం ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో బహిరంగ శుద్ధికి అంతే ప్రాధాన్యం ఇచ్చింది. ఇందులో భాగంగానే మడి, మైల అన్న భావనలు, గ్రాహ్య, అగ్రాహ్య వస్తు విభేదాలు, తీర్థ క్షేత్ర పర్యటన విధులు వచ్చాయి.

విశ్వాధారకుడు, విశ్వాత్మకుడైన పరమాత్ముడు సమస్త విశ్వం తానేయై భాసించే సర్వాంతర్యామి. అతను లేని, అతను దొరకని, అతనిని కాంచలేని కాలం కాని, పదార్థం కాని, ప్రాంతం కాని ఈ సృష్టిలో లేవు. అన్నింటినీ తనలో ఇముడ్చుకున్న స్వామి అన్నింటిలోను తాను ఇమిడి ఉన్నాడు.

ఆకలి వేసిన బిడ్డ ఏడుస్తూ అమ్మ దగ్గరికి వస్తుంది. ఆకలితో ఏడుస్తున్న బిడ్డ దగ్గరకు తల్లి పరుగెడుతుంది. ఈ రెండింటిని మనం ఈ వాస్తవ జగత్తులో చూస్తూనే ఉన్నము. అలాగే జ్ఞానులు, యోగులు, మహానుభావులు తాము ఉన్న చోటుకే ఆ పరాత్పరుని రప్పించుకుంటారు. సాధనా మార్గంలో బుడి బుడి అడుగులు వేస్తున్న చిన్నారి భక్తులకు తన వద్దకు రప్పించుకుంటాడు. అలాంటి ఒక ప్రయత్నమే "తీర్థ పర్యటన". "

"సచ్చిదానంద ఆత్మేతి మనుస్సైష్యు సురేశ్వరై:
యథాక్రమం బహుగుణై: బ్రహ్మణా త్వఖిలైర్గుణై:"

మనుష్య సాధకులకు పరమాత్మ యొక్క నాలుగు గుణాలను మాత్రమె ధ్యానంలో ఉపాసన చేయడానికి సాధ్యమైతే, దేవతలు, ఋషులు వారి తారతమ్యం, యోగ్యత, ధారణా శక్తి ఆధారంగా ఎక్కువ సంఖ్యలో నారాయణుని గుణాల పై ధ్యానం చేయగలరు. చతుర్ముఖ బ్రహ్మ మాత్రమె శ్రీహరి కున్న సమస్త గుణాలలో చాల వరకూ ధారణ లో ఉంచుకొని ధ్యానం చేయగలరు.

ఈ విధమైన ధ్యానాన్ని గుణోపసంహార ధ్యానం అని అంటారు. ఈ విషయాన్ని బ్రహ్మ సూత్రాలు తెలియచేస్తాయి - *BS* iii.pada 3. పరమాత్మ కున్న అనంత గుణాలలో భుమత్వమనే గుణాన్ని (infinitude) ప్రముఖమైనదిగా తెలిసికొనడానికి ఆనందం, జ్ఞానం, సత్యం, మొదలగు గుణాలను జోడించి ధ్యానించాలి. అనగా, దీని అర్థం పరమాత్మ యొక్క ప్రతి గుణమూ అనంతత్వంతో కూడి ఉంటుంది. ఉపనిషద్వారం ఆతని పూర్ణత్వాన్ని అన్నివిధాలుగా తెలియచేస్తుంది. ఈవిధమైన ఆలోచన విధానంతో ధ్యానం చేస్తేనే అది ఉత్తమమైన ఆధ్యాత్మ సాధనగా పరిగణింపబడుతుంది - యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి భూమైవ సుఖం (*ChanUp* vii.23).

సాధకుల గ్రాహ్యత (Perception), సంగ్రహణ (comprehension) వారి స్వభావం, యోగ్యతా, ధారణా శక్తి, ఆధారంగా ఈ భూమత్వ గుణం పై వారి అవగాహన ఆధారపడి ఉంటుంది కనుక పరమాత్మా యొక్క అనంతత్వం పై ఉపాసన చేయడం వయక్తిక అనుభవం. జయతీర్థులు ఈవిషయం లో ఒక ఉదాహరణ ఇస్తారు:

విశ్వావిర్భావం జరిగి ఇప్పటికి లెక్కకు మిక్కిలి సంవత్సరాలు గడచిపోయాయి. మన జీవిత కాలం లోజరిగిన మార్పులపై మనకు ఒక అవగాహన ఉంది (ఉదా: స్మార్ట్ ఫోన్ రాక మునుపు వచ్చిన తరువాత) అలాగే భగవంతుని అనంత గుణపూర్ణత్వం పై కూడా. మనలో ఆధ్యాత్మభావన అంకురించిన క్షణం నుంచి ఇప్పటి వరకూ మనకు భగవంతుని పట్ల ఉన్న విశ్వాసం దీనికి ప్రాతిపదిక. ఎలా

అనంతమైన విశ్వం లో మన ఉనికి ఇతరుల ఉనికి తెలుసుకోగాలమో, ధ్యానం లో మనకు పరమాత్మ యొక్క అనంత గుణపూర్ణత్వం తప్పక తెలుస్తుంది.

***

౨౧. బిమ్బోపాసన

గతం లో చెప్పినట్లు పరమాత్మపై నిరంతర పరతంత్రమైన సంబంధం కలిగి ఉండడం జీవుల స్వభావం. ఈ పరతంత్ర స్థితి కేవలం జీవుల అస్తిత్వానికి మాత్రమె కాదు వారి మార్పుకి కూడా చెందినది. ఈ పరతంత్రం భౌతికమైన విషయం కాదు ఒక అలౌకిక విషయం. దీనికు ఉపమానం ఉండదు. మధ్వులు అందించిన భావన "బిమ్బప్రతిబింబభావ" మాత్రమె దీనికి దగ్గరి వివరణ. ఇది అద్వైతం చెప్పినట్లు ఉపాధుల పై అపాదిన్చబడ్డ సంబంధమనే భావనతో కాక జీవులకు పరమాత్మ తో ఉన్న అనాదియైన, అనశ్వరమైన స్వరూప సంబంధం గా చూడాలి.

జీవుడు యావదత్మాభావి అని బ్రహ్మసూత్రాల లో (*BS* ii.3.30) **చెప్పబడింది. జీవుడు సత్యం, జ్ఞానం, ఆనందం అనే లక్షణాలతో ముక్త స్తితిలో భాసిస్తాడు. కాబట్టి అనాదిగా జీవుడు ఈ సంబంధాన్ని కలిగి ఉన్నాడు అని అర్థం. ముక్త స్తితిలో మాత్రమె ఈ సత్యాన్ని పూర్తిగా తెలుసుకొని తారతమ్యం అనుసరించి మోక్షానందాన్ని అస్వాదిస్తాడు. సంసారంలో ఉండడం అంటేనే ఈ సంబంధాన్ని కోల్పోవడమే (బిమ్బప్రతిబింబ భావనని మరచిపోవడమే). సంసారంలో కలిగే "నేను నా సత్తాకు ప్రతీతికి, ప్రవుత్తికి స్వతంత్రుడను" అనే భావన జీవి కలిగి ఉంటాడు. ఇదే స్వతంత్ర భావన వలన చాల మంది సాధకులకు అద్వైతం చెప్పిన నేనే బ్రహ్మ అనే మాట భలే భరోసాను ఇస్తుంది తద్వారా వారి సాధనలో ఆ నాలుగు మహా వాక్యాలను మాత్రమె ఆమ్నాయం చేసుకొంటూ ఒక విచిత్రమైన స్థితి కి అట్టి సాధకుల్ని తీసుకొని వెళుతుంది!!**

అందువలనే బిమ్బోపాసన ముఖ్యమైన ఉపాసనా మార్గం తద్వారా అపరోక్షజ్ఞాన సిద్ధి సాధ్యం ఔతుంది. సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ, ఆనందో బ్రహ్మ అని త్రికరణ శుద్ధి గా (మనసా వాచా కర్మణా) నమ్మి చేసే సాధన వలెనే సాధకులు తమ సాధనను పరిపక్వ స్థితికి తీసుకొని వెళ్ళగలరు. మోక్షం మరణానంతరం సంభవించే సంఘటన కాని జీవుడు తన దేహాన్తరయానం (transmigratory career **) లో ఎన్నో జన్మలు ఎత్తి ఎన్నో అనుభవాలను పొందుతాడు. ఈ దేహాన్తరయానం లో చేసిన బిమ్బోపాసన కూడా సంచితమై**

జీవికి ఒకానొక జన్మలో సంభవించిన మరణానంతరం మోక్షం సిద్ధిస్తుంది. కనుక బిమ్బోపాసన అనేది జీవుడు – ఈశ్వరుని తో చేసే ఒక అలౌకిక సాంగత్యం ఇది మధ్వులు అందించిన ఒక అద్భుతమైన వివరణ. ఇదే బిమ్బోపాసన, బిమ్బపరోక్ష అనే ఉపాసనకు ఉన్న అసలైన అర్థం. ఈ అలౌకిక సాంగత్యాన్ని మాటలు వర్ణించ లేవు, మనసు ఊహించలేదు. బింబ రూపం లో ఈశ్వరుడు జీవి యొక్క హృదయం లో ఉండే వాడు (హృద్యేతర్జున తిష్టతి). అట్టి పరమాత్మకు జీవుడు ప్రతిబింబం.

హృదిస్థా యా హరేర్మూర్తి: జీవో యత్ప్రతిబిమ్బకః
యద్వశే వర్తతే జీవ: సా తు జీవకలా స్మృతా

***

౫.౨. ముక్త స్థితి – భగవద్కృప

భగవంతుని తెలుసుకోవడం అంటే కేవలం తను ఉపాసించే ప్రతీక పట్ల సాధకునికి ఉన్న ఒక విజ్ఞానం మాత్రమె కాదు. బిమ్బప్రతిబింబ భావన పట్ల సాధకునికి లభించిన జ్ఞానం ఆధారం గా భగవంతుని గూర్చి సాధకునిలో నిరంతరం కలిగే ఆత్రుత, భగవంతుని పట్ల ఆకర్షణ కలిగి ఉండడమే నిజమైన జ్ఞానం. కాబట్టి భక్తిలో అవశ్యం జ్ఞానం, పరమాత్మతో గల సంబంధం మిళితమై ఉండాలి. ఇట్టి జ్ఞానం మాత్రమె భగవద్ కృపను పొందడానికి మనకు ఒక అర్హతను ఇస్తుంది. కేవల జ్ఞానం ముక్తికి దోహదపడుతుంది అని అనుకుంటే అది భ్రమ మాత్రమె. భగవద్కృప పొందగలిగిన జ్ఞానం ఆర్జించిన మీదట అది మోక్ష హేతువు ఔతుంది.

అద్వైతం చెప్పినట్లు సంసార బంధం కేవలం ఒక విచిత్రమైన అవిద్య (అజ్ఞానం) అది ఆత్మను కప్పి ఉంచుతుంది. ఒక్కసారి జ్ఞానోదయం కాగానే ఆ అవనిక తొలగిపోయి ఆత్మ పరమాత్మ అభేదం అని తెలిసిపోవడమే అపరోక్షజ్ఞానం. ఈ ప్రక్రియలో పరమాత్మ అనుగ్రహం తో పనిలేదు. జానార్జన చేసి ఆ మాయ లేదా అవిద్య తొలగిపోతే అంటే అవిద్య నివృత్తి అయితే జీవ-బ్రహ్మైక్య స్థితి లభ్యమైపోతుంది. అంటే జ్ఞానం యొక్క శక్తి ద్వారానే జీవుని అవిద్య తొలగి పోతుంది. దీని అర్థం అవిద్య నివృత్తిలో భగవద్కృప అనే అంశానికి తావులేదని! తదనంతరకాలం లో వచ్చిన అద్వైతులు అద్వైత సిద్ధాంతం వంటబట్టాలంటే/ అద్వైతామృత రుచి చూడాలంటే భగవద్కృప అవసరం అని ఒక చిన్న సవరణ చేసారు. ఇటువంటి బ్రహ్మజ్ఞానవాదాన్ని (బ్రహ్మమును తెలుసుకొంటే బ్రహ్మమే తానవడం అనే వాదన) మధ్వులు అసలైన ఆస్తిక భావన కాదని చెబుతారు. శ్రుతి వాక్యాల ను సమన్వయము చేస్తే తెలిసేది ఒక్కటే, ముక్తి

పొందాలంటే జీవునికి భగవద్కృప చాల అవసరం. ఆ కృప కలగాలంటే జీవుని **భక్తి లో అవశ్యం పరమాత్మ మహాత్మ్య జ్ఞానం, పరమాత్మ తో గల అనాదియైన సంబంధం పట్ల జ్ఞానం మిళితమై ఉండాలి.**

అసలు జీవులు భావరూప జ్ఞానాన్ని పొందని స్థితి లో ఎందుకు ఉంటారు అనే దానిని ఉన్న ఒకే ఒక్క సమాధానం "అనాదికర్మపరంపర" అనాదిగా జీవులు చేస్తున్న కర్మల వలన జీవుడు తన భావరుపజ్ఞానాన్ని కోల్పోతాడు అని రామానుజులు చెబుతారు. కానీ ఇది పూర్తీ సమాధాన్ని ఇవ్వలేదు. జీవుడు కామము తో కర్మలు చేసి తద్వారా సంసార బంధనం లో చిక్కుకొని అజ్ఞానమావరించిన మనసు కలవాడై ఉంటాడు. ఇట్టి జీవుడు సాధన చేసి బిమ్బప్రతిబింబ భావనను అవగతం చేసుకొనే రీతి జ్ఞానార్జన చేసిన పిదప కలిగే భక్తి బావంలో ధ్యాన మగ్నుడైనపుడు పరమాత్మ కృపకు పాత్రుడై, అపరోక్ష జ్ఞానాన్ని పొందుతాడు. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు చెప్పినట్లు రాబోయే కాలం లో మార్మిక భావనే (Mysticism) **అసలైన మతం గా చెలామణి ఔతుంది. అపరోక్ష జ్ఞాన సిద్ధిలో ఉన్న ఒకే మర్మం భగవద్కృప!!**

బ్రహ్మ సూత్రం "అమ్బువత్ గ్రాహణాం" కు మధ్వులు ఇచ్చిన భాష్యం అతి ప్రముఖమైన విషయం. మరొక్క మాటలో చెప్పాలంటే ఈ ప్రపంచం లో పుట్ట బోతున్న జీవులకు సైతం అర్ధం అయ్యే రీతిలో మధ్వులు ఈ సూత్ర భాష్యాన్ని వ్రాసారు:

జీవునికి ఈశ్వరుని తో ఉన్న ప్రతిబింబత్వ సంబంధం సత్యమైనది, నిత్యమైనది అలాగే పరతంత్రమైనది. ఇది ఉపాధులు మారినంత మాత్రం చేత మారే సంబంధం కాదు. ప్రతిబింబం భావన అంటే భౌతికమైన ప్రాణము లేని ప్రతిబింబము కాదు అలాగే తాత్కాలిక బింబం ద్వారా ఏర్పడిన ప్రతిబిమ్బమూ కాదు. ఇది ఒక సత్యమైన నిత్యమైన ప్రాణయుక్త ప్రతిబింబ భావన.

నీటికి స్నిగ్ధత ఎంత సహజమో నిజమైన సాధనకు భక్తి అంత సహజం. స్నిగ్ధత ను నీటి నుంచి ఎలా విడతీసి చూపలేమో అలా సాధనను భక్తిని విడిగా చూపడం సాధ్యం కాదు. దీనిని (ఇట్టి జ్ఞానాన్ని) సముపార్జించడమే అమ్బువత్ గ్రాహణా.

జీవునికి భగవంతునిపై గల ప్రేమ ఈ స్నిగ్ధత తో కూడికొని ఉండడం వలన ఆ జీవుడు భగవంతునికి సదా సంబంధియై ఉంటాడు. ఇటువంటి ప్రేమ ద్వారానే భగవంతునితో తనకు ఉన్న సంబంధాన్ని జీవుడు వ్యక్తం చేస్తాడు. కేవలం కామము, కర్మ వలెనే జీవుడు వివిధ ఉపాధులలో ఉండిపోతున్నాడు అని చెప్పినా జీవునికి సహజం గా ఉన్న అవకాశం ఈ ప్రేమను వ్యక్తం చేయడమే. అలా వ్యక్తం చేయడం వలన తన నిజ స్థితి కి జీవుడు మరల చేరగలడు, తన స్వప్రకాశత్వాన్ని తిరిగి పొందగలడు.

ఇక్కడ మనకు స్పష్టమౌతున్న విషయం ఏమంటే, కేవలం కామ్య కర్మాచరణ, సాధన, అవిద్య, అజ్ఞానం, మాయ, ప్రకృతి వలన మాత్రమె కాకుండా జీవుని ప్రస్థానం మరొక ప్రముఖమైన అంశం పై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే మాయ, ప్రకృతి కూడా స్వతంత్రంగా జీవునిపై తమ ప్రభావాలను చూపలేవు, ఇవి ఒక జడమైన సూత్రాలు మాత్రమె (insentient principle). మరి ఏది ఆ ప్రముఖమైన విషయం అంటే అదే హరి అనుగ్రహం!

ద్రవ్యం కర్మచ కాలశ్చ స్వభావో జీవ ఏవ చ
యదనుగ్రహతః సంతి న సంతి యదుపేక్షయా - భగవద్గీత ii 10 12

ఈవిధంగా జీవుని స్వరూప చైతన్యానికి ప్రకృతి (సత్వ, రజస్, తమో గుణాల) ఆధారం గా కొన్ని తెరలు కప్పి - వీటినే శాస్త్రాలు అవిద్య, మాయ అని పిలుస్తాయి – తద్వారా జీవుని స్వప్రకాశత్వాన్ని, స్వభావాన్ని తెలుసుకోకుండా అవి ప్రతిభంధకాలుగా మారతాయి. అందువలనే జీవుడు తన అచింత్యాభూత శక్తి (శోధనకు అందని శక్తి) ని కోల్పోయి సంసార చక్ర భ్రమణంలో చిక్కుకుంటాడు. స్కాంద పురాణం ఇదే మాటను ఇలా చెప్పింది:

బంధకో భావపాశేన భావపాశాచ్చ మోచకః కైవల్యదః పరం బ్రహ్మ విష్ణురేవ సనాతనః

ఈ స్వగుణచ్చాదికాలు (స్వగుణాని కి ఉన్న ఆచ్చాదనలు) తొలగి హరి కృపను పొందడానికి భక్తి వినా మార్గము లేదు. ఈ స్వగుణచ్చాదికాలకు ఉన్న మరో పేర్లే ప్రకృతి, మాయ. ఇవి తొలగాలంటే అనాది గుణ విస్తారం లో ఏర్పడ్డ అవిద్య సమసిపోవాలంటే హరి కృపే కావాలి. ఇది మధ్వులు అందించిన అద్భుత వ్యాఖ్యానం.

***

౨౩. అపరోక్ష జ్ఞానం (బ్రహ్మ సాక్షాత్కారం)

మధ్వులు ధ్యానానికి అపరోక్షస్థితి కి భేదాన్ని చెబుతూ: ధ్యానం ఒక అవిచ్చిన్న జ్ఞాన సంగ్రహ స్థితి ఆ స్థితి లో సాధకుడు తన మనోబలం ఆధారం గా బింబాన్ని ఊహించుకొని నిర్మించుకుంటాడు. కాని అపరోక్ష స్థితి భగవద్ సాక్షాత్కారం పొందడం అంటే బ్రహ్మమును నిజమైన బింబ రూపం లో చూడడం, వారి వారి తారతమ్యాన్ని, యోగ్యతను అనుసరించి. ఇదే విషయాన్ని ఋగ్వేదం చెబుతోంది:

రూపం రూపం ప్రతిరూపో భభూవ
తదస్యరూపం ప్రతిచక్షణాయ (*RV* vi.47-18)

సాధనలో ఉత్కృష్ట స్థితి ఏదంటే సాధకుడు తాను ధ్యానిస్తున్న బింబాన్ని (archetype) ముఖా ముఖి చూడడం. దీనినే బిమ్బపరోక్ష (penultimate state of final release) అని వేదాంతులు అంటారు. ఇది పొందిన వారే ముక్తి కి యోగ్యులు.

సాధకుని యోగ్యతానుసారంగా, సత్తా ఆధారంగా వారి సాధన యొక్క బలం (గుణ వత్త) ఆధారంగా ఈ పరోక్షజ్ఞాన సిద్ధి ఉంటుంది. మానవులలో ఇది ఒక మెరుపులా (విద్యుల్లతలా) వస్తుంది. దేవతలలో ప్రచండుడైన సూర్యునిలా గోచరిస్తుంది. గరుడ, రుద్రులకు వారి ముఖాలే వారికి అద్దం లో కనిపించినట్లు కనిపిస్తాయి. చతుర్ముఖ బ్రహ్మకు ఆద్యంతం బింబం (శ్రీ హరి స్వరూపం) గోచరమౌతుంది. పరమాత్మ అవ్యక్తుడైనప్పటికీ సాధకులు తమ సాధన ద్వారా పరమాత్మ కృపకు పాత్రులై అట్టి పరమాత్మ స్వరూపాన్ని యోగ్యతానుసారం చూడవచ్చు.

ఆత్మన్యేవాత్మాన్ పశ్యేత్ – ఆత్మ తన జ్ఞాన నేత్రం తో తనలోకి తిరిగి తన ఆత్మను చూస్తుంది (BrhUp. iv.4.23)
మనసైవేదమాప్తవ్యం (Katha Up. ii.1.11) అనే కఠోపనిషత్తు వాక్యం
నిదిధ్యాసనసంస్కృతమనసా అపరోక్షధీసంభవాత్ - (Nym iii.9).

పై స్మృతి వాక్యాలు అపరోక్ష స్థితిని మధ్వులు అందించిన అర్థం లోనే వివరించాయి.

వ్యాసతీర్థులు "యన్మనసా న మనుతే" అనే స్మృతి వాక్యాన్ని వ్యాఖ్యానిస్తూ మనసు ఆధ్యాత్మ శిక్షణను సాధనను, శ్రవణ, మనన, నిదిధ్యాసన చేయకపోతే, భక్తి భావం పరిపక్వ స్థితికి రాకపోతే అట్టి మనసు బింబాన్ని చూపలేదు. కనుక "సమ్యక్ కృతం = సంస్కృతం" చక్కగా మలచబడిన ఇంద్రియంగా తమ మనసుల్ని సాధకులు మార్చుకోన్నపుడే అపరోక్షజ్ఞాన సిద్ధి సాధ్యం.

రామానుజుల సిద్ధాంతం అపరోక్షజ్ఞాన్ని ఒక ప్రత్యేకమైన సాధానంశం గా పరిగణించదు. నిదిధ్యాసన ద్వారానే సాధన ఉత్కృష్ట స్థితిని పొందుతుంది అని చెబుతుంది. అంటే కేవలం ధ్యానం లో సాధకుడు ఊహించుకొన్న బింబ స్వరూపమే సాధనకు అంతం అని చెప్పడం. మధ్వులు ఇది (నిదిధ్యాసన) పరోక్షజ్ఞాన సిద్ధికి పూర్వ స్థితి గానే చెప్పారు. నిజమైన బింబ దర్శనం ఎప్పుడు జరుగుతుందో అప్పుడు సాధన ఫలవంతమౌతుంది, ముక్తి కలుగుతుంది. దీనికి రుజువులు గా ఈ క్రింది స్మృతి వాక్యాలు ఉన్నాయి:

దివ్యం దదామి తే చక్షు: పశ్యమే యోగామైశ్వర్యం (*Gita*, ix.8)
బుద్ధిగ్రాహ్యమతీన్ద్రియం (గీత vi. 2)
యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణం (*MundUp*, iii.1.3)
ఆత్మన్యేవాత్మానం పశ్యేత్ (*BrhUp*, iv.4.23)
ఏషోऽ పురాత్మా చేతసా వేదితవ్యః (*MundUp*, iii.1.9)
పరాత్పరం పురుషమీక్షతే (*PrasnaUp*,5)

అపరోక్ష జ్ఞానం స్మృతి సంతానం కాకూడదు అంటే సాధకుని మనసుకి సాధ్యమైన ఊహల ఆధారం గా బింబాన్ని దర్శిస్తే అది కేవలం దర్శన సమానాకార ఔతుంది కాని సాక్షాత్కారం కాదు. ధ్యానం లో ఉన్న సాధకునికి అసలైన బిమ్బపరోక్ష జ్ఞానం కేవలం హరి కృపవలనే సాధ్యం.

***

ముక్తి సిద్ధాంతం

౨౪. ముక్త స్థితి యొక్క స్వభావం దాని దశలు

ముక్తిని వివిధ సిద్ధాంతాలు వివిధ రకాలు గా వివరించాయి. ఈ వివిధత్వానికి కారణం ఆయా సిద్ధాంతాలు ప్రతిపాదించిన జీవ – ఈశ్వర సంబంధం.

బౌద్ధులు నిర్వాణ స్థితిని నమ్ముతారు. అనగా ఆత్మ యొక్క వ్యక్తిత్వ నాశనం. ఎందుకంటే బౌద్ధులు సంసారాన్ని, అనాదియైన అవినాశియైన ఆత్మను విశ్వశించరు. కనుక ఆత్మ యొక్క అస్తిత్వం ముక్తి

అనంతరం బౌద్ధుల ప్రకారం ఉండదు. సమకాలీన బౌద్ధ మతస్థులు నిర్వాణాన్ని కొంచం మార్పు తో నిర్వచిస్తున్నారు – ఆత్మ నాశనం కాదు అని. బౌద్ధం నైరాత్మ్యవాదం.

అద్వైతులు జీవ బ్రహ్మైక్య సిద్ధి అసలైన మోక్షం అంటారు. ఎందుకంటే ఆత్మ (జీవుడు) కేవలం బ్రహ్మము యొక్క స్వరూపం కాబట్టి బ్రహ్మమే వివిధమై జగత్తులో ఉన్నాడు అని వీరి వాదన. అవిద్య కారణం గా జీవుడు ఈ సత్యాన్ని ఎరుగక సంసారం లో వివిధ ఉపాధులు తీసుకొంటూ సంసారం లో చిక్కుకొని పోతున్నాడు అని అద్వైతం చెబుతుంది.

మధ్వులు అలౌకిక పరతంత్ర స్థితిలో జీవులు అనాదిగా భగవానుని తో సంబంధాన్ని కలిగి ఉన్నారు అని సప్రమాణం గా ఇంతవరకూ వివరించిన, చర్చించిన విషయాల ద్వారా తెలియచేసారు. యోగ్యత, తారతమ్యం, అనాదిత్వం, స్వభావం, మొదలగు లక్షణాలతో జీవులు ఒప్పి ఉంటారు. కాబట్టి ఈ లక్షణాలే ముక్త స్థితి లో సైతం ఆత్మకు వయక్తిక స్థితిని నిర్ణయించి తద్వారా మోక్షానంద తారతమ్యాన్ని కలుగచేస్తాయి.

ముక్త స్థితిలో జీవులు అన్ని రకాలైన సాంసారిక బాధల నుంచి, సుఖాల నుంచి ముక్తులై కేవలం ఆధ్యాత్మ ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటారు. ఈ స్థితిలో భయాలు, క్షీణత మొదలగు లౌకిక లక్షణాలకు అతీతం గా ముక్త జీవులు ఉంటారు.

విరాజో బ్రహ్మ లోకోన ఏషు జిహ్మం అనృతం న మాయా చైతి (PrasnaUp 1.16)

ఎందుకు సాధకులు మొక్షాశక్తత తో సాధన చేస్తారు? జీవుల స్వాభావం, తారతమ్యం ఇత్యాది లక్షణాల యొక్క ప్రభావం అలౌకిక స్థితి అయిన ముక్తి లో కూడా ఉంటె మరి అటువంటి ముక్తి ఏవిధం గా సాధకులను సాధన వైపు ప్రేరేపిస్తుంది వంటి ప్రశ్నలు, విమర్శలు రావడం సహజం.

ఇందుకు సమాధానం గా మధ్వులు:

సత్యాన్ని తెలుసుకోవడమంటే జీవన వైవిధ్యాన్ని తిరస్కరించడం కాదు. కేవలం నేను పరమాత్మ నుంచి వేరు, నేను స్వతంత్రుడను అనే సాంసారిక భావనలనుంచి ముక్తి కలిగి తన స్వరూపానందాన్ని అనుభవించడమే ముక్తి. ఇక్కడ సంసారిక లక్షణాలు ముక్తి లో ప్రతిఫలం కావు అవి నాశనమౌతాయి. కేవలం స్వరూప జ్ఞానం ద్వారా ఇది సాధ్యం ఔతుంది. ఈ స్వరూప జ్ఞానం సంసారం లో ఉండదు ఇదే ముక్త స్థితి కి లౌకిక స్థితి కి మధ్యన ఉన్న ప్రధానమైన భేదం.

అవినాశీ వా అరే s యమాత్మా అనుచ్ఛిత్తి ధర్మా (*BrhUp* iv.5.14)

ఈ ఉపనిషద్వాక్యం లో రెండు లక్షణాలు ఉన్నాయి.
౧. అవినాశి
౨. అనుచ్ఛితి ధర్మ అంటే జీవి యొక్క స్వభావం సమసిపోదు అని అర్థం.

మొదటి లక్షణం బౌద్ధ సిద్ధాంతాన్ని, రెండవ లక్షణం అద్వైతాన్ని (నిర్విశేష చిన్మాత్ర వాదాన్ని) చెల్లవు అని చెబుతాయి.

ముక్తానాం పరమాగతి: (*Mbh*)

కాబట్టి మోక్షం పురుషార్థం. అంటే ముక్త స్థితి లో అస్తిత్వాన్ని ఆత్మ కోల్పోతే అట్టి ముక్తి కోసం సాధన చేయవలసిన అవసరం ఉండదు. అస్తిత్వం కోల్పోయిన ఆత్మ మోక్షానందాన్ని ఎలా అనుభవించగలదు? బ్రహ్మములో ఐక్యమైతే కూడా ఇది సాధ్యం కాదు.

కాబట్టి శ్రీభాష్యం లో రామానుజులు వివరించినట్లు ముక్త స్థితి లో వ్యక్తిత్వం కోల్పోని స్థితి ఉంటేనే సమస్త ఆధ్యాత్మ ప్రయత్నాలకు, సాధనకు, తత్వ విచారణకు ఒక అర్థం ఉంటుంది. ఒకవేళ మన వేదాంతం ముక్తిలో సాధకుడు తన అస్తిత్వాన్ని కోల్పోతాడు అని చెబితే అట్టి వేదాంతాన్ని సాధకులు లెక్కచేయరు. విజ్ఞాన ఘనమైన ఆత్మ ముక్త స్థితి లో తన విజ్ఞానాన్ని (స్వరూప జ్ఞానాన్ని) కోల్పోవడం తత్వానికి అందని విషయం. ఆత్మ అహంకార అనేవి రెండు కాదు ఒకటే. సుషుప్తి లో పొందిన నిద్రాసుఖం మెలకువ వచ్చాక మనసు చెప్పగలడం ఇందుకు రుజువు. ప్రత్యగాత్మ (inner self), పరగ్-అర్థ అయిన నిద్రా సుఖం (బాహ్య సత్యం) గూర్చి చెప్పిన అహం ఒకటే రెండు కాదు. ఇదే విధం గా ముక్త స్థితి లో కూడా ఆత్మ తన వయక్తిక తారతమ్యం తో భాసిల్లుతుంది.

ముక్త స్థితి ని వివరించడం లో అద్వైత సిద్ధాంతం ప్రతిసారి నడిసంద్రం లో నావ విరిగిన చందాన తీవ్ర ఇబ్బందికి గురిఔతూనే ఉంది. జీవుని యొక్క వ్యక్తిత్వం ధ్వంసం చేసి ముక్తస్థితి ని వివరించడం గాలిలో మేడలు కట్టడమే. అసలు జీవుడు సాధనవైపు తన మనసుని మళ్ళించింది ఈ ముక్తానందాన్ని వ్యక్తిగతం గా అనుభవించడం కోసమే. లౌకిక ప్రపంచపు సుఖ దుఃఖాలకు అతీతమైన స్థితిని అనుభవించినపుడే జీవికి ముక్త స్థితి యొక్క ఆనంద తెలుస్తుంది. ఈ అనుభవం లేని ముక్తి, ముక్తి కాబోదు.

శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి - (*Gita* vi.15)
(నాయందు నిక్షిప్తమై ఉన్న శాంతిని ఉత్తమ మోక్షాన్ని జీవుడు పొందగలడు)
సుఖమాత్యంతికం యత్తద్ బుద్ధిగ్రాహ్యమతీన్ద్రియం - (*Gita* vi.21)

(బ్రాహనందానుభూతి ఇంద్రియాలకు అందనిది అది కేవలం భక్తిచే/జ్ఞానాగ్ని చే తప్తమైన బుద్ధికి మాత్రమె అందేది)

***

౩౩. మోక్ష స్థితి – ఇతర సిద్ధాంతాల ఖండన

ఇతర సిద్ధాంతల ప్రకారం మోక్ష స్థితి ఎలా అవగాతమౌతుందో తెలిసికొని ఆపై ద్వైత సిద్ధాంతం లో మోక్ష స్థితిని గూర్చి తెలిసికోవడం వలన మోక్షం అనే స్థితి పట్ల సమగ్ర అవగాహన ఏర్పడుతుంది.

జైనుల సిద్ధాంతం ప్రకారం ఆత్మ అలోకాకాశం లో ఒక అంతం లేని ఊర్ధ్వ ముఖ చలనం చేస్తూ ఉండడమే మోక్ష స్థితి. ఈ స్థితి లో సాధకుడి హృదయం లో ఆధ్యాత్మిక, దైవిక భావనలకు తావులేదు.

బౌద్ధుల మాహా శూన్యం కూడా సాధకునికి ఏవిధమైన ఆలోచనకూ తావులేని స్థితిని చూపుతుంది. నైరాత్మవాదులుగా బౌద్ధులు తమ సిద్ధాంతానికి బద్ధులై ఉంటారు. వారి సిద్ధాంతం ప్రకారం ఆత్మ, నేను అనే అంశాలకు ఆస్కారం లేదు. అందువలన సంసారబంధం నుంచి మోక్ష స్థితికి వెళ్ళే జీవుల అనుభవాల తో పని లేని స్థితి ఇది. ప్రతి జీవన స్థితిలోనూ ఈ శూన్యతను పొందుచూ జీవించడమే సాధన (reduction to nullity). జీవి తనకుతాను ఈ విధానం లో (ఉన్నది మహా శూన్యం అనే విశ్వాసం తో) శూన్యతను సాధించి తద్వారా తన అస్తిత్వాన్ని విచ్చిన్నం చేసుకోవడమే సాధన అని బౌద్ధ మత సారం. ఈ శూన్యత నిర్గుణ మైనది, దీనికి స్థాయీ భేదాలు ఉండవు.

అద్వైతం ప్రకారం మోక్షం అంటే జీవ బ్రహ్మైక్య స్థితి. అంటే జీవుడు బ్రహ్మమును తెలిసికొని బ్రహ్మములో లీనమవడం లేదా బ్రహ్మము గా మారడం. సగుణమైన జీవుడు నిర్గుణ మైన పరమాత్మలో లీనం కావడం. ఇది ఒక విధం గా మాహాశూన్యం లో జీవుడు కలిసి పోవడానికి ఏమాత్రం భిన్నమైన విషయం కాదు. కాబట్టి మోక్షంమంటే ఆత్మ విచ్చిన్నతి జరిగి ఆత్మ అస్తిత్వం కోల్పవడం.

మధ్వాచార్య అవగాహన లో జీవులను భగవంతుని ప్రతిబింబాలు గా చూపడం వెనుక దాగిన పరమ సత్యం జీవుల అనాదిత్వం వాటి అనాదియైన పరిణామం, అలాగే జీవుల పరతంత్ర అస్తిత్వం. భగవానుడు జీవులలో అంతర్యామియై వారి కర్మలకు, సాధనకు, యోగ్యతకు సాక్షి గా ఉంటూ వారి తారతమ్యాన్ని ఆధారం గా చేసికొని వారికి ఆనందానుభూతిని కలుగ చేస్తున్నాడు. ముక్త స్థితిలో ఏవిధమైన బాధకు,

భయానికి, వికారానికి, తిరోగమనానికి వీలులేని ఆధ్యాత్మిక ఆంతరంగిక ఆనందాన్ని జీవులు పొందుతారు. ఈ ఆనందం ఆత్మల భౌతిక పరిస్థితుల పై ఆధారపడి ఉండదు, ఆత్మల లోనుంచి పెల్లుబికి వస్తుంది అందుకే ఆనంద తారతమ్యం యొక్క ఆధారం జీవుల యోగ్యత. ఇట్టి ఆనందం నిత్యమైనది సత్యమైనది దీనికి క్షీణత ఉండదు, యాంత్రికం కాదు, అక్షరమై ఉంటుంది.   ఈవిధమైన స్పష్టీకరణ ద్వారా ముక్తిని కేవలం జీవి పొందిన బాహ్య స్థితితో సంబంధం లేని కేవలం జీవి యొక్క అంతర్గత విషయంగా చూపడం జరిగింది అనే విమర్శ ఉన్నా ఇది జీవుల బహుదత్వాన్ని చాటి చెబుతుంది కనుక సత్యమైన వివరణే అని చెప్పాలి

ముక్తస్థితి లో జీవులు వారి వ్యక్తిత్వాన్ని కోల్పోవడం జరుగదు. ఆ వ్యక్తిత్వం ఆధారం గానే వారి తారతమ్య నిర్ధారణ జరుగుతుంది. అంతే కాకుండా నేను స్వతంత్రుడను, నేను పరమాత్మ నుండి విడువడి ఉన్నాను అనే సాంసారిక భావన ఒక అసత్యమైన భావన అని తెలుసుకోవడం ముక్త స్థితి లో జీవులు తమ స్వారూప జ్ఞానం తో పొందిన ఒక సత్యమైన అనుభూతి.

ముక్త స్థితి లో జీవులు పరబ్రహ్మం లో లీనం కారు అనే సత్యాన్ని శృతులు చెబుతున్నాయి:

౧. అవినాశీ వా అరే2యమాత్మా అనుచ్చిత్తిధర్మా (*BrhUp* iv.5.14)
2. ఉతామృతత్వస్యేశానః (RV X.90.2)
౩. ముక్తానాం పరమాగతి: (మహాభారతం)

శ్రీభాష్యం లో రామానుజులు తెలిపినట్లు ముక్త స్థితి లో జీవుడు తన అస్థిత్వాన్నే కోల్పోతే ఇక ముక్తి ని పొంది ప్రయోజనం ఏముంటుంది అప్పుడు జీవులు వేదాంత గ్రంథాల అధ్యయనానికి స్వస్తి చెప్పే స్థితి ఏర్పడుతుంది. కాదు, ముక్త స్థితి లో నీ వ్యక్తిత్వం ఉండకపోయినా ఒకానొక నిర్విశేష, శుద్ధమైన చైతన్య స్థితి లో ఉంటావు అని సాధకునికి చెబితే అది ఎంతవరకూ సాధనకు ప్రోత్సాహాన్ని ఇస్తుంది? మరియూ ఆత్మ విజ్ఞానఘనమని ఒప్పుకున్నపుడు ముక్త స్థితిలో ఆవిజ్ఞానం ఆత్మ కోల్పోవడం అనే పరిస్తితి ఎలా సమన్వయమౌతుంది?

ఆత్మ తన స్వచ్ఛమైన స్థితి లో స్వప్నావస్థ లో పొందిన అనుభూతుల్ని ఒప్పుకున్నపుడు స్వచ్ఛమైన ఆత్మ మరియూ ఆహమార్థ (అహం+అర్థ) ఆత్మ (ego-self) అనే భేదం చెల్లదు. సుషుప్తస్థితి లో పొందిన అంతర్గత అనుభూతి (ప్రత్యగర్థ) మరియూ బాహ్య మైన వాస్తవం (పరగ్ అర్థ) నడుమ భేదం లేదు. కనుక సుషుప్తి స్థితి లో అంటే అంతఃకరణ (mind) లో ఏవిధమైన క్రియ జరుగనపుడు పొందిన అనుభూతుల్ని ప్రత్యగాత్మ (inner self) పసిగట్టగలదు. ఇది ఆత్మేద్రియం. అద్వైతం ప్రకారం అవిద్య లో

ఉన్న అహంకారం (ego self), స్వచ్ఛ మైన ఆత్మ ఒకటి కానపుడు అవిద్య తో అజ్ఞానం తో కూడుకున్న అహంకారం సుషుప్తి స్థితిలో పొందిన నిద్రాసుఖం గూర్చి తెలపడం సాధ్యం కాదు!

ముక్త స్థితిలో ఆత్మల కు పరమాత్మకు నడుమ ఉన్న విశిష్ట మైన భేదాన్ని వేదాంత సూత్రాలు "జగద్వ్యాపారవర్జం" (iv.4.17) అని నిర్ధారించాయి. దీనినిబట్టి ముక్త స్థితిలో ఉన్న ఆత్మలు పరమాత్మ చేసే జగద్వ్యాపారాలు చేయలేవు అని సుస్పష్టం గా తెలుస్తుంది – బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి అనేది దుస్సాధ్యం.

మహాభారతం లో బాదరాయణుడు "మగ్నస్య హి పరేఽజ్ఞానే కిం న దుఃఖతరం భవేత్" (*Mbh,* xii.307.83) అని ప్రశ్నిస్తాడు. అర్థాత్: సంసార సాగరాన్ని దాటిన ఆత్మ పరోక్షజ్ఞానం పొందిన పిదప ఆ జ్ఞానం లో కేవలం మగ్నమై పోతేనే ముక్తి కి ఒక అర్థం. అంటే ఆనందానుభూతి లేకపోతె ముక్తి కి ప్రయోజనం ఏమిటి?

"సజ్ఞానాశో యది భవేత్ కిం ముక్త్యాః ప్రయోజనం?" స్వరూపజ్ఞానం కోల్పోయిన తరువాత ముక్తి పొంది ప్రయోజనం ఏమిటి అని గీతా తాత్పర్యం లో మధ్వులు ప్రశ్నిస్తారు. స్వభావానుసార అపరోక్షజ్ఞానం పొందిన ఆత్మ కు ముక్తి ద్వారం తెరుచుకొని తద్వారా ఆధ్యాత్మిక పునరుజ్జీవం లభ్యమై అది అనంతమైన ఆనంద స్థితిలో స్వరూప జ్ఞానాన్ని అటుపిమ్మట బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందదానికి దోహద పడుతుంది. గీతాచార్యుడు ఇదే విషయాన్ని ఈ రెండు శ్లోకాలలో వివరించాడు - *Gita* vi.15 & vi.21

ఇటువంటి అపరోక్ష జ్ఞానం ఘనాత్మక మైన ధన్య స్థితిని ప్రతి ఆత్మ పొందడానికి దారి చూపుతుంది. మధ్వులు ఈ అపరోక్ష స్థితిని:

౧. కర్మనస

2. ఉత్క్రాంతి (మానవులకు) / లయ (దేవతలకు ఉంత్క్రాంతి ఉండదు)

౩. మర్గ

౪. భోగ

జీవులకు మొదటి మూడు తమ సాధానా మార్గం లో సంచితాలై (accumulated) ప్రతిబంధకాలుగా పరిణమించి ఒక్క సారి జీవి అపరోక్షజ్ఞానం పొందిన తరువాత అవి ఆ జ్ఞానాగ్ని లో భస్మీపటలమైపోతాయి. ముక్త స్థితి లో అనారబ్ద కర్మ (Karma that has *not* begun to bear fruit) రెండు రకాలు గా ఉంటుంది:

౧. ఇష్ట

2. అనిష్ట

మొదటి అనారబ్ధ కర్మ ముక్త జీవి ఖాతా లో జమ ఔతుంది. రెండవ కర్మ ధ్వంసమౌతుంది. ప్రారబ్ధ (Karma that has begun to bear fruit) కర్మ ఫలం మాత్రమె అనుభవించ వలసి ఉంటుంది. సంచితం తో సంబంధం లేదు కనుక ఇది ఒక నిర్దిష్ట మైన పరిణామం లో ఉంటుంది. ఈ ప్రారబ్ధ కర్మ విషయం లో కొన్ని సవరణలు మినహాయింపులు సాధ్యం ముక్త స్థితి లో ఉన్న జీవికి. ఇది కేవలం అపరోక్ష జ్ఞానం వలెనే సాధ్యం, ఎందుకంటే అపరోక్షజ్ఞానం పొందిన జీవి యొక్క కర్మలు కేవలం జీవి యొక్క ఆధ్యాత్మిక ఆనందాన్ని ఇనుమడిమ్పచేసే విధం గానే ఉంటాయి. ఇటువంటి ఆధ్యాత్మిక ఆనందం జీవి యొక్క గత కర్మల లో ఉన్న జ్ఞాన, ఉపాసన, భక్తి అనే అంశాల పై ఆధారపడి ఉంటుంది. అపరోక్షజ్ఞానికి ఉన్న మరో పేరే జీవన్ముక్తుడు. ఈ జీవుడు తన ప్రారబ్ధ కర్మ క్షయమయ్యే వరకూ ముక్త స్థితి లో సైతం భౌతిక రూపం లో ఉండి చతుర్ముఖ బ్రహ్మ తో పాటు తన లింగ శరీరాన్ని త్యజిస్తాడు.

ముక్త స్థితి లోఉన్న జీవుడు రెండు అంశాల తో ఒప్పి ఉంటాడు:

ఋణాత్మక

ఘనాత్మక

మొదట తన వయక్తిక ప్రతిబంధకాలు, కర్మ ధ్వంసమై ఉండుట అంటే దుఃఖాభావం లింగశరీరం. రెండవది వయక్తికం గా ఆధ్యాత్మిక ఆనందం ముక్త స్థితి లో పొందడం.

భాగవత పురాణం చెప్పినట్లు ముక్త స్థితి లో జీవుడు నాలుగు విధాలైన ముక్తి ని తారతమ్యం ఆధారం గా పొందుతాడు. ఇవి అవరోహణ క్రమం లో చెప్పబడినవి అవి :

1. సాలోక్య – విష్ణు లోక వాసం
2. సామీప్య – విష్ణు సామీప్య వాసం
3. సారూప్య – విష్ణువు లా రూపాన్ని కలిగి ఉండి వసించడం
4. సాయుజ్య – విష్ణువు ని పొందడం (merging into the effulgence)

***

౩౬. ముక్తి – మధ్వాచార్య దృక్పథం

జీవి యొక్క స్వరూపం విశిష్టమైనది. ఆ విశిష్టత ముక్త స్థితి లో కూడా భాసిస్తుంది. ముక్తి కేవలం జీవునికి అంతర్గతం గా ఉన్న ఆనందాన్ని బహిర్గతం చేయడమే. అట్టి ఆనందం వయక్తికం. కాబట్టి దీనిని పదాలు నిర్వచించలేవు. ఎందుకంటే ముక్తికి వెళ్ళని జీవి వెళ్ళిన జీవి పొందిన అనుభూతిని వివరించడం అసాధ్యం!

ముక్త స్థితిలో ఉన్న ప్రధాన విషయం అత్యుత్తమమైన పురుషార్థాన్ని సాధించిన గుణాత్మకమైన భావన. ఈ అనుభవం సహజంగా జీవి యొక్క వ్యక్తిత్వం ముక్త స్థితిలో సైతం కొనసాగుతుంది అనే సత్యాన్ని చెప్పక చెబుతుంది.

ఆశరీరం వావ సంతం ప్రియాప్రియేన స్పృశతః
న హ వా సశరీరస్య సతః ప్రియాప్రియయోరోపహితః - *Chandogya*

ముక్త స్థితిలో భౌతిక శుఖాలు, ఆనందాలు అప్రాధాన్యాలు. కేవలం అంతర్గత ఆనందం పెల్లుబికి అవధులు లేని అనుభవానికి తెరతీస్తుంది ముక్త స్థితి. అలాగే ఆధ్యాత్మిక కామనలను అన్నిటినీ సంపూర్ణం గా తీరుస్తుంది ముక్తస్థితి.

మోక్ష స్థితిలో శుద్ధ సాత్విక భావన ఎప్పుడూ పొటమరించి ఉంటుంది అందువలన ముక్త జీవులు సత్య సంకల్పులు గా వారికి తోచిన రూపాన్ని పొందగలరు. లేదా ఆత్మకు సహజమైన చిదానంద స్వరూపులుగా వర్తిస్తారు.

మానవుని శోధన, సాధన ఎంతగా పరిణతి చెందినా ఈ జగత్తులో మనిషి తెలుసుకోలేని విషయాలు ఎన్నో ఉన్నాయి. ఈ జగద్వ్యాపారం తెలుసుకోవడం సాధ్యం కాదు జీవులకు.

అనిన్ద్రియా అనాహారా అనిష్పందా: సుగంధినః (Mbh xii.337.29)
దేహేన్ద్రియాదిహీనానాం వైకుంఠపురవాసినాం (*Bhag* vii.1.34)

అవిద్య, కామము కర్మలతో ఎన్నో జన్మల సాగంత్యం ముక్త స్థితి లో తెగిపోయి సవిశేష స్వరూపాలతో భాసిస్తూ ఉంటారు ముక్త జీవులు. మాయావి అయిన విష్ణువు తన మాయ అనే తెరను తొలగించగా ఈ ముక్త జీవులు సుఖైక స్వరూపులై ఆ భగవానుని స్వరూపాన్ని వారి వారి యోగ్యతానుసారం చూస్తూ తన్మయులై ఉంటారు. “బోధయన్తః పరస్పరం” అనే స్థితికి ఇది అసలైన సందర్భం. ముక్త స్థితి లో ఆత్మ

పూర్తిగా వ్యక్తమౌతుంది, అభివ్యక్తమౌతుంది, తనను తాను పూర్తిగా తెలుసుకొంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆత్మ యొక్క సత్తా ప్రతీతి పూర్తిగా వ్యక్తమయ్యే స్థితి ముక్త స్థితి.

పరం జ్యోతిరూప సంపధ్యా స్వేన రూపేణాభినిష్పధ్యతే - (*ChanUp* viii.12.3)
ముక్తిర్హిత్వా s న్యథారూపం స్వరూపేణ వ్యవస్థితి: - (*Bhag* ii.10.6)

విశ్వ బహుదత్వం నిత్యం, స్వాతంత్ర్య భావన ఒక అభూత కల్పన అని ముక్త జీవులు త్రికరణ శుద్ధి గా నమ్మబట్టే వారికి ముక్త స్థితి లభ్యమైనది. ముక్త జీవులు విశ్వాన్ని పరమాత్మ చక్షువులతో చూడడం ప్రారంభిస్తారు. అలా చూడడంలో పరమాత్మ పై ఆధారపడిన విశ్వాన్ని అందులో ఉన్న తమను సైతం చూడగలుగుతారు. ముక్త జీవులు భగవంతుని వలే నిత్య సంత్రుప్తులు, జ్ఞానం ఆనందం వారి స్వభావం. కాబట్టి “ఇక్కడే ఉండిపోవాలా” అనే భావన వారిలో ఉండనే ఉండదు. ముక్త స్థితిలో జీవులు నిత్య చైతన్యం తో ఉంటారు. వారి వారి యోగ్యతకు తగ్గ రీతిలో వారి చైతన్యం ఉంటుంది. వారు నిత్య తృప్తు లై ఆ తృప్తిని అనుభవిస్తూ ఉండిపోవచ్చు, గత జన్మలలో పొందిన భగవద్ కృపను జ్ఞప్తికి తెచ్చుకొని ఆరాధనా భావం తో భగవానుని ధ్యానిస్తూ ఉండిపోవచ్చు, లేదా తమ అపరోక్ష సిద్ధికి కారణమైన హరి కరుణను కొనియాడుతూ గానం, నృత్యం చేస్తూ మోక్షానందాన్ని అనుభవిస్తారు.

ముక్త స్థితి లో విధి-విధానాలు ఉండవు. మోక్షం అనగా అనంతమైన సృజనాత్మక స్థితి. ఎవరు ఏది చేయాలన్న సాధ్యమే ఎందుకంటే అందరూ శుద్ధ సాత్విక స్థితి లో ఉంటారు. వారి చర్యలు అన్నీ ఉత్తమమైనదే! ముక్త జీవులలో ఉండే జ్ఞానం, భక్తి ఈ స్థితికి కారణాలు.

శంకరులు ఇచ్చిన వివరణ ప్రకారం, జ్ఞాని భౌతిక ప్రంపంచంలో ఉంటూ కర్మలను “లోకసంగ్రహ” అనే భావనతో చేస్తూ తన ఆధ్యాత్మానందాన్ని అనుభవించగలడు. అలాగే ముక్త స్థితి లో ద్వైత భావన లేని, క్రియ, కారక, ఫల రహిత స్థితిలో ఉంటాడు. ఇది ఆస్తిత్వ భావనకే సరిపడని వివరణ. ద్వైత భావన ఈశ – దాస భావన అద్వైత భావన నేనే ఈశ్వరుడను అనే భావన. ఇది తాత్విక విచారణ అనసూయకత తో చేస్తే జీవుడు జీవుడే ఎప్పటికీ అని స్పష్టం గా అవగతమౌతుంది.

దీనికి రుజువు గా ఈ క్రింది వేద, ఉపనిషద్వాక్యాలను చూపుతారు:

సర్వే నందంతి యశసాగతేన సభాసాహేన సఖ్యా సఖాయ: (*RV* X.71.10)
అక్షణ్వంతః కర్ణవంతః సఖాయో మనోజవేష్వసామా బభూవు: (*RV* X.71.7)
యేతత్సాం గాయన్నాస్తే హావు హావు (*TaittUp* iii.10.5)
యత్రానందాశ్చ మోదశ్చ ముదః ప్రముద ఆసతే

దేవై సుకృత కర్మాభి: తత్ర మామృతం కృధి: - (*RV* IX.113.1)
కేచన్ పూర్వాభ్యాసేన యజ్ఞాదికం కుర్వంతి (*Mbh* xiii.18.6)
కేచనేచ్ఛామాత్రేణ పిత్రాదిదర్శనవంతో భవతి (*ChanUp* viii.2.1-10 and Sankara *BSB* iv.4.8).
కేచన్ సర్వలోకచారిణ: (*ChanUp* viii.25.2)
కేచన్ శుద్ధసత్వనిర్మితలీలాశారీరాణ్యాదాయ క్రీడంతే (*BS* iv.4.12, and Sankara's commentary thereon)

***

౪౭. మోక్ష స్థితిలో ఆనంద తారతమ్యం యొక్క హేతుబద్ధత (RATIONALE)

ఆస్తిక భావం ఉన్న ప్రతి ఒక్కరూ మోక్ష స్థితి లో ఆత్మ యొక్క వ్యక్తిత్వ ఉనికి ని విశ్వశిస్తారు. ఆత్మల బహుదత్వం (plurality) ఉండాలి అంటే ఆత్మల వ్యక్తిత్వం నిలబడాలి. ఆత్మల నడుమ ఉన్న అంతర్గత భేదాలు, తారతమ్యాలు లేని స్థితి గ్రాహ్యతకు సైతం అసాధ్యం. గుణ, సత్తా మరియూ వ్యాప్తి ఆధారంగా ముక్త స్థితి లో ఉన్న ఆత్మల నడుమ స్వరూపానందంలో తారతమ్యం ఉంటుంది అని మధ్వులు చెబుతూ ఆత్మల స్వరూప యోగ్యత యొక్క ప్రాముఖ్యాన్ని తెలియచేసారు.

రామానుజులు వారి ఆత్మ సిద్ధాంతంలో దేవ ఆత్మల, మానుష ఆత్మల నడుమ భేదాన్ని వారి కర్మ ఫలం, ప్రాకృతిక లభ్యత (accretions) గా వర్గీకరిస్తూ వారి మూల స్వరూపాలలో వారు ఒకే తరగతికి చెందిన వారిగా వివరించారు. ఈ వివరణ తో మధ్వులు విభేదించి స్వరూప భేదం తారతమ్యం ఆధారంగా ముక్త స్థితిలో ఉన్న జీవులు వారు దేవతలైనా మానవులైనా ముక్త స్థితిలో ఆనందాన్ని పొందుతారు అని చెప్పారు. ఇదే రామానుజుల సామ్య సిద్ధాంతానికి, , మధ్వాచార్య ద్వైత సిద్ధాంతం మధ్య ఉన్న సైద్ధాంతిక తారతమ్యం.

మధ్వాచార్య స్వరూపానంద ఆనంద తారతమ్యం కేవలం స్వరూప భేదం, ఆత్మల నడుమ తారతమ్యం ఆధారం గా ఉంటుదని అనేది నిర్వివాదాంశం. ఉన్నదొక్కటే ఆత్మ అదే వివిధ ఉపాధులు తీసుకొని ఒప్పుచున్నది అనే ఏకాత్మవాదం ఆత్మల బహుదత్వాన్ని ఒప్పుకోదు కాని అలా ఒప్పుకొనక పోవడం వలన ఈ వాదం చివరికి ఒక విచిత్రమైన గందరగోళ స్థితికి దారి తీస్తుంది. ఉదా: అద్వైతులు రామాయణం చెబుతూ హనుమ భవిష్యద్ బ్రహ్మ అంటారు అప్పుడు ఉన్న ఒక్క ఆత్మ హనుమ అవతారంలో వచ్చి మరల మరొక పదవికి వెళ్ళడం అనే విషయాన్ని ఎలా సమన్వయము చేస్తాము ఈ ఏకాత్మవాదం తో ?

అద్వైత సిద్ధాంతం ప్రకారం ఆత్మల నడుమ కనిపించే భేదం అసత్యమైన ఉపాధుల వలన మోక్ష స్థితి లో ఈ భేద భావన తొలగి పోయి ఒక్కటి గా నిలిచి పోతుంది.

మోక్షం జీవుడు తనను తాను తెలుసుకొన్న ఒక స్వచ్ఛమైన ఆనందమయమైన స్థితి అట్టి స్థితి లో తన ఆనందానుభావాన్ని మరొకరికి బదిలీ (పూర్తిగా లేక అసంపూర్తి గా) చేయడం సాధ్యం కాదు. ముక్త స్తితి లో ప్రతి ఆత్మా తన స్వరూపనందాన్ని అనుభవిస్తూ సంపూర్ణ సంతృప్తి తో మగ్నమై (Mystic joy) ఉంటుంది. జిజ్ఞాసువులు మోక్ష స్తితిలో పొందే ఈ స్వరూపనందానుభూతిని అమోఘమైన విషయం గా భావిస్తారు. ఐతే అన్ని జీవులు ఒకే విధమైన సాధన చేస్తాయి అని చెప్పడం అసాధ్యం. జీవి యొక్క సాధన, సాధనలో తీవ్రత, సాధనా వ్యవధి, సాధన యొక్క నాణ్యత, స్థాయి మొదలగు అంశాలు భేద కారకాలు. అత్యుత్తమ జీవి అయిన చతుర్ముఖ బ్రహ్మ యొక్క సాధన ఇతర దేవతలైన రుద్ర, ఇంద్ర, వరుణ మొదలగు దేవతలా యొక్క సాధన కు భిన్నం గా అన్ని అంశాలలో ఉంటుంది. ఈ దేవతల సాధన లో ఉన్న భేదం మానవ మేధస్సుకు అందనిది. కనుక స్వరూప యోగ్యతను అనుసరించి సాధన, సాధ్యత ఆధారపడి ఉంటాయి. మన శాస్త్రాల లో చెప్పినట్లు ఏకాంత భక్తుడైన సనకుడు కేవలం తన సాధనను శ్రీ హరి పట్ల తనకున్న అమితమైన ప్రేమను నిరంతరం వ్యక్తం చేస్తూ ఉండడం కోసమే తక్క తన ముక్తి కోసం కాకుండా చేయడం అలాగే “నాలో ఐక్యం చేసుకుంటాను” అనే వరాన్ని సైతం కాదని అదే స్థితి లో ఉండడానికి ఇష్టపడడం ఒక మహత్తరమైన తారతమ్యం.

స్వరూపతారతమ్యాన్ని అంగీకరించిన రామానుజ సిద్ధాంతం స్వరూపానంద తారతమ్యాన్ని అంగీకరించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. రామనుజులు చెప్పినట్లు దేవతల లో (బ్రహ్మ, రుద్ర, ఇంద్ర మరియూ వారి దేపేరులు) అలాగే జీవులలో ఉన్న తారతమ్యం స్వాభావికం కాదని అది కేవలం వారి భౌతిక లేదా కార్మిక ఉపాధుల వలన అని భావిస్తే అప్పుడు పరబ్రహ్మం విధు, శేషి, స్వతంత్ర అని జీవులు అను, శేష, పరతంత్ర అని చెప్పడం ఆధ్యాత్మిక సాప్రదాయం ప్రాకారం సమన్వయము కాదు. ఈ సమన్వయము సాధ్యం కాకుంటే అనేకమైన ఈశ్వర తత్వాలు బహిర్గతమయ్యే స్థితిని సూచిస్తుంది. ఇది వేదం వాగ్మయం ప్రకారం సాధ్యం కాని స్థితి. జగద్వ్యాపారవర్జ్యం అనే బ్రహ్మసూత్రం ప్రకారం ముక్తజీవి కి జగద్వ్యాపారం (cosmic activity) సాధ్యం కాని పని అది ఒక్క పరమాత్మకే శక్యమైన పని. కనుక నియామ్య – నియామకభావ (controller and controlled) అనే వైవిధ్యం అంతర్గతం గా ఎల్లపుడూ పరమాత్మకు జీవులకు మధ్య ఉంటుంది అని తద్వారా నియమింపబడే వారి ఆనందం నియమించే పరబ్రహ్మ ఆనందం కన్నా - ముక్త స్థితి కూడా - తక్కువగా ఉంటుంది అనే విషయం రూఢి ఔతుంది.

భోగమాత్రసామ్యలింగాచ్చ అనే బ్రహ్మ సూత్రం లో (iv.4.21) దాగిన అర్థం బ్రహ్మ సామ్యం కేవలం భోగం, ఆనందం అనుభవించడం లో మాత్రమె అని దీనిని జగద్వ్యాపారవర్జితం అని మరో బ్రహ్మ సూత్రం తో

అనుసంధానం చేసి అర్థం చేసుకోవాలి అని రామానుజులు వివరించారు. వి.అద్వైత సిద్ధాంతం లో శ్రీమహాలక్ష్మిని ముక్త జీవులకు, జీవులకు శేషి గా వివరిస్తూ నిత్యశూరులు అయిన విష్వక్సేనుడు జీవుల పట్ల నియామకత్వాన్ని వహిస్తాడు అని చెప్పడం ద్వారా స్వరూప తారతమ్యం స్వరూపానంద తారతమ్యం స్థిరీకరించ బడ్డాయి.

వేద వాఙ్మయం లో ముక్తి ఆరోహణ క్రమం లో చెప్పబడింది - సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్య ముక్తి – ఈ ముక్త స్థితుల లో జీవి ఉన్నపుడు అంతకు ముందు ఉన్న స్థితి లోని ఆనందం సైతం జీవికి ఉంటుంది ఉదా: సారూప్య ముక్తి ని పొందిన జీవికి సామీప్య, సాలోక్య ముక్తి కి సంబంధించిన ఆనందం అవశ్యం దక్కుతుంది. సాయుజ్య ముక్తి ని ఐక్యం తో సమానం చేసి చెప్పకూడదు. దీనికి తార్కాణం ఈ క్రింది ఉపనిషద్ వాక్యం:

"చంద్రమ సః సాయుజ్యం సాలోకతామాప్నోతి" – ఏ సాధకుడైతే చంద్రుని తో సాయుజ్యాన్ని పొందాడో ఆ సాధకుడు చంద్రుని సాలోకత ని అనుభవించ గలడు అని అర్థం. సాయుజ్య అనే శబ్ద వ్యుత్పత్తి ప్రకారం "సాయుజో భావః" అంటే సాయుజ్యమనే స్థితి ఒక భావం కనుక అది ఐక్యం అనే స్థితి తో సమానం కాదు. ఐక్యం మన ఆధ్యాత్మిక వాఙ్మయం లో సాధ్యం కాని స్థితి. కారణం వయక్తికత కోల్పోని అసృజమైన, అనంతమైన స్థితిలో అనాదిగా ఆత్మలు ఉంటాయి కనుక.

జీవుల చేసిన సాధన, దాని త్రీవత, వ్యాప్తి, గుణవత్త (quality) మోక్షానందం లో జీవుల నడుము ఉన్న తారతమ్యానికి ప్రధాన మైన కారణాలుగా ఉంటాయి. ఎలా ఒక పదార్థాన్ని రుచి చూడని వ్యక్తి ఆ పదార్థం యొక్క రుచిని చెప్పలేడో అలా ఈ మోక్షానందం లో ఉన్న తారతమ్యం ఇలా ఉంటుంది అని అనుభవం లేని మనం చెప్పడం సాధ్యం కాదు. ఎలా ఒక ఫలం ఉందని నిశ్చయం గా తెలిసినప్పటికీ ఆ ఫలం రుచి ఎలా ఉంటుందో తెలియనంత మాత్రాన ఆ ఫలమే లేదు అని చెప్పడం సబబు కాదో అలా మోక్షానందం పొందడం లో జీవి (అణు ప్రమాణమైన ఒక వయక్తిక ఆత్మ) కి మరొక జీవి కి నడుమ తారతమ్యం లేదు అని చెప్పడం కూడా సబబు కాదు. మొక్షానందం ఒక ప్రమేయం (వాదమునకు పనికి వచ్చు ఆధార విషయం) గా తీసుకొంటే అది తారతమ్యం విషయం లో అనుభవాధారం. ఈ తారతమ్యం స్వసంవేద్యం (knowable only by one's own self) వచం అగోచరం (beyond the power of words to be expressed).

భక్తి, ప్రపత్తి రామానుజుల సిద్ధాంతం ప్రకారం వివిధమైన రెండు సాధనా మార్గాలు. ఈ రెండిటి లోనూ స్వరూపానందం అభివ్యక్తమౌతుంది కాని ఉత్పత్తి కాదు. ప్రపత్తి అంటే భార న్యాసం ఇది పూర్ణ విశ్వాసం తో కూడుకొన్న శరణాగతి. అవిచ్ఛిన్నమైన ఆలోచనాత్మక ప్రక్రియ కే భక్తి అని పేరు. భక్తి, ప్రపత్తి రామానుజుల సిద్ధాంతం ప్రకారం పరస్పర పూరకాలు కాదు ఒక స్వతంత్రమైన సాధనా మార్గాలు.

వేదాంత దేశికుల "రహస్యత్రాయసార" ప్రకారం వర్ణాశ్రమ ధర్మానికి, శ్రౌత స్మార్త ధర్మాలకు, శాస్త్రిక కర్మలకు, నిధిధ్యాసన కు కట్టుబడి చేసే ఉపాసనే భక్తి. ఇట్టి ఉపాసనా మార్గంలో జీవి తన మానసిక స్థితిని అనుసరించిశ్రుతి చెప్పిన విద్యల సహాయం తో భగవంతుని ప్రేమకు పాత్రుడు కావడం. కర్మ బంధాలనుంచి, ఆవృత్తి (పునః పునః కర్మలు చేయడం) నుంచి విముక్తుడై హృదయ పూర్వకంగా చేసే పూర్ణ విశ్వాసం తో చేసే శరణాగతి ప్రపత్తి. దక్షిణ భారతదేశంలో అనుసరించిన వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ప్రపత్తి భక్తి కంటే గొప్పది. భక్తి మార్గాన్ని క్లిష్టతరమైన సాధనా మార్గంగా వి. అద్వైతం చూపుతుంది. ఇక్కడే వి.అద్వైతం సైతం తారతమ్యాన్ని చెప్పక చెప్పింది అని వ్యాసతీర్థులు తెలియచేసారు.

రామానుజుల గీతా భాష్యంపై వ్యాఖ్యానిస్తూ వేదాంత దేశికులు: సాంఘిక అసమానతలు (అంటే వర్ణాశ్రమ ధర్మాల లో ఉన్న తారతమ్యం) సాధనకు ప్రతిబంధకాలు కాకుండా సాధకులకు ఉన్న అతి శులభమైన సాధనా మార్గమే ప్రపత్తి మార్గం.

వైదిక ఉపాసన మార్గాన్ని అనుసరించి కర్మాచరణ తో కూడుకొన్న భక్తి మార్గం శులభం కాదని శులభమైనది ప్రపత్తి మార్గమని దేశికుల అభిప్రాయం. దీనిని వ్యాసతీర్థులు ఖండిస్తూ : "ప్రపత్తి ఒక ప్రత్యామ్నాయ భక్తి మార్గం అని మోక్ష సాధనా మార్గమని మన వేదం వాగ్మయం లో లేదు. విధి నిషేధాలకు అనుగుణం గా వర్ణాశ్రమ ధర్మాలకు లోబడి చేసే సాధనే అత్యుత్తమ మైన సాధన." అని చెబుతారు. వ్యాసతీర్థుల ఈ వ్యాఖ్యానం చాతుర్వర్ణం మాయా సృజం అనే గీతాచార్యుని వాక్కుకి చక్కగా సమన్వయము ఔతుంది. అపరోక్ష జానులైన శుకాదుల ఆధ్యాత్మిక చర్యలను అపరోక్షజ్ఞానం ఆశించే సాధకులు అనుసరించడం ద్వారా మోక్ష సాధన అసాధ్యం ఔతుంది. కర్మ భక్తి ప్రపత్తి ద్వారా చేసే సాధన యొక్క గుణ వత్త (quality) వ్యాప్తి (range) తీవ్రత (intensity) కాలం (గడువు) ఆధారం గా మోక్షం సిద్ధిస్తుంది అనే విషయం తేటల్లం. కాబట్టి మోక్షం (స్వరూపానందం) లో తారతమ్యం నిశ్చయం గా ఉంటుంది. జీవుల సాధనను అనుసరించి వారి యోగ్యత తద్వారా వారు పొందే స్వరూపానందం ఆధారపడి ఉంటుంది. కనుక బ్రహ్మానందానినికి జీవులు పొందే స్వరూపానందానికి నడుమ ఒక విశిష్టమైన అంతర్యం ఉంటుంది. ఇదే విషయాన్ని శ్రుతి వాక్యం : "ఏతస్యైవానందస్యాన్యాని భూతాని మాత్రాముపజీవంతి" తెలియచేస్తుంది.

ముక్త జీవులు వారి యోగ్యత ను అనుసరించి వారికి ఏది యోగ్యమో, ఏది సాధ్యమో అది మాత్రం తమ సత్తాకు తగ్గకుండా ఆచరించి ఇతర జీవుల ముక్త స్థితికి ఏమాత్రం భంగం కలుగని రీతిలో వారి స్వరూపానందాన్ని అనుభవిస్తారు. ఇలా ముక్త జీవులు ఎటువంటి నియంత్రణ, యంత్రాంగం లేకుండా

స్వచ్ఛందం గా వర్తిస్తారు. దీనిసే సత్యకామత అని బృహదారణ్యక ఉపనిషద్ వ్యాఖ్యానం లో మధ్వులు చెబుతారు:

యథోదజ్జనకుమ్భాదే: సరిత్సాగారయోరపి
అల్పేనా మహతా వాపి పూర్తియోగ్యతయాభవేత్

ముక్త స్తితిలో జీవులు వారి వారి స్వరూపానందానుభవం లో పూర్తిగా నిమగ్నులై వారికి, వారిలాగే ముక్త స్థితి లో ఉన్న మరొక జీవి కి మధ్య ఉన్న తారతమ్యం పట్ల ఏవిధమైన ఆలోచన లేకుండా తమకున్న ఆనందాన్ని అనుభవించడమే పరమావధి గా భావిస్తారు. నిజానికి ఇది ఒక అమోఘమైన అవ్యక్త స్థితి. జీవుల ఆనందం వయక్తికం కనుక వివరణకు అందనిది.

ముక్త స్థితి లో సైతం తారతమ్యం, యోగ్యత ఉండడం సాధ్యం కాదు అనే పలు విమర్శలకు మధ్వులు సాధికారికంగా సమాధానం ఇస్తూ ఈ బ్రహ్మ సూత్రాన్ని ఉటంకిస్తారు:

"అక్షరధియాం త్వవిరోధః సామానతత్భావాభావాభ్యాం ఔపాసదవత్ తదుక్తం" (BS iii.3.34).

అక్షర – ధీ = అవినాశి అయిన పరబ్రహ్మం తో ముక్త జీవులందరూ తమ తమ స్థాయిలలో వయక్తిక సంబంధాన్ని ఏర్పరచుకొని పరస్పరం సహకరించుకొంటూ (ఉత్తమ జీవులు మధ్యములకు మధ్యములు కనిష్టులకు) గురు-శిష్య (ఔపసద) సంబంధంతో, ప్రేమతో పరస్పర గౌరవభావంతో వర్తిస్తారు. బ్రహ్మ సూత్రాల లో సాధనాధ్యయం లో ఉన్న ఈ సూత్రానికి ఇంత చక్కటి తాత్పర్యాన్ని మధ్వులు అందించారు.

అంతర్ముఖత్వం తో కూడుకొన్న ఒక పూర్ణత్వ స్థితిని పొందిన ప్రతి ముక్త జీవి ఆ స్థితి లో ఉన్న సుహృద్భావానందాన్ని ఇతర ముక్త జీవులతో పంచుకొంటూ శాంతియుత సహజీవనాన్ని సాగిస్తాడు.

***

౪౮ ముగింపు

భారతీయ తత్వశాస్త్రాన్ని, వేదాంత విషయాలను అర్థం చేసుకోవడంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి మధ్వులు, వారు అందించిన జ్ఞానాన్ని చక్కగా అవగతం చేసుకొని "టీకాచార్యులు" గా వాసికెక్కిన జయతీర్థులు, వాదిరాజులు, వ్యాసతీర్థులు మొదలగు వ్యాఖ్యానకారులు చేసిన కృషి అనుపమానం. ఈ కృషి లో ప్రముఖంగా తత్వ విషయాలైన జ్ఞాన మీమాంశ (epistemology), అస్తిత్వం (Ontology), తర్కం (Logic), అధిభౌతిక విషయ జ్ఞానం (Metaphysics), సాక్షి, సాధన, మోక్షం, మొదలగు వాటిని కూలంకషంగా వివరించడం లో వీరు అనన్యసామాన్య మైన ప్రతిభను కనబరచారు అని చెప్పడం అనసూయకత తో, సాక్షి ప్రమాణం తో గ్రహిస్తే ఇది ఒక నిర్వివాదాంశం అని తెలుస్తుంది.

చివరిగా, మధ్వులు అందించిన తత్వజ్ఞానాన్ని విశ్వశించే వారిని తరచూ అద్వైత సిద్ధాంత ప్రమేయములైన వ్యావహారిక-పారమార్థిక విషయజ్ఞానం లేని వారిగా చూపడం తరచూ జరుగుచున్నది. అదే విధంగా శంకరుల అద్వైత సిద్ధాంతాన్ని మిథ్యావాదం అని ద్వైతులు చెప్పడానికి ముఖ్య కారణంగా దీనిని చూపడమూ జరుగుచున్నది. కానీ, వ్యావహారిక-పారమార్థిక విషయ జ్ఞానమే మూలస్థంభం గా భావించే అద్వైతానికి, దీని ఆధారంగా తత్వావిష్కరణ సంపూర్ణంగా సమన్వయ పూర్వకంగా చేయడం సాధ్యం కాదు అని ఇప్పటి వరకూ చర్చించిన విషయాల ఆధారంగా తెలిసింది. అదే విధంగా భూత భవిష్యద్ వర్తమాన కాలాలతో పారమార్థిక జ్ఞానానికి ఉన్న సంబంధం వ్యవాహారిక జ్ఞానాన్నే సూచిస్తుంది! అలాగే వ్యవహారిక జ్ఞానం పారమార్థిక జ్ఞానాన్నే సూచిస్తుంది కాబట్టి వీటి మధ్య పరస్పరఆధార (interdependence) సంబంధం ఉంది. మాటల గారడీ తో మభ్య పెట్టడానికి మినహా వీటిని స్వతంత్రమైన భావాలుగా చూపడం సాధ్యం కాని విషయం.

మాంస నేత్రానికి గోచరమయ్యే ప్రపంచం దానిలో జీవుడు పొందే అనుభవాలు వ్యావహారికం కాబట్టి మిథ్య అని తీర్మానించడం అసలు తత్వం తెలియక పోవడమే! అబధ్య (uncontradictable) విషయాన్ని తెలుసుకోవాలంటే బధ్య (contradictable) విషయ జ్ఞానం కావాలి అలాగే తద్వ్యతిరేక (vice versa) స్థితిలో కూడా. జగన్మిథ్య అనే విషయ జ్ఞానాన్ని త్రికాలాతో సమన్వయ పరచి నిర్వచించడం ద్వారా అసలు విషయం బహిర్గతమౌతుంది. అప్పుడు అద్వైతం సాధించే నిర్వచనం మొత్తం తత్వ జ్ఞానాన్ని సూన్య స్థితిని తెలుసుకోవడానికి ఉపయోగపడే విద్యగా చూపుతుంది. కనుక వాస్తవాన్ని వ్యవహారిక పారమార్థిక విషయంగా విభజించడం సాధ్యం కాని విషయం. లౌకిక ప్రపంచం లో చేసిన సాధనే మోక్ష కారకం. పితృ తర్పణలు, యజ్ఞాలు, యాగాలు, తపస్సులు ఇహ లోకంలో లేదా వ్యవహారిక ప్రపంచంలో చేసేవే, అవే జీవన పరమార్థమైన ముక్తికి హేతువులు. ఈ పుస్తకం యొక్క ముఖ్యోద్దేశ్యం భారతీయ

తత్వాన్ని శంకరుల అద్వైతంతో పోల్చి చెప్పడం లేదా భారతీయ తత్వానికి ఉన్న ఆఖరి మజిలీ గా శంకరాద్వైతాన్ని చూపడం సబబు కాదు అని ఋజువు చేయడమే. శంకరుల అనంతరం వచ్చిన రామానుజుల తరువాత ఏవిధమైన వేదాంత దర్శనమూ జరుగలేదు అనే వాదం కూడా లోకంలో ప్రచారంలో ఉంది. రామానుజుల అనంతరం వచ్చిన మధ్వాచార్యులు భారతీయ తత్వవాదానికి సహేతుకమైన, నిశ్చయాత్మకమైన స్థితిని వేద ప్రమాణాలతో నిరూపించి చూపారు అని చెప్పడమే దీని పరమోధ్యేయం.

అనువాదకుని ముగింపు:

సత్యాన్వేషణ లో భాగంగా ప్రధమంగా ఒక సాహిత్యాభిలాషి గా పరిచయమై ఆపై మిత్రుని గా మారి అటుపై నాకు దొరికిన గురువు గా నాకు అవగతమైన ఒక గొప్ప ఆధ్యాత్మ వేత్త ద్వారా మధ్వులు నాకు పరిచయమయ్యారు. ఈ పరిచయం నా మిడిమిడి జ్ఞానానికి ఒక కొత్త మార్గం చూపింది. మహామహోపాధ్యాయులైన శర్మ గారి పుస్తకాన్ని అనువదించడానికి పూనుకోవడం సాహసమే. అయితే దానిని పూర్తి చేయడం కేవలం అస్మద్గురువుల దిశానిర్దేశం వలన శ్రీహరి కృప లభించి పూర్తీ చేసాను అని అనిపించుకున్నాను.

నేను ఈ స్వేచ్చనువాదం ద్వారా చేసింది స్వాధ్యాయం. ఇది మరికొందరు సాధకులకు ఉపయుక్తమైతే ఈ అనువాదానికి సార్ధకత చేకూరినట్లే. తెలుగు నాట మధ్వాచార్య పై పుస్తకాలు ఎక్కువగా ప్రచారం లో లేవు. ఈ అనువాదం ఈ లోటుని ఇసుమంత భర్తీ చేస్తుందని భావిస్తాను

ఇందు పలు ముద్రా రాక్షసాలు, వ్యక్తీకరణ, వ్యాకరణ తప్పులు చదువరులను చాల ఇబ్బంది కలిగిస్తాయి. అవి కేవలం నా అసమర్ధత వలెనే. అందులకు నేను క్షంతవ్యుణ్ణి.

కలౌ కల్మష చిత్తానాం
పాప ద్రవ్యోప జీవినాం
విధి క్రియా విహీనానాం
గతిర్గోవింద కీర్తనం

పైన తెలిపిన వ్యాస వాక్కు ఈ అనువాద రచనకు దిక్కు.

కలౌ వేంకటనాయకః అనే ఆర్యోక్తిని అవగతం చేసుకున్న వారు ఎందరో ఉన్నా వారి వారి స్వభావానుసారం ఆ వేంకటేశుని కాదని మరో దేవతా స్వరూపాన్ని సర్వోత్తమ పరబ్రహ్మంగా లేక తన

ఆత్మయే సర్వోత్తమమైనది అనే భ్రమకు లోనై సాధన చేసే వారూ ఉన్నారు. అలాగే బాబాలను, గురువులను, దైవాలు గా భావించి విచిత్రమైన రీతిలో కూర్చిన ఉపాసన మార్గాలను ఆచరించే వారు ఉన్నారు. ఏది ఏమైనా హరి: ఓం అనే సత్యం శుద్ధ సాత్విక స్వభావానికి మాత్రమె దక్కేది. అందుకు దిక్కు ఆ గోవిందుడు.

నగుమోము కననీక పెద్దగా ఊర్ధ్వ పుండ్రాలు అద్దినా, నిజ దర్శన భాగ్యం లేకుండా ఆభరణాలతో కప్పినా, ఆ దివ్య భవ్య మూర్తిని చూసినంత మాత్రాన్న జీవుని స్వరూపానందం ఆ ఆనంద నిలయం లో పెల్లుబుకి ఎన్నో కోరుకోవాలని వచ్చినా ఏది జ్ఞప్తి కి రాక ఆ ఆనందంలో తేలియాడే స్థితిలో ఉన్న భాగవతులకు ప్రణమిల్లుతూ ...



//శ్రీకృష్ణార్పణమస్తు//